తాళ్లపాక సాహిత్యము

# శృంగార సంకీర్తనలు



తాళ్లపాక అన్నమాచార్యులు

శ్రీ తాళ్ళపాకవారిపదసాహిత్యము – సంపుటము 30

(149)

# శృంగారసంకీర్తనలు

7-2-91

అన్నమాచార్య విరచితములు

పరిష్కర్త:
గౌరిపెద్ది రామసుబ్బశర్మ

AB44
Vol 24

ప్రచురణ:
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
1983

అన్ని హక్కులు
తిరుమల తిరుపతి దేవస్థానముల వారివి

ప్రకాశకులు :
జి. కుమారస్వామిరెడ్డి, I.A.S.
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

మొదటి ముద్రణ 2,000 ప్రతులు

ముద్రణము :
తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము,
తిరుపతి.

# ముందుమాట

పదకవితాపితామహుడే యైనను అలంకార శాస్త్రముల కందని - సాహిత్యమర్మములను చవిచూపించిన మహాకవి, పరమభాగవతుడు, తనవంశమున మూడుతరములవరకు సారస్వతశక్తి, పారమార్థికముక్తి, రెంటిని, తన ప్రభావమువలననే సిద్ధింపజేసికొన్న మహానుభావుడు అన్నమయ్య. ఆతని వాఙ్మయమును మాకందినంతవరకు త్వర త్వరగ ప్రకాశింపజేయవలెనని మా సంకల్పము.

ఇప్పటికి, ఈ సంపుటముతో అధ్యాత్మశృంగార కీర్తనల సంపుట-ములు అన్నికలిసి ముప్పది అగుచున్నవి. ఈ సంపుటముల విభాగమున పాతకాలమున 50 రేకులకొక సంపుటముగ వెలువడినవి కొన్ని, తరువాతి-కాలమున 100 రేకుల కొక సంపుటముగ వెలువడుచున్నవి కొన్ని. ఈ యిన్నింటిని 100 రేకుల కొకసంపుటమువంతున నిర్మింపవలెనని మా సంకల్పము. దానిలో ఆధ్యాత్మిక సంపుటములు 3, 4 సంఖ్యగలవి వెలువడి నచో అక్కడికి అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనల సంపుటములన్నీ 100 రేకుల కొకటివంతున వెలసినట్లు కాగలదు. ఇంక క్రొత్తగా ముద్రింప వలసిన సంపుటములు 5 మాత్రము కలవు. ముందు ముద్రితమై చెల్లి-పోయినవానిని, క్రొత్తగాముద్రింప బోవువానిని అన్నింటిని పుష్కల ముగ ముద్రింపించుటయే మా ప్రధానోద్దేశము.

ఈ సంపుటము పీఠికలో తాళ్లపాకవాఙ్మయము స్పెషలాఫీసరు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు చూపిన "అన్నమయ్య శృంగార భండారము-అన్నమయ్య మనస్తత్వము" అను రెండంశములను రసికులు చదివి ఆనందింపగలరనుకొంటాను.

జి. కుమారస్వామిరెడ్డి, ఐ. ఏ. ఎస్.

తిరుపతి, కార్యనిర్వహణాధికారి,

29—4—1983. తిరుమల తిరుపతి దేవస్థానములు.

# పీఠిక

**అశైశవాచ్ఛ్రీనివాసపరబ్రహ్మపరాయణః।**
**యోఽస్తౌషీ దిందిరానాథం తస్యవాగ్విభ్నమామి తమ్॥**

1401 నుండి 1500 వరకుగల రేకులలోని 600 శృంగార సంకీర్తనలు గలది ఈ సంపుటము.

ఈ సంపుటమునందు 1. "అన్నమాచార్య శృంగార భండారము." 2. "అన్నమయ్య మనస్తత్త్వము" అను నంశములనుగూర్చి లఘువుగ చర్చింప దలచితిని.

లోకసాధారణమైన నాయికానాయకుల విషయమున శృంగార రసమును వర్ణించిన మహాకవుల ధోరణికిని, తాను నాయికగా, శ్రీ వేంకటేశ్వరస్వామి నాయకుడుగా అన్నమయ్య సాగించిన శృంగార వర్ణనకును చాలవ్యత్యాసము లున్నవి. ఇతర-మహాకవులకు అన్నమయ్యకు అలంకారశాస్త్రమొక్కటే యైనను, ఆ శాస్త్రమును అన్నమయ్య మూడుపూవు లారుకాయలుగ దాని కొక వింతసొగసు సంతరించినాడు. కవులందరకు ఈ గుణము కొద్దిగనో గొప్పగనో ఉండడ మలవాటే. అయినా అన్నమయ్య హద్దుదాటి ప్రవర్తించినాడనుట ప్రతిసత్యమైనమాట. ఇతరకవులు లోకసాధారణ నాయికానాయకులను తమ యందారోపించుకొని, వారే తాముగా మారి ప్రబంధములందు సంచరించినారు. అన్నమయ్య తానే నాయికగా, తన ఎదుటనున్న వేంకటేశ్వరస్వామి ప్రతిమయే సజీవ పురుషోత్తమ నాయకుడుగా చరించడంవల్ల, ఈయన-రచనలో కొంత స్వాతంత్ర్యభావము, పచ్చిదనము, దుందుడుకుదనము, సొల్లుంటనపు మాటలు ఎక్కువగా కనిపించుచున్నవి.

మామూలు ప్రబంధ శృంగారమునకంటె దాక్షిణాత్య కావ్యము లందు, శృంగారముపచ్చిదనము కొనగొమ్మ లెక్కినదని చెప్పక తప్పదు. ఆపచ్చిదనమున కంతటికి మన అన్నమయ్యయే గురుపీఠమా యనిపించుచున్నది.

మన అన్నమయ్యలో మామూలు కవులువాడెడి ఉపమాన రూపణములకంటె, చాలాసాధారణములైన లౌకికములైన ఉపమాన వాచకపదములు అగుపిస్తుంటాయి. సహజముగా, పెద్దరాసిని (గుంపును) చెప్పునప్పుడు మామూలు ప్రబంధకవులందరు 'రాసులని' ప్రోవులని, గుంపులని వాడుట సహజము. అట్టి స్థలములలో మన అన్నమయ్య కువ్వలు, లేక కుప్పలు వాములు, మందలు, మొదలైన తన స్వతంత్రపదములతోపాటు, మామూలు కవులు వాడెడి పదములు కూడ వదలిపెట్టడు. అన్నమయ్యకు, సొంతమైనపదములతో ప్రజలకు దగ్గరగా నుండడమనెడి ఒకసహజ లక్షణమున్నది. దానివలన ఆయన అనుకున్నవస్తువును, పాఠకులకు చాల త్వరగ సాక్షాత్క—రింప జేయగలడు. నాయకుడు నాయికను, నాయిక నాయకుని దుందుడుకుదనముతో పైబడి సర్వావయవ సమ్మర్దముగ అనుభవించు నపుడు "నన్ను ఇంతపచ్చిచేసితివి" "నన్ను బందుబందు చేసితివి" వంటిపదములు అన్నమయ్య వాఙ్మయమున అంతటా సాక్షాత్కరిస్తాయి. ఈ పచ్చిసేయుట, బందుసేయుటవంటిపదములవిలువలు సాహిత్యజ్ఞులకు వివరింపబనిలేదు. ఈ పచ్చిదనము మాటలందు, చేతల యందు, మనోభావములయందును ఆయనవాఙ్మయమున అంతటా తొంగిచూచుచుండును.

హద్దుమీరి నాయిక నాయకునితో మాటలాడిన పచ్చిబందు— తనపు మాటలకు

ఆహిరి

లంజకాఁడ వౌదువురా
లంజకాఁడవౌదువు నీలాగులెల్లఁ గానవచ్చె
ముంజేతఁబెట్టినసొమ్ములకద్దమేలరా ॥ ॥ పల్లవి ॥

కొంకక యెవ్వతోకాని కోరి నీబుజముమీఁద
కంకణాల చేయివేసి కాఁగిలించఁబోలును
వంకలైన వొత్తులెల్ల వడిఁగానవచ్చె వింక
బొంక నేమిటికిరా నీబూమెలెల్లఁ గంటిమి ॥ లంజ ॥

ఒద్దిక నెవ్వతో గాని వోరి నీవురముమీఁద
నిద్దిరించఁ గంటమాలనీలము లొత్తినది
తిద్దినజాణవుగాన తిరిగి తిరిగి మాతో
బద్దనేఁటికిరా నేఁ బచ్చిసేయఁజాలను ॥ లంజ ॥

వేడుక నెవ్వతో తిరువేంకటేశ్వర విన్ను
కూడిన నీమేవితావి కొల్లవట్టుకొన్నది
తోడనె నాకాఁగిటిలో దొరకొంటి వింక విన్ను —
నాడనేమిటికిరా నాయలపెల్లఁ దీరెను ॥ లంజ ॥

(12 సంపు-84 పాట)

ఉదాహరణముగా చూపవచ్చు. ఇట్టిపాటకు దాక్షిణాత్యశృంగారములో ఒకవిత్తుకు పదిమొలక లెత్తినవి. అన్నమయ్యలో ఎంత శృంగారము తొణికిసలాడుచుండినను, పరమాత్మపై భక్తి పట్టుదప్పకుండ కన్పట్టుచునేయుండును. నాయిక విరహములో అధ్యాత్మభావముతో పలవరించినందుకు

కాంబోది

తమ్ములాల అన్నలాల తల్లులాల నే
నెమ్మనపు హరిఁబాసి విలువ నే విఁకను ॥ పల్లవి ॥

కొమ్మలాల మరుకోటకొమ్మలాల వో-
    యమ్మలాల తొలరె నాయక్కలాల
    తమ్మి రేకుఁగన్నులయాతనిఁ బాసి నే-
    మమ్మల సొమ్ములచేత నుండలేనిఁకను ॥ తమ్మ ॥

చెలులాల కలికితొయ్యలులాల వో-
    యెలజవ్వనముల మోహినులాల
    చెలువంపుహారిఁదలఁచిననాకు నే (?)
    నులుకుఁగన్నీ రాఁపకుండలే నిఁకను ॥ తమ్మ ॥

బోఁటులాల జవ్వపుమేనఁటులాల వో
    గాఁటపుఁదురుములచిఁకటులాల
    వాఁటమైనవేంకటేశ్వరుఁ బాసి నే-
    నాఁటదాననై జన్మమందలే నిఁకను ॥ తమ్మ ॥

(12 సంపు 99 పాట)

ఉదాహరణముగ చూపవచ్చు. ఈయన తనసీమలో వాడిన భాషను వాడుటకు వెనుకాడడు. అట్టులే తన గ్రామముచుట్టును ఉన్న పదార్థములను ఉపమానించుటకు జంకుగొనడు.

వరాళి

సొంపుల నీ వదనపుసోమశిలకనుమ
    యింపులెల్లఁ జేకొనఁగ నిల్లు నీపతికి ॥ పల్లవి ॥

కలికి నీపిఱుఁదనే గద్దెరాతికనుమ
    మొలనూళ్లలతలనే ముంచుకొన్నది
    కలయఁబోకముడినే కట్లువడ్డది
    అలరువిలుతుదాడి కడ్డము నీపతికి ॥ సొంపు ॥

ఇదివో నీకెమ్మోవి యెఱ్ఱశిలకనుమ
కదిసి లేఁజిగురులఁ గప్పుకొన్నది
వదలకింతకుఁ దలవాకిలై నది
మదనుని బారికి మాఁటువో నీపతికి ॥ సొంపు ॥

కాంత నీ చిత్తమే దొంగలసావికనుమ
యింతటి వేంకటపతికిరవైనది
పంతపు నీగుబ్బలే గుబ్బలికొండకనుమ
మంతనాలకనుమాయ మగువ నీ పతికి ॥ సొంపు ॥

(12 సంపు—115 పాట)

పై విషయములు ఈ పాటతో గుర్తింపవచ్చు. ఈ కనుమలన్నీ తాళ్లపాక చుట్టూ ఉన్న వే ఆ ప్రదేశజ్ఞానముంటేగాని పాఠకుడు పోల్చుకో లేడు.

అన్నమయ్యా కొన్ని వేల ప్రబంధకవులకు ఊహాల కందని వర్ణనలు సేయుటలో మేటి అనుటకు:—

**ముఖారి**

చెప్పరాదియింతి సిరులు—దీని-
పొపులిన్నియుఁ జూడ వొరపులోకావి ॥ పల్లవి ॥

ముదితజఘనముమీఁదిమొలనూలిగంట లవి
కదలురవ మెట్లుండెఁ గంటిరే చెలులు
మదనుఁడుండెడిహేమమందిరము దిరిగిరాఁ
గదిసి మ్రోసెడి పారిఘంటలోకావి ॥ చెప్ప ॥

కొమ్మపయ్యెదలోనికుచమూలరుచి వెలికిఁ
జిమ్ముటది యెట్లుండెఁ జెప్పరే చెలులు
యిమ్మైన మరుధనములెల్ల రాసులుపోసి
కమ్మకొని చెంగావి గప్పిరోకావి ॥ చెప్ప ॥

నెలఁతకంఠమునందు నీలమణిహారములు
అలరుచెట్లుండు కొనియాడరే చెలులు
లలితాంగి ప్రాణవల్లభుఁడు వేంకటవిభుఁడు
నెలకొన్న కాఁగిటనె నిలిచెనో కావి ॥ చెప్ప ॥

(12 సం—259 పాట)

రసికులకు విచ్చివివరింప వలసిన పనిలేని ఒక ముగ్ధమనోహర నాయికా పదబంధములను గుర్తింపుడు.

## శ్రీరాగం

మరువినగరిదండ మాయిల్లెఱఁగవా
విరులతావులు వెల్లివిరిసేటి చోటు ॥ పల్లవి ॥

మఱఁగుమూఁకచింతల మాయిల్లెఱఁగవా
గుఱుతైన బంగారుకొండలసంది
మఱపుఁ దెలివి యిక్కు మాయిల్లెఱఁగవా
వెఱపక మదనుఁడు వేఁటాడేచోటు ॥ మరు ॥

మదనునివెదసంత మాయిల్లెఱఁగవా
చెదరియు జెదరని చిమ్మఁజీఁకటి
మదిలోన నీవుండేటిమాయిల్లెఱఁగవా
కొదలేక మమతలు కొలువుండేచోటు ॥ మరు ॥

మరులుమ్మెతలతోఁట మాయిల్లెఱఁగవా
తిరువేంకటగిరిదేవుఁడ నీవు
మరుముద్రలవాకిలి మాయిల్లెఱఁగవా
నిరతము నీసిరులు నించేటిచోటు ॥ మరు ॥

(12 సంపు—262 పాట)

శంకరాభరణం

మదనుబండారము మగువమేను
పొదిగొన్నవలపులఁ బొనఁగెఁగాన ॥ పల్లవి ॥

మరునియాయుధశాల మగువకొప్పు
తొరలించి విరులెల్లాఁ దురిమెఁగాన
యిరవై కీరములాయ మీపెగళము
సరసపుమాఁటలెల్లా జరపెఁగాన ॥ మద ॥

కాముని సాముగరిడి కాంతవురము
ఆమని చనుసంగడా లమరెఁగాన
ప్రేమపుఁగేళాకూళి గంభీరనాభి
తేమలె మిటలంచేత దిగుపారెఁగాన ॥ మద ॥

కాంతుసవేఁటపొలము కన్నెపిఱుఁదు
బంతి మొలనూళ్ల పోఁగువారెఁగాన
అంతటివావితల్లి యీయలమేల్మంగ
యింతలో శ్రీవేంకటేశు నెవసెఁగాన ॥ మద ॥

(సంపు 29_196 పాట)

దీనితో ఈతని శృంగారసామ్రాజ్యము ఎంతగొప్పగా వెలసినదో శ్రీవేంకటేశ్వరునిచేత ఆశృంగార సామ్రాజ్యమునకు వసంతోత్సవము సేయించినాడో గుర్తింప గలరు.

అన్నమయ్య స్త్రీవర్ణనలలో కొప్పునే ఎక్కువగావాడినారు. ఎక్కడనోగాని జడలు కనపడవు, జడలకంటె కొంచెమెక్కువగా ముడులుకూడ కనపడుచుండును. ఆయన శృంగారభండారములో నాయకునిచే నాయిక కప్పురము (పచ్చకప్పురము) గొనుట, ఒక అంగీకారముద్ర. ఒడివట్టితీయుట, పంతాలాడుట, కొంగువట్టి తియ్యుట, కొప్పువట్టి తీయుట, పయ్యెదగుంజుట, చన్నులుపిసుకుట,

కుచ్చెలలాగుట, పచ్చడము గప్పుట. ఒద్దనే కూర్చుండుట, ఒడబరచుట, కాళ్లుపిసుకుట, కాళ్లగుద్దుట, వాసివంతులాడుట, వలపులు చల్లుట, కొలువులో సైగలుచేయుట, అసురుసురగుట, సేసఁబాలు పెట్టుట, ఒడలెల్ల జడివానగురియుట మొదలగునవి అన్నమయ్య శృంగార సామ్రాజ్యములో మేటి విభావానుభావ సంచారిభావములు. ఇందులో కొన్ని సత్యములు.

కొన్నిపట్టులందు వానకే సామ్రాజ్యము. కొన్నిపట్టులందు భాగ్యములకే సామ్రాజ్యము. ఇట్టులు అన్నమయ్య శృంగారము సాగుచుండును. ఉదాహరణమునకు వాన:

సౌరాష్ట్రం

పొలఁతికి నీతోపొందు పోఁకకుఁ బుట్టెఁడాయ
యెలమి నీభాగ్యమిఁక నెంతైనా గద్దయ్యా ॥ పల్లవి ॥

పదఁతిచెక్కులవెంటఁ బన్నీటివాన గురిసె
వది నందె మెఱుఁగులవాన గురిసె
విడివడి తురుమున విరులవాన గురిసె
చిదుముడి జవ్వనము చిగిరించెనయ్యా ॥ పొలఁ ॥

మొలకనవ్వులనె ముత్యాలవాన గురిసె
వలపులఁ బెనుజడివాన గురిసె
కలికిసిగ్గులఁ దొలకరివానలు గురిసె
పలుమారు జవ్వనము పదనెక్కెనయ్యా ॥ పొలఁ ॥

సొరిది మోవితేనెల సోనలవాన గురిసె
వరుస రతులఁ దతివాన గురిసె
యిరవై శ్రీవేంకటేశ యింతినిట్టె కూడితివి
పరగినజవ్వనము పచ్చిదేరెనయ్యా ॥ పొలఁ ॥

(29 సంపు-66 పాట)

అట్టులే భాగ్యమునకు.

మాళవిగౌళ

చెలులాల చూడరే యీచెలిభాగ్యము
అలమేలుమంగ యీకె కబ్బెను యీభాగ్యము ॥ పల్లవి ॥

పతిదయగలిగినపడఁతి దీభాగ్యము
అతఁడు మాటమీరనిదది భాగ్యము
సతతముఁబాయక జంటైవుండేది భాగ్యము
అతివలెందరుగల్లా నది యేమిచెప్పేరే ॥ చెలు ॥

మగఁడు మన్నించిన మగువది భాగ్యము
సొగిసి యాతఁడు మోహించుట భాగ్యము
వెగటులేనిరతుల వేసరవిది భాగ్యము
మగువలవలపులు మరి యేమిచెప్పేరే ॥ చెలు ॥

శ్రీవేంకటేశుఁ దేలె మచ్చిక నీ సతిదిభాగ్య-
మావేళనాతఁడు మెచ్చినదిభాగ్యము
తావుకొని యెప్పుడూఁ దనవాఁ డౌటే భాగ్యము
యేవనితలనేరుపు లిఁక నేమిచెప్పేరే ॥ చెలు ॥

(ఈసంపుటము-పాట274)

## అన్నమయ్య మనస్తత్వము

అన్నమయ్య నాయికగా శ్రీవేంకటేశ్వరుఁడు నాయకుడుగ సాగిన విరహవర్ణనమంతా మూడవచరణము వరకే, మూడవచరణములో ఏదో ఒకవిధముగ సంయోగముతో ముగియవలసినదే. రెండు చరణములవరకు సాగిన వియోగమే అన్నమయ్యకు భరింపరానిది. వియోగమున ఆయన మనస్తత్వమును ఒక పాటలో స్పష్టముగ చెప్పుకొన్నాడని తెలియుచున్నది.

పాడి

మొకమోటములకెల్ల మొదలు నేను
వెకలినీతమకము విడిపించఁగలనా ॥ పల్లవి ॥

ముద్దులనీమోము చూచి మొక్కకుండలే (ను) నీతో
గద్దించి నేనలుగఁగఁగలనా
పొద్దు వొద్దు నేఁ దలఁచి పులకించకుండలేను
వద్దని నీగుణములు వారించఁగలనా ॥ మొక ॥

చేరి నేను ముచ్చటలు చెప్పకుండలేను నీతో
ధీరత నేఁ జలము సాదించగలనా
పేరుకొని పారెసారెఁ బిలువకుండగలేను
దూరిదూరి నే నిన్నుఁ దుచ్చమాడఁగలనా ॥ మొక ॥

సతమైననిన్నుఁ గూడి సంతసించకుండలేను
ఇతరులవలె నెగ్గులెంచగలనా
రతివేళ నిన్నుఁ గడురాయడించకుండలేను
పతిగా శ్రీవేంకటేశ పంతమియ్యఁగలనా ॥ మొక ॥

(ఈసంపుటము—పాట 76)

శ్రీవేంకటేశ్వరుడనే నాయకుని తలచుకొన్నచో అన్నమయ్య అనే నాయికకు ఒడలుపులకరించి, దేహము ముచ్చెమటలుపోసి, కనులనీరు గ్రమ్మి, వింత వింత భావములు ఆనోటినుండి జాలువారు చుండును. చూడుడు.

ముఖారి

చక్కవిమానిని నీసరి యెవ్వరే
యెక్కువై ననీభావ మెంచిమాడవసమా ॥ పల్లవి ॥

కోమలి నీకుచములకొండలకొనలపొంత
వోముచు మించి నిలిచె నొకసింహము
కాముఁడు జఘనమనేకట్టుబండిమీఁద బెట్టి
దీమముతో వేటలాడీఁ దేరిచూడ వసమా ॥చక్క॥

పదఁతి లేఁజిగురులపాదపుదవిలోన
నడపులయేనుఁగలు నటియించఁగా
తొడలరటికంబాలతోఁ గట్టి దీములుగా
బడి బడి వేటలాడీ భావించవసమా ॥చక్క॥

అంగనముఖమనేటిఅంబుజాకరముపొంత
ముంగిటఁ జూపులలేళ్లు మోహరించఁగా
కంగవి శ్రీవేంకటేశు కాఁగిటిబావానఁగట్టి
చెంగటనే వేటలాడీఁ జిత్తగించవసమా ॥చక్క॥

(ఈసంపుటము-పాట 195)

ఈ పాట కొంత వ్యాఖ్యాన సాపేక్షమనకుంటాను. నాకు తోచిన-విధముగ వ్యాఖ్యానిస్తాను. సహృదయులు సరిచూడగలరు. ప్రతి పాటలోను పల్లవిలో, భావములు సంగ్రహముగచెప్పి, చరణములతో ఆ భావమునే విస్తరించుట పరిపాటి. నీవు చాలచక్కనిదానివి, నీతో సమాన మెవ్వరే, నీకుగలగొప్పభావము ఊహించవశమా, అని పల్లవిలోనిభావము. పలువురుసఖులు నిర్మత్సరభావముతో ఒక నాయికను గూర్చి మాటలాడే మాటలుగా తోచుచున్నది. దీనిలో కొంతవేట, వేటకాని పరికరములు వగైరా పద్ధతులు తెలిసిననేకాని భావము బోధపడదు. అందుకని మొదట వేటపద్ధతిని నిరూ-పించెదను. వేటకాడు జంతువులనో పక్షులనో పట్టుకొనుటకు జంతు వులను పోలిన జంతువులను, పక్షులనుబోలిన పక్షులను సాకి, వాటిని ఆయా ఉపకరణములపై ఎక్కించుకొని, ఈ జంతువుల పక్షుల ఎలు-

గులతో అడవిలోని జంతువులు పక్షులు వీటిని కూడరాగా, ఈ జంతువులదగ్గర ఆ యా జంతువులకు పక్షులకు సరియైన ఉరులొడ్డి, వీటి దగ్గరకు వచ్చిన ఆ అడవి జంతువులు ఆ వురులలో తగులుకొనగా వాటిని బంధించి తీసికొనిపోవుట వేటకానిపని. ఇక పాటలోని భావము.

ఇక్కడ మొదటి చరణములో ఒకసింహము అనుపదమునకు రూపకాతిశయోక్తితో నడుము అనునర్థమురాగా, ఆనడుము కుచములకు జఘనమునకు మధ్య వుండుటచే, కవి తన ప్రతిభతో రూపకము సాగించినాడు. మొదటి రెండు పాదములలో రూపకాతిశయోక్తి ప్రక్రియ, తరువాత రెండుపాదములలో వేటకానికికావలసిన రూపకము సాగుచున్నది. సింహము కొండలలో నుండుట సహజము. ఇక్కడ కుచములకొండలకొనలపొంత వున్నది. ఆసింహమే(నడుము) జఘనమనే కట్టుబండి (వేటకొరకు వేటకాడు తయారుచేసుకొన్న బండి) దానిపై నిడుకొని దానినేదీమముగా చేసుకొని ఇంకొకసింహమును (మగసింహమును వేంకటేశ్వరుని) వేటలాడుచున్నాడన్న మాట. ఈ కాంత మధ్య, జఘన, సౌందర్యముతో కాముడనే వేటకాడు పురుషసింహమైన (పురుషోత్తముడైన) వేంకటేశ్వరునికి ఉరులు పన్ను – చున్నాడన్న మాట. ఈ ఉరితో తప్పక పురుషసింహము కాముని బారికి చిక్కవలసినదే. ఇది చాలదూరమైన రూపకాతిశయోక్తి. ఇక రెండవచరణము. లేతచిగురులనియెడి పాదములుగల యడవిలో నడకలుఅనే ఏనుగులు తిరుగాడగా, ఇక్కడకూడ నడకలతోనే ఏనుగలు పురుషశ్రేష్ఠులు (పున్నాగములవరకు) రూపకాతిశయోక్తి, ఆ ఏనుగలను పట్టుటకు నాయికయొక్కతొడలనే అరటికంబములతో దీములుగాకట్టి కాముడనే వేటకాడు వేటలాడుచున్నాడు. పూర్వచరణముకంటె ఈచరణములో పున్నాగములవరకు రూపకాతిశయోక్తి వాటినిబంధించుటకు స్త్రీఅవయవములైన తొడలు అనే అరటి –

కంఠాలతోదీములు సిద్ధముచేయడము కొంత సులభతరమైన రూప కముఇక మూడవచరణము ప్రతి మూడవ చరణము దగ్గర (అంటే కడ పటి చరణములోనన్నమాట) అన్నమయ్య ఏదో ఒక విధముగ సమన్వ యము చేయడము ఆయన రచనలో వింత. స్త్రీముఖమనేతామర కొలనుదగ్గర, ఆమె ముంగిటిచూపులనేలేళ్లు మోహారించినాయట. ఎదురొడ్డి నిలిచినవన్నమాట. ఆలేళ్లను కంగుతినని (శ్రీ)వేంకటేశుని కాఁగిటిలో కట్టి కాముడనే వేటకాడు వేటలాడుచున్నాడు. ఈ చరణములో అంతారూపకమే కాని రూపకాతిశయోక్తి కానరాదు. ఈ కాంత కలిగినందుననే (శ్రీ)వేంకటేశ్వరునివంటినాయకునికూడ సునాయాసముగ లోగొనుటకు మన్మథునికి సాధ్యమైనదని ఈ పాట పరమార్థము. తక్కినవ్యాఖ్యానము సహృదయులవంతు. కొన్ని పట్టుల ఈయన వ్రాసినదంతయు కవిత్వమే. ఈయన పుట్టుకతో మహాకవిగ జన్మించినాడా అని తోపించును. చూడుడు.

నాగగాంధారి

విపరీతము లివి వినరాదు
  వుపమలెల్ల మీవొద్దనె కలిగె ॥ పల్లవి ॥

వువిదవదనచంద్రోదయవేళను
  రవియగు సూర్యప్రభ నీవేఁగగ
  యివల నవల మీయిద్దరి వలననే
  దివమును రాతి దెలియఁగఁ గలిగె ॥ విప ॥

అంగనతురుముమహర్ని(హా వి?)శివేళను
  రంగగు సూర్యప్రభ నీవేఁగఁగ
  సంగడి వెలుఁగును సరిఁజీఁకటియును
  చెంగట మీ యందే చెప్పఁగఁగలిగె ॥ విప ॥

కాంతమోవి చుక్కల(లు?)నిండువేళ
రంతుల సూర్యప్రభ నీవేఁగఁగ
యింతట శ్రీవేంకటేశ్వర మీయందే
కాంతులుఁ గళలునుఁ గలయుట గలిగె ॥ విప ॥

(ఈ సంపుటము—పాట 197)

పగటివేళనే రాత్రింబవళ్లుగా, రాత్రివేళనే వెలుగుచీకటులను. చుక్కలు మొలచినప్పుడే మంచిప్రకాశము కళలు కలిగినట్లు అలంకార శాస్త్రముతో సమన్వయించి వర్ణించినాడు. నాయికావదన చంద్రోయముతో సూర్యప్రభవంటి స్వామి కలియగా వారిద్దరివలననే రాతిరి పగలు కలిగినదట. చంద్రోదయమువలన రాతిరి సూర్యప్రభ వలన పగలు. చంద్రునికి క్షీణదశ వృద్ధిదశ రెండు కలవు. సూర్యుని కెప్పుడు ఒక్కటేకాంతి. స్వామి శాశ్వతకాంతి ప్రవాహముగా, నాయికావదనచంద్రుడు ఉదయచంద్రుడుగా వర్ణింపబడినవి. కాంత వెంట్రుకలు అనే అర్ధరాత్రి చీకటివంటి సమయములో, స్వామియనెడి సూర్యప్రభ కలియగా సూర్యప్రభవలన వెలుగు, మహానిశివలన చీకటి కలిగినట్లు వర్ణింపబడినవి. కామినిపెదవిపై చుక్కలు (అమృత బిందువులు) నిండునప్పుడు స్వామియనే సూర్యప్రభకలియగా, సూర్యప్రభవలన కాంతులు, మోవిపై యమృతబిందువులవలన కళలు కలిగినట్లు వర్ణింపబడినవి. నాయికానాయకుల సమాగమము ఈ విపరీత సృష్టికి కారణమని పల్లవిభావము. సహజముగ ఉత్సవములందు ఉదయపువేళలనే సూర్యప్రభ. ఇక్కడ రాత్రిసమయలందే సూర్యప్రభనువర్ణించుటచే విపరీతభావము. కాంతవదనచంద్రుడు, అంగన తురుము, చుక్కలునిండువేళ ఇవియన్నియు వచ్చుచుపోవుచునుండెడి పదార్థములే. కాని శాశ్వతప్రభ సూర్యప్రభ ఒక్కటే.

ఈనాడు మరల మనదేవస్థానములో జరిగెడి పుష్పయాగము అన్నమయ్యకాలమున ఎట్టు జరుగుచుండెడిదో గమనింపుడు.

సామంతం

సకల లోకేశ్వరుఁడు సరుసఁ జేకొనువాఁడు
అకలంకముగఁ బుష్పయాగంబు ॥ పల్లవి ॥

వివిధపుష్పములతో వేదఘోషములతో
అవల దిరువామొఢియు నంగనలయాటతో
కవివందినుతులతో కమ్మఁబూజలతోడ
నవధరించీఁ బుష్పయాగంబు ॥ సక ॥

కప్పురపుటారతుల ఘనచందనముతోడ
తెప్పలధూపముల తిరువందికాపుతో
వొప్పుగఁ బణ్యారములు వొగిఁ బెక్కువగలతో
అప్పఁ డందీఁ బుష్పయాగంబు ॥ సక ॥

తగు చ(ఛ?) త్రచామరాలతాంబూలములతోడ
పగటుతో నీరీతి పదిపూజ అందుకొని
జిగిమీరెఁ జూడరే శ్రీవేంకటేశ్వరుని–
అగణితంబగుపుష్పయాగంబు ॥ సక ॥

(ఈసంపుటము-పాట 209)

అన్నమయ్యలో శృంగారమునందు అధ్యాత్మము తొణికిస లాడుచుండునని పలువురిపెద్దల మాట. ఆమాటకు రుజువుగ ఈ పాటను గమనింపుడు.

శ్రీరాగం

ఇప్పుడు నీవు వచ్చితి విది చూచి నాకదివో
చొప్పుగా రెండుభావాలు చూపిచెప్పరాదు ॥ పల్లవి ॥

తక్కక యెడసి విన్నఁ దలఁచఁగాఁదలఁచఁగా
యెక్కడచూచినా నీవై యిదే తోఁచేవు
వెక్కసపునీసుద్దులే వేమారు వినఁగాను
మక్కువ వీనులకు నీమాటలే వుండీని ॥ ఇప్ప ॥

వరుసతో నీరూపు వ్రాయఁగా వ్రాయఁగాను
అరుదై చేతికిఁ జిక్కినట్టె తోఁచీని
సరవి నీగుణములు సతులతో నాడుకోఁగా
తొరలీ నీపేరే నాతుదనాలికకును ॥ ఇప్ప ॥

కందువ నీకుగానే కలఁగనఁగా గనఁగా
అంది కాఁగిటఁగూడినయట్టె తోఁచీని
విందుగా నన్నిపుడె శ్రీవేంకటేశ కూడితివి
చందముగా నాకన్నిటా సతమై యేలితివి ॥ ఇప్ప ॥

(ఈ సంపుటము-పాట 242)

అన్నమయ్య ఈ శృంగారతపస్సు ఎందుకు చేసినాడో మనము ఒకపరి కన్నులుమూసుకొని ధ్యానించినచో అర్థమగుచున్నది ఆయన, తాను ముక్తుడు కావలెననియే అధ్యాత్మశృంగారసంకీర్తనాత్మకమైన తపస్సు గావించినాడు. ఒకవేళతప్పితే తాను అలమేలు-మంగయే కావలెనని ఆయన భావము. గమనింపుడు.

సామంతం

ఎంతప్రియము గలిగెనంత పొదలు వలపు
వింతలే కాఁటదానికి వినయమే నేరుపు ॥ పల్లవి ॥

చిత్తమురా మాటలాడి చెలువునిమీఁదట
బత్తిచూపవలెఁగాక పడఁతికిని
కొత్తగా నేరాలువేసి కూరిమిఁ గొసరుకొంటా
హత్తి వెంగెములాడేది అది యేఁటినేరుపే ॥ ఎంత ॥

సముకాన నిలుచుండి సరసములాడి పతిఁ
దమకించవలెఁగాక తరుణికిని
జమళివద్దనే వుండి సారెకు నలఁగుకొంటా
అమరనికాఁక చల్లేదది యేఁటినేరుపే ॥ ఎంత ॥

అలమేలుమంగవలె నటు శ్రీవేంకటేశ్వరుఁ
గలయఁగవలెఁగాక కామినికిని
పెలుచఁదనాన రతిఁ బెనగులాడుకొంటాను
అలయించి చొక్కించేదది యేఁటి నేరుపే ॥ ఎంత ॥

(ఈ సంపుటము—పాట 447)

ఈ పాట కడపటి చరణములో

"అలమేలుమంగవలె నటు శ్రీవేంకటేశ్వరుఁ
గలయఁగవలెఁగాక కామినికిని"

అని చెప్పడముతో అలమేలుమంగ సారూప్యమును తాను కోరుకున్నట్లు వ్యక్తమగుచున్నది. ఆయనజీవితములో సగభాగమునకు పైన శృంగారసంకీర్తనలే రచించి, అందులో నాయికగా, ప్రతినాయికగా, దూతిగా, చెలికత్తెగా, తానే బహురూపములు ధరించి,

వేంకటేశ్వరుని శృంగారసర్వస్వముగా తానే నిలిచిన అన్నమయ్య, తన శృంగారారాధనకు ప్రతిఫలముగ అలమేల్మంగాసారూప్యమును కోరుకొనుట అసంభావ్య మేమీకాదు. అందువల్లనే ప్రతిసంపుటము నందును అలమేలుమంగకు సంబంధించినపాటలు కనీసము ఇరువది యైన యుండుట కన్పట్టుచున్నది. ఇట్లు అన్నమయ్యకోరుకొనుట అలమేలుమంగమ్మను త్రోసి తానచట నిలువవలెనను భావము కాదు. ఆమెకువలె తనకుగూడ శ్రీవేంకటేశ్వరమనోహరాంగసంబంధము శాశ్వతముగ ఉండకోరుటమాత్రమే అని దీనిపరమార్థముగ మన మూహింపవచ్చును.

తాళ్లపాకకవుల సంగీతసాహిత్యములను బయటిజగమునకు అందివ్వవలెనను దృఢసంకల్పము, దానికై ధనమెంతయైనను ఖర్చు పెట్టుటకు వెనుకాడని దీక్ష కలిగి రూపుదాల్చినఉత్సాహమో యన్నట్లు అగపడుచున్న కార్యనిర్వహణాధికారులు శ్రీ జి కుమారస్వామి రెడ్డి ఐ. ఏ. యస్. గారికి నా కృతజ్ఞతాభినందనలు. ఎంతపనియైనను తృటిలో జరిపించు స్వభావముగల తి. తి. దే ప్రెస్సు మేనేజరు శ్రీ ఎం. విజయకుమార రెడ్డిగారికిని, వారికి అన్నివిధముల చేదోడు వాదోడుగా నుండి మాపనిని త్వర త్వరగ ముందుకు నడిపించు స్వభావముగల పౌరసంబంధ శాఖాధికారి (P. R. O) శ్రీ R. సూర్యనారాయణమూర్తి, M. A. గారికిని, అడుగడుగున మాకు తలలో నాలుకవలె సాయపడుచున్న 'సప్తగిరి' సంపాదకులు శ్రీ K. సుబ్బారావు, M. A. గారికిని నాధన్యవాదములు. నాకీ పరిష్కరణకార్యమునందు సహాయకుడుగ నాలుగుసంవత్సరముల కాలముగా అన్నివిధముల నాకు చేయూత నిచ్చుచు శ్రద్ధా విధేయతలు తన సొమ్ములుగా గలిగి పనిచేయుచున్న చి॥ J. బాలసుబ్రహ్మణ్యం, M. A. కును, అచ్చుపని వీలైనంత నిర్దుష్టముగ కొనసాగించు

నేర్పరులగు అచ్చుకూర్పరులకును నా మంగళాశాసనములు. నా బుద్ధి బలమునకు తగినంతగా జరిగిన ఈ పరిష్కరణమునందు గుణదోషములను గమనించిన పెద్దలు దోషములు తెలిపినచో పై పై పరిష్కరణములందు మెలకువగలిగివుండగలమని మనవి.

కట్టమంచిసుధీ ర్యస్య ప్రతిభాపాండితీవశః।
మహీశూరపురీసూరిం తం వందే కృష్ణదేశికమ్॥

విధేయుడు,
గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
స్పెషలాఫీసరు,
తాళ్లపాక వాఙ్మయ పరిష్కరణశాఖ,
అన్నమాచార్యప్రాజెక్టు.
తి. తి. దేవస్థానములు.

తిరుపతి,
5–4–83.



శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు

శ్రీరస్తు

## శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల

# శృంగార సంకీర్తనలు

### 30 వ సంపుటము

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటిక్రోధి సంవత్సరమందు తాళ్లపాక-అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను, అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటిదుందుభిసంవత్సరఫాల్గుణ బహుళ ౧౨ నిరుధానకు[1], తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు.

రేకు 1401 ఆహిరి mp3

ఇద్దరిగుణంబు లివి ఇంతులాల
చద్దికివి వేఁడికివి సంగడించీని ॥ పల్లవి ॥

వొలసి సూర్యునిలోన నుండేటియలవాటు
గలదుగన విరహాగ్నిఁ గలఁగఁ డతఁడు
పొలఁతిదేహము మొదలఁ బూఁదీగెగవళ ఇదె
వలరాచకాఁకచే వాడఁబారీని ॥ ఇద్ద ॥

1 ఈ శబ్దము 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గానవచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాఁడు కడపటి దినమని తాత్పర్యము కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన 'సరియగు' అను నర్థము తాత్పర్యము గావచ్చును. 'అవధి' అను నర్థములో ''ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు'' అను తరిగొండ-వెంగమాంబగారి ప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమీవారి 'విష్ణుపారిజాతము' 55 పుట. నేనీ ప్రయోగ మిచ్చగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, ''నిఱుత్తం'' అను అరవ పదముగూడ 'నిలుపు' అను నర్థముతో దీనికి సహాయపడుననిరి.

సరిలేనిపంచశరగురుఁడుగన పైకొన్న-
విరిబాణములకెల్ల వెఱవఁ డతఁడు
గరిమ నీచెలిమనసు గఁటిలేనిదిగనక
వరుస లోలో మెఱుఁగువలెనె దాఁగిని ॥ ఇద్ద ॥

శ్రీవేంకటాద్రిపైఁ జెలఁగుదేవుఁడుగనక
యీవనితకుచగిరుల నిటు మరిగెను
యేవంక నీచెలియు ఇందుకే కోరెఁగన
భావమున సంతసము పచ్చిదేరీని ॥ ఇద్ద ॥

ముఖారి

[1] ఎంత గబ్బితనమే నీకింతటిలోనే। తొల్లె
యింత నీ కుపదేశ మిచ్చినదె కదరా ॥ పల్లవి ॥

పడఁతి నాపేరు నీవు పాదమున వ్రాతురటె
అడియాలముగ నింతె అందుకేమిరా
వాడికములైతే నీవురమున వా(వ్రా?)యరాదా
యెడ చాల దండుఁ గుచా లిమ్ముకొనెఁగదరా ॥ ఎంత ॥

నీలపుఁబెండెములోన నీడ భావింతురటే
తాలిమి నా ప్రియమింతె దానికేమిరా
ఆలాగైతే నాయద్దపుఁజెక్కులు గావా
చాలుకొన్నకళ లందే సందుకొనీఁగదరా ॥ ఎంత ॥

కూరిమి నా చెక్కు కొనగోర నంటుదురటే
ఆరసి కూడితివి నన్నందుకేమిరా
యీరీతి శ్రీవేంకటేశుఁడ నేఁ గాదా
తేరకొన విన్నియు నీ తేకువ గా దటరా ॥ ఎంత ॥ 2

1. ఇది వాకోవాక్యము.

### గుండక్రియ

నే నెఱఁగనా వోరి నీ మహిమ
కానవా యిన్నిటాఁ బాలు కడుఁదెల్లనౌట ॥పల్లవి॥

ఇంతలో నాతో నీ వేదరేనిబీరాలు
కొంత గొంత వాఁడిసేసి కుమ్మరించేవు
యింతటివాఁడవు నీ విటుగాకుండితే భూమి—
నింతటాను మింటికొన కింతవాఁడి గలదా ॥నేనె॥

కానీ కావిమ్మని కమ్మరఁ గ్రమ్మర దూరి
పావిపట్టుక నన్నుఁ బగచాటేవు
యేనెలవున నీకు యింతసత్తి లేకుండితే
మావిపై విమ్మపండు మరియేల పులిసె ॥నేనె॥

నీవిట్టె నన్నుఁగూడి నివ్వెరగైన నా—
భావమిదేమని పలికేవు
శ్రీవేంకటేశ నీచేఁతే కాకుండితే
మోవితేనెకు గంటి మొదలఁ గలిగెనా ॥నేనె॥ 3

### రామక్రియ

అంత సిగ్గువడకువే అతివ నీవు
పంతమునఁ దెలియవే పాయమెల్ల గడువు ॥పల్లవి॥

గొంది నొక్కసింహమట కొండలు మోచినదట
ఇందుముఖులనకుమె యిరవట
కందువ యీ పొదుపుడుఁగత యిది నీవు నాకు
అందముగ నానతీవే అరునెల్ల గడువు ॥అంత॥

మొగి నొక్క తామరలో మోవిపండు వండెనట
జిగిఁదేనె వావాతఁ జిందెనట
మగువ యీయారచి మతి నీవు దెలియవే
తొగరునీపలుకులతుదదాఁకా గడువు ॥ అంత ॥

కంతునిగురుతు రెండుగంబములమేడట
దొంతివలపులసిరి దొలఁకునట
ఇంతి నేను శ్రీవేంకటేశుఁడ యీకత
మంతనాన విన్నుఁ గూడి మరపించేగడువు ॥ అంత ॥ 4

ఆహిరి

ఈరీతివలపు లొకటి కిసుమడాయ। విభుఁడ
కోరికలు కోటానఁగోటి సతికాయ ॥ పల్లవి ॥

సుదతి నీరాక కెదురుచూచేటియాసలను
కదిసి నగుమోమెల్లఁ గన్నులాయె
యిదె నీకడకు నాకె యేతెంచుఁదమకమున
అదన మునిముంగిలెల్ల నడుగులే యాయ ॥ ఈరీ ॥

వెలఁది నీసుద్దెలెల్ల వినియేటివేడుకల
వెలలేనిపులకలే వీనులాయె
పలుమారు నీతోడఁ బలికేటికాంక్షలను
విలువెల్ల నంగనకు నివ్వెరగులాయ ॥ ఈరీ ॥

కమలముఖి నీరతులఁ గలయునిబ్బరమునను
కొమరైనచన్నుఁగవ కొండలాయ
చెమటచే విద్దరికి శ్రీవేంకటేశ్వరుఁడ
తమకములు తనువులును తడఁబాటులాయె ॥ ఈరీ ॥ 5

సామంతం

చెలులాల వూహించి చెప్పరమ్మ
నిలువెల్ల మురిపెమే నిండకుండీనా ॥ పల్లవి ॥

అంగన విభునిఁ జూచి అరనవ్వు నవ్వె నిట్టె
యింగితానఁ గడమన వ్వేఁదు దాఁచెనే
అంగమెల్ల మెఱుఁగులే అందు దాఁచ విమ్ములేదు
వుంగిటిఁ గనుగొనల నుండకుండీనా ॥ చెలు ॥

జలజాక్షి పతిఁ జూచి సగముమాటలఁ దిట్టె
యెలమిఁ గడమదొడ మెందు దాఁచెనే
తలఁపెల్ల దమకమే దాఁచఁ జోటు లేదెందు
పలుకుఁబంతములోనె పైకొనకుండీనా ॥ చెలు ॥

కోమలి శ్రీవేంకటేశుఁ గూడి పరవశమందె
యేమరి కోరికలెల్ల నెందు దాఁచెనే
ప్రేమలెల్ల పెనపులే పిరిదియ్యఁ జోటులేదు
దోమటిరతులలోనే తోఁచకుండీనా ॥ చెలు ॥ 6

రేకు 1402 దేసాళం

అన్నియు నీయందే అమరెనట
కన్నియ ఇందుకు మారుగత చెప్పవే ॥ పల్లవి ॥

కలువలు వికసింపఁ గమలములై తోఁచె
గలికి విన్నిట నీకత చెప్పవే
అలులంటా బడిఁబోతే అన్నియు నీలములాయ
కలగాదు ఇది యొక్కకత చెప్పవే ॥ అన్ని ॥

జక్కవలు గండుమీరి సరిఁ బైఁడికుండలాయ
గక్కన విచారించి కత చెప్పవే
మక్కువతోఁ బులినాలు మదనచక్రములాయ
కక్కసము మాని నాకీకత చెప్పవే ॥ అన్ని ॥

ఆకసము చూడఁజూడ నదె సింహమాయ నట
కాకుగాదు ఇది యొక్కకత చెప్పవే
యీకడను శ్రీవేంకటేశుఁడను నే విన్ను
పైకొన్న దిది యొక్కకత చెప్పవే ॥ అన్ని ॥ 7

మాళవి

పొలిఁతి జవ్వనమునఁ బూవక పూచె
యెలమి నిందుకు మనమేమి సేసేదే ॥ పల్లవి ॥

సతి చింతాలతలలో సంపెఁగపూవులు వూచె
మతివిరహపుమేన మల్లెలు వూచె
అతనునితలపోఁత నడవిజాజులు వూచె
హితవు తెలియ దిఁక నేమిసేసేదే ॥ పొలిఁ ॥

తొయ్యలిచెమటనీట దొంతిదామెరలు వూచె
కొయ్యచూపుఁగోపములఁ గుంకుమ వూచె
కయ్యపువలపులఁ జీఁకటిమాకులు వూచె
నియ్యెడఁ జెలియభావ మేమిసేసేదే ॥ పొలిఁ ॥

మగువరతులలోన మంకెనపువ్వులు వూచె
మొగిఁ గొనగోళ్లనే మొగలి వూచె
పొగరు శ్రీవేంకటేశుపొందులఁ గప్రము వూచె
ఇగురుఁబోండ్ల మిఁక నేమిసేసేదే ॥ పొలిఁ ॥ 8

## ఆహిరి

కాంతయేమీ నెఱుఁగదుగాని
చెంతల నీగతి చెప్పరే చెలులు ॥పల్లవి॥

చిత్తజు నమ్ములు శిరసున ముడవఁగ
గెత్తుకెట్ల దాఁకెనో గాని
గుత్తపుఁజెక్కుల కుంకుమచెమటలు
జొత్తులు గారీఁ జూడరే చెలులు ॥కాంత॥

చలువమేనిపై సరులహారములు
చెలఁగి నాని మొలచెనో కాని
పులకలమొలకలఁ బొదలినపయిరులు
వెలసె నిదివో భావించరె చెలులు ॥కాంత॥

ఘనుఁడగు శ్రీవేంకటపతి గూడఁగ
చెనకి గుఱుతు నేసెనోకాని
వెనకముందరల వింతలు వొడమెను
కనుఁగొనరే యిది గక్కనఁ జెలులు ॥కాంత॥ 9

## ముఖారి

నగవింతే యేమనినా నాకుఁ బోవునా
మొగమేడ ఉద్దమేడ ముచ్చటలుగావా ॥పల్లవి॥

మగువ నాతో నలిగి మారుమంచ మెక్కినాను
తగిలి నామన సందు దగ్గరిరాదా
తగులుగలచోటికి దవ్వేమి చేరువేమి
మొగులేడ నీరేడ మొత్తమై తిరుగవా ॥నగ॥

పైపై నాచేత నన్నుఁబట్టనీక తోపినాను
చూపులై నా నిన్ను నవి చుట్టుకొనవా
పాపరాదు పాలుగలపాయపువారిపొందు
తీపు లేద పూవులేద తేనెలై ఊరియవా ॥నగ॥

చాయపాటై నన్నుఁగూడి సరిమేను మఱచితే—
నేయెడ నారతిచేఁత లెచ్చరించవా
పాయరాదు శ్రీవేంకటపతినై ననన్నును
రేయేడ పగలేడ రిచ్చలఁ బైకొనవా ॥నగ॥ 10

ఆహిరి

నాకెట్లఁ దెలుసు నిన్ను నమ్మఁగలదానఁగాక
యీకడాకడ నీయిత వెట్లున్నదో ॥పల్లవి॥

శిరసువంచుక లేమసిగ్గే నినుఁ జూచి నవ్వె
అరయ నీవాకె కేమౌదువోకాని
వొరసి నాపై నీవు వద్దనుందు వింతేకాక
యిరవై యెఱఁగకుండ యేమినేతువో ॥నాకె॥

మచ్చిక నొకవనిత మాట దగుఁగ నాదె
యిచ్చల నీకును నాకె కేపొందులో
వచ్చి నాయెదుట ముగుదవలె నుందు వింతేకాక
యెచ్చట నెవ్వరియిండ్ల కేఁగుదువో నీవు ॥నాకె॥

నిక్కుచు నొకసతి నీకాలు దొక్కీదె
యెక్కడ మీయిద్దరిలో నేపంతమో
యిక్కువ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
యెక్కువ నీతమ వెట్ల నెందెందు మోచెనో ॥నాకె॥ 11

దేవగాంధారి

నవ్వకురా నీ నటనలను। నీ-
జవ్వన మందే చక్కనయ్యీఁగాని ॥పల్లవి॥

మఱవకురా నీమాఁటలు యీ-
జఱపులలోనే సరిచూపేను
పొఱగకురా సారె పొఱపులను। తెర-
మఱఁగుల మొఱఁగుల మంచిదయ్యీఁగాని ॥నవ్వ॥

చిమ్మకురా చూపు చివుకనను నీ-
దిమ్మఁగాఁకలనే తెలిపేను
కమ్మకురా నీగర్వము యివి
కమ్మర నీరతిఁ గందముగాని ॥నవ్వ॥

విగియకురా కడుఁబ్రియమునను యీ-
విగువుఁగాఁగిటనే పెనచేను
తగు శ్రీవేంకటధరణీశ నన్ను
మిగులఁ గూడితి విది మెచ్చేఁగాని ॥నవ॥ 12

రేకు 1403 శ్రీరాగం

[1]సూడగదవమ్మ సొక్కి యేల తంగీ
జేడుఁగోనేటిసెలమకరతమ ॥పల్లవి॥

కూపెట్టుసదువులకొనలపేరిటివాఁడు
పూపకొడుకుఁ గవి బూము లేలేటివాఁడు
సాపనీటికిందిసతి సంకఁబెట్టుక
తీపుల తిరుమలదేవరైనాఁడే ॥సూడ॥

1. ఈ ప్రహేళిక సరిగా వీడుట లేదు.

పుల్లవెలుగులోపిటోనపుతరివాఁడు
తెల్లనిమెఱుఁగుల తెరలఁ దేలేటివాఁడు
గుల్లసేతఁబట్టి కొండపై విలుసుండి
వల్లెవాటువేసి వరము లిచ్చెను ॥ సూద ॥

సీఁకటిమైవాఁడు సీలపసపువాఁడు
ఆకుదండలే తలనటుమోసినాఁడు
దీకొని పాముపై తేలి వుండినవాఁడు
యీకడ శ్రీవేంకటేశుఁ డైనాఁడె ॥ సూద ॥ 13

## ముఖారి

చెక్కుటిచే యిదియేల చింతయేల
చక్కనయ్యా విన్నియును చాలుఁజాలు సుందరా ॥ పల్లవి ॥

మేరతో నాయాసలకు మితిలేదు తతిలేదు
వోరి నీమాటల కెందు నూరటలేదు
దూరలేను నే విన్ను తొరలింపువినయాలు
సారె నీవుఁ జేయలేవు చాలుఁజాలు సుందరా ॥ చెక్కు ॥

దోమటినాచూపులకుఁ దుదమొదలును లేదు
గామిడినీచేఁతలకుఁ గడ లేదు
వేమారు విన్ను నిఁక వేసరించలేను నాతో
సాముసేయలేవు నీవు చాలుఁజాలు సుందరా ॥ చెక్కు ॥

మమత నాకాఁగిటికి మట్టులేదు గుట్టులేదు
తమకపునీమతికిఁ దవివి లేదు
చెమరించె మేనెల్లా శ్రీవేంకటేశ యిది
సమరతులాయ వింక చాలుఁజాలు సుందరా ॥ చెక్కు ॥ 14

ఆహిరి

అందరికి నావంటిఆసే కాదా
యిందుకేల వెఱపు నీ వెదురేఁగవయ్యా ॥ పల్లవి ॥

మగిడి మగిడి చూచి మాటలాడ నూఁకించి
చిగురుఁబెదవి వంచి సిగ్గువడీవి
మగువ నొయ్యనే చేరి మంతనాన బుజ్జగించి
పగడవాతెర నొక్కి పరికించవయ్యా ॥ అంద ॥

పొలసి పొలసి ఇంతి బొమ్మముడి వచరించి
మలసి పయ్యదకొంగు మాఁటుసేసీవి
నెలకొన్నతొల్లింటిసీయాకెయొడఁబాటు
సలిగెతోఁ జెల్లించి చనవియ్యవయ్యా ॥ అంద ॥

ఇక్కువల నాకె నిన్ను నెలఇంచఁగానే నన్ను
మక్కువచేఁతల నిట్టె మన్నించితివి
గక్కన శ్రీవేంకటేశ కపటము లిఁక మాని
అక్కరదీరఁగ నాకె నాదరించవయ్యా ॥ అంద ॥ 15

రామక్రియ

నాకు నివియే నవ్వులా। వీరు
దాకొని కదిసినదవ్వులా ॥ పల్లవి ॥

మానవయ్య నీమాటలూ యేల
తేనెలో నివె తేటలూ
నేనెఱిఁగినవె నీ చేఁతలూ భువి
మోనములలోనిమోఁతలూ ॥ నాకు ॥

చాలుఁజాలు నీసన్నలూ। కడు
పోలఁజూచినపొన్నలూ
సోలి మును నేఁజూచినవే నేఁ-
డీలాగై కడునేఁచీ వివె ॥ నాకు ॥

చెల్లవిఁక నేల సిగ్గులూ। నేఁడు
మొల్లపులకలే ముగ్గులూ
వెల్లవిరి శ్రీవేంకటేశ మన-
చల్లఁగూటమే సంకెనేసె ॥ నాకు ॥ 16

శంకరాభరణం

[1] నెమ్మది నున్నాఁడ విదె నీకేమయ్యా మంచి
నెమ్మిపం దారగించేవు నీకేమయ్యా ॥ పల్లవి ॥

నీలిల నీళ్లపై తేట నీకేమయ్యా। యీ-
నేలకింద నుండితివి నీకేమయ్యా
యేల విన్ను మరుతాప మేమినేసీని। నీ-
నీలిమేను కందులేదు నీకేమయ్యా ॥ నెమ్మ ॥

విక్కము బొంకుసేసేవు నీకేమయ్యా యిట్టె
నిక్కిచూచి దాఁగేవు నీకేమయ్యా
యెక్కడిమోహములు నీకేమియు నేల
నిక్కుసగ్గు లెఱఁగవు నీకేమయ్యా ॥ నెమ్మ ॥

విద్దురఁ గంటఁబెట్టవు నీకేమయ్యా। వట్టి-
విద్దురేల పొయ్యేవు నీకేమయ్యా
గద్దరి శ్రీతిరువేంకటవిభుఁడ। నన్ను
నిద్దపుఁగాఁగిట గూడి నీకేమయ్యా ॥ నెమ్మ ॥ 17

1. దీనిభావము స్పష్టమగుట లేదు.

సాళంగనాట

కాయముఁ బ్రాయముఁ బో కలిగినది
యేయెడ నాతఁడు నీవు నెంచినను ॥ పల్లవి ॥

చెక్కిటి చేతితోడ సిగ్గువడే విదియేమే
చొక్కపు విభుఁడు నిన్నుఁ జూచెనంటాను
వొక్కనిమిషములోనే నుఁ(వు?)డివోవు నివియెల్ల
గక్కన నాతఁడు విన్నుఁ గదిసినను ॥ కాయ ॥

మంతనాన మాఁటకు మాఁటాడ విదియేమే
పంతపువిభుఁడు నీతోఁ బలుకఁగాను
యింతలోనే యనుమాన మిఁకనేల తగులాయ
చెంతల నాతఁడు విన్నుఁ జెనకఁగను ॥ కాయ ॥

చెలరేఁగే విదియేమే శ్రీవేంకటేశుఁడు
యెలమిఁ గూడి చన విచ్చెనంటాను
తొలుత నే నిందుకే పో తొడఁగి చెప్పినదెల్లా
మెలుపున నీదేరె మీకిఁకను ॥ కాయ ॥ 18

రేకు 1404 శంకరాభరణం

అతివ యేగతినైనా నలసినాను
యితవై కొన్నిటికైన యింపాయఁగా ॥ పల్లవి ॥

మేఁ(మెం?)డైన విరహాన మెలఁత కన్నులనీరు
నిండుఁగొలఁకులై విగుడఁగాను
గండు మీలకైనాఁ గడు నందులోనుండి—
నొండొకటికిని దా నొకమన నవుఁగా ॥ అతి ॥

పరిపరివిధములఁ బానుపుపైఁ బొరలఁగా
శిరసుతురుము వీడి చెదరఁగను
విరతి నలులకైనా నెలఁతమైవాసన
సరుసఁ గైకొనఁగ ముచ్చట దీరెఁగా ॥ అతి ॥

కడుఁగడుఁదమకాన కదిసి యింతలోనె
పడఁతి శ్రీవేంకటపతిఁ గూడఁగా
జడియుఁ బరవశాన సారెసారెకు మేన
యెడలేనిపులకల కిరవాయఁగా ॥ అతి ॥ 19

ముఖారి

ఇది ఇట్లనౌత నే నెఱఁగఁ గాక
తుదిముట్ట నప్పుడే తోవ గనుకొననా ॥ పల్లవి ॥

సొగసి నా కడియాన చూపేరుగాక నను
దగిలి విక్కము నతఁడు దాఁ దలఁచెనా
మిగుల మీమాట నమ్మితిఁగాక ఇంతలో
మగుడ నే నొకతెగువ మది నెంచుకొననా ॥ ఇది ॥

యెదమాటలోననే యేమితమకమోకాక
వెదఁగుఁబతి విచ్చేయ వేళలేదా
బదలితిరి చాలు విఁకఁ బట్టుకున్నప్పుడే
అదరి నాలో వలసినట్లనే కానా ॥ ఇది ॥

చెలఁగి నామనసుఁ దెలిసితిరి మీ రిటుగాక
సొలసి శ్రీవేంకటేశుఁడు మానునా
చెలులాల మీపలుకు చెల్లె నే మిద్దరముఁ
గలసితిమి యిప్పుడేఁ గలకలన నగనా ॥ ఇది ॥ 20

## గుజ్జరి

చూడఁజూడ నిది వట్టి జోలి గాక। నీ—
జాడ లివి మంచివైతే సమ్మతులుగావా ॥పల్లవి॥

లాగుల వింటటనుఁ దెల్లవివెల్లాఁ బాలైతే
యేగతి భూమిలో నే మేమి గాదు
ఆగతినే పెట్టుకొన్న ఆనలే నిజమైతే
వేగుదాఁకా మరునికి వేదములై యుండవా ॥చూడఁ॥

సారెకు దిక్కులనుఁ బచ్చనిదెల్లాఁ బైఁడైతే
కోరి యవి యెంత సేసుకొనరాదు
కూరిమితో నీవొళ్లిగుణములే చక్కనైతే
సారపువలపులకు సాకిరులై వుండవా ॥చూడఁ॥

పొందినకాఁగిటిలోవిపులకలే పూవులైతే
చెందిన శ్రీవేంకటేశ చెప్పరాదు
కుందణపుఁగుత్తికలో కునుకులే కతలైతే
పందెపురతులకివి పచ్చియై నిలువవా ॥చూడఁ॥ 21

## శ్రీరాగం

ఎట్టయిన నేమి నీవు యేమన్న నేమి నీవు
యిట్టె లోనయ్యేవు యింత చాలదా ॥పల్లవి॥

కొమ్మ నీచే నాతఁ డంత కోపానఁ బడెనేమి
తమ్మిపువ్వు వాటు నొవ్వఁదాఁకివనేమి
అమ్మ నీ వవ్వలిమొగమైనా నాతనికేమి
ఇమ్ముల యెదుట నున్నాఁ డింతచాలదా ॥ఎట్ట॥

మగువ నీ కతవితో మాడాడకున్న నేమి
నొగిలి యాతఁడు నీచే నొచ్చివ నేమి
మొగమీక నీవెంత మోవఁగ నాడిన నేమి
నగకున్నఁ గన్నులనే నవ్వు చాలదా ॥ ఎట్టి ॥

ఆది గొవి నీ వతవి కర్డము లాడిననేమి
వేదనల విప్పుడెంత వేఁచిన నేమి
ఆదరించె వేంకటేశుఁ డలమేలుమంగనాచా–
రీదెనఁ బిలవుమనీ నింతచాలదా ॥ ఎట్ట ॥ 22

శంకరాభరణం

ఇప్పుదే విచారించుకో యింతయు నీవు
అప్పుడు నాతో నొఁగా దనరాదు నీకు ॥ పల్లవి ॥

యిందరివలెనే నీవిప్పటికిఁ గూడి నన్ను
సందడిఁ బెట్టేనంటే సమ్మతించ రా
పందెమాడినట్లనే పదియుఁ బదియుఁగా। నా–
కందువనే వుండవలె కలకాలము ॥ ఇప్ప ॥

తక్కులుఁదెక్కులు నాడి తగులఁ దీసుక నా–
యిక్కువలంట(టే?)నంటే వియ్యకొన రా
వొక్కటినొక్కటి నా వొదఁబాటు నాకంటే
మక్కువ వితరులను మన్నించరాదు ॥ ఇప్ప ॥

యీయెడనే శ్రీవేంకటేశ నాకు దక్కితివి
నీయింతులు వరుసంటే నే నియ్య రా
యేయెడఁ బలుకుఁబంత మేకముగ నా కాఁగిట
రేయుఁబగలుఁ బాయక రిచ్చవడవలెనా(రా?) ॥ ఇప్ప ॥ 23

శ్రీరాగం

ఎఱఁగించవలయు నిప్పుడిపుడే నీ-
కలకటి నిన్నియుఁ గసరకుమీ ॥ పల్లవి ॥

చెలి నీపతిపై చిందులపాటలు
పలుమఱు నీలోఁ బాడఁగను
అలులివి విని తానటుఁ దమపిల్లల
పిలుపని మూఁగినఁ బెదరకుమీ ॥ ఎఱఁ ॥

అందపునడపుల నటునీపలికెదు-
రిందువదన నీవేఁగఁగను
కందువనంచలు గతియిది దమదని
సందడి సేసిన జడియకుమీ ॥ ఎఱఁ ॥

వోదక శ్రీవేంకటోత్తముకాఁగిట
మేదెపుఁగుచములు మెరయఁగను
యీడను జక్కవలివి తమజాతని
జోడుగవాలినఁ జోఁపకుమీ ॥ ఎఱఁ ॥ 24

రేకు 1405 సామంతం

ఎవ్వరము నేమిచెప్పే మిటమీఁదను
నివ్వటిల్లుఘనుఁడవు నీచిత్త మిఁకను ॥ పల్లవి ॥

విలువెల్లా వలపులే నెలఁతకు నేపొద్దు
పలుకెల్లా నీమీఁదిపాటలందునే
తలఁపెల్ల నీపైతమకమే కలదెల్ల
నెలకొన్నపనులకు నీచిత్త మిఁకను ॥ ఎవ్వ ॥

చూపులెల్లనీపైనే సుదతి కీపులకల-
మోపులెల్లా నీమీఁదిమోచిదింపులే
తీపులయాసలు నీతేనెలమాటలందే
నీపాదమానసుమ్మీ నీచిత్త మిఁకను ॥ ఎవ్వ ॥

కాయము నీకాఁగిటనే కలికిజవ్వనపుఁ-
బాయమెల్ల నీరతిబంధములనే
యేయెడ శ్రీవేంకటేశ యీకెకు నీకుఁ దగు
నీయిచ్చలాయ నేఁడు నీచిత్త మిఁకను ॥ ఎవ్వ ॥ 25

పాడి

ఆతురమే నెలవాయనమ్మా యీ-
యేతులునుఁ దాలిములు యెరవౌట యరుదా ॥ పల్లవి ॥

డిందుపడి సొబగులకు ద్రిష్టిదాఁకినయట్లు
అందమే పరితాపమాయనమ్మా
చెంది హృదయఁ(యం?)బెల్ల చేకొన్నరమణుఁడే
పందెమడిచినయట్ల పగయౌట అరుదా ॥ ఆతు ॥

సొలపులఁ గనుచూపులకు సోఁకు సోఁకినయట్లు
అలసత మైమఱపు లాయనమ్మా
పిలిచి విభుఁగూర్చుటకు పెరరేఁచునెచ్చెలులె
కలలోనిచెలిమివలె కడకేఁగు టరుదా ॥ ఆతు ॥

చెప్పనరుదగుమరునిచేఁతవలె తఱిఁ జితురు-
మప్పుడే చిందువందాయనమ్మా
యిప్పుడే శ్రీవేంకటేశుకాఁగిట నింతి-
వొప్పులే తప్పులై వొత్తగిలు టరుదా ॥ ఆతు ॥ 26

### పాడి

[1]గరిమతో విన్నిటాఁగలనీకు
బెరసిననామీఁదఁ బ్రియమున్నదా ॥పల్లవి॥

తనురోమరోమరంధ్రములను బ్రహ్మాండ-
జననసంహారవిచారములు
మనసున నీకివి మంత్రములై నన్నుఁ
గనుఁగొని కరుణించఁగలదా వేళ ॥గరి॥

కన్నుల శీతోష్ణకారణములు దోఁచి-
యున్నచంద్రుఁడు రవియును మించఁగా
నన్నుఁ బాయుచుఁగూడ నలిరేఁగనేకాక
యిన్నిటాఁ బనులు నీకిఁకఁ గలవా ॥గరి॥

కడలేనినీమేనఁ గలుగుదేవతలను
బడిబడిఁ బలుమారుఁ బలికింపుచు
విడువక నమఁగూడి వేంకటేశ్వర నెత్త-
మడరి యాడఁగ నీకు నదనున్నదా ॥గరి॥ 27

### శంకరాభరణం

[2]మంజుతనౌ పరిమళతి సతి । సు-
ధాంజనం తే విహరణ మిదం ॥పల్లవి॥

గమన మయతి సతి కబరి చలతి సతి
కిమితి కిమితిముఖే విరతి సతి
కమలాననే త(వ)గతిః కథం భో
సుముఖమయా వద సుకరమి దం ॥మంజు॥

---

1. ఇది ఖండితనాయికావచనము. స్వామియధ్యాత్మస్వరూపమును నెపముచేసి నిందించినతీరు.
2. ఇది స్వచ్ఛందసంస్కృతరచన. ఇట్టి దానాడు సంకీర్తనములం దుండెనేమో? అక్కడక్కడా చిప్పుగుర్తులోని నాసవరణలు ఘుణాక్షరసాధుత్వసంపాదకములే.

మహతి వీక్షణే మదం కిరతి సతి
రహసి మనసి సంభ్రమతి సతి
మహితే తే గరిమానం కిం మా-
మిహ వద భవదిష్ట మిదం ॥ మంజు ॥

స్వయంస్వయం సంశయో హరతి సతి
నయనౌ(నే?)కించిన్నమతి సతి
శ్రీయఃపతి స్తే శ్రీవేంకటపతి
అ (ర?)యం ప్రియ స్తే యత్నమిదం ॥ మంజు ॥ 28

## మధ్యమావతి

నమ్మరా నామాట నీవు నగవు గాదు
కమ్మర నాబలిమెల్లఁ గనుకొనరా ॥ పల్లవి ॥

మాఁటలాడి మాఁటలాడి మగిడి చూచేవు నీవు
యేఁటికి నీకింత వెఱపేల వచ్చెరా
నీఁటున నెవ్వతెయైనా నిన్ను నేమిసేసినాను
గాఁటముగ నేవిప్పె కాచుకొనేరా ॥ నమ్మ ॥

చేరి చేరి నావొద్ద శిరసువంచేవు నీవు
వారించి యిది నీకెవ్వతే చెప్పెరా
యీరీతి విందుకుఁగా నెవ్వతె గోపించినాను
అరసి నే నీసంది కడ్డమయ్యేరా ॥ నమ్మ ॥

కూడిమాడి నాగోరికొనలకే యలికేవు
వోడక శ్రీవేంకటేశ వూరకుండరా
ఆడనీడ నెవ్వరు నీ కడ్డముగా వచ్చినాను
వేడుక నే నాడుకొనే వేసరకురా ॥ నమ్మ ॥ 29

శ్రీరాగం

[1]దేవదుందుభులు నలుదిక్కులందు
తావులనే వేవేలు ధ్వనులియ్యఁగాను ॥ పల్లవి ॥

వేంకటాద్రిదేవుఁ డదె వేడుకతోఁ బెండ్లాడీ
లంకెల నిప్పుడే కమలాదేవిని
కొంకక ముప్పదిమూఁడుగోట్లుదేవతలాల
వుంకువ విచ్చేయరో మహోత్సవవేళ ॥ దేవ ॥

వనజనాభుఁడు నిత్యవైభవానఁ జేకొనె
అనయము నిదివో యాదిలక్ష్మిని
మునులాల భు(ఋ?)షులాల మించినభూసర(రు?) లాల
పొవిసి యిందరుఁగూడి సుముహూర్త మనరో ॥ దేవ ॥

సురకన్యలాల భూసురనాగకన్యలాల
మరిగికూడీ నలమేలుమంగ నితఁడు
నిరతి శ్రీవేంకటనిలయుని నీకెను
యిరవుగ దీవించి యిందరునుఁ బాడరో ॥ దేవ ॥ 30

రేకు 1406 సామంతం

ఒక్కటికి నురిగట్టె వొంటికి [2]దాయిగట్టె-
వెక్కువ గోవాళవిద్య లీకఁ జేయవలెనా ॥ పల్లవి ॥

నిక్కినిక్కి యాకెఁ జూడ నిదివి యాడకు నీడ
అక్కడికే పోరాదా అంతగలితే
మొక్కిమొక్కి నన్నుఁ జూచి మూఁగసన్నలేల సేయ
ఇక్కడికే రారాదా యింతగలితేను ॥ ఒక్క ॥

---

1. ఇది అధ్యాత్మ కీర్తనల ఛాయలోనిది. 2. 'దాయఁగట్టుట'యా?

చెప్పిచెప్పి పంపనేల వెలవుల నవ్వనేల
అప్పటి నీ వేఁగరాదా అంతగలితే
తిప్పితిప్పి నాతోనుఁదెగి జాణతనమేల
యిప్పుడే మన్నించరాదా యింత గలితేను ॥ ఒక్క ॥

పూఁచిపూఁచి మావి నాతో బూమెలు సేసేవుగాక
ఆచాయ నుండవా నీ వంతగలితే
చేచేతఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
యీ చలమే నీకు దక్కె నింత గలితేను ॥ ఒక్క ॥ 31

## ముఖారి

అరజమైతివి అంగడికెక్కితి
తారుకాణ లికఁ దనతోనేలా ॥ పల్లవి ॥

పూవక పూచెను పున్నమవెన్నెల
కావక కాచెను కంతుబాణములు
యీవల నికఁ మరి యేలా మాఁటలు
ఆవలఁ దనచెలు లాడే రదివో ॥ అర ॥

కానక కనెనట కమ్మఁజెఱకువిలు
పూని వినకవినెఁ [1] బొత్తులగాలెట
నానాఁటికి నివె నడచీ సుద్దులు
తానే యెఱుఁగును తమకములేలా ॥ అర ॥

పాఁకెను తీగెలు బయలువందిలులు
మూఁకలు విచ్చెను మొకరితుమ్మెదలు
యీకడ శ్రీవేంకటేశుఁడు గాఁగిటఁ
జేకొనె నిదె మదిఁ జింతలవేలా ॥ అర ॥ 32

1. పొత్తులగాలి+అట.

తెలుఁగుఁగాంబోది

ఇదియే దిష్టము భూమి వింతులఁజేసినచేఁత
యెదురెదురనే కాఁకు నెఱఁగరే చెలులు ॥ పల్లవి ॥

పంచబాణములు నేఁడు పడఁతిపై నేసెఁగాన
పంచమహాపాతకుఁడు భావజుఁడే పో
యెంచ విందువఁ (వం?)కనేపో ఇందరిలో రూపులేక
అంచెల నంతరభూతమై యుండవలసె ॥ ఇది ॥

విరహపుటింతి వింత వెరపించెఁగాన రేఖ
సరిలేనిరాకాసి చందురుఁడే పో
తిరమై నేఁ డిందువంక దినములు నొక్కొకళ
సురలెల్లఁ దినఁగాను సుక్కువడఁగలిగె ॥ ఇది ॥

కందువ నేటియింతి కాఁగిటఁ గలయఁగాను
యిందు జాణ శ్రీ వేంకటేశుఁడే పో
మందలించి ఇందుననే మగువలపాలిటికి
ముందుముందే పురుపో (షో?) త్తముఁడు దానై వెలసె॥ఇది॥33

సామంతం

మరలి యేపవియైన మమ్మడుగవే। మీరు
గరిమఁ గలసి ఇంకాఁ గలవా యెన్నికలు ॥ పల్లవి ॥

కామిని నీపతి నీతోఁ గడుసరసమాడితే
యేమే నామోము చూచే వింతలోన
యేమేమో మీలో సుద్ది మీరిద్దరే యెరుఁగుదురు
కామునితంత్రములపైఁ గలవా యెన్నికలు ॥ మర ॥

కలికి నీపతిఁ నీతోఁ గన్నులనే నవ్వితేనే
యెలమిఁ జెలులము నే మేమినేతుమే
నెలవైనమీసన్నలు నేఁడు మీకే తెలుసును
కలిమి పూబాణాలపైఁ గలవా యెన్నికలు ॥ మర ॥

యీకడ శ్రీవేంకటేశుఁ డింతి నిన్నుఁ గూడితేనే
మేకొని మమ్మెల్లా నీవు మెచ్చేవేమే
యేకమైనరతుల మీరిద్దరునుఁ గంకణాలు
గైకొని కట్టినమీఁదఁ గలవా యెన్నికలు ॥ మర ॥ 34

## శ్రీరాగం

మించి కాలము కిందుమీఁదాయనే
ఇంచుకంత దెరఁగు లే దేమినేతమే ॥ పల్లవి ॥

ధరలో మరునెలవు తలఁపులో చిత్తరువు
తరుణిమాటలలోనే తఱచాయనే
విరహపుటెండవేఁడి విరులకొనలవాఁడి
ఇరవాయనా యెందు నేమినేతమే ॥ మించి ॥

కట్టలేవిగాలిమోపు కడలేవివినుకులు
దట్టమాయ నీమగువతగులనే
గుట్టులేవితమకము కోవిలలో సముకము
యె(యి?)ట్టె నాకిది యబ్బె నేమినేతమే ॥ మించి ॥

వానలేవివరదలు వడలేవిదప్పులును
మానివికాఁగిటిలోనే మక్కళించీనే
పానిన శ్రీవేంకటే(ట?)పతిగాన నన్నుఁ గూడె
యీనెలఁత మెప్పించె నేమినేతమే ॥ మించి ॥ 35

రామక్రియ

తవిసితి నీఁక నవి తడవకువే వాని—
మనసు దెలియఁ గంతుమాయలయినఁ జాలవు ॥ పల్లవి ॥

చిత్తరువుమాఁకులకు జిగురులు గలుగునా
హత్తినతనవలపూ నటువంటిది
పొత్తుల నటుండనీవే పొందగుపతిగుణాలు
యిత్తల నే నెంచేనంటే యిసుమైనఁ జాలదు ॥ తవి ॥

నెమ్మి నెండమావులలో నీనుపునీరుండునటే
అమ్మలాల తనబాస లటువంటివే
కమ్మర నింకా నేవే కాంతునిమోవిమీఁద
సొమ్ములవి యెంతమంటెఁ జుక్కలైనఁ జాలవు ॥ తవి ॥

కందువైనకతలకుఁ గాళ్లు గలుగునటే
అందమైనతనసుద్దు లటువంటివే
పొందినశ్రీవేంకటేశుభోగము చెప్పఁబోతే
యెందును రేలుఁ బగళ్లు నెన్నియైనఁ జాలవు ॥ తవి ॥ 36

రేకు 1407 శంకరాభరణం

రమ్మనీ రావయ్య రాఁపు వొద్దు
కొమ్మ మనసు విలిపె(పెఁ?) గొంతవొద్దు ॥ పల్లవి ॥

సమ్మతి నీరాకకు సకినాలు చూచి చూచి
కొమ్మ మనసు విలిపెఁ గొంతవొద్దు
వుమ్మడి నంతటఁ దనవొరపుసింగారాల
ఇమ్ములఁ బొద్దు గడిపెం తవివొద్దు ॥ రమ్మ ॥

గారవానఁ జెలులు నీకదకంపి, నీరూపు
కూరిమితోఁ దలపోసెఁ గొంతవొద్దు
ఆరసి నీసుద్దులెల్లా నందరితోఁ జెప్పి చెప్పి
యీరీతిఁ బొద్దువుచ్చె నింతవొద్దు ॥ రమ్మ ॥

చిప్పిలేటితమకానఁ జిత్తములో సమరతి
కుప్పనేసెఁ గోరికలఁ గొంతవొద్దు
ఇప్పుడే విచ్చేసి నీవు ఇంతిని శ్రీవేంకటేశ
తెప్పిరఁగూడితి విట్టె దినము నేపొద్దూ ॥ రమ్మ ॥ 37

## ముఖారి

ఇంతలోనే విభుఁడ మా కేమి దప్పెను। నేఁడు
వింతలుగాఁ దినఁదిన వేము దీపువో ॥ పల్లవి ॥

నీవు మమ్ముఁ జెనకక నిలిచితేఁ జాలుఁగాక
భావజు చెఱకువింటఁ బందు వందెఁబో
తావుల నీబాస నీవే తప్పితేనే చాలుఁగాక
పూవుబాణములపంట పొల్లువోదు వో ॥ ఇంత ॥

కడువింతదిమసము గలిగితేఁ జాలుఁగాక
చిడుముడి చిగురుల చేగలెక్కెఁబో
వడి నీమాటలు మఱవకవుంటేఁజాలుఁగాక
గుడిగొన్నవెన్నెలలే కొంగుముడి వో ॥ ఇంత ॥

శ్రీవేంకటేశ నన్నుఁ జేరితేనే చాలుఁగాక
సోవల మోవుల నిట్టె జున్ను వెట్టెఁబో
తావి నాకాఁగిట నిట్టె దక్కితేనే చాలుఁగాక
యేవేళఁ బులకలే ఇరవైననేసవో ॥ ఇంత ॥ 38

సామంతం

పడఁతి ఇటవి విన్నపము సేయవే[1] తాఁ
గడదాఁకా నిందుకైనఁ గలఁడుగా తాను ॥ పల్లవి ॥

సరి నిపుడైన విచారించెఁగా నన్ను
కురిసి విరహమే పై కుప్పసేసెఁగా
మరునికాఁకల నామనసిది యేమైన
గరిమతో సూడువట్టఁగలఁడుగా తాను ॥ పడఁ ॥

తలఁచి తనకు నాపై దయవుట్టెఁగా; నాకు
వలపులు మించనైన వరమిచ్చెఁగా
చెలఁగి యావలచే నాజీవ మెంతబడలినఁ
గలిమితో సేకరించఁగలఁడుగా తాను ॥ పడఁ ॥

గక్కన విచ్చేసి నన్నుఁ గాఁగిలించెఁగా నేఁడు
యెక్కువైన శ్రీవేంకటేశ్వరుఁడు
దిక్కయి నన్నిట్లానే దినదినమునుఁ గూడ
కిక్కసము గానివాఁడు గలఁడుగా తాను ॥ పడఁ ॥ 39

సామంతం

ఒక రొకరికె మన మొద్దిక గాదా। నీకు
వెకలిరతుల ముందువెనక గానా ॥ పల్లవి ॥

కోమలి నీకుచములు కొండలైతే నామీఁది-
చేమలుచెల్లుఁబో నా చేతు లివి
యేమిటా నీజవ్వనమే యెక్కుడుఁగా నెంచుకొంటే
ఆమీఁదిఫలభోగ మది నేఁ గానా ॥ ఒక ॥

---

1. రేకులో 'సేయవే'కు తర్వాత పాదపూర్తిగుర్తుగీత యున్నది. ప్రాస-లఘు భంగము.

కలికి నీకన్ను లివి కమలము లనుకొంటేఁ
దొలకు నాచూపులనుఁ దుమ్మిద లివి
చెలువాన నీవెంత చెలరేఁగినా నీకు
అలరి యెవ్వరివను లంతకు నేఁ గానా ॥ ఒక ॥

అంగన నీచెమటలే అంబుధియైతే నేఁ
జెంగలించి వోలలాడే శేషశాయిని
సంగతి నీకూటమే సారెకు [1] మెచ్చవు నేఁ
గంగులేవిశ్రీవేంకటపతిఁ గానా ॥ ఒక ॥ 40

తెలుఁగుఁ గాంబోది

తరుణి కిచ్చకమే తగిన దిది
విరతము నతివలునేర్చినప(ఫ?)లము ॥ పల్లవి ॥

అంగన నెవ్వరు నవుఁగాదనకురే
కంగి విరహమునఁ గాఁగినది
చెంగటఁ బతితో చెలి నొనగూర్చుటే
సంగతి మన మిచ్చటఁ గలఫలము ॥ తరు ॥

ఇంతి నెవ్వరును యిది యేమనకురే
పంతపుటాసల భ్రమసినది
యింతనంతటా యెడమాఁటల మతి–
చింత వాపుటే చెలులకు ఫలము ॥ తరు ॥

వెలఁది యిదివో శ్రీవేంకటపతితో
మలయురతుల మెయి మఱచినది
చెలువునిమర్మపుచేఁతలు చూచేటి–
చెలుములు మన మిటు సేసినఫలము ॥ తరు ॥ 41

---

1. మెచ్చు+అవు

### భైరవి

ఇటమీఁద మీచిత్త మెట్లోకాని
కుటిలకుంతలిపొందే గుణము వో విభుఁడా ॥ పల్లవి ॥

యింతి నీకు మేడమీఁద నెదురుచూచినచూపు
దొంతులై పెరిగి మరుతూపులాయను
యింతట విచ్చేయకున్న యివి యిన్నియును నీపై
చెంతల వద్దికిఁ బారు చెప్పితిఁబో విభుఁడా ॥ ఇట ॥

వాలినయాసలతో వనిత వలపులెల్ల
చాలుకొని శాఖోపశాఖలాయను
తాలిమి నింతటనైనా దయదలఁచకవుంటే
కాలఁ జేతఁ బెనగొను కనునో విభుఁడా ॥ ఇట ॥

మెలుఁత జవ్వనమెల్ల మించినసొబగులెల్లాఁ
గలయురతులఁ జెప్పఁ గతలాయను
యెలమి శ్రీవేంకటేశ యిట్లఁ గూడకుండితే
తలపోఁతేఘనమవును తప్పదు వో విభుఁడా ॥ ఇట ॥ 42

రేకు 1408

### సామంతం

ఇన్నిటా నే నీకు లోనయినదానరా
పన్నిన నీచిత్తము నాభాగ్య మింతేకాని ॥ పల్లవి ॥

పెలుచునానడుము నీపిడికిటిలోని దింతే
చెలఁగి నీవెటువలపినఁ జేయరా
మొలకలనాకుచములే కడుఁగల్లరులు
వులుకనినీవానివోపి కింతేగాని ॥ ఇన్ని ॥

కడు నాచెలువము నీకనుచూపులోని దింతే
అదరి నే విన్నవుఁగానదవఁ గలనా
కొడిమిగిలిననాగోళ్ళవి కడువాఁడి
బడిబడి నీవానిబలిమింతే కాని ॥ ఇన్ని ॥

కమ్మనినామేను నీకాఁగిటిలోని దింతె
నెమ్మది శ్రీవేంకటేశ నీయిచ్చరా
దిమ్మరేఁచి మఱపించీఁ దియ్యనినామోవి యిది
తెమ్మలైననాలోనిదీమసమే కాని ॥ ఇన్ని ॥ 43

తెలుఁగుఁ గాంబోది

ఏడఁ గన్న నీకు మొక్కే దిందు కింతేపో
అడుకోకు నీపంతా లందు నిందు నిఁకను ॥ పల్లవి ॥

వడుమేల బడుగాయ నవ్వులేల తెలుపాయ
వెడఁగునీగుణములు వినివినిపో
జడిమాట లెందాఁకాఁ జాలించు మిఁక గోడ
గిడిగితే నసలేపో ఘనుఁడ ఇన్నిటాను ॥ ఏడఁ ॥

కురులేల చీఁకటాయ గోళ్లేల వాండ్లాయ
సొరిది నీచేఁతలు నేఁ జూచిచూచి పో
వొరిమ నీయానలు నొట్లు నాతో నేల
సరిఁ బిప్పి నమలితేఁ జప్పనే పో విభుఁడా ॥ ఏడఁ ॥

చెక్కులేల చెమరించెఁ జిత్తమేల ముదమందె
నెక్కొని శ్రీవేంకటేశ నిన్నుఁ గూడే పో
తక్కిన విన్నియు నేల తప్పు లవే వొప్పులాయ
చిక్కినపులకలెల్ల నేస లే పో ఇఁకను ॥ ఏడఁ ॥ 44

శంకరాభరణం

ఇంతిచెలువమే యీతనికి
కంతునిచేఁతలఁ గలసినవేళ ॥పల్లవి॥

చిత్తజకేళి నీచెలికుచగిరు లివి
హత్తినరమణుని కాధ(ద?)రువు
నెత్తమితావులనిట్టూర్పుగములు
కొత్తగుబడలికకును పరిహారము ॥ఇంతి॥

వలపులాకటికి వవితలధర మిది
చెలువునికిపు దమసినవిందు
చెలపచెలపమైచెమటలపన్నీరు
తెలియఁగ చలివందిరివో పతికి ॥ఇంతి॥

పట్టుగొమ్మ యీపడఁతి దేహలత
గట్టిగా శ్రీవేంకటపతికి
యిట్టె యిన్నియు నీకెకు నితనికి
పట్టినవెల్లా బంగారములు ॥ఇంతి॥ 45

లలిత

అంత సిగ్గువడక నీవానతీవయ్యా నీ-
యంతరంగమేల దాఁచ నానతీవయ్యా ॥పల్లవి॥

కడునరుసుఁదవట ఘనుఁద నీమోమందు–
నదరిన కళలెల్ల నానతీవయ్యా
వొడికమై నీమోవిమన్న కెంపు లవి యెన్ని
అడియాలముగ నాకు నానతీవయ్యా ॥అంత॥

మిక్కిలిజాణఁడవట మేపిమీఁదిచెమటలు
  అక్కట యెందుండి వచ్చె నానతీవయ్యా
  గుక్క కిట్టె యేయింతిగుబ్బలపైకుంకుమో నీ-
  యక్కుమీఁద నంటినది యానతీవయ్యా ॥ అంత ॥

యెసఁగి శ్రీవేంకటేశ యిట్టె కాఁగిటిలోన
  నసురుసురేల వచ్చె నానతీవయ్యా
  ముసిముసినగవుతో మునిఁగి నాకొనగోరి-
  కసమిచ్చి యేల లోఁగే వానతీవయ్యా ॥ అంత ॥ 46

## మంగళకౌసిక

తెలవకుఁబతివైతివి గాక
  గలిసించినఁ గడుఘనమా నీవు ॥ పల్లవి ॥

చూచినవెల్లా సొంపుముత్యములు
  పూచినపువ్వులె పున్నమలు
  లాచినవెల్లా లాగవేగములు
  యీచెలిసొబగుల కెదురా నీవు ॥ తెల ॥

పలికినవెల్లాఁ బసనివజ్రములు
  నిలువునఁ దురుమే నీలములు
  కలిగినపులకలె కనకపుమొలకలు
  జలజలోచనకు సరియా నీవు ॥ తెల ॥

కాఁగిటివెల్లాఁ గంతునిరచనలు
  మూఁగినరతి నిను ముంచె నిదె
  చేఁగల చిగురుల శ్రీవేంకటపతి
  పీఁగేటిరమణికి వింతా నీవు ॥ తెల ॥ 47

## సామంతం

ఊరకే మరునిపౌఁజు లూరఁగూటాలు
ఆరసితే వట్టిజూలు లవి నీకు నెదురా ॥పల్లవి॥

కొలనిలో తుమ్మిదలు కొమ్మలపై కోవిలలు
బలము లింతేపో భావజునికి
నెలఁత [1]నియ్యందైతే నెరిఁగలతుమ్మిదలుఁ
బలుకుఁగోవిలలునుఁ బంతమాడీఁగదవే ॥ఊర॥

తీగలపై విరులును తియ్యనితుంటవెఱకు
చేఁగలయమ్ములు విల్లుఁ జిత్తజునకు
సోఁగలబొమ్మలవిల్లుఁ జూపులయమ్ములు నీకు
యీగతుల వింతి నీకు నెదయవుగదవే ॥ఊర॥

యెక్కడో చందురుఁడును యెదపుల చల్లగాలి
మక్కువైన తోడు దొన మదనునికి
గక్కన శ్రీవేంకటేశుకాఁగిటనీకై తేను
వొక్కచో వదనచంద్రుఁ డూరుపే గాలిగదే ॥ఊర॥ 48

రేకు 1409

## మాళవిగౌళ

అణికాఁడవట యంతటికి
జాణవు తెలియము సరిగొనవయ్యా ॥పల్లవి॥

ముంగిట చెమటలముత్యపుఁబూసలు
అంగన లోలో నమ్మీనదె
ఇంగితంపువెల లెరుఁగుదువటవో
యంగడిబేహారి యవి గొనవయ్యా ॥అణి॥

---

1. నీ+అందైతే. వింతత్రికసంధి.

మొల్లమి మాచెలి మోవిమాణికము
అల్లవెలకు నీ కమ్మీనదె
తొల్లి నీవు సూదులవాట్లచేఁ
గొల్ల లడిగితట కొనవయ్యా ॥ అణి ॥

విడుదలచూపులనీలంబులు నీ-
వడిగినంతకే యమ్మీనదే
పడఁతిదె శ్రీవేంకటపతి నీ విదె
యెడయనికాఁగిట నిటు గొనవయ్యా ॥ అణి ॥ 49

## నాదరామక్రియ

ఊరకున్న నుండేఁగాక వోరుపునను
గారవించి చేకొనఁ గాదనఁగఁగలవా ॥ పల్లవి ॥

అలిగినప్పటివేళ ఆఱుఁబోయఁగాక నీవు
చల మిట్టె కడదాఁకా సాదించేవా
చెలి నీకుఁ జెల్లినంత చెల్లదా విభునికి
బలిమిఁ బట్టినను నోపననఁగఁగలవా ॥ ఊర ॥

యెచ్చినకోపపువేళ యేమయిన నాయఁగాక
పెచ్చువెరిగే వదేమే బిగియుచును
యిచ్చట నాతఁడు నిన్ను యింత వేఁడుకొనఁగాను
పచ్చిసేయ నీక నంత పలమారుఁ జెల్లునా ॥ ఊర ॥

తడసి యొక్కొకవేళ తప్పుఁదారుఁగాక నీవు
కడదాఁకా నీపంతమే కైకొంటివి
కడఁగి శ్రీతిరువేంకటపతి నన్నుఁ గూడె
అడరి నీవేడుకల కడ్డ మెందూఁ గలదా ॥ ఊర ॥ 50

### ఆహిరి

ఇంతలోననే యివి రెండూ
చింతలుఁ దమకములు చెలువుఁడ నేఁడు ॥ పల్లవి ॥

చెనకుల నీకడ చెనకులు విండేఁ
దువియవిచిత్తముఁ దుత్తమురో
మునుకొని యిప్పటిమోహము చూచిన
అవలుఁగొనలునై యాసలు వొదలు ॥ ఇంత ॥

ఇంచుకవడి నీ విటురాకుండిన
కంచుఁబెంచు నొఁ గాయమిది
అంచెలఁ గన్నుల వటు నిన్నుఁ గండే
పొంచినముదములఁ బులకలు మొలచు ॥ ఇంత ॥

కదియుచు నీ వాకడిమోమైతే
చెదరి కోరికలు చిందరలో
యిదె నన్ను శ్రీవేంకటేశ్వర యిటువలె
పొదిగినమోములఁ బొత్తులు గలయు ॥ ఇంత ॥ 51

### శంకరాభరణం

MP3

మనసిజసముద్రమద(థ?)నమిదె
కనుగొను మింతటఁ గాంతుఁడ నీవు ॥ పల్లవి ॥

సతి చింతామతిజలనిధి తరువఁగ
అతిగరళపువిరహము వొడమె
తతి నాపిమ్మటఁ దమకపుఁగోర్కుల-
లతల కల్పకపులాకలు వొడమె ॥ మన ॥

పొలఁతికూరిములఁ బొంగులు వొంగఁగ
పులకల తారలు వొడమె నవె
ఫలమై సాత్త్వికభావపుఁజంద్రుఁడు
నిలువునఁ బొడమఁగ నేరుపు లలరె ॥ మన ॥

సుదతి దానే నీచొక్కపుఁగాఁగిట-
నదనున విందిరయై పొడమె
కదిసినశ్రీవేంకటపతి నీదెస
యద(ధ?)రామృత మయ్యతివకుఁ బొడమె ॥ మన ॥ 52

గుండక్రియ

కటకటా మీఁదటికద(త?) యెంతో
తటుకునఁ బతి దయదలచఁగవలదా ॥ పల్లవి ॥

కంచుమించులగుగగనపునడు మిది
అంచగమనయే అధ(ద?)ము వు
పొంచినఅరునఁ బొదుపునేసుకొని
వుంచపుగుట్టున నున్నదిగాక ॥ కట ॥

విగ్గులు నీడలు నెలఁతవదన మిది
యెగ్గుసిగ్గులకు నెడ గలదా
బెగ్గిలి కన్నులఁ బెద్దసేసుకొని
ముగ్గులనవ్వుల మురిసీఁగాక ॥ కట ॥

పరువపుగరువపుపాయపుమన సిది
తరుణియూసకే దరిదాపు
యెరవుగ శ్రీవేంకటేశుఁడు గూడఁగ
సరవు లివిన్నియు జయమయి నిలిచె ॥ కట ॥ 53

మంగళ కౌసిక

ఇంత సేయఁగా నీ కిందు యేమివచ్చెనే నీవు
యింతివేకావా చెలి యిదియేమే ॥ పల్లవి ॥

అలరిచేఁతలవిభుఁ డాతఁడేడ నేనేడ
చాలుఁజాలు వింత నీకు చలమేఁటికే
మూలనుండేవారిఁ దెచ్చి ముంగిటఁ వేసేనంటా
యేల యిట్టె బోదించే విదియేమే నీవు ॥ ఇంత ॥

మాయదారివిభుఁ డెంత మరిగిననేనెంత
ఆయనాయ ననునేల యలయించేవే
వోయమ్మ చల్లవేఁడై వున్ననన్ను నతనితో
యీయెడనే కూడుమనే విదియేమే నీవు ॥ ఇంత ॥

యింతలోనే శ్రీవేంకటేశుఁడే దక్కె విట్లు
సంతముసేసితివి మెచ్చఁగవలెనే
పంతము పలుకు నొక్కపాటిగా మెలఁగునాపై
యెంత కెంతమమకార మిదియేమే నీవు ॥ ఇంత ॥ 54

రేకు 1410 లలిత

అతనితలఁపు దెలియఁగరాదా। నీ-
మతిలోనికాఁకలెల్ల మందలించేఁగాని ॥ పల్లవి ॥

అన్నియుఁ జెప్పేఁగాని యతఁడంపినట్టిచెలి —
విన్నపమంతయు నీవు వినరాదా
యెన్నిక లంతటిమీఁద నెట్టువలసిన నయ్యీ
కన్నులఁ గన్నంతనే గారవించుమీ ॥ అత ॥

ఇద్దరితలఁపులకు నిక్కవ చెప్పేఁగాని
పెద్దరికమున నాకేఁ బెంచరాదా
గద్దరిచలములేల కలది కలిగినట్టె
వొద్దిక నన్నియు నీ వొప్పుగొనుమీ ॥ అత ॥

వెలఁదిఁ బుత్తెంచి తా వెంటనే శ్రీవేంకట-
విలయుఁడు వీఁడె వచ్చె నీవు రారాదా
తెలిసి ఇద్దరుఁ గూడితిరి మాకిందరి కిదె
సెలవు నీపతి నిదె చిత్తగించుమీ ॥ అత ॥ 55

## తోంది

ఏమి దలఁచుకొంటివో ఇన్నాళ్లకు
నీమన సింతటనే తనివిఁబొందెనా ॥ పల్లవి ॥

వూరకే కొలనిలోన నోలలాడేమగువల -
చీరలేల తీసితివి చిన్నారివాఁడా
చేరి యంతటనుఁ బోక చేతులెత్తి మొక్కుమనే -
వేర యెంతకెత్తుకొంటి వేద కొత్తరా ॥ ఏమి ॥

బాలుఁడవై మాఇఁడ్ల పాలారగించి ఇంకా
పాలిండ్లపై చూపు పచరించేవా
చాలదంటా మాకేలు చాఁచి యందుకొమ్మనేవు
మేలుమేలు నీగుణాలు మెచ్చితిమిరా ॥ ఏమి ॥

ఇంతు లున్నారన కిట్టె యీఁదులాదే విందు వచ్చి
ఇంతలోనె శ్రీవేంకటేశుఁడ నీవు
పంతము చేకొని మమ్ముఁ బచ్చిగాఁ గూడితి విట్టె
ఇంతచేసి మరి చీర లిచ్చితివి చాలదా ॥ ఏమి ॥ 56

## బౌళి

మేకులాఁడిగదె యలమేలుమంగ
ఆకె యీతనికే తగు నలమేలుమంగ ॥పల్లవి॥

చెక్కులచెమటలతో చెలువునియెదుటనె
మిక్కిలి చొక్కీ నలమేలుమంగ
మొక్కలాన చెలులతో ముచ్చటలు చెప్పి చెప్పి
అక్కడే చూచీఁగదె అలమేలుమంగ ॥మేకు॥

చాలుకొని పతితోఁ జల్లు వెదమాటలనె
మేలములాడీ నలమేలుమంగ
తాళమొత్తి పాటపాడి తనలోనే నవ్వీని
అలరివిభునివద్ద నలమేలుమంగ ॥మేకు॥

యీడ విట్టె శ్రీవేంకటేశుని మెప్పించి కూడె
మేడెపుఁగాఁగిట నలమేలుమంగ
వీడెపురసములనే వీడుదోడై రతులలో
ఆడుకోలుమాఁట లాడీ నలమేలుమంగ ॥మేకు॥ 57

## ఆహిరి

తానట నన్నట తలఁచునటా
యీనిజమంతయు నెఱిఁగేఁగాక ॥పల్లవి॥

పిలువనంపునట ప్రియుఁడట
చెలి నీవు ప్రియము నేతువట
పలుమాఁటల కిఁకఁ బనిలేల। నే
వలరాజువలన వచ్చేఁగాక ॥తాన॥

చేకొని యిట విచ్చేసునట తా
నాకయి వసమయి నడచునట
రాకకు నామతి రాయపునా
నీకొరకు వలపు నెఱపేఁగాక ॥ తాన ॥

శ్రీవేంకటగిరిచెలువఁడట
కావలెనని ననుఁ గలసెనట
యీవలనావల యిద్దరికి
పూవుఁబరిమళపుఁబొందులెకాక ॥ తాన ॥ 58

శంకరాభరణం

దొడ్డిపట్టుమానినులదొమ్మికాఁడా
అడ్డములేనిచేఁతలయాతఁడవా నీవు ॥ పల్లవి ॥

చెంగట గోపికలఁ జెలరేఁగి యొకమాఁటే
జంగిలిగా మోహములు చల్లఁగాను
యింగిత మెఱిఁగి నీవు యిందరి కిన్నిరూపులై
అంగవించికూడినట్టియాతఁడవా నీవు ॥ దొడ్డి ॥

కోరికమీర మునులకొమ్మలెల్ల నీకు విందు
పేరులేనిరుచులతోఁ బెట్టఁగాను
కూరిమి చేకొని యట్టె గోపాలకులఁ గూడి
ఆరగించివచ్చినట్టిఆతఁడవా నీవు ॥ దొడ్డి ॥

ముందు గలుగ నీకు మోహమున రుకుమిణి
కందువ చెప్పి [1]పుత్త్యాఁగఁ (?) గైకొంటివి
యిందుకేపో యిందరు మోహించిరి శ్రీవేంకటాద్రి-
యందలివిట్ఠలుఁడనేఆతఁడవా నీవు ॥ దొడ్డి ॥ 59

1. 'పుచ్చగ' లేక 'పుత్తేర' అనియా ? 2. 'విర్మల' రేకు.

ఆహిరి

[1] చూడఁ బసిబాలగాని జూటుగదమ్మా। తా-
నాడినట్టె ఆడకుంటే నగ్గలమయ్యీని ॥ పల్లవి ॥

కొట్టలేదు తిట్టలేదు కూరిమితోఁ దనచెక్కు-
ముట్టితేనే యేడిచీని మొఱలువెట్టి
యెట్టిచిన్నబిడ్డఁడమ్మ యెంత యెత్తుకొన్నమానఁ-
డట్టె యంతకంతకు నగ్గలమయ్యీని ॥ చూడఁ ॥

అద్దలించఁ జేయఁ దనయంగదూళిఁ దుడిచిన
పొద్దువోక నేలబడి పొరలాడీని
వుద్దండీఁడు గదవమ్మ వుట్టిపాలలోనఁ బాద-
మద్దకుమంటేనే యగ్గలమయ్యీని ॥ చూడఁ ॥

అంగడి నెఁ(నెం?)డైనఁ దా నాడివచ్చి పయ్యద-
కొంగుఁ గప్పుమని మాతో గువిశాడీని
జంగిలై శ్రీవేంకటేశ్వరుఁడ(డు?) యెంగిలిముద్దు-
లంగవించ నొల్లమంటే అగ్గలమయ్యీని ॥ చూడఁ ॥ 60

రేకు 1411 మాళవి

అంగనచేసినపుణ్య మందకపోదు-
చెంగటఁజూడరమ్మ చెలులాల మీరు ॥ పల్లవి ॥

దొంతరపూవులపూజ తొయ్యలి సేయఁగఁబోలు
చింతతో విప్టె చేయి చేర్చె నేఁడు
యింతి నీలపురాసు లిలఁ జూరలియ్యఁబోలు
చెంతఁ దురుమటు జారి చిక్కువడె నదివో ॥ అంగ ॥

---

1. ఇది అధ్యాత్మకీర్తనలచాయలోనిది.

దిట్టయై కోరి యఖండదీప మెత్తఁగఁబోలు
విట్టచూపే చూచీని నివ్వెరగై
జట్టిగొని పన్నీటఁ జలివంది రిదఁబోలు
వుట్టిపడి చెమటల నోలలాడె నదివో ॥ అంగ ॥

వవిత మోవిపండు వాయనమియ్యఁగఁబోలు
మొనసి శ్రీవేంకటేశుమోవి చేకొనె
తనివోక చెప్పరానితపము సేయఁగఁబోలు
యెనసి ఇద్దరుఁ గూడి యేకమై రిదివో ॥ అంగ ॥ 61

సామంతం

అటు గాన నీకు లోనైతిఁగాక యీ-
చిటుకు లన్నియు నీచేతివేకదే ॥ పల్లవి ॥

కంతునియమ్ములైతే కతలలోనేకానీ
ఇంతి నీచూపులైతే నివె దిష్టము
కాంతిమెఱుఁగులైతే కాలవేలాలఁగాని
చెంత నీమేనిమించు చేగలుదేరీనే ॥ అటు ॥

మెలుపువెన్నెలలైతె మిన్నులపైసుద్దు లింతే
కలికి నీనవ్వులైతేఁ గడుఁజేరువ
చిలుకపలుకులు పెంచపుఁబోలికలు గాని
అలరు నీమాటలెల్ల నచ్చముగదే ॥ అటు ॥

వొట్టినచిగురులెల్ల నొగరువేసీఁగాని
గట్టిగా నీమోవి తెనెగారీఁగదే
యిట్టివేళ శ్రీవేంకటేశుఁడఁగనక నాకు
దిట్టవై నీకాఁగిలిచ్చి తిరమైతివే ॥ అటు ॥ 62

### ఆహిరినాట

[1] ఎంతనేర్చెనే యీమగువా
పంతమె నెరసీఁ బాయముమీఁదా ॥పల్లవి॥

చక్కులపొదవగు సుదతిచన్నుఁగవ
జక్కవ లెగరుచు జరయఁగను
గక్కన కిన్నెరకాయగూండ్లఁ
దొక్కపట్టి తంత్రులమీఁటీని ॥ఎంత॥

గుట్టున నుండక కొప్పుతుమ్మెదల-
తెట్టెలు చెదరఁగఁ దెరవ యిదె
కట్టడిగోళ్లకత్తులకొనునఁ
బెట్టుచు శ్రుతులే బిగియించీని ॥ఎంత॥

యిత్తరి శ్రీవేంకటేశ్వరుఁ గూడఁగఁ
గుత్తికలోపలికోవిల లా-
బిత్తరియధరపుఁబిల్లఁగోవిలో -
నొత్తి నిలిపి తనివొందించీని ॥ఎంత॥ 63

### కాంబోది

తీపులతనవిజాలు దేవ రెరుఁగు
పైపై నాతోనేఁల పదమనవే ॥పల్లవి॥

వెన్నెలరసములు వేఁడవి బదుకఁగాని
యెన్నికఁ దాఁజేయుకాఁక లివియుఁ గొన్నా
నిన్నవే వింటివి తాను నేరకాడినట్టిమాట
పన్నెటిమాయలు మాని పదమనవే ॥తీపు॥

1. మగువనేర్పు వర్ణించునెపముతో అన్నమయ్య తనసంగీతసార్వభౌమత్వమును చూపినాడు.

అచ్చపుఁబాయమే బరవై యుండఁగాఁ దా-
విచ్చేటికానిక లందే దిదియుఁ గొంతా
హెచ్చినయీవినయాల పిన్నిటా నేఁ దవిసితి
బచ్చెన యీగచ్చులేల పదమనవే ॥ తీపు ॥

వినుపువిరహమున నివ్వెరగై యుండఁగఁ దా-
నెనసినపరవశ మిది యొకటా
వనిత శ్రీవేంకటేశ్వరుఁడు గూడె వింకఁ
బవిగలదిక్కు-వ(నః)కుఁ బదమనవే ॥ తీపు ॥ 64

## కాంబోది

సుదతి నొకటొకటనే చూడరే దిష్టంబు
పొదలువిరహంబు లోఁ బొదలఁగా నేఁడు ॥ పల్లవి ॥

అంగన మీనాక్షియైనందు కిదె దిష్టంబు
కంగి పతిఁబాసి ఇటు గను ముయ్యదు
అంగవించి కమలముఖియగుట కిది దిష్టంబు
పొంగుఁ జెమటలనీటఁ బొదలీవి నేఁడు ॥ సుద ॥

మగువ పుత్తడియనెడిమాట కిది దిష్టంబు
పొగరు వలపులకాఁకఁ బుటమెక్కెను
అగడుతో శైలకుచయగుట కిదె దిష్టంబు
చిగురుఁబులకలచేతఁ జెలఁగీని నేఁడు ॥ సుద ॥

అతివ బింబాధరై యలరుటకు దిష్టంబు
తతివి శ్రీవేంకటోత్తముఁడు దొడికె
మితిఁ గంబుకంఠియై మెఱయుటకు దిష్టంబు
రతిరాజతంత్రముల రవళిగొనె నేఁడు ॥ సుద ॥ 65

సాళంగనాట mp3

మందులు మాఁకులు మఱి యేలా
అందులనే గుణమయ్యీని ॥పల్లవి॥

చుంగులనీతెలిచూపులు రమణుని-
కంగజబాణములయి తాఁకె
రంగగు వీడెపురసములకారము-
లెంగి లనక పతి కియ్యఁగరాదా ॥మందు॥

వెడ నీనవ్వులవెన్నెల విభునికి
వడిగల యండయి వడదాఁకె
అడరఁగ నతిరస మమృతరసాయనము
వొడలి కిత వతవి కొసఁగఁగరాదా ॥మందు॥

చెలి నీకుచములు శ్రీవేంకటపతి-
కలయిక రుచులయి కళదాఁకె
కులికేటిగోళ్లకొనయెచ్చరికల
తెలియఁగ మఱపులు దెలుపఁగరాదా ॥మందు॥ 66

రేకు 1412 శ్రీరాగం

ఏమాయ వింతలోనే యిదియెల్లాను
కామునితంత్రము లతుఁ గడుఁబోది గాదా ॥పల్లవి॥

అతివిరహపుఁగాఁక నతవి దూరితినంటా
మతిలోఁ బొడిఁబడేవు మాటిమాటికి
సతి నీవొక్కతెవేయా? జవ్వనాన బడలిన-
యతివలు పతుల నేమైనా నాడుదురు ॥ఏమా॥

పాయపువిభుఁడు నిన్నుఁ బట్టరాఁగా గోపానఁ
జేయిఁ దీసికొంటినంటాఁ జింతించేవు
యేయెడ నెవ్వరికైనా నీపాటి లేకుండితే
వోయమ్మ చవులౌనా వుడివోనిరతులు ॥ ఏమా ॥

చెనకునీకాఁగిట శ్రీవేంకటేశ్వరుఁ
జనుఁగొండ లొత్తెనంటాఁ జంచలించేవు
మనసిజుగరిడిలో మల్లడి నొక్కరొక్కరి-
పెనకువలకు నివి ప్రియమేకాదా ॥ ఏమా ॥ 67

## ముఖారి

అదివో కనుఁగొను మది యొకతె
యెదుటనే నెలకొనె నిది యొకతె ॥ పల్లవి ॥

తేటలమాటలఁ దెర లదె కట్టీఁ
గాటుకకన్నులకలి కొకతె
జూటరిచూపులఁ జొక్కులు చల్లీ
నీటుగర్వములనెలఁ తొకతె ॥ అది ॥

ముసిముసినవ్వులు మోపులుగట్టీ
రసికుఁడ నీపై రమణొకతె
కొసరులఁ గుచములఁ గోటలు వెట్టీ
మిసమిసమెఱుఁగుల మెలఁ తొకతె ॥ అది ॥

కాయజకేలికిఁ గందువ చెప్పీ
చాయలసన్నల సతి యొకతె
యీయెడ శ్రీవేంకటేశ కూడి నిను
వోయని మెచ్చీ నొకతొకతె ॥ అది ॥ 68

### కాంబోది

నీట ముంచు పాల ముంచు నీచిత్తము । నీకుఁ
జాటితి వింతేసి దూరఁజాలఁబో నే నిఁకను ॥ పల్లవి ॥

యెక్కువతలఁపు నీపై నేపొద్దు నాకైతే-
నెక్కడెక్కడో నీయెన్నికలు
వెక్కసాన సారెసారె విన్నవించలేను నీ-
కెక్కనది నాజన్మ మింతేపో యిఁకను ॥ నీట ॥

నీపేరు చెవులవినేయాసే నాకైతేఁ
బై పూతలేపో నీభావములు
యేపున మొకమోట మేమియు నిన్ననలేను
పాపపుణ్యము నీపాలిదేపో యిఁకను ॥ నీట ॥

మన్నన నీకాఁగిటిలో మరపులే నాకైతేఁ
బన్ని మరురేకలే నీపనులెల్లను
యెన్నిక శ్రీవేంకటేశ యిపుడు నేఁ గోరినట్టి-
వన్నియు నాయ నమ్మికాయఁబో నా కిఁకను ॥ నీట ॥ 69

### ముఖారి

మేరకు మేర నుండుటే మెచ్చుటగాక
కోరి వాదులాటలేలే కొలమునాండ్లకును ॥ పల్లవి ॥

నిక్కినిక్కి పతిఁజూడ నీకునెంత చెల్లుఁబడే
వొక్కడై యాతఁడు నావద్ద నుండఁగా
పుక్కిటివిడెము చూపి బూటకము సేసేవు
మొక్కలము లింతయేలే మొగనాండ్లకును ॥ మేర ॥

నన్ను నేసే వాఁడు నానంగడినే వుండఁగాను
యెన్నఁడు నాలాగు నీ వెఱఁగవటే
కన్నుల నొలసేవేమే కమ్మర నాతని నీవు
యిన్నేసిచేఁతలేలే యిల్లాఁడ్లకును ॥ మేర ॥

చెంది గోరు దియ్యనేలే శ్రీవేంకటేశుఁ డిట్టె
పొంది నాతోఁ బరవశంబున నుండఁగా
కందువ బైపై నీవు కాతరానఁ దిరిగేవు
సందడి సేయఁగనేల సవతాఁడ్లకును ॥ మేర ॥ 70

## భైరవి

చెల్లఁబో నన్నుఁ జెనకి చెనకించుకొననేల
చిల్లరనీ మేనిమీఁదిచెనకులే చాలవా ॥ పల్లవి ॥

వనుఁగవి పూరకైన నవ్వేవు కిమ్మల నీ-
పను లిందరికి నవ్వుఁబాటుగాదా
నిను నీవు చూచుకోవు నెయ్యమి నన్నొరసేవు
వొనర నీమే నిందరు నొరయుట చాలదా ॥ చెల్లఁ ॥

వెల్లవిరి నిజమే వేమారు నెరపేవు
కల్లతోడ నిజ మోపఁగలదటరా
బల్లిదాన దొడ్డదొడ్డబాసలెల్లఁ జేసేవు
తొల్లి జెల్లనిమాదకు దొడ్డముద్రే కాదా ॥ చెల్లఁ ॥

మెచ్చి నన్నుఁ గూడితివి మేలపుశ్రీవేంకటేశ
యిచ్చట మెరమెచ్చులే యిందాఁకా గాదా
పచ్చిచేసే వింకా నీపదఁతులచేత మున్ను
పచ్చివెచ్చిమాటలనుఁ బడినదే చాలదా ॥ చెల్లఁ ॥ 71

శంకరాభరణం

మేలుమేలు ఇవ్విటాను మించితివిగా
యీలాగువాఁడవౌత యెఱఁగము నేము ॥ పల్లవి ॥

నవ్వు నవ్వకంత నీవు నాతో సారెకు నేఁడు
నవ్వినట్టె వున్నది నీనామముజాడ
జవ్వనపుబొమ్మలనే జంకించే విందుకుగా
యెవ్వతె నేరిపె నీకు వింతలేసివెల్లను ॥ మేలు ॥

విక్కచూడ కంత నీవు విలిచి కమ్మర నన్ను
విక్కనట్టె వున్నది నీవిట్టతురుము
చక్కనై నీ కిదియునుఁ జందమాయ నెందరికి
మొక్కనాను వీడకుండు మోసలేదు నీకు ॥ మేలు ॥

చెక్కునొక్క కంత నీవు చేరి నన్నుఁగూడుమని
చెక్కునొక్కినట్టె నీసేసలముద్దు
మిక్కిలి శ్రీవేంకటేశ మెరయుజాణవు నీవు
నిక్కము నీకాఁ(గి)టిలో నేరుపుమీ నాకు ॥ మేలు ॥ 72

రేకు 1413 లలిత mp3

ఒకటిపై నొకటి నీవుపాయాలు
వెకలినీవిద్యలెల్ల వెల్లవిరి గావా ॥ పల్లవి ॥

సందడి నాచేఇ ముట్టి సరసాలాడేకొగకే
పందెమాడవచ్చేవు పలుమారును
మందలించి నాచేత మాటలాడించవలసి
అందపుఁగత లడిగే వది నే నెఱఁగనా ॥ ఒక ॥

యేరా నాకుచగిరు లిటు ముట్టేయందుకుఁగా
హారములు చిక్కుదీసే వది మేలురా
గోరికొన దాఁకించేకొరకుఁగా చెక్కుముట్టి
యీరీతి వేఁడుకొనే విన్నియుఁ దెలిసెరా ॥ ఒక ॥

యీకద నన్నుఁగూడేఇందుకుఁగా నింత సేసి
యేకతమాడేనంటా నెనసితివి
పైకొని శ్రీవేంకటేశ బడివాయకుండా న-
న్నాకుమడిచిమ్మనేవు అవురా నీవు ॥ ఒక ॥ 73

శంకరాభరణం

అన్నివనులు మీకే అమరుఁగాక। నేము
కన్నుల నన్నియుఁ గనుగొంటిమిగాక ॥ పల్లవి ॥

మీరే తెలియవలె మీలోవిజగడాలు
మారుఁ దెలఁగవలె మరి మీఁదను
వూరకే మీమాఁట లూఁకొనేచెలులము
కోరి సాకిరి చెప్పఁగూడునా మాకు ॥ అన్ని ॥

చనవు లియ్యఁగవలె చలములు మానవలె
మనసు లెనయవలె మరి మీఁదను
యెనయఁగలిగినట్టియిద్దరి మిమ్ముఁ జూచి
కనుసన్నఁ గోపించఁగలమా నేము ॥ అన్ని ॥

శ్రీవేంకటేశ నీచిత్త మియ్యఁగ-
నీపనితాఁ గూడె విటు విన్నను
పూవుఁబరిమళపుపొందులమీలోవి-
భావాలు మాకెల్లఁ బలుకఁగవసమా ॥ అన్ని ॥ 74

### పాడి

మొకమోటములకెల్ల మొదలు నేను
వెకలినీతమకము విడిపించఁగలనా ॥ పల్లవి ॥

ముద్దులనీమోము చూచి మొక్కకుండలే(ను) నీతో
గద్దించి నే నలుగఁగఁగలనా
వొద్దువొద్దు నేఁ దలఁచి పులకించకుండలేను
వద్దని నీగుణములు వారించఁగలనా ॥ మొక ॥

చేరి నేను ముచ్చటలు చెప్పకుండలేను నీతో
ధీరత నేఁ జలము సాదించఁగలనా
పేరుకొని సారెసారెఁ బిలువకుండఁగలేను
దూరిదూరి నే నిన్నుఁ దుచ్చమాడఁగలనా ॥ మొక ॥

సతమైన నిన్నుఁ గూడి సంతసించకుండలేను
ఇతరులవలె నెగ్గు లెంచఁగలనా
రతివేళ నిన్నుఁ గడురాయడించకుండలేను
పతిగా శ్రీవేంకటేశ పంతమియ్యఁగలనా ॥ మొక ॥ 75

### ముఖారి

ఇందుమీఁద సతిభావ మెట్లౌనో యేమౌనో
విందుగాఁ జెలువునికి విన్నవించరే ॥ పల్లవి ॥

కోవిలకూఁతకుఁగానే గుండె జల్లురవి చెలి
పూవకపూచినయట్టు పులకించె
మావినుండి యంతలోనే మదనభూతము సోఁకె
పోవులైనపుప్పొడినే పోయరే జడిమి ॥ ఇందు ॥

కోమలి చందురుఁడనేకొరవిదయ్యముఁ జూచి
దీమస మింతయు మాని దిగులందెను
తేమలైనవెన్నెలల దిమ్మువట్టి విలువున
మైమఱచెఁ గప్పురాన మంత్రించరే ॥ ఇందు ॥

ఇంతలో శ్రీవేంకటేశుఁ డిందుకు విచ్చేయఁగాను
చింతదీర మేనెల్లఁ జెమరించెను
వింతలై నరతులలో విరహపుసోఁకు వాసె
కంతుచిగురాకురక్ష గట్టరే యంగనకు ॥ ఇందు ॥ 76

సామంతం

[1] పట్టరాదు వొకటికిఁ బది యౌదువు
అట్టె నీవన్నట్టే యవునౌఁ దలఁగరా ॥ పల్లవి ॥

యీఁతలు మోఁతలు నీకు యీడకు రాఁ బొద్దు లేదు
వూఁతగొని అక్కడనే వుండవయ్యా
చూఁతలకు మోరతోపుసుద్దులవాఁడవు నీ-
లేఁతనవ్వు నెఱఁగుదు లేలే అంటకురా ॥ పట్ట ॥

ఆసలు రేసులు నీకు అంతకెల్ల నేనోప
వేసపునీరాజసాలు విడువవయ్య
మోసపోతి ననవద్దు ముదితలయెడలందు
దోసపులూట్లు మాని తోతో తొలఁగరా ॥ పట్ట ॥

సిగ్గులు నెగ్గులు నీకుఁ జెప్పి చూపనేల మాకు
వొగ్గిననీతొక్కుమట్టు కోరువమయ్యా
వెగ్గళించి ఇంతలో శ్రీవేంకటేశ కూడితివి
బొగ్గరవుఁజింతలెల్ల పోపో మెచ్చాయరా ॥ పట్ట ॥ 77

1. ఇందు దశావతారవర్ణనము సూక్ష్మము.

### ముఖారి

కదిసినమీఁద నింకఁ గడమలేల
చెదరె నలుకలెల్ల చిత్తగించు చెలివి ॥ పల్లవి ॥

కొమ్మమతి కోరికలు కోటానఁగోట్లై
కుమ్మరించీ నీమీఁదికొనచూపుల
దిమ్మఁగాఁకలే సారెఁ డెగనిసిట్టూరుపుల
చిమ్మఁజొచ్చె వీఁకనేల చిత్తగించు చెలివి ॥ కది ॥

వనిత తమకమెల్ల వడిఁబెట్టీ నీమీఁద
చినుకు చిత్తడి మేనిచెమటలను
వినుపువిరహమున నివ్వెరగై నేఁడు
జినుగాయఁ దాలిములు చిత్తగించు చెలిని ॥ కది ॥

తరుణినేరుపులెల్లఁ దండోపతండాలై
దొరయఁ గాఁగిటిలోనే తోడుచూపీని
యిరవుగ శ్రీవేంకటేశ కూడితి విట్టె
మరిగి తరములేక మన్నించు చెలివి ॥ కది ॥ 78

### రేకు 1414 శంకరాభరణం

ఎంతగబ్బితనమే నీ కింతలోననే
మంతనపువినయాలమావినివి నీవు ॥ పల్లవి ॥

కొండవంటిదొర వచ్చి కోరి వాకిట నుండఁగా
అండనున్నచెలులు ప్రియము చెప్పఁగా
విందుకొన్నచలమున నిలుచున్నదానవు నీ—
గుండె యెంతరాయే కడుఁగోమలివి నీవు ॥ ఎంత ॥

చేరి నీవిభుఁడు నిన్ను చెట్టవట్టి వేఁడుకోఁగా
కోరికలు నీలోనే కొనసాగఁగా
మారుకొన్నయలుకతో మాటలాడే వతనితో
సారె నింతవెగటేలే జవ్వనివి నీవు ॥ ఎంత ॥

ఇంతటిశ్రీవేంకటేశుఁ డెనసి బాసలియ్యఁగా
సంతమై మరుబలమే సాకిరిగాఁగా
వింతరతులనే చొక్కి వెరగుతో నుందానవు
చింత ఇఁకనేలే మేలు చేకొన్నదానవు ॥ ఎంత ॥ 79

బౌళి

ఒక్కమాఁటే ఇంతయేల వోరుచుకొనేవు
వెక్కసపునీమతికి వేడుకయ్యీఁగాని ॥ పల్లవి ॥

మచ్చరముగలిగినమాటమాటలఁ బతికి
లచ్చన నీకొనగోరిలాగు చూపవే
యెచ్చుకుందు లిద్దరిలో నేమేమి గలిగినా
పచ్చివెచ్చిరతులలోపలఁ దేరీఁగాని ॥ ఒక్క ॥

చలమెంత గలిగినా సారెసారెఁ బతికిఁ
గులుకుఁజూపులలోనే కుప్పళించవే
చెలఁగి ఇద్దరికి నెఁ(నెం?)జెరి వెంత గలిగినా
పలుకులరసాలఁ బచ్చిదేరీఁగాని ॥ ఒక్క ॥

ఆస లెన్నిగలిగిన నటు శ్రీవేంకటపతి
బాసలకూటములలోఁ బచరించవే
గాసి మాని మతిలోని కడమదొడమలెల్ల
నేసలతమకములో సిగ్గుదేరీఁగాని ॥ ఒక్క ॥ 80

బౌళి

ఇంతేపో యెడమాట లిఁక నేఁటికి। తా—
    నంతే నంగళమైతే నంతకంటె నేను ॥పల్లవి॥

వొయ్యారములతనవొప్పు చూచే తనిసితి—
    నయ్యో నిం(యిం?)కానేలే ఆనుద్దులు
    గయ్యాళియై తనకన్నులనే మొక్కితేను
    వెయ్యేసి మతిలో దీవించితినే నేను ॥ఇంతే॥

నానాగతులు తననవ్వులలోనే తనిసితి
    కానే యింకానేలే ఆనుద్దులు
    తానే ముచ్చటమాట తలఁపులోఁ బాదుకొంటే
    మోనాన నూఁకొంటి మొదలనే నేను ॥ఇంతే॥

గద్దరికోపము తనకాఁగిటనే మఱచితి—
    నద్దివో యింకానేల యానుద్దులు
    వొద్దనే శ్రీవేంకటేశుఁ డూరడించి యిచ్చి మోవి
    చద్దివేఁడి కింక నిట్టె చవిగొంటి నేను ॥ఇంతే॥ 81

గౌళ

ఒకరొకరిమనసు లొక్కటాయను
    మొకమొకములు చూచి ముచ్చటాడినట్లు ॥పల్లవి॥

మానినినవ్వినవ్వు మరునిబాణపుఁబూవు(బువ్వు?)[1]
    సానదీరి పతి కొక్కసరి వచ్చెను
    ఆనకమై మారుకుమా రాతనిచూపులు ఇంతి—
    కోనలకుచము లందే గురిదాఁకినట్లు ॥ఒక॥

---

1. అనుప్రాసభంగము

వనితయాదినమాట వంచినపూఁదేనెపూఁట
ఘనుని కొక్కటి తారుకాణాయను
వెనుకొని యంతలోనే విభునిమొక్కులు అతి-
వినయము లచ్చోనే వియ్యమందినట్లు ॥ ఒక ॥

చెలియత్తరములు చేఁతలబిత్తరములు
యిల శ్రీవేంకటపతి కితవాయను
యెలమిని సతిరతి యితనికాఁగిటిలో
కలకాలమును నట్టె కాణాచైనట్లు ॥ ఒక ॥ 82

గుండక్రియ

వద్దు నన్నుఁ జెనకకుర వాదేఁటికి
చద్దివేఁడికి నొలపుజంకెనలు మేలు ॥ పల్లవి ॥

వొలసినొల్లములపొం దొనరించుకంటేను
అలవోకలైనపొలయలుక మేలు
కలసీకలయనిమనసు కసిగాటుకంటేను
తలఁపులో నడియాసతమకమే మేలు ॥ వద్దు ॥

పచ్చివెచ్చులకూర్మి పచరించుకంటేను
కొచ్చి వూరకయుండుగుట్టు మేలు
వచ్చియును రాములను వడిఁబొరలుకంటేను
మచ్చరము మాని మెఱ మఱచుటే మేలు ॥ వద్దు ॥

తవిసియునుఁ దవివోవిరతులకంటేను
కనుఁగొనుచుఁ జెలఁగుసంగతులే మేలు
యెనలేని శ్రీవేంకటేశ యిన్నిటికంటే
వినుఁగలసియున్ననానేరుపే మేలు ॥ వద్దు ॥ 83

ముఖారి

అంత కోపితేనే మమ్ము నట్టె నగుమీ
చెంత నీవు చెనకిన చెనకక మానము ॥ పల్లవి ॥

వొక్కటంటే రెండనక వుండుదురా యెవ్వరైనా
మక్కువ ముందర చూచి మాటాడరా
యెక్కువైనదొరవైతే యేలుదుగాని భూమెల్ల
చక్కనిమావద్దనుంటే జరయకమానము ॥ అంత ॥

మెఱిచిన నుఱుమక మిన్నైన నుండదట
గుఱి నీచేఁతలు చూచి కోపము రాదా
నెఱజాణవైతే నీకునీవే వుండేవుగాని
నెఱయ సరికిబేశౌ విలువకమానము ॥ అంత ॥

ముయికి ముయి వెట్టేది మున్నిటివారితగవు
వియతి నీవు మెచ్చిన నేను మెచ్చితి
ప్రియుఁడ శ్రీవేంకటేశ పెంపునఁ గూడితి నన్ను
నయమున గుఱుతులు నాటించకమానము ॥ అంత ॥ 84

రేకు 1415 శంకరాభరణం

ఇట్టెపో ధర నెవ్వరికి । తాఁ
బెట్టినమమతే పెదకొలి మవును ॥ పల్లవి ॥

తవియవికోర్కులు తరుణి వెంచఁగ
మనసే యెడపై మలగొనెను
తనుఁ దా నందునె తడఁబడి ముందర
వెనకయు నెఱఁగక వెరగులు వడెను ॥ ఇట్టె ॥

తలిరుఁబోఁడి పతిఁ దలఁచఁగఁ దలఁచఁగఁ
బులక లమ్ములై పొదిగొనెను
విలువున నందుల పిబిడపుసందడిఁ
దొలఁగరాక తోదోపులఁ బడెను ॥ఇట్టె॥

కాఁగిట శ్రీవేంకటపతిఁ గూడఁగ-
నాగనియాఁకై యలవడెను
చేఁగచిగురుతనచేఁతే యిటులై
రాఁగినవలపుల రాయిడిపడెను ॥ఇట్టె॥ 85

శ్రీరాగం

నీవనఁగ నేమనఁగ నేరమేకాక
దోవలేనిదోవలనుఁ దొక్క నెట్టువచ్చునే ॥పల్లవి॥

కోరిననీకోరికకు గురి గలిగినగాక
ఆరయ నౌఁగాదవి యాదవచ్చును
పూరకె బట్టబాయిట నులివచ్చిమాటలను
[1]దూరన గోలలేసినఁ దుద నెందు దాఁకునే(?) ॥నీవ॥

పొసఁగ నీపతిపేరు పొందుగఁ జెప్పినఁగాక
కొసరి బలిమిఁ దోడుకొని వత్తుము
పసపుఁజీరవానిఁ బట్టుమని యాడితేను
దెసల మాటోఁటి కెట్టు దెలియఁగవచ్చునే ॥నీవ॥

యిక్కడ శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నుఁ జూచి
వొక్కమనసున నింక నుందుముగాక
తెక్కువఁ గడవలోన దీపము ముట్టించిన
దిక్కులఁ దేజములెల్ల దీపించివుండును(నే?) ॥నీవ॥ 86

1. 'దూరన' 'దూరాన' కావచ్చును.

బౌళి

ఇప్పట నుండియు నీతో నింత యేలరా। నా-
తిప్పరానిచేఁతలందే తేటపడీఁగాక ॥ పల్లవి ॥

నీ వేమిసేతువుర నిన్నుఁ జూచి యాడలేవి-
యీవల నామొగమోట మింతసేయఁగా
కోవరపునామనసు కోపము మించినప్పుడు
కావలసినపనులు గానుపించీఁగాక ॥ ఇప్ప ॥

తప్పేమి నీవంకఁ దలరా నీతో నలిగి
యప్పటి మాటాదేనాయాసలుగాక
యెప్పటికి నింతయేల[1] ఇద్దరి మనలోలోని-
చిప్పలుఁగాఁకలే బుద్ధిచెప్పీ నింతేకాక ॥ ఇప్ప ॥

ఇందులో నీకడమేది ఇట్టె నిన్నుఁ బైకొని నే
ముందు నిన్నుఁజెనకనిమోసముగాక
విందుగా శ్రీవేంకటేశ నింత నీనాకూటమికిఁ
జందమైన గురుతులే సాకిరయ్యీఁగాక ॥ ఇప్ప ॥ 87

ముఖారి

కనుఁగొనరే యిరుగడ చెలులూ
పవివడి యివి యేర్పరచఁగఁగలరా ॥ పల్లవి ॥

ముదితనవ్వులను మొగిఁ బతికాంతులు
గుదిగొని యిరుదెసఁ గూడఁగను
యిది దిన మిది రే యిపుడని యెఱుఁగక
ముదముల చెమటల మునిఁగిరి దాము ॥ కను ॥

---

1. 'ఇద్దరైనమనయొక్క లోలో చిప్పలుకాఁకలు' అని విగ్రహవాక్యము.

కలికికోరికలుఁ గాంతునియాసలు
కలసెను మనసులఁ గొలవిసి
తలఁపుల వివియే తడఁబడఁజేయఁగ
విలువుప నూరకె నివ్వెరగైరి ॥ కను ॥

అతివనేరుపులు నటు శ్రీవేంకట-
పతిరతులు నొకట బలుసుకొని
చతురతనంబుల సందడిసేయఁగ
యితవగుకాఁగిట నెడమీరైరి ॥ కను ॥ 88

సామంతం

ఎన్నఁడు నెఱఁగమమ్మ యింతులాల
కన్నెకు నెందుండివచ్చెఁ గాఁకలెల్లా నిపుడు ॥ పల్లవి ॥

తలపోఁతే ఘనమాయఁ దరుణికి నేపొద్దు
నెలవై కుచగిరులు నిక్కఁగాను
అలరి మీఁదటిపను లైనరీతి నాయఁగాని
కలిగెఁబో యేడలేనికాఁతాళ మిపుడు ॥ ఎన్నఁ ॥

చెక్కుచేయి ఘనమాయఁ జెలియకు నీవేళ
నిక్కి జవ్వనము మేన నిలువఁగాను
యెక్కువమదనకళ లేచినప్పు దేచెఁగాని
దక్కెఁబో తమకములతడఁబా ట్లిపుడు ॥ ఎన్నఁ ॥

వేడుకలే ఘనమాయ వెలయు శ్రీవేంకటేశుఁ-
డీడ నేఁ డీయింతి నెనయఁగాను
మేడెపుఁజెమటలెల్ల మించినాను మించెఁగాని
కూడెఁబో రతులలోనికూటము లిన్నియును ॥ ఎన్నఁ ॥ 89

శంకరాభరణం

నిక్క మానతియ్యవయ్య నేఁడైనను
పక్కన నీసుద్దులెల్లఁ బచ్చిదేరీ నిపుడు ॥ పల్లవి ॥

వేడుక నీపలుకులు వినరానివేదాలు
కూడేదిగొల్లెతలగుంపుఁగాఁగిలి
ఆడేటి దొకటి నీయసిమలోని దొకటి
యీడ నాతో నాడుమాఁట లివియైనా నిజమా ॥ నిక్క ॥

పూఁతలనీకతలెల్లఁ బుణ్యపుఁదెరువులె
చేఁతలు రుకుమిణిఁ దెచ్చినముచ్చిమి
వాఁ(వ్రా?)త వ్రాసే దొకటియు వక్కణించే దొకటియు
బాఁతిపడి నీవుసేసేబాసలు నమ్మేదునా ॥ నిక్క ॥

చేకొని నీవుండేది శ్రీవేంకటాచలము
ఆకడితలఁపులు పదారువేలు
యీకడఁ బలుకుఁబంత మెక్క నన్నుఁగూడితివి
కాకరినీపనులే లోకమున సమ్మతము ॥ నిక్క ॥ 90

రేకు 1416 దేసాళం

నేయనీవే యెమ్మెలెల్లాఁ జేసేవెల్లా
బాయిటఁ దనకుఁ జిక్కెఁ బందినకొల్లా ॥ పల్లవి ॥

పన్నినమరుఁడు బెట్టుపాయ మిది తట్టుముట్టు
యెన్ననేల యింతేపో యిది నాగుట్టు
విన్నవించ సారెసారె వేనటఁ దనకు బుట్టు
వన్నెలేలే యీఁకఁ దనవలసినట్టు ॥ నేయ ॥

బూక లెంతయినఁ గద్దు పోయ నిదే కడుఁబొద్దు
వాకువిష్టారములేలే వద్దువద్దు
యీకడ నేనేమవిన వింతయుఁ దనకే ముద్దు
చేకొనినతనసుద్ది చెప్పరానిబద్దు ॥ సేయ ॥

అంతలోనే తనపొందు అధరపానమే విందు
వింతయైనరతులే వెనకముందు
యింతటిశ్రీవేంకటేశుఁ డిపుడే విచ్చేసె విందు
పంతము చెల్లఁగఁ గూడేభావము చేకొందు ॥ సేయ ॥ 91

పాడి

జవ్వన మందరి కొక్కసరియే కాదా
ఇవ్వల వింతేసి చేసి యేల యేఁచేవే ॥ జవ్వ ॥

మదనుఁ వియమ్ముఁ వాఁడి మగువ నీచూపువాఁడి
వెదచల్లువలపులు వేఁడివేఁడి
మదిఁ దమకము వింఁడె మాటలనే పొద్దువోయ
యిదివో యీగతి నన్ను యేలయేఁచేవే ॥ జవ్వ ॥

చందురువెన్నెలజోలి సతి నీనవ్వున నాలి
సందడిఁ గోరికలెల్ల జాలిమాలి
కందువ చిత్తము రాఁగె కాఁకలు మేనున మూఁగె
ఇందులోనే నీవు నన్ను యేల యేఁచేవే ॥ జవ్వ ॥

వడి నమృతపుబావి వవిత నీమోవియీవి
[1] జడియుఁగాఁగిటిపొందు జమళీవి
కడ శ్రీవేంకటపతిఁగనక కూడితి నేను—
నెడయ వింతటిమీఁద యేల యేఁచేవే ॥ జవ్వ ॥ 92

1. అనుప్రాస భంగము.

## రామక్రియ

ఇంతలో నేఁ డిట్టె తోఁచె నిది యొక్కకాలము
కాంత కిన్నియు మేలుకాల మాయనే ॥ పల్లవి ॥

కన్నుఁగొనల విదివో కారుమెరుఁగులు మించె
వున్నతి తురుము మేఘ ముదఇంచెను
సన్నపుచెక్కుచెమట జడివట్టి కురిసీవి
కన్నెభావ మిది వానకాలమాయనే ॥ ఇంత ॥

తలపోఁత విరహపుతాపపుటెండలు గాసె
వెలయ నూరుపుగాలి విసరీని
తలచూపరాక చిత్తజునిపౌఁజులు మూఁగి
కలికిమై వేసవికాల మాయనే ॥ ఇంత ॥

సంతమై శ్రీవేంకటేశ్వరుఁడు గూడఁగ విదె
మంతనపుఁబులకల మంచు ముంచెనే
చింత లిన్నియుమఁ బాసి చిత్తములు చెంగలించె
కాంతచందము చలికాల మాయనే ॥ ఇంత ॥ 93

## కాంబోది

ఇందుకెల్ల నాకుఁ జనవిచ్చితో లేదో
అందరు వినఁగ నాకు నానతియ్యవే ॥ పల్లవి ॥

వెలఁది నావిన్నపము వింటివో లేదో యే-
పలుకైన నన్ను విట్టె పాలింతువు
అలుకెంత గలిగిన నతనిమీఁదా నీ-
తలఁపున్న ఖీఁక నేమిఁ దడవకువే ॥ ఇందు॥

కోమలి నాదండము చేకొంటివో లేదో। అతఁ-
దేమనిన నవియెల్ల నిందుకొనవే
నీమది నింతగోపము నిలుపుదురా
యీమాఁట తనదేకా నెంచుమనెనే ॥ ఇందు ॥

విచ్చలుమ నన్ను మన్నిఁతువో లేదో। నేఁ-
డిచ్చటను శ్రీవేంకటేశుఁ గూడితి
మెచ్చితి రిద్దరు మీరు మీ  నను। యివి
తచ్చన లింతేకాక తగ్గుమొగ్గులా ॥ ఇందు ॥ 94

గుండక్రియ

తెలిసె నీగుణమెల్లాఁ దేటతెల్లమై
కలఁదన్నవారికెల్లాఁ గలిగినట్టేపో ॥ పల్లవి ॥

తచ్చనై నతలఁపులో దాఁగివుంటివో కాని
ఇచ్చట నేఁ దలఁచితే నెదురైతివి
మచ్చికఁ బ్రంహ్లో(బ్రహ్లో?)దుఁడుమా(మాఁకు?)లోనఁగలఁడంటే
నచ్చట నుండితివి నేఁ దటువలెనేపో ॥ తెలి ॥

చూపులోనఁ గనుపాపచొప్పున నుందువో కాని
యేపున నెందుఁ జూచిన నింతా నీవే
పైపై పదారువేలుపడఁతులకును పెక్కు-
రూపులై నిలిచినవరుసవలెనే పో ॥ తెలి ॥

పంతపునాకాఁ(గి)టిలోఁ [1]బాతుగాడితివో కాని?
దొంతివెట్టి రతులెల్లఁ దోడుచూపితి
యింతలోనే శ్రీవేంకటేశుఁడ నీదాసులకు
సంతతము నీకృప సతమైనట్టేపో ॥ తెలి ॥ 95

1. 'పాతరాడు', లేక 'పాతరలాడు' అనుటకు వ్యావహారికరూపమా?

భూపాళం

తెలుసుకో నీపేరు దేవుఁడవట
కలగాదు నిజరూరు కాణలట ॥ పల్లవి ॥

అల్లాడ నొకలేమ అడిగితినని నిన్ను
వల్లెగా నీకేమిగావలెనో కాని
చల్లఁజూపులజవరాలు చక్కనిది యాకె రూపు
యెల్లచోటఁ దనపేరు యిందిరయట ॥ తెలు ॥

మక్కువ నాడినమాఁట మఱవకుమనె విన్ను
యెక్కువ నీవాకెతోద యెన్నఁదో కాని
తొక్కినపదములో నిదొమ్మ వేళఁ దోఁచునట
చిక్కులఁ జెప్పినఁ బచ్చిదేరునట ॥ తెలు ॥

యింతలోనే వచ్చి తా నీయెదుట విన్నియు నవె
మంతనాన యెంతటితమక మోకాని
వింతగా శ్రీవేంకటేశ వెలఁదిఁ గూడితి విట్టె
మంతు కెక్కె విన్నియు నీమహిమలట ॥ తెలు ॥ 96

రేకు 1417 ఆహిరి

ఏమిసేతు నీకు నే నీయింతి వింతె
నీమేలే నామీఁద నెరపుమీ ఇపుడు ॥ పల్లవి ॥

చిత్తములో నన్ను దయసేయఁగా నాలో
తత్తరాన నుండలేక తాఁకనాడితి
ఇత్తల నాతమకమె యింతసేసె నాతప్పు -
లెత్తి నీవాడిన నవి యెన్నైనఁ గలవు ॥ ఏమి ॥

యెదుట నీవుండఁగానే ఇందాఁక నెడసిన-
వుదుటుఁగాఁ తాళాన నుప్పటించితి
కదిసినజవ్వనపుఁగాఁకఁ బడ్డదానఁగన
తుదమొద లెఱఁగ విందుకు నలుగకుమీ ॥ ఏమి ॥

అక్కున నీవు నన్ను నలమఁగా నంతలోనె
గక్కున నే ముందు నిన్నుఁ గాఁగిలించితి
యెక్కువశ్రీవేంకటేశ యెప్పుడును నీకు నే
మక్కువసతిఁగనక మనసు చూచితిని ॥ ఏమి ॥ 97

వరాళి

అప్పుడైనా సంతోసమౌనా నీకు
యెప్పుడుఁగూటమికంటె నిదియే మేలు ॥ పల్లవి ॥

యిప్పుడు నీగుణము నే నెఱిఁగి కమ్మర నీ-
కప్పినవలలకుఁ జిక్కకపోదు
యిప్పటి యీవెదఁబొందేయిందుకంటే నామోహ -
మొప్పగించి వొక్కచోట నుండుటే మేలు ॥ అప్ప ॥

ఇటువంటినీవెకా నే నెంత నిన్నుఁ గొసరి(రేఁ)
అటని నాతమక మాఁపలేను
చిటిపొటియలుకల చిందువందై యుండుకంటె
తటుకునఁ దెగువై నతలపోఁతే మేలు ॥ అప్ప ॥

విన్నవేపో తొల్లియు శ్రీవేంకటేశ నాలో-
నెన్ని యిట్టె నిన్నుఁగూడి యెదయలేను
మన్ననరతుల మైమఱచి నే నుండుకంటె
వున్నతి నీగోరితాఁకు కోరుచుటే మేలు ॥ అప్ప ॥ 98

### ముఖారి

మేలైన నాలైన మెచ్చే నాకు
ఆలకించి తను నవుఁగాదనఁబోయేనా ॥ పల్లవి ॥

యింతవిచారములేల యిందుకుఁగాను। అతఁ—
డెంత సేసిన నదే యితవు నాకు
సంతసమైతేఁ దనకుఁ జాలుఁగాక। నే—
నెంతకోరిచిన నేమాయరా ॥ మేలై ॥

వేమారుఁ దనకు నే విన్నవించనోప విట్టె
యేమని యానతిచ్చిన యింపే నాకు
దీమసాన నీవేళఁ దీరకున్న మానెఁగాక
ప్రేమ మీఁదటికైనాఁ బెంచకుండీనా ॥ మేలై ॥

పలుమారుఁ బంతమిచ్చి పలుకఁగావి। యెంత
చలిమైన బలిమైన సమ్మతే నాకు
వలసి శ్రీవేంకటేశ్వరుఁడు గూడెఁ గాక
తొలుత నిటులైతే నే దూరఁబొయ్యేనా ॥ మేలై ॥ 99

### సామంతం

పలుకుఁబంతము నొక్కపాటి గావద్దా
చెలుములు నలుకలు చెల్లునా విభుఁడా ॥ పల్లవి ॥

ఇంతలో నీమాటలకు నెగ్గులెంచేవాఁడవైతే
చెంతల నన్ను ముందు చెనకనేల
సంతముగాకుండ లేవు జంకెన కోరువలేవు
కొంతగొంత తెగి కొంకఁగూడునా విభుఁడా ॥ పలు ॥

కొనగొనచేతలకే కోపగించేవాఁడవై తే
చనవిచ్చి సరసాలు జరపనేల
అనుకోకుండఁగలేవు అందుకు నిలువలేవు
వసధిలో లోఁతెంచవలెనా విభుఁడా ॥ పలు ॥

మత్తిలి మైసోఁకులకే మఱపొందేవాఁడవై తే
కొత్తగా శ్రీవేంకటేశ గుంపెనింతేల
హత్తినకూటమివలె నతిరాజసమువలె
తత్తరాలఁ దామసాలఁ దగునా విభుఁడా ॥ పలు ॥ 100

గుండక్రియ

ఓడలు బండ్ల వచ్చు నొక్కవేళ దానికేమి
కూడినమీఁదటఁగాని కూరిమి లేదు ॥ పల్లవి ॥

నీవు విచ్చేసినదాఁకా నెలఁత ప్రియము చెప్పె
సేవలు నీవాకె కిఁకఁ జేయవలనె
తావులఁ దగులయినదాఁకానేపో యెవ్వరికి
యేవలఁ జొరక లోఁతెఱఁగరాదు ॥ ఓడ ॥

అంకెకు వచ్చినదాఁకా నాడినట్టె యాడెఁ జెలి
ఇంక నీవాకెకుఁ బంతమియ్యవలనె
పొంకము లట్లనేపో భూమిమీఁద నెవ్వరికి
లంకెలఁ బెనఁగ కిట్టె లావెరఁగరాదు ॥ ఓడ ॥

ఇవ్వు దింతవడి నిన్ను నింతి రతులఁ జొక్కించె
పివ్వగా నాకెమెఇ మఱపించవలనె
యెప్పుడు శ్రీవేంకటేశ ఇంతికి నీకిదియేపో
ముప్పిరిమాటలఁగాని ముచ్చట వోదు ॥ ఓడ ॥ 101

వేళావళి

ఆతనికి నిది పరాకౌనో కాదో
కాతరపుభ్రమ నేఁ గాచుకున్న దానను ॥ పల్లవి ॥

యెప్పుడు వచ్చునో విభుఁ డేమనిపలుకునో
అప్పుడు నేరరాదంటా నేను
రెప్పవెయ్యక కన్నుల రేఁగి రేఁగి కనుగొంటాఁ
జప్పు డాలింపుచు నే విచ్చట నున్నదానను ॥ ఆత ॥

యెదురుగఁ బోకున్న యేమని యెగ్గువట్టునో
అదనేదో విభునికినంటా నేను
వెదచల్లుఁగూరిమితో వేఁగుదివ్వె వెట్టుకొని
నిదుర గంటికి రాక నిలుచున్న దానను ॥ ఆత ॥

యింతలోనె శ్రీవేంకటేశుఁ డిందు విచ్చేసి
యెంతకెంత నన్నుఁగూడె నిదె యంటాను
సంతసపుఁబులకల జడియుచుఁ గరఁగుచు
వింతరతుల విఱ్ఱవీఁగుచున్న దానను ॥ ఆత ॥ 102

రేకు 1418 లలిత

[1]కోరి బిడ్డఁడంటాఁ గంటి గోవిందుని
సారెసారె దూరనేల చందమాయనే ॥ పల్లవి ॥

వెల్లిమునుగు లీఁదఁబోవు వెడఁగుకొండ లెత్తఁబోవు
చల్లరీఁడు మా(మాఁ?)కులందు సురిగి తిరుగునే
వల్లెతాట రోలఁగట్టువరచినను పరచినను
యెల్లనాఁడు మానఁడింక నేమిసేతువే ॥ కోరి ॥

---

1. ఇది అధ్యాత్మకీర్తనలభాయలోనిది దశావతారసమన్వయమూ కొంత.

వేఁడుకొనఁ బెచ్చువెరుగు వెరవఁ డింత తల్లికైన
వాఁడియడవిఁ దిరుగు బండి వాలఁదన్నెనే
పోఁడిమలర నెంత నేము బుద్ధిచెప్పినాను వినఁడు
వీఁడేఁటిబాలుఁడమ్మ వింత చూడరే ॥ కోరి ॥

చెలులనెల్ల బంగపెట్టి చేఁతలందె కలికియాయ
పులుమీఁద నెక్కి తోలి పుడమి వెలనెను
మెలఁగి శ్రీవేంకటాద్రిమీఁద నిలిచె వింతలోనె
యెలమి నతఁడుచేయుచేఁతలెల్లఁ గంటిరే ॥ కోరి ॥ 103

గుండక్రియ

అప్పటి నీచెలు వంతయును
కుప్పలఁదెప్పలు కోరికలాయ ॥ పల్లవి ॥

పాయలేక ననుఁ బలుమరుఁజూచే
సోయగంపునీచూపు లివి
నేయనిములుకులచిలుకుల మదను-
సాయకకోట్లచందములాయ ॥ అప్ప ॥

అడుగిదఁజాలక ఆడినమాటలె
బడిబడిఁ బలికేపలుకు లివి
జడిగొనుముత్యపుసరులై విరులై
విడువనివెన్నెలవేఁడిము లాయ ॥ అప్ప ॥

ముచ్చట వాయక మోహదాహమున-
విచ్చేటిమోవులయావు లివి
విచ్చవవిడి శ్రీవేంకటేశ నీ-
తచ్చనకూటపుతలపోఁతలాయ ॥ అప్ప ॥ 104

### నాగవరాళి

ఇద్దరితలఁపు లవె యింపు లవె మీలోన-
నద్దిసకోరిక లవె అంపరాదా మమ్మ ॥ పల్లవి ॥

నెలఁతరో నీవిదె నీవిభుఁ డల్లవాఁడె
పలికినమామాఁటపట్లు నవె
తలఁపులుఁదలఁపులుఁ దలకూడె మీలోని-
యలుక లిన్నియుఁ దీరె నంపరాదా మమ్మ ॥ ఇద్ద ॥

కప్పిన నీచూపు లవె కాంతునిరూప మదె
తెప్పలఁదేలేటిమీతెలువు లవె
వొప్పన నేసితిమి మిమ్మొకరొకరివి మీకే
అప్పుడే చలము చెల్లె నంపరాదా మమ్మ ॥ ఇద్ద ॥

చిమ్ములనీచేతు లవె శ్రీవేంకటపతి-
కమ్మినతమకమలకాఁగి లదె
దొమ్మిగాఁ గూడితి రట్టె దోమతెరమంచములో
అమ్ముడుజీతము లాయ నంపరాదా మమ్మ ॥ ఇద్ద ॥ 105

### ముఖారి

ఔలే నేనే మీకు నలసైతిని
తేలించేవు యింతుల కిదే చాలుఁగాదా ॥ పల్లవి ॥

ఆరీతి నన్ను విట్టె యాడవచ్చుఁ గాక మరు -
బారిఁ జిక్కి నావలెఁ బడవచ్చునా
నేరుపు మెరసి మీకు నెలఁత లిందరు నన్ను
దూరిసట్టె యాతనిని దూరరాదా పోయి ॥ ఔలే ॥

అప్పటప్పటికి నన్ను నలుగకుమని బుద్ధి
చెప్పవచ్చుఁగాక నాకుఁ జేయవచ్చునా
యెప్పటి మావాడఁబాల్లెలుఁగక నన్నునే మీ-
రుప్పటించే రాతనినే వుప్పటించరాదా ॥ ఔలే ॥

అంచెల నిందరును మీ రాతినిని నన్ను దగ్గ-
రించవచ్చుఁగాక తమి రేఁచవచ్చునా
యెంచఁగల శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గూడె
మించి యేకచిత్తాన మెచ్చరాదా యిఁకను ॥ ఔలే ॥ 106

ముఖారి

ఇన్నియుఁ గన్నవే కావా యిఁకనేఁటికే
పున్నమవెన్నెల పండి పొల్లపొయ్యీనా ॥ పల్లవి ॥

యెన్నరానికాఁకతోడ నిప్పటినీచలములు
ఇన్నియుఁ జూతముగాక యెందువోయేనే
విన్నఁ గుప్ప కోపములు నేఁ దాల్లింతే గాక
యెన్నటివే కావా మీహృదయములు ॥ ఇన్ని ॥

విందువలె నామాట వినక నేనేచేఁత
కందము గాక నే నెక్కడ వోయేనే
ముందటికన్నులకంటే మొనవాంఢైనచన్ను-
లందమాయఁగాక చూపు లప్పటివే కావా ॥ ఇన్ని ॥

వేఁడివేఁడిరతుల శ్రీవేంకటేశ్వరుఁ గూడి
యేఁడు నిమిషము దోఁచె విడిగదవే
[1]నేఁడే పెండ్లి నీకు నేఁడే నాగవల్లి
పోఁడిమాయ మీలోనిభోగములు ॥ ఇన్ని ॥ 107

---

1. అన్నమాచార్యులకాలానికే పెండ్లి నాగవల్లి ఒకరోజేనా? లేక ఉత్సాహక-మైనవాక్యమా?

రామక్రియ

ఎంతలే దాతనిమోహ మేమిచెప్పేవే
యింత నన్ను నాలించ విది పరాకా ॥ పల్లవి ॥

ఆయలేవే చాలుఁజాలు అతనికి నేనేలే
వేయువేయువలపులవేడుకకాఁడు
పాయమునఁ దనమీఁదిభ్రమఁ బడే వింతేకాక
యీయెడ నాపైఁ దన కిది పరాకా ॥ ఎంత ॥

యెంచనేలే చెలియ తా నెక్కడెక్కడనైనాను
కంచపుఁబొత్తునతులగమికాఁడు
వంచినచూపుల నేనే వలలఁ జిక్కితిఁగాక
యించుకంతయినఁ దన కిది పరాకా ॥ ఎంత ॥

అందము సేయఁగనేలే యందుకేమి పెక్కెండ్ల-
విందు గాఁడా యాతఁడు శ్రీవేంకటేశుఁడు
పందెమాడి నన్నుఁగూడెఁ బాయకిట్టె తన కింక
యెందరు గలిగినాను యిది పరాకా ॥ ఎంత ॥ 108

రేకు 1419 సాళంగం

మొదలనే యీజోక మోసపోక
పొదలించవలెఁగాక పొద్దువోక ॥ పల్లవి ॥

నెలంతకు నీకుఁ బోమ నేరమి యెందును లేదు
యెలమి మీఇద్దరిలో నేల వాదు
కలఁచి చూచె వింతే కంతునికిఁ బొద్దువోదు
వలచినమీఁదఁ బాయ వసముగాదు ॥ మొద ॥

ఇంతలేసివొళ్లేల ఇద్దరికి నీలీల
పొంతనే లేచినయట్టిపొద్దువేళ
వంతులఁ దెప్పలఁ దేలవద్దు వద్దు మీవోల
కొంతగొంత పంతమిచ్చి కొసరనేల ॥ మొద ॥

యిన్నియు చింతటఁ దీరె యెన్నికలు చేకూరె
చెన్నుమీరెఁ గూరిములు సిగ్గులు జారె
వన్నెల శ్రీవేంకటేశ్వరునకు నీకు సారె
మన్ననకూటమిలోన మంతనాలు చేరె ॥ మొద ॥ 109

సామంతం

మేలుమేలు నీజాడ మెచ్చితి నేను । నీ-
వీలాగు గాకున్న నెన్నికవుదువా ॥ పల్లవి ॥

కన్నుల నేఁ జూచితేనే కవకవ నవ్వేవు
వున్నతి నీకు నాకు నేవూరిపొందురా
యిన్నేసిజాణతనము నీవు నేరకున్న
మున్ను రుకుమిణి నీకు మోహించునా ॥ మేలు ॥

ఇంతుల నేఁ బిలిచితే నేమియని దగ్గరేవు
కొంతైన నే నిన్నుఁ బేరుకొంటినటరా
పొంత సిట్టె వుప్పువేసి పొత్తుగలయ వచ్చేవు
పంతము లేకుంటే శ్రీపతి వవుదువా ॥ మేలు ॥

ఇట్టె నేనేకతమైతే నిటు నన్నుఁ గూడితివి
వొట్టి నీకు నాకు వొడఁబాటురా
దిట్టవు శ్రీవేంకటేశ తెగు వింత లేకుండితే
ఇట్టికాఁడ నీకు నేను సతమవుదునా ॥ మేలు ॥ 110

లలిత

వలపెందుఁ జల్లినా వద్దనకువే
చలిగాలి యొకచోట సతమయ్యీనా ॥పల్లవి॥

పైపై నీవిభుఁ డేపడఁతినో చూచెనంటా
కొపగించే వది యట్టే కొనసాగీనా
దీపించి మెఱుఁగులు దిక్కులెల్ల మెఱిచిన
రూపురేకై వొకచోట రూఢికెక్కీనా ॥వల॥

కోరిక నెవ్వతెపైనో కూరిమి నించెనంటా
దూరే వాతవి నవి తుదకెక్కీనా
కారుకమ్మే వానలోనఁ గడఁగి పుట్టినయట్టి-
నీరుబుగ్గ లొకచోట నిజమయ్యీనా ॥వల॥

శ్రీవేంకటేశుఁ దేచెలిఁ దొల్లి కూడెనంటాఁ
గావరించే వవి నీవు గంటివా నేఁడు
ఈవేళ నినుఁ గూడె విట్టె పో భువిమీఁదఁ
బూవుఁ బరిమళము లెప్పుడు రెండవునా ॥వల॥ 111

సాళంగనాట

పులుఁగునెక్కేటిపెద్దబొమ్మలవాఁడు
కలికిచేఁతల నించీఁ గానరటే మీరు ॥పల్లవి॥

పామునాడించినయట్టిబాలజోగిపిన్నవాఁడు
వాములవెన్నలుదినేవలువకాఁడు
చేముంచి కొండలెత్తేసిద్ధవిద్యలవాఁడు
కామినులాల వచ్చెఁ గానరటే మీరు ॥పులుఁ॥

పొంచినరాకాసిఁ జంపి భూతనాథుడైనవాఁడు
పెంచెము గట్టుక వెంపించేవాఁడు
అంచెల విప్రవినోదై తిరిగేటివాఁడు
కంచుమిఁ(మిం?)చై తిరిగాడీఁ గానరటే మీరు ॥ పులుఁ ॥

విడివిడిచేతులతో [1] విద్యములయాటవాఁడు
అడవిఁగాచేటిగంగ్యావులవాఁడు
చెడనివరములిచ్చేశ్రీవేంకటాద్రివాఁడు
కడు నెందు చనె వీవిఁ గానరటే మీరు ॥ పులుఁ ॥ 112

## సామంతం

అన్నియును నొక్కజాడే యనవచ్చునా
కన్నులపండువగాఁ గనవలెఁగాక ॥ పల్లవి ॥

సన్నమాయ నెన్నడుము చన్నుదోయి ఘనమాయ
కన్నియ కీరెండు నంగములేకావా
యెన్ననేల యిందులోనే యెచ్చుకుందు లాయనఁటా
పన్నినవారివారిభాగ్య మింతేకాక ॥ అన్ని ॥

నవ్వులు దెలుపులాయ నలుపాయ కనుచూపు
జవ్వనిమేనివిలాసములే కావా
యెవ్వరి కేమనవచ్చు ఇందుకుఁగా మనసున
నొవ్వలేల తా మున్ను నోచినంతేకాక ॥ అన్ని ॥

చెదరెఁ గెంపులు మోవి చెక్కులెల్లఁ జీరలాయ
ముదితపలుకులకు ముంగిలేకాదా
వెదచల్లె మచ్చిక శ్రీవేంకటేశుఁ డిదె కూడె
మదనుఁడుసేసినటిమాయ లివి గాక ॥ అన్ని ॥ 113

---

1. 'విద్యము' 'రూపము చింత్యము'

సామంతం

రతి నీపలుకులకు రామనదపులకు
గతిగూడఁ గదమ రాగము సేయుమీ ॥ పల్లవి ॥

పిల్లఁగోవిరవములు బెరయించఁగా నదే
గొల్లెతలమట్టెలకుఁ గూడె సుతి
పల్లవపుఁబదముల పాటలు వాడుచుఁ
గల్లగాదు కదమ రాగము సేయుమీ ॥ రతి ॥

ముందు నీసంకపురవ రమునకు గోపికలెల్ల
కుందణపు టందెలకుఁ గూడె సుతి
చిందుల రాగములు చిలికించి చిలికించి
కందువలఁ గదమ రాగము సేయుమీ ॥ రతి ॥

పెనఁగేనీవూఁ రుపులు పెరుగమ్మెకాంతల—
కొనగోరితాఁకులకుఁ గూడె సుతి
చెనకితి విందరిని శ్రీవేంకటేశ్వర
కనుచొక్కి కదమ రాగము సేయుమీ ॥ రతి ॥ 114

రేకు 1420 శ్రీరాగం

ఇందుకుఁగా నేమన్నా నెరవు తాను
ఇందరు నీతారుకాణ లెఱఁగనివా ॥ పల్లవి ॥

వొల్లనిసతులమాట వొప్పులునుఁ దప్పులవు
చల్లనిచూపులయినచల్ల వేఁడవు
చెల్లుబడి నిచ్చకపుఁజేఁతలెల్ల మోఁత లవును
యెల్లవారు నివియెల్ల నెఱఁగనివా ॥ ఇందు ॥

మనసెనయనిచోట మక్కువలే తక్కువలా
తనివోపినవ్వులు తాపము లవును
చవివిచ్చి చెనకినసరసాలు విరసాలా—
నెనయవియీభావా లెఱఁగనివా ॥ ఇందు ॥

కూరిమిలేనిచోట కొసరులే కసరులా
కోరి చేకొపిన నివే కూటములా
వేరులేక కలసె శ్రీవేంకటేశుఁ డిదె నన్ను
యీరీతి వింతులెల్లా నెఱఁగనివా ॥ ఇందు ॥ 115

ముఖారి

ఇటువలెనేపో నీయెన్నికలు। నీ—
ఘటన చిన్నియు నీవే కానవుగాక ॥ పల్లవి ॥

ఐడియనీమాఁట నీకుఁ జక్కనేకాదా
కడవారి కియ్యకోలు గావలెఁగాక
విడువక వేముచవి వేమెరుఁగునా। యే—
యెడ నెవ్వరైనా నెఱుఁగుటగాక ॥ ఇటు ॥

మిక్కిలినీచేఁత నీకు మెచ్చేకాదా
దిక్కులవారికి నిన్నిఁ దెలుసుఁగాక
చొక్కి దనరూపు దానే చూడవచ్చునా
యెక్కడా నద్దములోనే యేరుపడుఁగాక ॥ ఇటు ॥

నేమను శ్రీవేంకటేశ నీవే కావా
ఐనప్పటి మఱపంతేకాక
తేనెతీపు తేనియకు తెలిపియౌనా। యిట్టె
పూని చవిగొన్ననన్నుబోఁటి కింతేకాక ॥ ఇటు ॥ 116

సామంతం

తనువు తనదిగాని తలఁపు [1]నీది
పెనఁగి మాఁకునఁ దీగె బెరసినయట్లు ॥ పల్లవి ॥

మోమునఁ గన్నులుగావి మోహపుఁజూపులు నీపై
కామినిభావము చెప్పఁ గతలాయను
తామరలు కొలనిలోఁ దరులఁ బరిమళము
వేమారు విందుకొన్న విధమాయ నిపుడు ॥ తను ॥

చెలితో మాటలుగాని చిమ్ముచేఁతలు నీపైఁ
గలిగినవిధమెట్లాఁ గనుఁగొనుమీ
చిలుకలు వనములఁ జెలరేఁగుపలుకులు
వలరాజునమ్ములకు వాఁడివెట్టినట్లు ॥ తను ॥

పురముపై [2]నుంటేకావి పువిదప్రాణము నీపై
గరిమల శ్రీవేంకటవిభుఁడ
సరిలేనిమీలోనివిసరసపుఁగూటములు
ఇరవాయఁ బాలు నీరు నేకమైనగతిని ॥ తను ॥ 117

సామంతం

ఏఁపులేల వూఁపులేల యెదమాటలేల ఇఁక
రాఁపులెల్లాఁ బక్కనయ్యా రమ్మనవే తన్నును ॥ పల్లవి ॥

అసము దించక బీరాలాడీఁగాక తాను
నసిగాటుఁ దత్తరము నాకంటెఁబో
ముసిముసినవ్వు వచ్చీ మోముమోము చూచితేను
రసికుఁ డన్నిటానౌను రమ్మనవే తన్నును ॥ ఏఁపు ॥

---

1 ఇక్కడ 'నీ' దగ్గరపాదపూర్తిగీత యున్నది. అట్లైన యతిప్రాసభంగము. ప్రామాదికము గావచ్చు. 2. ఉంటే=ఉండుటే.

తెచ్చుకోలుఁదెలివితో తెగువలాడీఁగాక
నచ్చుకొట్టేవినయాలు నాకంటెఁటో
పెచ్చువెరిగేది చూచి పెదవులే గొణఁగివి
రచ్చలో సుద్దులు మాని రమ్మనవే తన్నును ॥ఏఁపు॥

ప్రియమునఁ గాఁగిలించి బిగిసీఁగాక తాను
నయగారిమేమఱపు నాకంటెఁటో
దయ శ్రీవేంకటపతి తానే నన్నుఁ గూడె
రయమున దినమును రమ్మనవే తన్నును ॥ఏఁపు॥ 118

దేశాక్షి

అంగన లాతనివేళ అరసిరారో
సింగారరాయఁడు యేమిసేసీనో యీవేళ ॥పల్లవి॥

వుప్పవడమౌ నిఁ(విం?)తక వువిదయుఁ దా నీవేళ
అప్పుఁడు దధ్యన్నము లారగించు నీవేళ
అప్పుదే మొకమజ్జన మవధరించు నీవేళ
ఇప్పు దేమినేసీనో యెఱఁగ మీవేళ ॥అంగ॥

తిరువారాధనవేళ తిరువందికాపువేళ
అరిది యప్పాలు వన్నాలారగించు నీవేళ
దొరలకొలు నీవేళ తోదోపు లీవేళ
సిరివరుఁ డిపు దేమిసేసునో యీవేళ ॥అంగ॥

యిట్టె యలమేలుమంగ యేకతమాదేవేళ
చుట్టి రా నంగరంగాలు చూచేవేళ
మెట్టి శ్రీవేంకటపతి మెరసి యేఁగేవేళ
చెట్టాపట్టాలతో రతిఁ జెలఁగు నీవేళ ॥అంగ॥ 119

శంకరాభరణం

ఒకటి గూడినను వేరొకటికిఁ బొసఁగదు
వికటాలై నీవలన వేదనలే చెలికి ॥ పల్లవి ॥

కమలాక్షిగనక యీకన్నీటికొలను దగు
తమకపుమేనికాఁక తగదు గాని
తమిఁ గీరవాణిగాన తగుఁ బొదలుమాఁటలు
[1] అమరా(రవు?) చెదరినయట్టినెరివురులు ॥ ఒక ॥

జక్కవకుచగనక సరిఁ దాపరవి మేలు
నిక్కి వెల్లనిమేనివెన్నెలఁ గూడదు
అక్కటా చిగురుఁబోడి కగుఁ జెమటలమంచు
గక్కన నిట్టూర్పుపెనుగాలి గాదుగాని ॥ ఒక ॥

మదగజయానగాన మఱపుమదము దగు
అదనఁ గిందుపడేదే యది చెల్లదు
యెదుట శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
కదియ కింతయేఁచివకపటమే నేరమి ॥ ఒక ॥ 120

రేకు 1421 సామంతం

నిక్కి నాతమకానకు నీవే కావలెఁగాక
యెక్కువ నన్నిటు గావ నెవ్వరున్నా రిఁకను ॥ పల్లవి ॥

కోపగించి విన్నయితేఁ గొసరుదు నేను; నన్నుఁ
బైపైనే బుజ్జగించి పాయలేవు నీవు
చాపలాన గొణఁగుచు సాదింతు నే నిన్ను
తీపుమోవి నాకు నిచ్చి తేలింతువు నీవు ॥ నిక్కి ॥

---

1. 'అమరవు' అను వ్యతిరేకార్థములో ప్రమాదవశముననో, వ్యావహారికముగనో 'అమరా' అనురూపము వాడియుండవచ్చు.

వేగిరించి విన్నయితే వెంగెమాడుదు నేను
బాగుగా సందుకు నీవు పకపక నవ్వేదువు
ఆగతి నడుగరానివైనా నడుగుదు నేను
సోగల సాదించి తెచ్చి చొక్కింతువు నీవు ॥ విక్కి ॥

ముందుముందే కాలఁజిమ్మి మొక్కులు మొక్కుదు నేను
అందుకంటే మునుప నన్నాదరింతువు నీవు
ఇందుకే శ్రీవేంకటేశ యెనసితి నే నిన్ను
కందువలఁ గరఁగించి కైకొంటివి నీవు ॥ విక్కి ॥ 121

శ్రీరాగం

మీరేమి దూరకురే మెలుఁతలాల
ఆరసి నే నెఱుఁగుదు నతనిగుట్టెల్లా ॥ పల్లవి ॥

సొలసి యెవ్వతెదిక్కు చూచినఁ దాఁ జూచెఁగాని
మెలుపున నాతఁడు నామీఁదికన్నే
అలరి యీమాటలు తానాడిన నాదెఁగాని
కలదెల్లా నామీఁదికలవరింపులే ॥ మీరే ॥

ననుపై యెవ్వతెతోఁ దా నవ్వితేనే నవ్వెఁగాని
చనవై నాతోనే పో సరసమెల్లా
చెనకి యెక్కడఁ బొందుసేసితేఁ జేసెఁ గాని
పెనఁగి నాపైనే పో ప్రియమెల్లను ॥ మీరే ॥

వరుసిచ్చి యెందుండివచ్చినఁ దా వచ్చెఁగాని
సరి నాకాఁగిటనే పో సమరతులు
ఇరవై శ్రీవేంకటేశుఁ డయినఁ దా నాయఁగాని
వురముపై నన్ను మోఁచె నున్నపంతా లేఁటికి ॥ మీరే ॥ 122

బౌళిరామక్రియ

రమణిజవ్వనము రామురాజ్య మిఁక
అమరఁగ విటు గొనియాడరె చెలులు ॥పల్లవి॥

కాంతకుచంబుల ఘనదుర్గంబులు
కాంతి జక్కవలు [1] గజబలిసె
పొంతనె పిఱుఁదనుపులినపుఁదిప్పలు
మంతుకెక్కె వదె మదనుఁడు బలిసె ॥రమ॥

సతివలయపుముఖచక్రవాక మిదె
అతికళల చంద్రుఁ డదె బలిసె
మతకముతోఁ గచమండలరాజ్యము
మితిమీరినతుమ్మిద లిటు బలిసె ॥రమ॥

తరుణిరతుల బంధపుబహురాజ్యము
నిరతి శ్రీవేంకటనిధి బలిసె
అరయ నతనిపుర మందుకుఁ బతిగా
సిరులుమించ నీచెలియును బలిసె ॥రమ॥ 123

బౌళి

వెలఁదివిరహ మెంతో విన్నవించితిమి నీకు
తలఁపుఁ దలఁపు మీకే తారుకాణలైనవి ॥పల్లవి॥

మాట లెందున్నవో కాని మగువకోర్కులు నీ-
తేటలమోవియందే తిరమైనవి
నీటుఁజూపు లెందున్నవో నివ్వెరగై వూర్పులెల్లా
కూటువ నీముద్రలపైఁ గుమ్మరించినవి ॥వెలఁ॥

---

1. గజదొంగవలె 'గజబలిసె' ఇక్కడ గజశబ్దమునకు ఎక్కువ, పెద్ద అనియర్థము.

వివర మెందున్నదో వెలఁదికి వీను లివె
తవిలి నీసుద్దులందే తావైనవి
వువిదకు గమన మెందున్నదో పాదములు
యివల నీవున్నవీది కిటు మొకమైనవి ॥ వెలఁ ॥

పంత మెందున్నదోకాని పడఁతికి వినయాలు
చెంతల నీదూతికకే నెలవైనవి
యింతలో శ్రీవేంకటేశ యిట్టె విచ్చేసి చెలివి
సంతసానఁ గూడఁగాను జయము చేకొన్నది ॥ వెలఁ ॥ 124

### సామంతం

ఇద్దరి కిద్దరే సరి యీడుకు జోడుకుఁ దగు
గద్దరికన్నులఁ జూడఁగలిగెఁగా మనకు ॥ పల్లవి ॥

పంతపు చెలిచన్నులు(లఁ?)పసిఁడి కాంతులకు
కాంతువిపీతాంబరపుకాంతులు సరి
[1] దొంతులచెలినీలపుతురుముకాంతులకు
వంతుల మేనినీలవర్ణము సరి ॥ ఇద్ద ॥

జలజాక్షి వెలలేనిజఘనచక్రమునకు
చలమరివలకేలిచక్రము సరి
కులికేటియీయింతికుత్తికశంఖమునకు
చలివాయ రమణునిశంఖము సరి ॥ ఇద్ద ॥

కమలాక్షి శ్రీవేంకటపతిఁ గూడుటకు
రమణుఁడంటినసమరతులు సరి
తమితోడ నిద్దరికి తారుకాణలైనట్టి —
సముకపుమోహములసంతసములు సరి ॥ ఇద్ద ॥ 125

1. 'చెలిదొంతులనీలపుతురుముకాంతులు' అనుట సహజము.

సాళంగం

నీకు నీవే చూచుకొమ్మీ నీయందు నేరమి
మాకుఁ దెలియదు యేమి మఱఁగోకాక ॥ పల్లవి ॥

సెలవుల నగితేనే సిగ్గులకు వెలితా
కలికి నీయందు నేమిగనెనో కాక
కులికి మాటాడితేనే గుట్టులేవిదాయనా
వెలి నీచేఁత కదేమి వేఁగెనోకాక ॥ నీకు ॥

తప్పకచూచితే పంతమునకు వెలితా
చెప్పరానిపని యేమిసేసితోకాక
యిప్పుడే తలవంచితే యెమ్మెలకు హీనమా
అప్పుడే యేయాయము నీవంటితోకాక ॥ నీకు ॥

బొమ్మల జంకించితేనే పొందులకు వెలితా
సొమ్మల నీగో రేద సోఁకెనోకాక
నెమ్మది శ్రీవేంకటేశ నెలఁతఁ గూడితి విట్టె
వుమ్మడితమక మెంత వుండెనో కావి ॥ నీకు ॥ 126

రేకు 1422 సామంతం

రమణుఁడు దానై నరవ్వే నాకుఁ జాలు
భ్రమగానితనివోనిపంతమే చాలు ॥ పల్లవి ॥

ఆడుకోలుమాటలు తా నాడనీ మాననీ నే-
నాడినమాటల కోర్చె నంతే చాలు
వాడుచుఁ దా నవ్వనీ నవ్వకమాననీ ఇఁక
యీాడ నాచేఁతల కోర్చె నిదియే చాలును ॥ రమ ॥

పెన్నిధిఁ బానుపునకుఁ బిలువనీ మాననీ నే
సన్నసేసితేఁ దెలిసేనరవే చాలు
మన్నించి మాటాడనీ మాటాడకుండనీలే నేఁ
గన్నులఁ జూచినమెచ్చేఘనతే చాలును ॥ రమ ॥

అఁగి నాకు వలవనీ అటుగాక మాననీ
కాఁగిట నన్నుఁగూడినకతలే చాలు
ఆగతి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
యీగతి నేకమలైతి మిదియే చాలును ॥ రమ ॥ 127

సాళంగనాట

మేలు మేలుగా నీవు మెరయుటింత
యీలాగు నాకొరకు నింతసేసితివిగా ॥ పల్లవి ॥

చెల్లెఁగా లంకలోనికిఁ జెప్పిపుత్తెంచినమాట
మల్లడిగా నల్లహనుమంతునిచేత
వల్లెగాఁ గొండలచేత వారిధి గట్టుట యెంత
ఇల్లిదె నాకొరకుఁగా నింతసేసితివిగా ॥ మేలు ॥

యెక్కెఁగా నీచలము నింద్రచంద్రాదులఁ గూడి
చక్కఁగా రావణు నట్టె చంపినవంక
పక్కనను వనచరబలము గూర్చుట యెంత
యెక్కువ నాకొరకుఁగా నింతసేసితివిగా ॥ మేలు ॥

అందెఁగా నీకోరిక నన్నలమి కూడినవంక
అందరుఁ జూడఁగా నీ వయోధ్యలోన
వొందిరి శ్రీవేంకటేశ పురమున మోచితివి
ఇందునే నాకొరఁకుగా నింతసేసితివిగా ॥ మేలు ॥ 128

## మంగళకౌసిక

MP3

కందువమీనిచ్చకల్యాణమునకు
　అందములాయను అదన నివి ॥ పల్లవి ॥

కలువలసేసలు కలికికి నీకును
　సొలవక చూచేటిచూపు లివి
　చిలుకులమొల్లలసేసలు మీలో
　నలుగడ ముసిముసి నవ్వులివి ॥ కందు ॥

తామరసేసలు తలకొనె మీకును
　మోము మోమొరయుముద్దు లివి
　సేమంతిసేసలు చెలియకు నీకును
　చేమిరిగోళ్లచెనకు లివి ॥ కందు ॥

సంపెంగసేసలు సమరతి మీకును
　ముంపులపూర్పులమూఁక లివి
　యింపుల శ్రీవేంకటేశ చెలిఁ గలసి
　సంపదఁ దేలితి చనవు లివి ॥ కందు ॥ 129

## నాదరామక్రియ

ఏమిమాయసేసితివో యెవ్వఁ డెఱుఁగుర విన్ను
　నామువలపుఁ[1] దలకు నాకు నెక్కెరా ॥ పల్లవి ॥

మాయపునీసుద్దులకు మాటలాడకుండేనన్న
　కాయపునాపాయమే కాఁక రేఁచీరా
　పోయగానఁ గోపగించి చూపుల జంకించేనన్నా
　బాయట నాచెమటలు వచ్చిరేఁచీరా ॥ ఏమి ॥

---

1. ఇందరసున్న ఆవశ్యకమా?

పొరపొచ్చెముల నిన్ను బొమ్మల జంకించేనన్నా
అరిది నా మొగమోటా లడ్డగించీరా
సరవి నీవొట్లకు చక్కఁగా నవ్వేనన్న
సరిగా నాపులకలు వందండించీరా ॥ఏమి॥

గొబ్బున నీమోవి గని గుక్కిళ్లు మింగేనన్నా
అబ్బురపుఁబరవశ మ్మట్టె ముంచీరా
వుబ్బున శ్రీవేంకటేశ వొగి నన్నుఁ గూడితివి
తబ్బిబ్బై నామతులు తడఁబడీరా ॥ఏమి॥ 130

## సామంతం

ఎంతకెంత జాణతనా లిఁకనైనాను
యింత చాలదా మన కిఁకనైనాను ॥పల్లవి॥

బొమ్మల జంకించఁబోతే బొట్టు కస్తూరెల్ల రాలె
యెమ్మెలు మానవే నాతో నిఁకనైనాను
పిమ్మట గొణఁగఁబోతే పెదవికెంపులు రాఁగె
ఇమ్మల నొక్కటిగారే ఇఁకనైనను ॥ఎంత॥

తప్పకచూడఁగఁబోతే తనువెల్లఁ జెమరించె
యెప్పటివలె నుండవే ఇఁకనైనాను
గొప్పగా నవ్వఁగఁబోతే కొప్పు గదువెడజారె
యిప్పటిబింకాలు వద్దే యిఁకనైనాను ॥ఎంత॥

ముందటఁ దిట్టఁగఁబోతే మొగమోటములు విండె
ఇందు కేమిసేసేవే ఇఁకనైనను
అందమైన శ్రీవేంకటప్పఁడని నన్ను
యెందునుఁ బాయవు గూడి యిఁకనైనను ॥ఎంత॥ 131

ముఖారి

ఏదాయనేమి రొట్టె కింతా [1] రేవేకాదా
దాదాత మోచెఁ బవి తానే నేఁగానా ॥ పల్లవి ॥

కలికి మాటాడకున్న కంకణాలే మాటలాడీ
మలసి యవే తనమారు గావా
కలికి తాఁ జూడకున్న కుచాలు దలెత్తిచూచీ
అలర నవే తనయంగములుగావా ॥ ఏదా ॥

చిత్తములోఁ [2] దూరకున్న చెవులైన మాఁట [3] దూరీ
మత్తిల్లి యవే తనమారుగాదా
పొత్తుకుఁ బిలువకున్న బోన మొక్కటియయ్యీ
కొత్తగా నదియు నొక్కకూటమే కాదా ॥ ఏదా ॥

కాయములు వేరైతే కాఁగిలి నొక్కచేయయ్యీ
మాయల నేనే తనమారు గాదా
చేయారఁ గూడితి నిట్టె శ్రీవేంకటేశుఁడను
చాయలు సన్నలు నొక్కసరియే కాదా ॥ ఏదా ॥ 132

రేకు 1423 శుద్ధవసంతం

[4] బాలకిగావి యింతి ప్రౌఢగాదు ఆకె—
చేలకొంగంటుచును మచ్చికసేయవయ్యా ॥ పల్లవి ॥

నీవువచ్చేదెఱఁగక నెలఁత నిన్నుఁ బాడి
చేవల్ల విన్నటుచూచి సిగ్గువడెను
యీవల నాసిగ్గుదేర ఇంతితోడ సుతి గూడి
తోవ చూపి చూపి ఇట్టె తోడు వాడవయ్యా ॥ బాల ॥

---

1. రొట్టె తినుటకు నంజుడుగా నుపయోగించుకొనుపచ్చడివగైరా లుంచుకొను స్థలమా? 2, 3, తూఱుధాతువు, తూరు-దూరు అనురెండురూపములలో సాధు రేఫతో ప్రయోగము 4, బాలిక సహజము. బాలకి, ప్రయోగము శ్రీనాథ, అనంతామాత్యులలోను గలదు.

నాటకసాలలోన నాతి యాడి నిన్నుఁగని
చీటికిమాటికి నిట్టే సిగ్గుపడెను
నీటున నాసిగ్గుదేర నీవు కోపులెత్తియెత్తి
తూఁటరితనముతోడ తోడాడవయ్యా ॥ బాల ॥

కాఁగిటికిఁ జేయి చాఁచి గక్కున నీమోము చూచి
చేఁగలనవ్వులు నవ్వి సిగ్గువడెను
యీగతి శ్రీవేంకటేశ యింతిసిగ్గుదేరఁ గూడి
కాఁగిటనే వించి విఁచి కళదాఁకించవయ్యా ॥ బాల ॥ 133

శంకరాభరణం

మనసులు చూచేమత మేల
కొనలచేఁతలకుఁ గొత్తలివేల ॥ పల్లవి ॥

నెలఁతవలపులకు నిట్టచూపే గురి
యెలమి మాపలుకు లిఁకనేలా
చిలుకుముదములకు చిఱునవ్వులె గురి
యిలఁ దారుహాణ లిఁకనేలా ॥ మన ॥

చిత్తపుఁగరఁగుకు చిఱుఁజెమటే గురి
యిత్తల ముసగస లిఁకనేలా
హత్తినకూర్మికి నందనువికె గురి
పొత్తులబానలు పూఁచఁగనేలా ॥ మన ॥

కాఁగిటిరతులకు కళలమోమే గుఱి
అఁగినయెడమాఁట లవి యేలా
యీగతి శ్రీవేంకటేశ కూడితివి
జాగులనరసపునట లిఁకనేలా ॥ మన ॥ 134

సాళంగం

ఇంతే నాతలఁపోఁత లింతికి మరేమి లేదు
కాంతుఁడ సతిచలము కాంక్షదీరుదాఁకనే ॥ పల్లవి ॥

చెలిచెక్కుచేయి విన్నుఁ జేరినయందాఁకా
విలుచుం దెదురుచూపు నినుఁ గనుదాఁకనే
అలపులసురుసు లంగము లంటినదాఁకా
మలయుమోనము నీతో మాటలాడుదాఁకనే ॥ ఇంతే ॥

కసరులుఁ గొసరులు కాఁగిలించునందాఁక
వసివాడులెల్ల విన్ను వలపించుదాఁకనే
పసురుఁబులకలెల్ల పైపడి చెనకుదాఁక
ముసిముసిగుంపెనలు నీమోవి యానుదాఁకనే ॥ ఇంతే ॥

మిక్కిలిపై కాఁకలెల్ల మేను చెమరించుదాఁక
సుక్కులసిగ్గులు కనుచొక్కుదాఁకనే
పక్కన శ్రీవేంకటేశ పడఁతియు నీవు విట్టె
వొక్కటౌట కలకాల మొద్దికౌదాఁకానే ॥ ఇంతే ॥ 135

గౌళ

అసురల శిక్షించ నమరులఁ బాలించ
వెనఁ గొలువిమ్మనరే విన్నపాలకాంతలు ॥ పల్లవి ॥

యేకతాన దేవుఁ డున్నాఁ డింతులరతిఁ దగిలి
దాకొనదపసతులు దగ్గరరమ్మ
యీకడ నింతవొద్దు వోయినదీ నెరఁగఁడు
దాకొని జలకముకాంతలు విన్నవించరే ॥ అసు ॥

పూవి యిందిరపాటలో నోలలాడుచున్నవాఁడు
 బోనపుటింతు లెదుటఁ బొడచూపరే
పావిపట్టి నెత్తమాడేపరాకై వున్నవాఁడు
 పూవి గదేరమువారు పొంచియెచ్చరించరే ॥ అసు ॥

శ్రీవేంకటేశుఁ డదె శ్రీసతిఁ గూడున్నాఁడు
 ఆవేళఁ బూవులు గందా లందియ్యరే
భావించి రాజసాన నభయహస్త మిచ్చినాఁడు
 దైవ; మాతవినే నమ్మి తరుణులు మొక్కరే ॥ అసు ॥ 136

## రామక్రియ

రమణునికడకేఁగి రతి సలుపఁగరాదా
 అమరవు మీకు మీకు నలుక లింకేలే ॥ పల్లవి ॥

చిత్తజునికే తగు శివునికే తగుఁగాక
 యిత్తల మతిలో మంట యింతి నీకేలే
పొత్తుల పాముకుఁ దగు పొంచి నీలాహికిఁ దగు
 మొత్తపునిట్టూర్పుగాలి ముదిత నీకేలే ॥ రమ ॥

జక్కవలకే తగు చందురునికే తగు
 వెక్కు పొద్దొకలాగులు నేఁడిది యేలే
చక్కఁదేంట్లకే తగు సంపెంగలకే తగు
 చొక్కులకొప్పుచెదరు సుదతి ఇంకేలే ॥ రమ ॥

మోవిపండ్లకే తగు మొనచిలుకకుఁ దగు
 యీవల నీమోవిగంటి యిప్పుడే యేలే
శ్రీవేంకటేశ్వరుఁడు చింతదీర నిన్నుఁ గూడె
 భావము లొక్కటాయఁ బదర వింకేలే ॥ రమ ॥ 137

బౌళిరామక్రియ

కొలచి నాకాంతమే కోపము చూపీ
చెలు వి(లి?)ది దెలుపరె చెలువుఁ దేమనునో ॥పల్లవి॥

మఱి కొసరినబొమ్మలు ముడివడె నవె
యెఱఁగనిపతిమతి యెట్టుండెనో
పెఱిమకు నగితేఁ బెదవులు గదలెను
తఱి విందుకుఁ బతి తా నేమనునో ॥కొల॥

వుదుటున నడచిన వూర్పులు గిసరెను
యెదుటఁ జెలు లతవి కేమనిరో
వదలుఁదురుమిడినవడి మోము మఱలె
తుద రమణుఁ డెంత దూరెనో తాను ॥కొల॥

కొనచెయివట్టిన గోరటు నాఁటి
యెనసి యతవిరతి యెట్టుండెనో
ఘనుఁడగు శ్రీవేంకటపతిఁ గూడితి
తననాగుణితులు దాఁగనివెట్లో ॥కొల॥ 138

రేకు 1424 బౌళి

అయ్యో యేమి చూచే వతివ(ఁ) దప్పక యిట్టె
పయ్యదకొం గల్లార్చి పలికించవయ్యా ॥పల్లవి॥

చెక్కులవెంటఁగారేచెమట దుడువవయ్యా
యిక్కడ నీకుఁ గైదండ యిచ్చి యలసె
లక్కవలెఁ గరఁగినలావణ్యరస మిదో
కక్కసపుఁగొప్పుమేఘపుజడివానలో ॥అయ్యో॥

సురటి విసరవయ్య సుదతి నీకొప్పు దువ్వి
అరుదుగ ననురుసురాయ నిదె
పరిపరిజవ్వనముపైఁ బరవశమో
మరుసముకములోనిమాటలతేటలో ॥ అయ్యో ॥

తమల మొసఁగవయ్య తరుణి నీమేను సోఁకి
తమకపురతిఁ జొక్కి దప్పిగొనెను
అమరఁగ శ్రీవేంకటాద్రీశ యిదియల్లా
గొమరెవయసునను కోరినకోరికలో ॥ అయ్యో ॥ 139

తెలుఁగుఁగాంబోది

మేలుమేలు మగువా మేరదప్పఁ దగవా
ఆలరిసేఁతలు సేసే వౌనౌనే నీవు ॥ పల్లవి ॥

కన్నులైతేఁ దేటలు ఘాతలైతే మేఁటులు
యెన్నఁడు నేరిచితివే యింతి నీవు
సన్నలైతేఁ జాయలు జాడలైతే మాయలు
అన్నిటా జాణవౌదు వవునౌనే నీవు ॥ మేలు ॥

తనువైతేఁ జిగురు తలఁపైతేఁ దగరు
ననుపైతి వెట్లానే నాతి నీవు
పెనఁగితే నగవు బీరమైతే బిగువు
అనుమానమెల్లఁ దీరె అవునవునే నీవు ॥ మేలు ॥

మోవియైతేఁ దీపులు మోహపుసారాఁపులు
వావి దెలిపితి వౌనే వనిత నీవు
శ్రీవేంకటేశుఁడ నేఁ జేకొంటిఁ గాఁగిట నిన్ను
ఆవిదమే చేకొంటి వవునౌనే నీవు ॥ మేలు ॥ 140

రామక్రియ

నవ్వి నవ్వి జగడాలు నాఁటినేఁటి విగడాలు
  ఇవ్వల నీపతితోనే యేఁమమ్మ నీకు ॥ పల్లవి ॥

కదుఁ బెదవి కదలీకదలనిమాటలు
  వదిఁ గనరులతోడివాలుఁజూపుతేటలు
  పుడుకుఁ జెక్కుచెమట లూరేటివూటలు
  యెదలేదు యింతలోనే యేలమ్మ నీకు ॥ నవ్వి ॥

అరితేరినపయ్యదమరఁగు మొరఁగులు
  నీరుకమ్మెచెక్కుచేతినిండునివ్వెరగులు
  ఘోరపుఁగన్నీట మించు గుబ్బలకరఁగులు
  యీరీతి నింతలోనే యేలమ్మ నీకు ॥ నవ్వి ॥

వుండనుండ నంతలో నిట్టూరుపుటుసురులు
  బండుబండై పులకల పైరులపసురులు
  అండనె శ్రీవేంకటేశుఁ డాదరించి కూడె నేఁడు
  యెండలెల్లా నీడలాయ యేలమ్మ నీకు ॥ నవ్వి ॥ 141

నాదరామక్రియ

[1] ఎఱుఁగుదు మమ్మలాల ఇంత నాకుఁ జెప్పనేల
  తఱవాతిపనులకుఁ దానే కాఁడా ॥ పల్లవి ॥

సొలసి చూచి చూచి చూపులనే చిక్కించి
  తలవంచుకొన్నవాఁడు తానే కాఁడా
  తొలుతనుండియు మోరతోపులనే తిరిగాడి
  తలవాకిటనున్న(వాఁడు) తానే కాఁడా ॥ ఎఱుఁ ॥

---

1. ఇందు దశావతారసమన్వయ ముద్దేశింపబడినది. 2వ చరణముత్తరార్ధము నుండి కొన్నిట కారకాన్వయము అర్థాన్వయము అంత సనిగ లేదు.

పొగరు గుణాలచేతఁ బొడవెక్కి పొడవెక్కి
తగనికోపాలవాఁడు తానే కాఁడా
బిగివాసి కాఁకచేత పరకాంతలనుబొందే-
తగవులధర్మరాజు తానే కాఁడా ॥ ఎఱుఁ ॥

వుండ నుండ సిగ్గుదేరి వూరఁగలబుద్ధులతో
దండిరాతిగుండెవాఁడు తానే కాఁడా
కొండల శ్రీవేంకటాద్రిఁ గోరి నన్నుఁగూడె
తండినవలపువాఁడు తానే కాఁడా ॥ ఎఱుఁ ॥ 142

మాళవిగౌళ

కన్నవారెవ్వరు నేఁడు కాంతజవ్వన మిది
పన్నినవిభుఁడ నీభాగ్యమాయఁగాక ॥ పల్లవి ॥

పట్టఁ బసయేది పడఁతినడుము నేఁడు
బట్టబయలవు అందు భావనేకాదా
అట్టిట్టఁనగ నేది అంగనతురుము నేఁడు
పుట్టుమేఘమిట మింటిపొడవేకాదా ॥ కన్న ॥

యెంచఁగఁ జోటేది యింతికనుచూపు లివి
కంచుమించులట చెప్ప కథలేకాదా
పొంచిదాఁచఁజోటేది పొలఁతికుచము లివి
పెంచెపుజక్కవలట బెదరేవేకావా ॥ కన్న ॥

తలపోఁత యేది కాంతకు శ్రీవేంకటపతి-
వలపట మతి పరవశమేకాదా
తలఁగఁ జోటేది తడఁబడేరతులలో
పలుకుఁబంతములెల్ల పదరుటేకాదా ॥ కన్న ॥ 143

బౌళి

ఘనుఁడ నీవలననే కాంత కబ్బెఁగాక ఇవి
అనువుగావిచోట నంటునా గుణము ॥ పల్లవి ॥

అంకెల నీమోవికెంపు లటు చూచి చెలియకు
కింకలఁ గనుఁగొనల కెంపులెక్కెను
పంకజము లేవూరు పచ్చిచిగు రేవూరు
అంకెల నొక్కటొక్కటి కంటునా గుణము ॥ ఘనుఁ ॥

జాఱుఁజెమటల మెయి సరులముత్యాలు చూచి
చీఱుముత్యా లొలికె నీచెలిచెక్కుల
తీఱుటద్దా లేవూరు తీగెసోగ యేవూరు
ఆఱడి నొక్కటొకటి కంటునా గుణము ॥ ఘనుఁ ॥

కదుఁ జంద్రాభరణాలు కరములఁ జూచి నీకు
పదఁతికుచాల చంద్రాభరణా లంటె
బదిఁ దూండ్లేవూరు పయిఁడికుండ లేవూరు
అదరి శ్రీవేంకటేశ అంటునా గుణము ॥ ఘనుఁ ॥ 144

రేకు 1425 ముఖారి

నిచ్చఁబండుగలు నేసీ నెలఁత ఇదివో నేఁడు
తచ్చివపులకపూవుదండలతోను ॥ పల్లవి ॥

కన్నులపండుగ సేసెఁ గాంత నిన్నుఁ గనుఁగొని
సన్నపునుఁజెమటజలకాలతో
విన్ననై నతరితీపువిందులకజ్జాయముతో
[1] కన్నెలె(వెః)ల్లనీనవ్వులకప్పురాలతోనుః ॥ నిచ్చఁ ॥

1. కన్నె వెల్లనినవ్వుల కప్పురాలతో, అన్నను పెద్దలాభములేదు.

వీనులపండుగ సేసె వెలఁది నీపేరు విని
 ఆనకపుఁగూరిమిగంధాక్షలతో
 కానుకై నమదరాగములపదేలతో
 సేనల సిగ్గులవింతచిలుపాలతోను ॥ విచ్చ ॥

కాఁగిటిపండుగసేసె కామిని నీకూటముల
 వాఁగేటివూర్పులమోఁతవాద్యాలతో
 రాఁగినశ్రీవేంకటేశ రతులభోగములతో
 సాగిననరసముల సంతసాలతోను ॥ విచ్చ ॥ 145

సామంతం

ఇటమీఁద నీచిత్త మెటువలసినఁ జేయి
 కుటిలపురమణుఁడ గురిలేదు వలపు ॥ పల్లవి ॥

తుమ్మెదరవము విని తొంటిహెగ్గాశేలంటా
 తమ్మికంటి యాసలతో దగ్గరిపోయి
 వుమ్మడిఁ దప్పకచూచి వుల్లమెల్ల వక్కలై
 సొమ్మసిల్లె విఁకఁ జెప్పి చూపరాదు వలపు ॥ ఇట ॥

కలికిచంద్రోదయము ఘనుఁడ నీప(పం?)జుల-
 వెలుఁగంటా నెదురేఁగి వెఁదఁది నేఁడు
 చలివాయ నవి చూచి చంచలించి వెరగంది
 అలివేణి పులకించె నాఁపరాదు వలపు ॥ ఇట ॥

పచ్చనితోఁపులు చూచి పట్టునీగొల్లెనంటా
 ఇచ్చగించికొమ్మ నీఇంటికిఁ బోయి
 అచ్చట శ్రీవేంకటేశ అటు నిన్నుఁ గని కూడె
 మచ్చికతమకముల మట్టులేదు వలపు ॥ ఇట ॥ 146

సాళంగం

సరిబేసు లివియివి సరిసరియే
తరుణిచెలువములు దైవారినట్లు ॥ పల్లవి ॥

కాంతకాటుకలకనుచూపులకును
శాంతపునవ్వులు సరిసరియే
వింతగఁ గస్తూరివీణెలలోపల
కాంతులఁ గప్పురము గలసినయట్లు ॥ సరి ॥

ముదిత చంద్రికమోవికిఁ దెల్లని-
చదురుదంతములు సరిసరియే
కదిసిన సంధ్యాకాలములోపల
వుదయ చంద్రరుచి వొలికినయట్లు ॥ సరి ॥

చెలికుచములకు శ్రీవేంకటపతి-
చలువకాఁగిలిది సరిసరియే
మెలుపగుఁగొండలమీఁదట నల్లని-
బలుపగుమేఘము పైకొన్నట్లు ॥ సరి ॥ 147

ముఖారి

పాయపురమణుఁడ నీపంత మింక నెట్లనో
ఆయములే విపరీత మాయఁబో నేఁడు ॥ పల్లవి ॥

వుపమించఁ జందురుఁడు వుదయమైతే భూమి
తపియించి చీఁకట్లు తలఁగుఁగాని
కపురునాతురుముచీఁకటి నీమోముకళ
వుపరిసురతమున నోడించె నేఁడు ॥ పాయ ॥

ఆలరికొండలమీఁద నంబరపుమేఘములు
గాలికి వాలి విండాఁ గప్పఁగాని
పీలమేఘమువంటినీపై నాకుచగిరు
లోలి నుపరతియందు నొగి వాలె నేఁడు ॥ పాయ ॥

తేరిమీఁద మదనుఁడు తెలివొందుఁగాని యందు
నేరుపు శ్రీవేంకటేశ నీనాయందు
బీరపుమరునిమీఁద పికిఁదితేరు వారె
ఆరితేరి రతి వింతలాయఁబో నేఁడు ॥ పాయ ॥ 148

## సామంతం

అల్లదివో నాయకుఁడ అప్పుడు నేఁ జెప్పినది
వొల్లనే వొయ్యారి బాగై నిలుచున్నది ॥ పల్లవి ॥

కొండుకగుబ్బలమీఁద కుంకుమ పూసినది
అండనే వలిపపయ్యెద గప్పినది
మెండుగఁ గస్తురినామమె నుదటఁ బెట్టినది
కొండలరాయఁడ నీకు గురియై తా నున్నది ॥ అల్ల ॥

చిప్పిలువిలువుఁగొప్పునేసవిరులది
కప్పురవిడేలఁ గమ్మెల నవ్వేటిది
వుప్పతిల్లుసొమ్ములతో నొరపుమించినది
అప్పఁడ నీచేఁతలకు నందమై తా నున్నది ॥ అల్ల ॥

చేవల విన్ను దగ్గరి చెఱఁగు వట్టినది
యీవల నీభావమెల్ల వింతగాఁ జేసినది
శ్రీవేంకటేశుఁడ నీచిత్తము వట్టినది
సావితో నీరతులలో సదమదమైనది ॥ అల్ల ॥ 149

రామక్రియ

రాసబలుపువాఁడు రామ నాతఁడు వాఁడే
మోసపోక మనము మొక్కవలె వాఁడే ॥ పల్లవి ॥

అదవికాటఁగాండ్లగ్గిలోఁ గఱలువేయ?
వదఁబొదమినయట్టివాఁడు
ఐదుపమోరలపెద్దసీలికోఁతులనెల్ల
బడిబడిఁదిప్పినబలువింటివాఁడు ॥ రాస ॥

పుటగా నీరాలు దొబ్బుచు పెనుమఱుగెల్లా
అటునిటుఁ బూడిసి యాతఁడు
తటుకున మింటిపెద్దదయ్యాలకోసము
కిటుకురాకాసుల గెలిసినవాఁడు ॥ రాస ॥

గామిడై బూమెల్ల గద్దెవేసుక యేలి
అమవినేసినయాతఁడు
గీము శ్రీవేంకటగిరులలోనను
దోమటి సీతతో దొరయాయ వాఁడే ॥ రాస ॥ 150

రేకు 1426 సాళంగం

అప్పటనుండియుఁ జూడ రమ్మలాల
వొప్పగింత మీఁక పతి కువిదవిరహము ॥ పల్లవి ॥

పొంతనే తామెరలైతే పొద్దుగూఁకినమీఁద
అంతఁ దెల్లవారుదాఁకా నరమోడ్చును
ఇంతికనుఁదామెరలయితే రేయివగలు
యేఁ(యెం?)తైన మొగియుట యెఱఁగ మెప్పుడును ॥ అప్ప ॥

జక్కవలు వొకవేళ సరుస గూఁటిలోన
వొక్కరీతి గుట్టున దాఁగుండుఁగాని
చక్కనిచెలిచనుజక్కవలైతే నందు
తక్కకపయ్యెదగూఁట దాఁగుటే కానము ॥ అప్ప ॥

చిగురుఁదీగెలు భూమిఁ [1]జలపచెలపనీట
తగిలి నానాఁటికిఁ దవియుఁగాని
మగువ శ్రీవేంకటేశుమలయుమేఁదీగెలైతే
తగినరతిఁ జెమటఁ దనియుట గానము ॥ అప్ప ॥ 151

సాళంగనాట

[2]ఏఁటిమాఁట యేదులతీఁట
జీటకపువానిసుద్ది చెప్పకురే మీరు ॥ పల్లవి ॥

కన్నులఁ దప్పకచూచు కాఁకనేసి తలదీసు
సన్నలఁ బెక్కులు దవ్వు సారెసారె నవ్వును
కన్నెనాఁడే వీనిచేఁత కంటిమి వింటిమి నాతో
యెన్ననేలే వీనిసుద్దు లెంచకురే మీరు ॥ ఏఁటి ॥

అ(అ?)డుగులో మోసపుచ్చు నలుగు నేమిటికైన
పడఁతి నెలమిపట్టు పలువుర నఁటును
ఏదిపడి వేసరితి పసిలే దంకేసిదూర
యెడనెడ వీనిగుణా లెంచకురే మీరు ॥ ఏఁటి ॥

మానములు గోలుపుచ్చు మారులేక కాలుదొక్కు
మోనమున నంతలోన మొక్కు మొక్కుమనును
యీనిజము శ్రీవేంకటేశునికిఁ గలజాడ
యే నెఱుఁగుదును ఇఁక నెంచకురే మీరు ॥ ఏఁటి ॥ 152

1. 'జెలవ చెలపనీట' కావచ్చు.
2. ఇందు దశావతారసమన్వయము కలదు.

లలిత

ఎన్నిటి కీడ్కఁ దా నెడరయినచో
కన్నియ నింతటఁ గావఁగవలదా ॥ పల్లవి ॥

కలువ వాఁడియట ఘనచంద్రుఁడట
యెలమిఁ జెలినిట్ల నేఁచేదా
బలుచుట్టముగలఫలము విరహదెస
కలసిమెలసి యిటు కావఁగవలదా ॥ ఎన్ని ॥

చందనగందెట చలువగాలియట
యిఁదునె చెలి నలయించేదా
అందపుచుట్టఁ(ట్టం?)బైనఫల మిపుడు
కందువ విట్టె కాచుట యరుదా ॥ ఎన్ని ॥

అతిశయిలకుచయట శ్రీవేంకట–
పతియట కాఁగిట భ్రమసేదా
చతురత నిరువురసరసపువేళల
అతిశయసంభ్రమ మలరుటగాక ॥ఎన్ని॥ 153

ముఖారి

ఏమి సేసితివో యింతివి। నీ–
మోము చూచి చూచి మొక్కీనదె ॥ పల్లవి ॥

చెక్కులకాంతులు చెదరఁగా
నక్కువఁ జెలి నవ్వీనదె
ముక్కున నూర్పులు మొరయఁగా
సొక్కుచు సోలుచుఁ జూచీనదె ॥ ఏమి ॥

చెమట నీపైఁ జిప్పిలఁగా
కొమరె సిగ్గునఁ గొంకీనదె
వుమురుఁగుచాలవొత్తులు
గములపయ్యదఁ గప్పీనదె ॥ఏమి॥

వాగిఁ దమకము లొలుకఁగా
చిగురుఁదేనెలు చిందీనదె
నగు శ్రీవేంకటనాయకుఁడా । నీవు
తగఁ గూడినవి తలఁచీనదె ॥ఏమి॥ 154

మాళవిగౌళ

తలఁ పొకటియు నాచేఁతయు వేరొకటియాయ
సొలసి యెగ్గులెంచేవుసుమ్మీ వోపతుఁడా ॥పల్లవి॥

సొలసినచూపునమఁ జూచేపరాకున
తొలఁత నాపలుకులే దూరీ నిన్ను
తెలిసి నీరూపు చింతించేపరాకున
వలనైనకాల నేల వ్రాసీ నీపేరు ॥తలఁ॥

బడి నీసుద్దులు వినేపరాకున నీవు రాఁగా
జడియునాతనువు మంచము దిగదు
కడువిరహపువెదఁ గాఁగేపరాకున
సిడిసి కన్నీరు నీపైఁ జిమ్మీ నాగోరు ॥తలఁ॥

వచ్చిగాఁ గూడేటినిబ్బరపుఁబరాకున
గచ్చునాకుచాలు విన్నుఁ గాఁడివారీని
మచ్చిక శ్రీవేంకటేశ మర్మపుఁబరాకున
యిచ్చ నాచెమట విన్ను నీఁదులాడించీని ॥తలఁ॥ 155

తెలుఁగుఁగాంబోది

ఎవ్వ రేమిసేతురు యెక్కడికెక్కు మామాఁట
యివ్వల విచ్చారువారి కింతేపో దోసము ॥ పల్లవి ॥

పట్టరాదు ముట్టరాదు పడఁతిచిత్తముకాఁక
పట్టరాదు నీమనసు పతివి నీవు
వొట్టినమోహ మామెకు వొలసీనొల్లమి నీకు
యిట్టేసేసినమరువి కింతేపో దోసము ॥ ఎవ్వ ॥

చెప్పరాదు చూపరాదు చెలియతమకములు
చెప్పరాదు మారుమాట చెంగట నీకు
ముప్పిరిచింత యాకెకు ముదము నీకుఁ జేసిన-
యిప్పటిపూవుటాణాల డింతేపో దోసము ॥ ఎవ్వ ॥

ముయ్యరాదు తియ్యరాదు ముదితరెప్పలచూపు
ముయ్యరాదు నీకు నీక మోవికెంపులు
నెయ్యము శ్రీవేంకటేశ నెలఁతఁ గూడి తింతలో
ఇయ్యెడ మెచ్చువివారి కింతేపో దోసము ॥ ఎవ్వ ॥ 156

రేకు 1427 శంకరాభరణం

ఏకతపువేళ మీరెవ్వరుఁ బోకురమ్మా
చీకాకునెరుఁలతో సిగ్గువడీ వాఁడే ॥ పల్లవి ॥

ముసిమి నధరపానమున మోవికెంపులు దేరి
కొసరుసంభోగముల కొప్పు జారి
వెస వీడుదోడాదేవీదెములఁ బచ్చిదేరి
వుసురుసూరుపులతో నున్నాఁడు వీఁడే ॥ ఏక ॥

చిందరవందరలైనచెమటలఁ దొప్పఁదోఁగి
కందువ గోరి గురుల కడురాఁగి
గందపుఁగుచాలచొప్పు గట్టివురమున నాఁగి
పొందినసింగారాల పొద్దువుచ్చు వాఁడే ॥ఏక॥

తెల్లనికన్నులమోముతేటలలో నోలలాడి
వెల్లవిరి నిందిరను వేడుకఁ గూడి
చల్లఁగా బండాతుకూరి జనార్దనుఁడై
యెల్లగా శ్రీవేంకటేశుఁ డిరవాయ వాఁడే ॥ఏక॥ 157

### ముఖారి

తలఁచరా దీజాగు దగ్గరి రమణుఁ డిట్టె
చెలులతోఁ జెప్పఁగానె సిగ్గువడీఁ జెలియ ॥పల్లవి॥

గుబ్బలపైఁ గప్పినట్టికోమలిపయ్యద నేఁడు
వుబ్బునఁ జల్లనిగాలి వొగిఁ దలఁగించఁగా
అబ్బురాన రమణుఁడు అది చూచి నవ్వీతేను
జిబ్బిలుఁజెమటతోడ సిగ్గువడీఁ జెలియ ॥తలఁ॥

పడఁతివలిపముపైఁ బచ్చిగా వసంతుఁడు
వడియుఁబూఁదేనెలవాన గురిపించఁగా
వెదభావములు చూచి విభుఁడు నవ్వీతేను
చిడుముడిపాటుతోడ సిగ్గువడీఁ జెలియ ॥తలఁ॥

ఇంతలో శ్రీవేంకటేశుఁ డింతిఁ గూడితే చిలుక
చెంతనే యద్దముగవిసెన చించఁగా
పంతమున నందు నీడ పతి చూచి నవ్వీతేను
చింతదేరి తలవంచి సిగ్గువడీఁ జెలియ ॥తలఁ॥ 158

### సామంతం

¹చెల్లఁగదె నీమాట చెంచెత నీకు
చెల్లుబడిగలచోటఁ జెప్పనేఁటికయ్యా ॥పల్లవి॥

చిగురుఁబయ్యద యేలే చెంచెత నీకు
చిగురు మాయడవిలో సేనాసేన
విగురుఁబసిఁడిచేల నీకేలయ్యా । మా -
పగటుమెరుపు గొంతపసిఁడి రాలె ॥చెల్లెఁ॥

చిల్లపూవుదండలేలే చెంచెత నీకు
చెల్లెఁబో మాకులమీఁద సేనాసేన
చల్లఁగా నీకుఁ దొళసిసరమేలయ్యా
యిల్లిదె మాయేటిదరి నింతా విదె ॥చెల్లెఁ॥

చేరితివిగదె నన్ను చెంచెత నీవు
చేరె నాకాఁగిటి కదె సేనాసేన
ఆరయ శ్రీవేంకటేశ అవునవునయ్యా
నీరువంక తుంగపైతి విజమరివయ్యా ॥చెల్లెఁ॥ 159

### భూపాళం

²ముద్దుగారఁగా విదె ముంగిట నిలుచున్నాఁడు
వొద్దికేఁగి చెలులెల్ల వూరడించరే ॥పల్లవి॥

వేఁకువజామున లేచి వేడుక క్రిష్ణుఁడు తల్లి
ఆఁకలయ్యీ ననుచు వొయ్యనె మంచము దిగి
కాఁకలతో వసివాడి కన్నులు పులుముకొంటా
యేఁకరుచు నున్నవాఁడు యెత్తుకోరె బిడ్డని ॥ముద్దు॥

---

1. ఇందువాకోవాక్యము
2. ఇది ఒకరక పద్యాత్మ కీర్తనయే.

బాలులతో పూరనెల్లఁ బరువులు వెట్టి వెట్టి
చాలుకొని యాడి యాడి జామెక్కఁగా వచ్చి
కేలుచాఁచి వెన్నదిగి కిందుపడీ యంతలో
బేలులై వుండఁగనేల పెట్టరే బిడ్డనికి ॥ముద్దు॥

మట్టమధ్యాన్నపువేళ మలయుచు నింటిలోనే
చట్టులపెరుగు వేఁడీ చాలఁ బెట్టరే మీరు
పట్టపుశ్రీవేంకటాద్రిపై కీలుకొనె నిదె
అట్టిట్టనక వీని నాదరించరే ॥ముద్దు॥ 160

బౌళి

బాపు బాపు మాతోనే పంతమేలోయి
చేపట్టితి వింతలోనే చెల్లునోయి ॥పల్లవి॥

నల్లఁబల్లిచెన్నుఁడా నవ్వేవు సారెసారె
ఇల్లిదె చూతువుగాని యిందు రావోయి
గొల్లదోమటాయ నేఁడు కోరి నీతో సరసాలు
చల్ల వేఁడిసేసుకొంటే చాలులేవోయి ॥బాపు॥

గోపికలవిటుఁడా కొంగువట్టే వేమోయి
యీపారి చూతువుగాని ఇందురావోఇ
మూపులు మూఁడాయ నీమొక్కినమొక్కులకెల్ల
రాపైన వుప్పగప్పురములాయనోయి ॥బాపు॥

నగు శ్రీవేంకటగిరి నల్లఁబల్లిచెన్నుఁడా
యెగసక్కెమిఁకనేల ఇందు రావోఇ
తగుఁదగు నీకు నాకు తనిసితి నిఁక నోయి
చిగురుఁజేవనుకొంటి చిత్తగించవోయి ॥బాపు॥ 161

ఆహిరి

భువిఁ దనవారిఁ బాసి పొరుగువారిఁ గూడిన
అపునా వొక్కటఁ బుట్టెనని ఇంతేకాక ॥ పల్లవి ॥

రమణివిరహవేళ రాఁపుతురుము వీడి
గములై తూలాడీఁ గన్నులపొంత
కమలపుతుమ్మెదలు గండుమీలపైవ్రాల-
నమరునా వొక్కచోటివని యింతేకాక ॥ భువిఁ ॥

చెలియచింతావేళ చిందినకన్నీటిసోన
తొలరి కుచములపైఁ దొలఁకీ నట్టె
వెలిఁ జకోరా లెనపి వెదజక్కవలవద్ద
నిలుచునా వొకజాతినేమ మింతేకాక ॥ భువిఁ ॥

కాంత రతివేళ శ్రీవేఁకటపతినెమ్మోము
దొంతియై కెమ్మోవిమీఁద దొరకె నిదె
అంత పాలచందురుఁడు అమృత మాసపడిన
యింత చెల్లునా వొకయిక్కవనికాక ॥ భువిఁ ॥ 162

రేకు 1428 శ్రీరాగం

కాంత నీవుగలచోటు కలిమిగలుగుచోటు
కాంతువి కితరమెల్లాఁ గడగడ చోటు ॥ పల్లవి ॥

సతి నీమోమెత్తుటే చంద్రోదయమౌట
అతివ నీతలవంపు అస్తమానము
మితి నీచూచినచూపే మించినసూర్యోదయము
రతి రెప్పమూయుటే యారవియస్తమానము ॥ కాంత ॥

పొలఁతి నీవు నవ్వుచే పున్నమపెనుఁబండుగ
మలసి కోపించుచే యమావసదినము
అలరి మాటాడినదే ఆమనికాలము నీవు
వొలసీవొల్లమి నుండు టుడివోవుఁగాలము ॥ కాంత ॥

యింతి నీవు గూడుచే యెన్నిక విరహవేళ
అంతలో మైమఱచుచే యానందవేళ
పంతపుశ్రీవేంకటాద్రిపతికి నీవిట్లనే
మంతనాన నుండుచే మరుజన్మవేళ ॥ కాంత ॥ 163

## ముఖారి

ఏమైన నాయఁగాక యింత చాలదా
ఆమీఁద నీవు నన్నాదరించకుందువా ॥ పల్లవి ॥

తెగి నన్నుఁ గోపించితేఁ గోపింతువుగాక
వగగా వెనక వగవక మానేవా
వెగటు చెప్పుదుమాఁట వింటే విందువుగాక
నిగుడి వనిత నీవు నిజపట్టేవా ॥ ఏమై ॥

అలిగి నీ వావలిమోమైతే నవుదువుగాక
చలివాయ మతిఁదలఁచకమానేవా
కలఁగి నీచలమిది గట్టియైతే నాయఁగాక
మెలుఁత నీదయ నాకు మెత్తనేకాదా ॥ ఏమై ॥

సొరిది చూపుల నాఁటఁజూచితేఁ జూతువుగాక
సరుస చల్లవినవ్వు చల్లకుండేవా
పరగ శ్రీవేంకటాద్రిపతివైన నన్నుఁగూడి
కరఁగితి వింతగాక గాతనేసేవా ॥ ఏమై ॥ 164

### శంకరాభరణం

[1]విక్కమమ్మ యశోద [2]వియ్యాన
అక్కడ నెవ్వరోకాక అటువంటివాఁడా ॥పల్లవి॥

వీఁడుగదె బాలుఁడు వెన్నలు దొంగిలి నేఁడు
కాఁడువో ఆదేమోసి గబ్బిగొల్లెత
చూడఁగదె నీవు సోయగపు చేతిబిడ్డు
ఆదేవు కల్లలేకాళ అటువంటివాఁడా ॥విక్క॥

చిక్కెఁగదె మీవాఁడే చేరి పెరుగుదొంగ
[3]పొక్కాలదేమోసి బొంకుగొల్లెత
పుక్కిట విదిగదె పొంగినట్టిమీఁగడలు
అక్కటా నీభ్రమలింతే అటువఁటివాఁడా ॥విక్క॥

యిదివో శ్రీవేంకటేశుఁ డింతేసి సేసినాఁడు
పదవే నీవేమనేవు బద్దుగొల్లెత
అదివో నీమాఁటలైతే అన్నియుఁ జెల్లెనమ్మ
అదనాయ మీకు నాడ నటువంటివాఁడా ॥విక్క॥ 165

### భైరవి

చెప్పరాదు చూపరాదు చెలియమోహము నేఁడు
వుప్పటించి దూరీ పతి కొప్పగించవె ॥పల్లవి॥

తలఁ పెంతవేఁదోకావి తరుణిమైకాఁకలైతే
వెలి నంటరాదు చేత విరహవేళ
వల పెంత చిక్కోకాని వాలినయీనెరులైతే
కలగలపైన చిక్కు కడగానరాదు ॥చెప్ప॥

---

1. ఇది సంవాదము. 2. నీ + ఆన. వింతత్రికసంధి 3. 'పొకాలు' కు వ్యావహారికమా?

కోరికలెన్నోకాని గుబురు(బులకలైతే
యేరి యెంచరా దెవ్వరి కీవేళను
నీరసమై గుండె యెంత నీరాయనోకాని
యేరులచెమటలైతే నెడతెగవు ॥ చెప్ప ॥

యెంత అలయికోకాని యీ యింతియధరమైతే
వంతుల నప్పుదే కదువసివాడెను
రంతుల శ్రీవేంకటేశురతి యెంత నిబ్బరమో
చెంతల నీవేళ నూర్పు చిమ్మిరే(గెను ॥ చెప్ప ॥ 166

## కాం(డమలహరి

తరవాతిపనులెల్లా( దానే యెఱు(గు
సిరులవిభుని కిట్టె చెప్పరే చెలులు ॥ పల్లవి ॥

మనసులోపలిచింత మాటలకు గుఱిగాదు
తనివోవితమకాలే తామే యెఱు(గు
తనువులోపలికా(క తచ్చిచూప గుఱిగాదు
మునుపువెనకల నామోహమే యెఱు(గు ॥ తర ॥

కన్నులచూపులయాన గట్టిసేయ గురిగాదు
కన్నెలాల నాకోరికలే యెఱు(గు
పన్నినజవ్వన మిది పట్టిచూప గురిగాదు
వెన్నెలవంటినావివ్వేరగే యెఱు(గు ॥ తర ॥

వాదిన నామోవితేనె వారవట్టగురిగాదు
సూదువట్టినట్టిపలుసో(కు లెఱు(గు
యీడనె శ్రీవేంకటేశు( డిట్టె విచ్చేసి నన్ను
కూడినకూటమి మేనిగుఱుతులే యెఱు(గు ॥ తర ॥ 167

దేవగాంధారి

[1] ఒక్కరీతినే వుండరా నీకు
మొక్కేను నాతో మొఱఁగకురా ॥ పల్లవి ॥

బెళకులమాటలు పెంచకురా । నేఁ
దెలిసిన నటు తలదియ్యకురా
ములుచెనకులకే ములుగకురా
నలుగడ వికవిక నవ్వకురా ॥ ఒక్క ॥

బిరుదునఁ బెచ్చులు పెరుగకురా । కదు-
బరవగుబతి మిటు పట్టకురా
తిరుగులఁ బగ సాదించకురా
యెరవులకాంతల నేఁచకురా ॥ ఒక్క ॥

వేగమె సిగ్గులు విడువకురా
వాగులకలికివి భళిభళిరా
యీగతి శ్రీవేంకటేశ్వరుఁడా నను
బోగించి కూడితివి పొందాయరా ॥ ఒక్క ॥ 168

రేకు 1429 సాళంగం

చాలుఁజాలు నిన్నింత జరయనేల
నీలాగులెల్లఁ గంటిమి నీవు నీవేకావా ॥ పల్లవి ॥

వంకదిద్ద వసమా వాఁటపుయేరులకెల్ల
అంకెల నీగుణములు అట్టివెకావా
లంకెఁబెట్టవశమా లావున మేఘములను
ఇంకనేల నీమనసు ఇట్టిదేకాదా ॥ చాలుఁ ॥

---

1. ఇందు దశావతారవర్ణన గలదు.

కట్టిపెట్టవశమా గాలి ముడియగాఁగ
　వొట్టివసీమోహమును నట్టిదేకాదా
　కట్టుకొవవశమా కానరానిపట్టుచీర
　వట్టినీవినయములు వలసినవేకావా ॥ చాలుఁ ॥

లెక్కపెట్టవశమా లీలతోడఁ జుక్కలెల్ల
　యిక్కడ నారతు లిట్టివేకావా
　గక్కన శ్రీవేంకటేశ కలసితి విట్టె నన్ను
　చక్కవిసరన మీఁక సమ్మతేకాదా ॥ చాలుఁ ॥ 169

నాదరామక్రియ

ఇంతిసింగారము నేఁడు యెట్టున్నది
　కంతునిదీపము రూపై కలిగినట్లాయ ॥ పల్లవి ॥

విప్పటిల్లుతురుములో నెలఁతముడిచినట్టి-
　యివ్వలఁ గమ్మవిరు లెట్టున్నవి
　పువ్వుఁదేనె లంటిరాఁగా పువ్వులెల్ల తుమ్మెదల
　అవ్వల వెంటనే వచ్చి ఆవినట్లాయ ॥ ఇంతి ॥

కందువకుచములపై కామిని వూసినయట్టి-
　యిందులో గందపుఁబూత లెట్టున్నవి
　చందురునివెన్నెలలు జక్కవలు సారె దాఁగ
　అందుకే వెన్నెలలెల్ల ఆవినయట్లాయు ॥ ఇంతి ॥

శ్రీవేంకటేశ్వరుఁడు చెలిఁగూడేరతివేళ
　యీవల మోవిగుఱుతు లెట్లున్నవి
　దేవుఁ డితనికిమీఁదె త్తినయమృతముకోవి
　వేవేలుముద్రలు పయివేసినయట్లాయు ॥ ఇంతి ॥ 170

సామంతం

నయగారిసటకాఁడ నారసింహా నీ-
ప్రియమెల్లాఁ గంటి వింటి పెనునారసింహా ॥ పల్లవి ॥

వేరేమారురూపై వెలసే వింతిమాటున
చేరి యేమిసేసితివో శ్రీనారసింహా
సారె నోరు దెరచేవు సతితమ్ములము నీకుఁ
గారమై తోఁచెనోకాక ఘననారసింహా ॥ నయ ॥

తీగెనవ్వు నవ్వేవు తెరవ నీమర్మమెత్తి
చేగదేర నేమనెనో శ్రీనారసింహా
వేగమే చెమరించేవు వెలఁదిదగ్గరనుండి
యేగతిఁ గళలంటెనో యిటు నారసింహా ॥ నయ ॥

అంతలోనే బుసకొట్టే వంగనకాఁగిట నీవు
చెంత నెట్టు గూడితివో శ్రీనారసింహా
దొంతిగా శ్రీవేంకటాద్రిఁ దొడ నిఁ(విం?)తిఁ బెట్టుకొంటి
పంతమిచ్చితి అవుభళనారసింహా ॥ నయ ॥ 171

బౌళిరామక్రియ

అట్టెకాదా మరి అవునయ్యా నీ-
పుట్టుగెల్ల విట్టె పోపోవయ్యా ॥ పల్లవి ॥

వుద్దండాన నీవే వొగిఁ గాలుదొక్కి-
గద్దించేవు నీవే కానీవయ్యా
అద్దలించఁగానే ఆయము లంటేవు
పొద్దువోదో నీకు పోపోవయ్యా ॥ అట్టె ॥

దాకొని నీకొంగు దాఁకించి నీవే
మేకొని తిట్టేవు మేలయ్యా
పూఁకొనకుండిన వొట్టిమాఁటాడేవు
బూకలింతేశేల పోపోవయ్యా ॥ అట్టె ॥

కందువల నీవే కాఁగిలించిపట్టి
యిందులోనే జంకించే వేమయ్యా
చిందేటినవ్వుల శ్రీవేంకటేశుఁడ
పొందితివి నన్నుఁ బోపోవయ్యా ॥ అట్టె ॥ 172

## హిందోళవసంతం

తొయ్యలి వెంగెములాడ దోసమునుమ్మీ
చయ్యన నీతో నింత చాలదా యేమీ ॥ పల్లవి ॥

యిద్దరిలో నీకు మోహ మిచ్చితిఁజుమ్మీ । అవురా
కద్దు కద్దు నీమాఁట కల్లలా యేమీ
పెద్దగా నీపై నానవెట్టేఁజుమ్మీ । అంత
వద్దూవద్దు నీ వట్టివాఁడవా యేమీ ॥ తొయ్య ॥

ఆఁడిఁ గానక నీకే యంపితిఁజుమ్మీ
మీఁటి యె(యం?)తపేసేది మేలుదా యేమి
జాఁటిననీపై వలపు చల్లితిఁజుమ్మీ । నీకుఁ
బాటిపాటి నాతోనే పంతమా యేమీ ॥ తొయ్య ॥

మించినశ్రీవేంకటాద్రిమేఁటి నేఁ జుమ్మీ । యింత-
వంచనతో నాకుఁ జెప్పవలెనా యేమి
అంచెలఁ గూడితి నన్ను నప్పుదేసుమ్మీ । యివె
పొంచిపొంచి చెప్పేవు పొద్దువోదా యేమి ॥ తొయ్య ॥ 173

సామంతం

చేసినదే చేఁతా చెల్లుబడిగలచోట
నేసకొవ్వువిభుఁడ నీచిత్తమింతే ఇఁకను ॥పల్లవి॥

విన్నదే వివికి వివేకించినచోట
కన్నదే కానుపు మరి గలయుచోట
వున్నదే వునికి వోపికెగలుగుచోట
చెన్నగువిభుఁడ నీచిత్త మింతే యిఁకను ॥చేసి॥

ఆడినదే మాట ఆయమెఱిఁగినచోట
కూడినదే కూటమి చేకొనుచోటను
వేడుకలే వేఁటవీడుదోడాడేచోట
జేడుమోహపువిభుఁడ చిత్తమిఁతే యిఁకను ॥చేసి॥

యెంచినదే యేలిక(యెన్నిక?) ఏవి యెగ్గుతప్పులేవిచోట
సించినదే మోహము నీనాచోట
యెంచఁగల శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
చెంచెత నింతే నీచిత్త మింతే యిఁకను ॥చేసి॥ 174

రేకు 1430 లలిత

[1] ఓ పోటాలకి నాతో నోపుదువటె
చేపట్టు జలధి దాఁట చిన్నివోడేకాదా ॥పల్లవి॥

పువ్వుగాని పిందెగావి పూఁపవయసుపడుచ
యివ్వల నన్నుఁ జెనకే వేలే నీవు
పువ్వులపూఁపలే కావా పొదలిఫలించేవి
చివ్వల వోరమణుఁడ చెల్లదటయ్యా ॥ఓపో॥

1. ఇది సంవాదాత్మకము.

నల్లగాని తెల్లగాని నాఁటుఁజూపులవడుచ
యెల్లచూపి మాఁటలాడేవేలే నాతో
నల్లదెల్లలే కావా నడురేయి పగలయి
చిల్లరేలెండలయ్యీ చింతించవయ్యా ॥ ఓహో ॥

తగ్గులేవి మొగ్గలేవి తమకపుకాఁగిటను
యెగ్గుసిగ్గు లేక కూడేవేమే నన్ను
తగ్గుమొగ్గులేవియట్టిదై వపుశ్రీవేంకటేశ
అగ్గమైతి పంతవిచ్చి ఆడనేఁటికయ్యా ॥ ఓహో ॥ 175

రామక్రియ

అదియే కాదా సతత మాతనికి తన కిపుడు
పదియవస్థలఁ బొంగి భ్రమనేఁగాక ॥ పల్లవి ॥

పతిఁ బాసి విరహమున పానుపే పామనుచు
అతివ యల్లన లేచి అవలి కేఁగె
సతి యంతలోఁ గొలన జలకేలి కేఁగి యది
మతిఁ బొంగుజలధనుచు మారుమో మిడియ(యె?) ॥ అది ॥

తరుణి తామరయిల్లు తపనమండలమనుచు
అరమరచి కాఁకలనె యలసె నదివో
మరిగి మట్టెలరవము మంత్రశాస్త్రం బనుచు
వెరవెడలి తనలోనె వెరగందె నదివో ॥ అది ॥

చెలియ దనకుచగిరులు శ్రీవేంకటాచలపు—
విలువుశిఖరములనుచు నిధుల నిలిచె
వలచి శ్రీవేంకటేశ్వరుఁ డపుడు గూడఁగా
తలఁపులును దనువులును తారుకాణాయ ॥ అది ॥ 176

## ముఖారి

పలుకులకొలఁదే కాక పంత మేఁటికి మాను
చెలువునిఁ గలయుమంతమే చింతించరాదా ॥ పల్లవి ॥

కలికితమకముకొలఁదే ఘనమైనచెమట లివి
అలుకలకొలఁదివే అసురుసురులు
చలములకొలఁదివే సరిలేనిచింతలును
యెలమి విందుకు నీవు యేల విసిగేవే ॥ పలు ॥

కోపముకొలఁదివే కొనల కనుకెంపు లివి
రాఁపులకొలఁదివే రతికాఁకలు
చూపులకొలఁదివే సొఁ(సొం?)పైనకాంక్ష । లివి
కోపు లిందుకు నీవు గొణఁగుకొన నేలే ॥ పలు ॥

కూటములకొలఁదివే గుజ్జరైనపులక లివి
నీటులకొలఁదులే నివ్వెరగులు
చాటి శ్రీవేంకటేశ్వరుఁ గలసితివి నేఁడు
యేఁటికిఁక పలుబుద్ధు లెంచుకొననేలే ॥ పలు ॥ 177

## ముఖారి

ఇంతకంటె నెవ్వరికి నెచ్చరాదు కుందరాదు
వంతలఁదగరై తాఁకవచ్చునటవయ్యా ॥ పల్లవి ॥

వోఁగునూతులాభశేశ వొద్దికి నీచెలి దాసె
సాగినసభలలోన చలివాసె
రేఁగినకోపము మానె రేయే పగలు సేసె
చేఁగల నీకేమి సేసు చెప్పఁగదవయ్యా ॥ ఇంత ॥

నారసింహ కాలుఁదొక్కె నాతి నీకుఁ జేత మొక్కె
గారవపుమోహము అఁ(అం?) గన చొక్కె
సారెకు నీచెక్కునొక్కె జారినకురులు చెక్కె
చేరి యేమిసేసు నిఁక చెప్పఁగదవయ్యా ॥ ఇంత ॥

శ్రీవేంకటేశ ముఁ(ముం?)దె శ్రీసతి నీకాఁగి లొందె
భావజురతులలోన ఫల మందె
పూవులలోవిపిందె పొదమినట్టు పొందె
సేవ లింక నేమిసేసుఁ జెప్పఁగదవయ్యా ॥ ఇంత ॥ 178

## పాడి

వలచినదానఁగాన వడి నే లోనైతిఁగాక
అలుగఁ దగదా నీతో నలుగలేఁగాక ॥ పల్లవి ॥

అడనుండి యెడమాఁట లాడించినప్పుడే నిన్నుఁ
గూడకుండఁదగదా నేఁ గూడితిఁగాక
మేడపై నెవ్వతెతోనో మేలఁమాడఁగా నిన్నుఁ
జూడకుండఁదగదా నేఁ జూచితిఁగాక ॥ వల ॥

తలఁచినవప్పుడే రాక తడసినప్పుడే నిన్ను
పిలువకుండఁ దగదా నేఁ బిలుతుఁగాక
బలిమి నావొద్దనుండి బహూపరాకైనప్పుడే
[1]కం(కలి?)యకుండఁదగదా నేఁ గలసితిఁగాక ॥ వల ॥

మిగుల నన్నుఁ గూడి మేనుమఱచినప్పుడే
నగకుండఁదగదా నే నగితిఁగాక
చిగురుమేవితుమ్మలూరిచెన్నుఁడా శ్రీవేంకటేశ
తగఁ బంతమిచ్చితే (తే నే?) దక్కె మెచ్చితిఁగాక॥ వల ॥179

1. ప్రాసభంగము.

కాంబోది

నావలెఁ గావు నీవు నటనఁ బరాకే నీకు
భావజుఁ దేకాంగి గాన పలుదొమ్మి కోపఁడో ॥ పల్లవి ॥

వాకై నీయింటికి నేవత్తుగాని నీవు రావు
యేకమనములు గావు ఇది యేమొకో
మూకల మరునియమ్ము ముందు నన్ను నాఁటి విన్నుఁ
గైకొని వెనక నాఁటఁ గదుమొద్ద(ద్దు?)వాయనో ॥ నావ ॥

నేనే తమకిఁతుఁ గాని నీవు తమకించవేర
పూవికె లొక్కటి గావు బుద్ధి యేదాకో
మోనమున మరుకాఁక ముందు నన్నుఁ దాఁకి నిన్నుఁ
దానకమై సోఁకి యంతటఁ జల్లనారెనో ॥ నావ ॥

కిట్టి నేనే ను(యు?)పరతికిని బోతిఁగాక నీవు
పట్టి నాకివ్నిటాఁ గిందుపడితి విదె
యిట్టె శ్రీవేంకటేశ యెదుట మరుఁడు నన్ను
నెట్టనఁ గరుణఁ జూచి విన్ను మరి చూచెనో ॥ నావ ॥ 180

రేకు 1431 లలిత

పచ్చినేయ వనమా పదఁతుఅభావ మిది
గచ్చుల మదనగతి గరఁగుటగాక ॥ పల్లవి ॥

వంక దిద్దవనమా వనిత నీకురు లవి
అంకెల సింగారమాయవనుటగాక
మంకు దీర్చవనమా మది ఇంచుకుచముల
పొంకపుఁ[1] గటూరమే పొగడుతగాక ॥ పచ్చి ॥

---

1. "కఠోర" శబ్దభవము కావచ్చు.

సాదుసేయవనమా చంచలపుఁగనుచూపు
    [2]మేదకాన మేలనుచు మెచ్చుటగాక
భేదించవనమా బెడిదపునీపిఱుఁదు
    సోదించరాక లోలోఁ జొక్కుటింతేకాక ॥ పచ్చి ॥

చవులెంచవనమా జవ్వని నీయధరము
    వివరించి పలుముద్ర వేయుటగాక
నవమై శ్రీవేంకటాద్రి నాదుఁ(థుఁ?)డగనక విను
    కవగూడితివి యిదె కాణాచిగాక ॥ పచ్చి ॥ 181

## శంకరాభరణం-ఏకతాళి

కంటి రా నీగుణమెల్ల కడగడనే
    పంటమోవితేనెకాఁడ పాలగిరిరాయఁడా ॥ పల్లవి ॥

విన్ననే వూఁకొంటిరా నేఁడు నీమాఁటలకు
    వున్నవెల్ల మాని యిఁక నూరకుండరా
వెన్నవంటిమన సింతే వెత కోపరా
    పన్ని నమాయలకాఁడ పాలగిరిరాయఁడా ॥ కంటి ॥

ఇప్పుడే మెచ్చితిరా నీఇటమీఁదిచేఁతలకు
    చెప్పనేల విచ్చివిచ్చి సిగ్గులయ్యీరా
కొప్పు జారెఁ గోరికకు గురిలేదురా
    పప్పులాయ దాలిమెల్ల పాలగిరిరాయఁడా ॥ కంటి ॥

అంతలో మఱచితిరా ఆయము నీవంటేవని
    సఁ(సం?)తమైతి నీకాఁగిట చాలుఁజాలురా
యింతటిజాణఁడ నీకు ఇటు మొక్కేరా
    పంతపుశ్రీవేంకటాద్రి పాలగిరిరాయఁడా ॥ కంటి ॥ 182

---

2. "మేదకుడు" శబ్దమునకు భావార్థకముకావచ్చును. తెలిసీ తెలియని తనము' అని అర్థము.

### పాడి

ఒకటి కొకటికిని వొరపాయ। యీ—
వెకలిజవ్వనము వి(వి?)తైనట్లు ॥ పల్లవి॥

సతితురుములోవిశామంతివిరులు
రతిసమయంబున రాలఁగను
తతిఁ జెమటవాన తగఁ గురియుటకును
గతిఁ జిలుకలాడుగరిమెలు దోఁచె ॥ ఒక ॥

రమణికుచంబులు రతిబందం(ధం?)బున
క్రమమున సారెకుఁ గదలఁగను
కమలపుమొగ్గలు కంతుసమరమున
జమళి నదరుసూచనవిధమాయ ॥ ఒక ॥

పొలఁతిమేనిపైఁ బూసినగంధము
కలయికఁ గరఁగుచుఁ గారఁగను
యెలమి శ్రీవేంకటేశుమోహరన-
మొలుగులు వారుచు నుండినరీతి ॥ ఒక ॥ 183

### కాంబోది

చాలదా నాకింత నిన్ను సరి గన్నులఁ జూచేది
వేళవచ్చినఁ దామెర విరియక మానునా ॥ పల్లవి ॥

అలిగి నీవవ్వలిమోమైనా వవుదువుగాక
తలఁపు నామీఁదనే తగులుగాదా
మొలచి రత్నదీప మేమొకమై తామండినాను
వెలుఁగు ఇంటిలోనెల్ల వెలయకుండీనా ॥ చాల ॥

యెమ్మెల నీ విటు నన్ను నెంతవొల్లకుండినాను
దిమ్మల నీసతివనే తేజము లేదా
కమ్మర కళిఁ గొన్నాళ్లు కళలుదీసివుండినా
నెమ్మది మరికొన్నాళ్లు విందకుండీనా ॥ చాల ॥

పట్టినచలము మాని పంతము నాకిత్తుగాక
ముట్టి నేను గతిగూడ మొక్కకుండేనా
గట్టున శ్రీవేంకటేశ కూడితివి నన్ను విట్టె
పుట్టినపూవున బిందె పొదమకుండీనా ॥ చాల ॥ 184

## మేఁచబౌళి

[1] వెదకరే చెలులాల పీదిపీదులను పీవి
కదిసి ముద్దాడినదాఁకాఁ గలఁగీఁ జిత్తము ॥ పల్లవి ॥

యేకడ మాటలాడీనో యింతక నేఁ డింట నుఁ(నుం?)చే
అక్కరతోఁ బదిమారు లారగించును
చొక్కపుఁగృష్ణుఁడు యెందుఁ జూచీనో వినోదాలు
చిక్క[2]పుఁగచ్చకాయలు చేతనే మీటుచును ॥ వెద ॥

యెవ్వరెత్తుకున్నవారో, ఇంతక ముంగిట నుంచే
చివ్వన నగుచు నాచేయి వట్టును
నివ్వటిల్లుఁగృష్ణుఁ డెందు నేఁడు పరాకైనాఁడో
ఇవ్వల నుంచేఁ గన్నవెల్లా నడుగును ॥ వెద ॥

యెంత సంతసమైనదో ఇండ్లిండ్ల వెన్నలు దివి
రంతుతోఁ బడుచులతో రాయడించఁడు
ఇ(ఇం?)తలో శ్రీవేంకటేశుఁ డెదురుగావచ్చి తన్ను
మంతనానఁ గాఁగిలించి మాయ చూపెను ॥ వెద ॥ 185

1. ఇందు మాతృవాత్సల్యము ఉట్టిపడుచున్నది. 2. అరసున్నవిచార్యము.

సాళంగం

నీకు వలయుపనికి నీవే వెతకి వచ్చితి
శ్రీకాంతుఁడవు ఇట్టె చేకొనవే నన్నును ॥ పల్లవి ॥

విన్నుఁ బాసి లంకలోన నెయ్యపుసీతాదేవి
పన్ని విరహాన దపము సేయఁగా
వున్నతపుఁగొండలచే వూరక జలధిఁగట్టి
చెన్నగురావణుఁ జంపి చేకొనవా ఆకెను ॥ నీకు ॥

నీవే కావలెనని విన్నుఁగోరి రుకుమిణి
తోవలఁ బెండ్లికి నెదురుచూడఁగా
దావతితో నంతలోనే ద్వారకనుండి వచ్చి
చేవల దుష్టులఁ జంపి చేకొనవా ఆకెను ॥ నీకు ॥

పాయపురమాదేవి పాలజలధినుండి
కాయజకేలికి నినుఁ గనుగొనఁగా
యీయెడ శ్రీవేంకటేశ యిందుకే జలధి దచ్చి
చేయిచ్చి వుర మెక్కించితివిగా యాకెను ॥ నీకు ॥ 186

రేకు 1432 రామక్రియ

నీకు నిచ్చకమాడ నేర్తుఁగాక। యిట్లఁ
గాక నీ కెదురాడఁగలనా నేను ॥ పల్లవి ॥

చలివిడిచి నాయకుని సాదించుఁ గడు నొకతె
అలరి తను నెడసితే నలుగు నొకతె
వాలసి నొల్లమియైన వొగిఁ గోపగించు నొకతె
విలిచి ఇంతటిపనికి నేర్తునా నేను ॥ నీకు ॥

సరవిఁదప్పక విభుని జంకించఁ గడు నొకతె
సరసంబులాడితే జఱయు నొకతె
వరుస వంతెదలినను వాదించు మరి యొకతె
పరగ నింతేసి కొదఁబడుదునా నేను ॥ నీకు ॥

అంకపురతులలోన నలయించఁ బతి నొకతె
మంకుమర్మపుఁగళల మఱచు నొకతె
ఇంకేల శ్రీవేంకటేశ కూడితివి నను
వుంకువల వెనకఁ దడవుదునా నేను ॥ నీకు ॥ 187

## ఆహిరి

మాఁటలేల మనసుకు మనసే సాక్షి
యేఁటికిఁ బరాకు సేసే వింతిఁ గావవయ్యా ॥ పల్లవి ॥

కామివితాపమునకుఁ గప్పినపయ్యద సాక్షి
చేమిరిచింతకు చెక్కుచేయే సాక్షి
వాములవూరుపులకు వాడినమోవే సాక్షి
యేమరిపాటు విచ్చేసి ఇంతిఁ జూడవయ్యా ॥ మాఁట ॥

వడియుఁగన్నీటికివి వట్టువగుబ్బలే సాక్షి
తడుపుఁజెమటలకు తనువే సాక్షి
చిడుముడియలకకు చెదరుఁగురులే సాక్షి
యెడసేయక విచ్చేసి ఇంతిఁ గావవయ్యా ॥ మాఁట ॥

నీ కెదురుచూచుటకు నిట్టచూపులే సాక్షి
పైకొన్నయవస్థలకు పానుపులే సాక్షి
చేకొని శ్రీవేంకటేశ చేరి కూడితి వింతట
యాకడ విట్టే కరుణ నింతిఁ జూడవయ్యా ॥ మాఁట ॥ 188

### ముఖారి

కన్నచోటఁ బ్రియమెల్లఁ గార్యవశమె
యెన్నిచూచినా విభుఁడ ఇంతేపో వలపు ॥పల్లవి॥

యేయెడ వేరొకచోట ఇతవైనమనసుంటే
కాయికపువలపులు గడతేరవు
చాయలసన్నలమాట సరియైనమోహమైతే
ఆయములు సరిదాఁకు నంతేపో వలపు ॥కన్న॥

వినుకలివిరహాన వేగిరపుఁదమితోడ
కనుకలి గన్నమీఁదఁ గడతేరదు
కనుకలివినుకలి గట్టియైనకూరిమైతే
యెనసి యెప్పుడుఁ బాయ దింతేపో వలపు ॥కన్న॥

యెప్పుడు నెగ్గులుదప్పు లెంచరానికూటమైతే
చెప్పుడువారిబుద్ధి చెవి దూరదు
యిప్పుడె శ్రీవేంకటేశ యిటు గూడితివి నన్ను
అప్పుడే దక్కితివి నీ వంతేపో వలపు ॥కన్న॥ 189

### శంకరాభరణం

అవియేపో నేఁడు మాతో నంటిసేసేతపములు
వివరించుకొవి యిట్టె విచ్చేయుమనవే ॥పల్లవి॥

కొండలకొట్టగొనల గోరమైనతపములు
పండుఁబలములలోవి పచ్చిమేఁతలు
గుండెదాఁకేమంత్రాల కుత్తికలో జపములు
దండకారు(ర?)ణ్యాన నాఁడు తాఁ జేసెఁగా ॥అవి॥

యేరులలోమునుకలు యెక్కువఆచారాలు
ఆరితిమోనముతోడియానందాలు
కోరికోరి చలివేఁడి కోటికోటినేమాలు
చేరి యీరీతిఁ దపాలు సేసినాఁడుగా ॥ అవి ॥

సమ్మతించఁజేసినయాసనభేదబంధాలు
వుమ్మడి యన్యోన్యపుయోగాలు
దొమ్మి శ్రీవేంకటపతి తొల్లి సేసె నట్లనె
రమ్మని నేఁడును నారతిఁ జేసెఁగా ॥ అవి ॥ 190

నాదరామక్రియ

పొలఁతిదేహమే భూమండలమై
కలకాలంబునుఁ గాణాచాయ ॥ పల్లవి ॥

కొమ్మకుచంబులకులపర్వతములు
నెమ్మదిఁ గలుగఁగ నేఁ డిదివో
పమ్మిన జవ్వనభారము మోవఁగ
తమ్మివదన కాధారంబాయ ॥ పొలఁ ॥

కాంతగమనముల ఘనదిగ్గజములు
కంతునిబలమై కలుగఁగను
పంతమున పిఱుఁదుభారము మోవఁగ
యింతినటనలకు నిది గతియాయ ॥ పొలఁ ॥

చెలియారనియెడిశేషుఁడు గలుగఁగ
అలతురుముభార మానె నిదె
వెలయఁ గూడె శ్రీవేంకటపతి యీ-
కలికివి యిదియే కదుఁగతలాయ ॥ పొలఁ ॥ 191

ముఖారి

[1] మాతో నేఁటికి నేను మగువ నింతే। నీ-
చేఁతలెల్ల యేడనైనాఁ జేయవయ్యా ॥పల్లవి॥

జలధి యీఁదేచోట, శైలము మోచేచోట
పొలసి నీబలిమెల్లఁ జూపవయ్యా
యిల దవ్వఁబోషచోట, హిరణ్యునిఁ జంపుచోట
పలుకుఁబంతాలెల్లఁ బచరించవయ్యా ॥మాతో॥

నీవు మిన్నందేచోట, నెత్తుటఁ దోఁగేచోట
సోవల నీమురిపేలు చూపవయ్యా
దీవుల కేఁగేచోట, తెగి వెన్న దినుచోట
చేవదేర మాయలెల్లాఁ జేయవయ్యా ॥మాతో॥

సిగ్గులుదేరుచోట, చెంతలఁ బారేచోట
యెగ్గులుదప్పులఁ బోయి యెంచవయ్యా
అగ్గమైతి శ్రీవేంకటాధిప నన్నుఁ గూడి
వెగ్గళపుకపటాలు విడువవయ్యా ॥మాతో॥ 192

రేకు 1433 పాడి

పతిఁ బెడఁబాసినఫల మిదివో
అతివకు ద్రిష్టాంతమైనరీతి ॥పల్లవి॥

కన్నులఁబెట్టినకాటుకరసములు
కన్నెకు విరుదెనఁ గమ్మీవిదె
పున్నమచంద్రుఁడు పొరిఁ దనలోపల-
నున్నకందు వెలిమమిసినరీతి ॥పతి॥

1. ఇందు దశావతారవర్ణన స్పష్టమే.

గురుకుచములపై కుంకుమచెమటలఁ
　గరఁగి యిరుదెసలఁ గారె విదె
సరి జక్కవలటు చంద్రోదయమున-
　నొరలినవిరహం బుమిసినరీతి ॥ పతి ॥

శ్రీవేంకటపతి చెలి విటు గలయఁగ
　మోవితేవియలు మొనపె విదె
చేవదేరుమరుచిగురుబాణమటు
　వోవల నామురె వుమిసినరీతి ॥ పతి ॥ 193

వరాళి

మీకు మీకే కానవచ్చు మిన్నులపై మెఱుఁగులు
　మాకు నెట్టు దెలుసు మీమనసులమాయలు ॥ పల్లవి ॥

యేమిటికే చెలియ నీ వితఁడు యెదురెదుర
　మోము మోము వంచితిరి ముసిముసిసిగ్గులతో
తామెరకుఁ దామరే ధరఁ జంద్రుఁ డాయనో మీ-
　మోముటద్దములలోవి మొరఁగులు గంటిరో ॥ మీకు ॥

యేపవికే మగువ మీరిద్దరూను మీలోన
　చూపుఁజూపు సరిఁదాఁకె సొంపుల చొక్కితిరి
యేపుఁగలువల కవె యిటు తామెరలాయనో
　మేపుమీనములు జఁట్టె(జంటై?) మేఁతలు మఱచెనో ॥ మీకు ॥

యెక్కడివే వవిత మీకిద్దరికెమ్మోవులందు
　చుక్కలుఁజుక్కలే సురపొన్నలై పూచె
వొక్కటై శ్రీవేంకటేశుఁ దొద్దికైనలెక్కలో
　చక్కనిరతుల మీరు సరిబేశాడితిరో ॥ మీకు ॥ 194

## ముఖారి

చక్కనిమానివి నీసరి యెవ్వరే
యెక్కువైననీభావ మెంచిచూడవసమా ॥ పల్లవి ॥

కోమలి నీకుచములకొండలకొనలపొంత
వోముచు మించి నిలిచె నొకసింహము
కాముఁడు జఘనమనేకట్టు బండిమీఁదఁ బెట్టి
దీమముతో వేటలాడీఁ దెరిచూడవసమా ॥ చక్క ॥

పదఁతి లేఁజిగురులపాదపుటడవిలోన
వదపుల [1] యేనుగలు నటియించఁగా
తొదలరటికంబాలతోఁ గట్టి దీములుగా
బడిబడి వేటలాడీ భావించవసమా ॥ చక్క ॥

అంగనముఖమనేటిఅంబుజాకరముపొంత
ముంగిటఁజూపులలేళ్లు మోహరించఁగా
కఁ(కం?)గవిశ్రీవేంకటేశుకాఁగిటిభావానఁ గట్టి
చెంగటనే వేటలాడీఁ జిత్తగించవసమా ॥ చక్క ॥ 195

## దేసాళం

అరజమేల సేసే వట్టే కాదా
యేరా ముందటిపొందు లిట్టే గాదా ॥ పల్లవి ॥

కన్నులసన్నలు గొంత కమ్మటినావలు గొంత
అన్నిటా నీవే జాణఁడ వట్టే కాదా
పన్ని వినయాలు గొంత బలిమిచేఁతలు గొంత
యెన్నికాయ నీతగవు యిట్టేకాదా ॥ అర ॥

1. 'ఏనుఁగ' కావచ్చు.

ముసిముసినవ్వు గొంత ముంగిటనే జోలి గొంత
అసుదా నే నీకింత ఆట్టే కాదా
అసురుసురులు గొంత ఆయము లంటేది గొంత
యిసుమంతపనికిఁగా విట్టేకాదా ॥ అర ॥

మోవి యానేది గొంత ముంటిపోట్లనుఁ గొంత
[1]అవటమాయ నీకు నట్టే కాదా
శ్రీవేంకటేశ నన్ను సేసవెట్టి కూడితివి
యేవేళ నీమోహ మిట్టేకాదా ॥ అర ॥ 196

నాగగాంధారి

విపరీతము లివి వినరాదు
వుపమలెల్ల మీవొద్దనె కలిగె ॥ పల్లవి ॥

వువిదవదనచంద్రోదయవేళను
రవియగుసూర్యప్రభ నీవేఁగఁగ
యివల నవల మీయిద్దరివలననే
దివమును రాతిరి దెలియఁగఁ గలిగె ॥ విప ॥

అంగనతురుముమహర్ని(హావి?)శివేళను
రంగగు సూర్యప్రభ నీవేఁగఁగ
సంగడి వెలుఁగును సరిఁ జీఁకటియును
చెంగట మీయందే చెప్పఁగఁ గలిగె ॥ విప ॥

కాంతమోవి చుక్కల(లు?) విందువేళ
రంతుల సూర్యప్రభ నీవేఁగఁగ
యింతట శ్రీవేంకటేశ్వర మీయందే
కాంతులుఁ గళలునుఁ గలయుట గలిగె ॥ విప ॥ 197

1. అవటము = 'పొందిక' అని వా. ని. అవటము = పరిహాసము, ఎగతాళి. ఇత్యాదిగ మాండలికవ్యవహారము.

నాదరామక్రియ

[1] ఏమమ్మ మగువా నీ వింతనేతురా
తామసించనేఁటి కిఁక దయఁజూడవమ్మా ॥ పల్లవి ॥

తగిలి తప్పకచూచు తలవంచు నంతలోనే
విగిడి చింతారతి నేలదవ్వును
మగువ నిన్నిటువాసి మానుపడి వూరకుండు
అగడాయ నీపతి నదె చూడవమ్మా ॥ ఏమ ॥

దీవతతోఁ జిన్నఁబోవు తెగువలే తలపోయు
తానే యేకతాననుండి తమకించును
మోమునఁ దెల్లఁబారు మోహించిన విరహాన
మానిని నీవే విచ్చేసి మరి చూడవమ్మా ॥ ఏమ ॥

కొచ్చినకాఁకలచేఁ బై కొంగువేయనెఱఁగఁడు
మెచ్చుగ మెట్టినచోటే మెట్టి భ్రమయు
అచ్చపు శ్రీవేంకటేశు నలమేలుమంగ నీవు
వచ్చిసేసి కూడితివి పంత మేఁటికమ్మా ॥ ఏమ ॥ 198

రేకు 1434 ముఖారి

ఏఁగివచ్చుఁగాని యీతఁ డింటవింట వాదవాద
మూఁగినయీసింగారమోహనముతోడను ॥ పల్లవి ॥

పెట్టినకస్తూరిబొట్టు బేంట్లెగయకుండ
కట్టినహారము లెందుఁ గదలకుండ
విట్టతురుమువిరులు విప్పటిల్లి రాలకుండ—
సిట్టె అందలముపై నెక్కించరే ॥ ఏఁగి ॥

1. ఇందు దశావతార సమన్వయము గలదు.

మొగిఁ జెంగావిరెంటెము నెరి విరుగకుండ
చిగురుమోవిగచ్చు చెదరకుండ
అగలు(రు?)గంధపుఁబూఁత అందునిందు నంటకుండ
యెగనెత్తి అందల మెక్కించరె ॥ ఏఁగి ॥

కూడినకూటములగుఱుతులు మాయకుండ
వీడెపుమదముచొక్కు విడువకుండ
వేడుకకాఁడై వశ్రీవేంకటేశు నండ నన్ను
యీడుదోడై యందలాన నెక్కించరె ॥ ఏఁగి ॥ 199

సామంతం

చుక్కలు మెరసీని సూర్యుఁ డెండలుగాసీ
తక్కులు మొక్కులు మాని దగ్గరి రారా ॥ పల్లవి॥

నానీనానవినీనాలిమాటలు నా-
వీనులు సోఁకినంత వెచ్చనాయరా
కానీకానీ నీకడమలెల్లా
తానే మెచ్చయ్యీఁగాని దగ్గరి రారా ॥ చుక్క ॥

వీడీవీడవినీవింతనవ్వులు నా-
వాడికమతిఁ గాఁడి వాఁడ్లాయరా
జోడుగూడిన విన్నీ జోకలయ్యీని మరు-
దాడి ముట్టకతొల్లె దగ్గరి రారా ॥ చుక్క ॥

పాసీపాయవినీపన్నుఁగాఁగిలి
రాసి నాకుచములు రవ్వాయరా
ఆసల శ్రీవేంకటాధిప నేను వలపు
తాసునఁ దూచేఁగాని దగ్గరి రారా ॥ చుక్క ॥ 200

ముఖారి

అక్కడఁ జెలియలపు యిక్కడ నీగెలుపు
 యిక్కడ నక్కడఁ గంటి మీఁక నీచిత్తము ॥ పల్లవి ॥

వ్రాసేటినేలల వ్రాఁత వాఁకలచెమటయీఁత
 గాసిలునూర్పులమోఁత కాంతపాలాయ
 బేసబెల్లిలేనగవు పిలువఁగానే బిగువు
 వేసాలయీతగపు విభుఁడ నీపాలు ॥ అక్క ॥

చెలిమూపుపై నొరగు చిత్తములో నివ్వెరగు
 చలిఁజింతలపొరుగు సతిపాలాయ
 వెలినుండేవిక్కచూపు వెడబొంకు రేపుమాపు
 విలువులతరితీపు నీపాలాయ ॥ అక్క ॥

కాఁగిటిలో తమకము కదిసినగమకము
 దాఁగి యిట్టెసముకము తరుణిపాలు
 వేఁగి శ్రీవేంకటపతివేడుకైనసమరతి
 యీగతిమెచ్చినమతి యిది నీపాలాయ ॥ అక్క ॥ 201

ఆహిరి

తనువు బడలెను తలఁపు భ్రమసెను
 యెనసినతా నెఱుఁగు నిఁక నేఁటిదే ॥ పల్లవి ॥

మంతనాన నుండితేను మనోరథాలవెద
 కాంతునిఁజిత్తానఁ గంటేఁ గన్నీటివెద
 కాంతలలోఁ జెప్పఁబోతే కందువసిగ్గులవెద
 యెంతటానుఁ బొద్దువోదు యేమి సేసేదే ॥ తను ॥

చెలులలోన నుంటే చెప్పుడుబుద్ధులవెద
వెలి నుండేఁ జందురునివెన్నెలవెద
తొలఁగి విద్దురవోతేఁ గలలోన సీవెద
యేలమి వింతటిమీఁద నేమిసేసేదే ॥ తను ॥

యిచ్చట శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
కొచ్చి నూర్పులబుసకొట్లవెద
మెచ్చురతిబంధముల మించుఁజెమటలవెద
హెచ్చి; వెదలెల్లఁ దీరె నేమిసేసేదే ॥ తను ॥ 202

ధన్నాసి

చూడరమ్మ విచ్చకొత్తసొద్యమ(ము?)లాయ
వేడుకవిభునిచేఁత వెల్లవిరులాయ ॥ పల్లవి ॥

అతనువిరహవేళ అందపుఁగురులు జారి
అతివనొసలిపైఁ దూలాడఁగాను
సతినాసికమనేటి సంపెంగపూదావి సోఁకి
అతిఘోరపలులు తూలాడినయట్లాయ ॥ చూడ ॥

ఆఁపలేక పతికడ కంగన యలపుతోడ
యేపున మెల్లమెల్లనె యేఁగఁగాను
చేపట్టి నెన్నడిమిసింహపుగాలికిఁ గరి
కేపున నేఁగుచు నలికేటివిధమాయ ॥ చూడ ॥

యింతలోనె శ్రీవేంకటేశుఁ డెదురుగ వచ్చి
కాంతఁ గూడఁగ రతిఁ గరఁగఁగాను
పొంతఁ జంద్రోదయమున పొలఁతిగుబ్బలచంద్ర-
కాంతము గరఁగినచొక్కపువిధమాయ ॥ చూడ ॥ 203

రామక్రియ

ఒకటికొకటి గూడ దోయమ్మ నీయందే
సకలము నెటువలె సంతము సేసితివే ॥ పల్లవి ॥

తానకపునీకుచాలు దంతికుంభాలఁ బోలితే
యీనడుము సింహమునేల పోలెనే
ఆవిపట్టి నీకన్ను లంబుజాలఁ బోలితేను
ఆననము చందురువి నదియేల వోలెనే ॥ ఒక ॥

అతివ నీచేతులు బిసాంగములఁ బోలితేను
యితవై నడపు హంసనేల పోలెనే
చతురత నాసికము సంపెంగఁ బోలితేను
తతి నీకురులు తుమ్మెదలనేల పోలెనే ॥ ఒక ॥

నేవళపునీయారు నీలాహిఁ బోలితేను
యీవల మేను మెఱుపునేల పోలెనే
శ్రీవేంకటేశుమోవి ఓవ్విన కెంపు లంటించి
ఆవేళ దంతాలు వజ్రాలై యెట్టు వోలెనే ॥ ఒక ॥ 204

రేకు 1435 సామంతం

ఎప్పుడెప్పుడంటా నిచ్చగించీ వాఁడే
చిప్పిలు నీపతిఁ జేకొనవమ్మా ॥ పల్లవి ॥

పలుకుఁదేనెలు పారఁజల్లి చల్లి
చిలుకుఁజూపులు చిమ్మి చిమ్మి
కులుకునవ్వులఁ గొనరికొసరి
చెలువునిఁ బేరఁ బిలువవమ్మా ॥ ఎప్పు ॥

సారెకు బొమ్మల జంకించి జంకించి
కూరమి లోలోఁ గొచ్చికొచ్చి
తోరపుఁజెమటలఁ దొప్పఁదోఁగితోఁగి
చేరి నీపతిపయిఁజేయి చాఁచవమ్మా ॥ ఎప్పు ॥

గుబ్బలకొనలఁ గుదించి కుదించి
జొబ్బిలు నీమోవిఁ జూపిచూపి
[1]వొబ్బిలి శ్రీవేంకటోత్తముఁ గూడితి
అబ్బురా లీతని నఁటించవమ్మా ॥ ఎప్పు ॥ 205

శంకరాభరణం

ఇదియే పరమయోగ మిద్దరికి విభుఁడా
అదన నవిచినద్రిష్టాంతమాయ నిపుడు ॥ పల్లవి ॥

వెలి మనమిద్దరము వేరై వుందుముగాని
తలఁపులోపలను యిద్దర మొకటే
వొలిసి యద్దములోన నొకరూపే రెండై
తెలిసినట్లనేపో ద్రిష్టాంతమిపుడు ॥ ఇది ॥

పేరు లిద్దరికి నిట్టె భేదమై తోఁచీఁగాని
తారుకాణగుణము లిద్దరి కొకటే
కోరినమాఁటొకటే కొఁడశలలో రెండవు
తేరిచూడ నిదియేపో ద్రిష్టాంత మిపుడు ॥ ఇది ॥

శ్రీవేంకటేశ నీనాచేఁతలే వేరులుగాని
కేవల మిద్దరికి కాఁగిలి వొకటే
పూవుగుత్తి వొకటే పూఁపలు వేరైనట్లు
దేవ యిన్నిటికి నిదె ద్రిష్టాంత మిపుడు ॥ ఇది ॥ 206

1. 'వొబ్బిడి' కిరూపాంతరమా? వొబ్బిడి='ఒంటరితనము' ఏకాంతము, పూర్తి చేయుట అని మాండలికవ్యవహారము.

### తెలుఁగుఁగాంబోది

ఏమిటికే వున్నవెల్ల నింత చాలదా
ప్రేమమే కడకు నాపైఁ బెంచె నిది చాలదా ॥పల్లవి॥

తలఁపులోఁ దనరూపు తలఁచఁగఁ దలఁచఁగ
యెలమి మెయి చెమరించె నిది చాలదా
వెలిఁ దనగుణములు వినఁగ వినఁగ నాకు
నిలువెల్లఁ బులకించె నేఁడే చాలదా ॥ఏమి॥

యింగితానఁ దనకు నే నెదురుచూడఁ జూడఁగ
అంగమెల్లఁ గాఁకరేఁగె నది చాలదా
చంగవఁ దాఁ బవ్వళించేశయ్యపైఁ బొరలితే
రంగుగాఁ గళలు దాఁకె రతి నది చాలదా ॥ఏమి॥

తాను నేను నంతవింత దగ్గరఁగ దగ్గరఁగ
ఆనకమై నవ్వువచ్చీ నది చాలదా
పూనిన శ్రీవేంకటేశుఁ డొద్దికతో నన్నుఁ గూడె
యీనేటిసంపదలెల్ల నిచ్చె నది చాలదా ॥ఏమి॥ 207

### హిందోళవసంతం

అదె చూడరే మోహనరూపం
పదిగోట్లుగలభావజరూపం ॥పల్లవి॥

వెలయఁగఁ బదారువేలుమగువలను
అలమినఘనమోహనరూపం
వలచిననందవ్రజముగొల్లెతల
కులుకుఁజూపులకు గురియగురూపం ॥అదె॥

యిందిరావనిత నెప్పుడుఁ దనవుర-
మందునిలిపిన మోహనరూపం
కందువభూసతికాఁగిటిసొంపుల-
విందులు మఱిగిన వేడుకరూపం ॥ అదె ॥

త్రిపురసతుల బోధించిరమించిన
అపురూపపుమోహనరూపం
కపురుల శ్రీవేంకటపతియై యిల
నుపమించఁగరానివున్నతరూపం ॥ అదె ॥ 208

సామంతం

[1] సకల లోకేశ్వరులు సరుసఁ జేకొనువాఁడు
అకలంకముగఁ బుష్పయాగంబు ॥ పల్లవి ॥

వివిధ పుష్పములతో వేదఘోషములతో
అవల దిరువాముడియు నంగనలయాటతో
కవివందినుతులతో కమ్మఁబూజలతోడ
నవధరించీఁ బుష్పయాగంబు ॥ సక ॥

కప్పురపుటారతుల ఘనచందనముతోడ
తెప్పలధూపముల తిరువందికాపుతో
వొప్పుగఁ బణ్యారములు వొగిఁ బెక్కువగలతో
అప్పఁ దఁదీఁ బుష్పయాగంబు ॥ సక ॥

తగుచ(ఛ?)త్రిచామరాలతాంబూలములతోడ
పగటుతో నీరీతి పదిపూజ లందుకొని
జిగిమీరెఁ జూడరే శ్రీవేంకటేశ్వరుని-
అగణితంబగు పుష్పయాగంబు ॥ సక ॥ 209

1. ఇది అధ్యాత్మకీర్తనలలో నుండదగినది.

రామక్రియ

చూడవమ్మ చెలియ యీ చుట్టుపట్టు నతని
వోదక యెప్పుడు నావొద్దఁ బాయఁ డితఁడు ॥పల్లవి॥

కలికి నాథుఁడు రాఁ గలగంటి నంతలో నే-
నలరి ముచ్చటమాటలాడితి నేను
చలివాయఁ దములము చవిగొంటి మేలుకొంటి
తలఁగి యీతఁ డింకెందు దాఁగి రాఁడో కాని ॥చూడ॥

కమ్మరను నేనొకకల గంటి నాతని-
నుమ్మగిలి కాఁగిట నే నొద్దికైతిని
చెమ్మఁజెమటలు మేనఁ జిమ్మిరేఁగి వున్నవివె
అమ్మరో యతనిఁ గాన నందనుండె నిపుడు ॥చూడ॥

నెయ్యమున నెదుటనే నిక్కలగాఁ గంటి నిదె
యియ్యెడ శ్రీవేంకటేశుఁ డెనసి కూడె
ముయ్యక మలసె నాలో ముదములు సమకూరె
పయ్యదమఱుఁగులోనే పచ్చిసేసె నితఁడు ॥చూడ॥ 210

రేకు 1436 శంకరాభరణం

ఆదనుండే యేమిగల్లా నావతియ్యరా
యేడనున్నా మనసులు యేకమౌటే చాలును ॥పల్లవి॥

కొప్పుతుమ్మిదలు నాకు గొబ్బున బెదరుఁ జేసు
దప్పితో నవ్వు నవ్వక తలరా నీవు
అప్పటి కన్నుఁజకోరా లవి యులుకునో యేమో
చప్పుడు సేయక నీవు చక్కఁజూడ నందరా ॥ఆద॥

చన్ను జక్కవలు నేఁడు సరిగ కదలఁ జేసు
నన్నలు సేయకు మింతె చాలించరా
అన్నువనానదపుల, అంచలు బెగడుఁ జేసు
నన్నుఁ బేరుకొనకురా నటవల కిపుడు ॥ అద ॥

కుత్తికలో నాయెలుఁగుకోవిల బెదరుఁ జేసు
హత్తి నన్నుఁ జెవకకు మంతేసి నీవు
పొత్తుల శ్రీవేంకటేశ పొందితివి నన్ను విశ్వై
[1]సత్తుగ నే నీకు నతమైతిఁ జాలదా ॥ అద ॥ 211

రీతిగౌళ

[2]ఆయనాయ వెంగెమేలే అతివా । నీ–
ఆయమే తాఁకీ మాఁట లందుకేమి సేతురా ॥ పల్లవి ॥

కప్పురమిందవే వోకలికీ । మాకు –
నుప్పులవు నీకప్పురా లొల్లము పోరా
తప్పనాదే వదియేమే తరుణీ । వోరి
తప్పులెవ్వ[3]రెందున్నవో తలఁచుకో నీవు ॥ ఆయ ॥

నిమ్మ పండిందవే వో నెలఁతా! అ-
నిమ్మపండే పాఁపరవును నే నొల్లరా
చిమ్మేవు నట లిదేమే చెలియ మేన
చిమ్మురేఖ లెవ్వరందో చిత్తగించు నీవు ॥ ఆయ ॥

కుంకుమపూ విందవే వో కోమలీ । నీ–
కుంకుమలే పుప్పొదౌను కూడుకొంటేను
యింకనేలే కలసితి నింతీ । వోరి
యింకవు శ్రీవేంకటేశ యిద్దరిచెమటలు ॥ ఆయ ॥ 212

1. ఇది సత్యశబ్దభవము కావచ్చు. అర్థమూ అదే. 2. ఇదివాకోవాక్యము 3. ఎవ్వరి+అందు

## సామంతం

[1] అందు కంటినటే నీ యందము లెంచితిఁగాక
చిందేటి నామోహము నీచేతఁ జిక్కెఁగదరా ॥ పల్లవి ॥

నడుము పిడికెఁడంత నాతి నీకుచములైతే
బడి నొకటే పట్టెఁడంత
యెడ నాయంగము లివి యెంతలెంతలైనాను
చిడుముడి నిన్నియు నీచేతిలోనేకదరా ॥ అందు ॥

మొగము గోడిఁదెఁడంత మోహనపుఁగనుదోయి
చిగురుఁబో డిదియేమే చేరఁడంత
యెగసక్కెమిఁకనేల యేర నే నెట్టుండినాను
జిగి నాసింగారము నీచేతిలోనేకదరా ॥ అందు ॥

సుదతి నీయడుగులు జుట్టెఁడంత, దేహమైతే
సదరమైవయేడుజానలంత
కదిసితి విదె శ్రీవేంకటపతి విటు నన్ను
చెదరవి నేను నీచేతిలోనేకదరా ॥ అందు ॥ 213

## రామక్రియ

ఆతఁడు బత్తిసేయఁగా నన్నీ నమరె నీకు
కాతరాన విడెమిచ్చి కాఁగిలించఁగదవే ॥ పల్లవి ॥

సంతోసానఁ బెనఁగఁగా జగడము లేదుగాక
పంతములాడుకొంటే పచ్చిదేరదా
వింతలేక వుండఁగానే వేడుకలు వుట్టెఁగాక
వంతులు వాసు లెంచితే వలపు గలుగునా ॥ ఆతఁ ॥

1. ఇదియు వాకోవాక్యమె

ననుపు గలుగఁగానే నవ్వు లితవాయఁగాక
చెనకితే చలములు చిమ్మిఁరేగవా
వినయము చూపఁగానే వెలెనెఁగాక పొందులు
మనసు రాకుండితే మర్మములు గరఁగునా ॥ అత ॥

యిట్టె నేసలు చల్లఁగా వియ్యకోళ్లాయఁగాక
వట్టిసిగ్గున నుండితే వాడికలౌనా
నెట్టన శ్రీవేంకటాద్రివిభుఁడు విన్నుఁ గూడె
చుట్టరికమెంతైనా సొంపులే పుట్టించవా ॥ అత ॥ 214

## వరాళి

ఏమాయ నందుకు నీవేల కొంకేవు
దీమసపునీపట్టపుదేవుల నేను ॥ పల్లవి ॥

యింతవడి నీవు రాక యీడా నాడా నుంటివంటా
యెంత నన్ను వేఁడుకొనే వేమిచెప్పేది
పంతమున నీమేనఁ బచ్చిసేఁత లున్నవంటా
చెంతనున్ననాతోనేల సిగ్గువడేవు ॥ ఏమా ॥

విలుచుంటే నాపె వచ్చి నీచెఱఁగు వట్టెనంటా
పలుమారునేల వొడఁబడచేవు
కలలో నాపెఁ గదిసి గక్కన మేలుకొని
యెలమి నామోము చూచి యేల నవ్వేవు ॥ ఏమా ॥

వూడిగపువారి మేను లొరసె నిన్నంటాను
యేడలేనియానలు నీవేలపెట్టేవు
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
జాడఁదప్పకుండా నాతో సరసమాడేవు ॥ ఏమా ॥ 215

నాదరామక్రియ

పిందుజాణ వన్నిటాను నీవే యెఱుఁగుదువు
అందనుండి సతులచే నాడించుకోరాదు ॥ పల్లవి ॥

తలఁపుకొలఁదినే తమి రేఁచవలెఁగాని
వలవంతఁబెట్టరాదు వనితలను
పులక లెనఁగఁ గుచములు ముట్టవలెఁగాని
బలిమిఁ బిసికి తడఁబరచఁగరాదు ॥ పిందు ॥

కూరిములు దలకొన కురు లంటవలెఁగాని
బారెఁదేసి వెంట్రుకలు పట్టఁగరాదు
నేరుపుతోనే కాఁగిటనించి కూడవలెఁగాని
బీరానఁ గుదించి పిరివీకు సేయరాదు ॥ పిందు ॥

మోహముకొలఁదినే మోవి యానవలెఁగాని
సాహసాన పలు సోఁకించఁగరాదు
యీహల శ్రీవేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
బాహుమూలా లంటి కదుఁబచ్చిసేయరాదు ॥ పిందు ॥ 216

రేకు 1437 లలిత

[1] చాలునే నీమాఁటలు చాలు మూలకెక్కెరా
వేలఁ జూపేవా పదారువేలవాఁడ వౌదురా ॥ పల్లవి ॥

వొంటినుంవాన వదేమే వొంటియు నొంటకె పోరా
అఁటఁగా వోచెలియ గోరఁట కౌనౌరా
గొంటుజాణతనమేలే కూళతనాలేలరా
కంటినే నీజాడ బండికంటిజాడలటరా ॥ చాలు ॥

1. ఇది సంవాదాత్మకము.

పిదనాదేవేమే నీపిదనాద నుండఁగఁబో
జోడుగదే నేను అవురా జోడగుటౌ? (లౌ?)
మేడిసేసేవటే నీవు మేడిపండె నీగుణాలు
వోద పేమిటాను నీవావోదతో దూలమురా ॥ చాలు ॥

యింతయేలే నాతోఁ గారింతలు నీవల్లనే పో
సంతమైతినే వో వసంతకాఁడవా
పంతపుశ్రీవేంకటాద్రిపతి నేఁ గూడితిఁగదే
పంతము పాడియుఁగలపడఁతిరా నేను ॥ చాలు ॥ 217

తోండి

ఇతరము లేదే యిఁతి నీపతికి
ప్రతిదినదినమును ప్రభాతవేళ ॥ పల్లవి ॥

అంగన నీమోము అద్దము విభునికి
కంగుదేరి మేల్కనువేళ
పొంగేటికుచములే పూర్ణకుంభములు
వింగళమై వెలివెడలెఁడివేళ ॥ ఇత ॥

అతివ నీతొడలే యరఁటికంభములు
చతురునికిఁ బ్రవేశపువేళ
రతిఁగరములే తోరణపుఁజిగు రలరె
అతనుమువాూర్తపుటావేళ ॥ ఇత ॥

సుదతి నీకెమ్మోవి సూడిదెపల మిది
అదన మీరహస్యపువేళ
కదిసినశ్రీవేంకటపతికిని నీ-
వెదిటివిధానమ వెప్పటివేళ ॥ ఇత ॥ 218

ఆహిరినాట

పంతమాడఁదడవా పచ్చిదేరి నవికాక
కాంతునికిఁదడవా కై కొసీనవికాక ॥ పల్లవి ॥

కోపగించఁదడవా కొనచూపులకన్నుల
ఆపని తా నెఱఁగీ ననికాక
రాఁపుగా నాడఁదడవా రంతులవెంగేలఁ దన్ను
వైపుదనబా సెంచుక వచ్చీనవికాక ॥ పంత ॥

యెగ్గువట్టఁదడవా యెదుటఁ దనచేఁతకు
విగ్గులమీఁదటను మాసీనవికాక
వెగ్గళించఁదడవా వేగిరించి తనకంటె
సిగ్గుదేరి తాఁ బ్రియముచెప్పీనవికాక ॥ పంత ॥

జంకించఁదడవా సమరతులను నేఁడు
కొంకి శ్రీవేంకటేశుఁడు కూడెనవికాక
సుంకుల నవ్వఁదడవా సొరిది నెలవులను
వుంకువగా మేన గోరు వూఁదీనవికాక ॥ పంత ॥ 219

ఆహిరి

తలఁచుకో నావల్లఁ దప్పులే
వెలయ విన్నింతనేయ వేడుకా నాకు ॥ పల్లవి ॥

తమితోఁ బాయక నాదండ నీవే వుండితేను
సముకాన విన్ను దూరఁ జలమా నాకు
అమరఁగ నీవాడినఆమాటే తప్పకుండితే
జమళి నలిగియుండ సంగతా నాకు ॥ తలఁ ॥

నన్నుల నీ విచ్చినచనవే చెల్లించితేను
విన్ను నేరము లెంచఁగ నేరుపా నాకు
మున్నిటివారఁబాటు ముందె నీవు చెప్పించితే
విన్నపము సేసి యంప వినోదమా నాకు ॥ తల ॥

గట్టిగా నీవు నన్నుఁ గాఁగిలించుకొంటేను
అట్టె కొంగువట్టితియ్య నాసా నాకు
నెట్టన శ్రీవేంకటేశ నేఁ డిట్టె నన్నేలితివి
అట్టుసేయ నాగుండె కాయా నాకు ॥ తల ॥ 220

తెలుఁగుఁగాంబోది

ఏమి సేసేవోకాని ఇఁకను నీచిత్తము
వేమారు నుద్దు లడిగీ వెలఁది యింటిలోను ॥ పల్లవి ॥

ఆడుకోలునీమాఁట లావలు వుట్టించఁగాను
వాడికె నెదురుచూచీ వనిత నీకు
పాడినపాట నీపే రప్పటిఁ దలఁపించఁగాను
జాడ విన్నదుగవంపె సకియలచేతను ॥ ఏమి ॥

తాలిమితో నీగుణాలు తమకము రేఁచఁగాను
పోలించి పూవుల వేసీఁ బొలిఁతి నిన్ను
వేలనున్నవుంగరము వేడుకలు రేఁచఁగాను
కేలెత్తి నీకు మొక్కీఁ గెలవినన్నలను ॥ ఏమి ॥

చుట్టరికపునీరాక సొంపు విగిడించఁగాను
ఇట్టె విన్నుఁగాఁగిలించీ నీకాంత నేఁడు
గట్టిగా శ్రీవేంకటేశ కలసి నీవుండఁగాను
నెట్టన విన్నుఁ బొగడీ నెలఁతలలోను ॥ ఏమి ॥ 221

### సామంతం

ఏకతాన మీ రుండఁగా ఇన్నిసింగారాలునాయ
మేకొని చెలు లిందుకే మెచ్చేరు నిన్నును ॥పల్లవి॥

సకియనెమ్మోమునఁ జంద్రోదయఁ బాయ
వెకలినవ్వులనె వెన్నెల గాసె
చికురభరము నీడి చీఁకటి యంతలో జారె
తొకుతొకులాడేరకుల నీవు గూడఁగా ॥ఏక॥

వన్నెమోవిచిగురున వసంతకాలము వచ్చె
చిన్నిపలుకులఁ బుట్టె చిగురులెల్లా
వున్నతపుఁగుచముల నొనరెఁ దమ్మిమొగ్గలు
కన్నె మరమున నీవు గాఁగిలించఁగాను ॥ఏక॥

మరుతేరు చూపట్టె మగువపిఱుఁదునను
సిరిమించెఁ గాళెలు చిఱుఁదొడల
యిరవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
గరిమల నీవిట్లాఁ గరుణించఁగాను ॥ఏక॥ 222

రేకు 1438

### శంకరాభరణం

నీదా(దాఁ?)క వలెనా నెగడె మరుబలాలు
భేదము లేదని వింటిఁ బెంచితిమె నేము ॥పల్లవి॥

పలుకకువే నీవు పడఁతి। యీ-
పలికేచిలుకలు నీప్రతి గాదా
కులుకకువే నీకుచములు। యీ —
వొలయుజక్కవలు అపోలికే కాదా ॥నీదా॥

సోవలఁ బాదకువే సుదతీ । యీ -
కోవిలపాట లందలిగుణమే కాదా
చేవదేర నవ్వకువే చెలియా । యీ
కావరపువెన్నెల లాగతులే కావా ॥ సీదా ॥

మీఁదఁ జేయివేయకువే మెలుఁతా
పోదిగొన్నతీఁగె లాపొరుగేకాదా
నాదించి శ్రీవేంకటాద్రినాథుఁడ నేనూ । నన్ను
సోదించి కూడితి నీ సొమ్మయితిఁ జాలదా ॥ సీదా ॥ 223

## రామక్రియ

నాలుకతుదనే వో నానావిధములును
యేలేపతికడకు విప్పదే రాఁగదవే ॥ పల్లవి ॥

చింతించఁజింతించ చిత్తములోనే నుయ్యి
అంతలో సంతసించిన నదే కొండ
పంతమున నలిగితే ప్రాణనాయకుఁడే పగ
చెంతగూడిన నాతఁడే చేతిలోవిదేవుఁడు ॥ నాలు ॥

కన్నుముయ్యఁగన్నుముయ్యఁ గప్పిన దింతాఁ జీఁకటే
అన్నిటాఁ జూడఁజూడఁగ నదే వెలుఁగు
పన్ని మనసురాకున్నఁ బలుకెల్లా వెంగేలే
తిన్ననై యేనయుచోటఁ దిట్టులే దీవెనలు ॥ నాలు ॥

పరుసము చేఁతనుంటేఁ బట్టినదెల్లా బంగారే
యెరవై పూరకపుంటే వినుమినుమే
యిరవైనశ్రీవేంకటేశురతులే యలపు
పరవశము గోరిన పచ్చికారముఁ దీపే ॥ నాలు ॥ 224

## ముఖారి

వింతచెలి వద్దనుండే వెలఁదికి సిగ్గుగాదా
యెంతైనా నెరఁగదు యెటువంటియాఁటది ॥పల్లవి॥

ఇంతి తనకాఁతాళాన ఇద్దరముఁ గూచుండఁగా
నంతలో సుద్దులు చెప్పి సారెసారెకు
మంతన మాడేనంటా మనసు పట్టఁగలేక
చెంత నేకతములాడీ చెవిలోనే తాను ॥వింత॥

యీకె దనవేడుకతో యెదుట నే నుండఁగానే
ఆకుమడిచియ్యవచ్చి నదే నీవద్ద
నీకుఁ బాదాలొత్తేనంటా నెపములు నేసుకొని
చేకొని కూచుండీని చేరి పానుపుమీఁద ॥వింత॥

తతి నిన్నుఁ గూడేయాసఁ దలుపు దెరచుకొని
రతినేయవచ్చీఁ గాఁతరాన నీదకు
యితవై శ్రీవేంకటేశ యిప్పుడే నన్నేలితివి
సతి పెనఁగాదేనంటా మతకము సేసీని ॥వింత॥ 225

## సామంతం

నీకు నాపె గలుగుట నీభాగ్యమే
చేకొని కాఁపుర మిట్టె సేయఁగదరయ్యా ॥పల్లవి॥

మగువ నీతోనాడితే మాటలఁ దేనెలు గారీ
నగితే నెలవుల వెన్నెల వెళ్లీని
పగటునఁ బొలసితే బంగారుపొడి చిందీని
మొగి నాపె నురమున మోవఁదగునయ్యా ॥నీకు॥

తమకించి చూచితేను తామెరరేకులు గప్పీ
చెమరించితే ముత్యాలచేరు లూరీవి
సముకాన నిలిచితే జవ్వనము దొట్టీని
అమరునయ్య నీకంటె నాపెపేరు మునుప ॥ నీకు ॥

యిట్టె కాఁగిలించుకొంటే యిలు నిండీ సిరులెల్ల
మెట్టితే నవరత్నాలు మెండుకొనీవి
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు మమ్ము నేలితివి
వొట్టుక యిల్లిటముగా మఁడదగునయ్యా ॥ నీకు ॥ 226

కాంబోది

ఇప్పు డాతనిమనసు యెట్టున్నదో తెలియరే
చెప్పినట్టు మీమాఁట సేసేఁగాని ॥ వల్లవి ॥

వొనరినపొందులైతే వొడఁబరచుటఁగాక
మనను రాకుండితేను మాటాడేదేమి
కనువిచ్చి చూచితేను కానుక యీవచ్చుఁగాక
మనుపే తలవంచితే ముందరికి వత్తురా ॥ ఇప్పు ॥

ఆవపడియుండితేను అట్టె నవ్వవచ్చుఁగాక
వేసరఁగాఁ జెనకితే వేడుకయ్యీనా
వాసితోనే నడపితే వాడికై వుండుటగాక
వేసాలకు వేఁడుకొంటే వినయమేమిటికి ॥ ఇప్పు ॥

కలసి కాఁగిలించితే కరఁగఁగవచ్చుఁగాక
తలఁచి గుట్టున నుంటే తవివయ్యీనా
అలరి శ్రీవేంకటేశుఁ డాదరించి నమ్ముఁ గూడె
నెలవై విన్నటిరతి నేఁటికి వచ్చీనా ॥ ఇప్పు ॥ 227

సాళంగనాట

ఏమినేరుపే నీది యింటికిఁ బిలిచే పతిని
కామించినవారు వేళగాచియుండఁగాను ॥ పల్లవి ॥

వొక్కతెవే నీపతిని నోడిఁ బెట్టుకొనేవటే
పిక్కటిల్లి యిల్లునిండాఁ బెండ్లాలుండఁగా
అక్కరఁ జేపట్టేవేమే ఆతనిముంజేతివే
పెక్కుకంకణదారాలు పెట్టెఁడుండఁగాను ॥ ఏమి ॥

నెమ్మి నాతనిపైఁ బత్తి నీపాలికే వచ్చెనటే
యిమ్ములఁ గాంతలు మేడలెక్కి చూడఁగా
కమ్మి నేఁడు నీచుట్టరికమే చెప్పేవదేమే
వుమ్మడి వావులవారు వూరెల్లా నుండఁగాను ॥ ఏమి ॥

కలయ నతఁడు నీకే కాణాచియటవే
చెలు లెందరైనా వచ్చి సేవసేయఁగా
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడే నన్నుఁ గూడె
వలపులెల్లా నీతనివాకిట నుండఁగాను ॥ ఏమి ॥ 228

రేకు 1439 సాళంగనాట

ఏమి పంతాలాడేవే యిటువంటివాఁడు వీఁడే
కామించి నేఁ గైకొంటిఁ గాదనఁగఁగలవా ॥ పల్లవి ॥

యెలయించనేరుతువా ఇన్నిటా జాణఁ డితఁడు
పిలువఁగనేరుతువా పెను చితఁడు
పలికించనేరుతువా బలవంతుఁ డితఁడు
కలయఁగనేరుతువా గట్టువాయ ఇతఁడు ॥ ఏమి ॥

నగ నీ వోపుదువా నాలికాఁడు యీతఁడు
తగులఁగనోపుదువా దంట ఇతఁడు
బిగియఁగనోపుదువా ప్రియవాది యీతఁడు
జగడించనోపుదువా సరసుఁ డితఁడు ॥ఏమి॥

చెనకఁగఁగలవా చిక్కనివాఁ డితఁడు
తనిఇంచఁగలవా వుద్దండుఁ డితఁడు
యెనసెను శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్ను
పెనఁగఁగఁగలవా ముప్పిరి ఘనుఁ డితఁడు ॥ఏమి॥ 229

బౌళి

వనితకు నెంతమేలువాఁడవో కాక
యెవసి నవ్వేవు తగ వెంచుకొనవద్దా ॥పల్లవి॥

పూపచన్నులు వట్టితే పోపొమ్మని జంకించఁగా
ఆపెతోనే మాటలాడే వప్పటి నీవు
యేపున వేఁడుకొంటే యిందాఁకా బిగిసెను
చేపట్టితి వంతలోనే సిబ్బితైనా వలదా ॥వని॥

పూవుల నీవు వేసితే పూఁచి విన్నానలువెట్టె
చేవట్టి తీసే వాపెనే చెల్లఁబో నీవు
భావించి నీవు చూచితే పయ్యద పైఁగప్పుకొనె
వావులు చెప్పవచ్చేవు వానెఱఁగవద్దా ॥వని॥

గుట్టునఁ గాఁగిలించితే కొప్పువట్టి తీసె నిన్ను
ఇట్టె మోవడిగేవు ఇంకా నీవు
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
జట్టిగొంటి వందరివి జంటసేయవలదా ॥వని॥ 230

దేసాళం

నీగుణ మెఱిఁగేనంటా నే నుందానను
యీగతి నూరకుండితే యెగ్గులుసేయకుమీ ॥ పల్లవి ॥

మనను వేరొకతెపై మరిగి నీ కుండఁగాను
పెనఁగఁగఁబోతేను ప్రియము గాదు
పనివడి చూపు లాపెపైఁ బారివుండఁగాను
వినుకొలువు నేసితే వేసటలై వుండవా ॥ నీగు ॥

తేరకొవి నీ వొకదిక్కున నవ్వఁగాను
చేరి యంత మొక్కినాను సెలవయ్యీనా
కోరి పరాకున నాముకొని తలపోయఁగాను
సారె నిన్నుఁ బిలిచితే సందడిలో వినేవా ॥ నీగు ॥

మూటిగా నీ వవ్వలిసుద్దులెల్లా వినఁగాను
మేటినాసరసములు మెచ్చులయ్యీనా
చోటిచ్చి నన్నేలితివి చొక్కుచు శ్రీవేంకటేశ
వాటముగా విఁకను నీవలపు లీదేరవా ॥ నీకు ॥ 231

పాడి

ఎప్పుడూ నావాఁడవే యెఱుఁగుదు నే నాసుద్ది
చిప్పిల నన్ను నీవు చేపట్టి వదలవు ॥ పల్లవి ॥

జంకించ నోపఁగాని సరసమాడే నీతో
మంకు చూపనోపఁగాని మాటలాడేను
కొంకి వూరకుండనోపఁ గొసరిఁ జేతుల మొక్కే
సంకెలేక మోహించి యేసతిఁ దెచ్చుకొన్నాను ॥ ఎప్పు ॥

పంతములాడఁగాని పాదాలసేవ సేసేను
చింతతో నట్టగఁగాని చెక్కునొక్కేను
వింతగా మెలఁగఁగాని వేడుకచుట్టమ నయ్యే
వంతుకు నీ వేమగువవద్ద నుండినాను ॥ఎప్పు॥

తప్పులేమీ నెంచఁగాని తగిలి పొగడే నిన్ను
వుప్పతించఁగాని నీవాడి వట్టేను
ఇప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చొప్పులెత్తనేల నీ వేసుదతిఁ గూడినాను ॥ఎప్పు॥ 232

రామక్రియ

ఏమిసేసీ వింటిలోనె యెప్పుడు వచ్చీఁ దాను
ప్రేమతో నున్నాఁడ నేను పిలువరే మీరు ॥పల్లవి॥

మొనసి చెలియ నాముందర నిలిచినట్టు
పెనఁగి కాఁగిటిలోన బెరసినట్టు
తనివార మోవియిచ్చి దప్పిదేరిచినయట్టు
మనసున మెలఁగీని మాటలాడినట్టు ॥ఏమి॥

చెలరేఁగి నాయెద్ద పెలవుల నగినట్టు
సొలయుచు నాదిక్కు చూచినయట్టు
సలిగె మెరసి నాతో సరసమాడినయట్టు
కలలోనఁ బొరపీని కప్పురమిచ్చినట్టు ॥ఏమి॥

చెక్కునొక్కి నామీఁద సేసలు చల్లినట్టు
గక్కనఁ బయ్యెద నాపైఁ గప్పినయట్లు
యిక్కడ నే శ్రీవేంకటేశుఁడఁ; దానే వచ్చి
నిక్కముగా నన్నుఁ గూడె నిఁడీ నింతా నానలు ॥ఏమి॥ 233

## బౌళిరామక్రియ

ఎగ్గుపట్టఁ బనిలేదు యింతులతోను
సిగ్గువడ్డకామిని చెక్కు చేతఁ జేర్చును ॥ పల్లవి॥

పనిమాలినపనికి పంతముతో రమణుని
చనవుగలయాఁటది పాదించును
పెనఁగి బుద్ధిచెప్పితే బిగియుచుఁ జెలులతో
వానరవినఁగులు పూరకే రాలుచును ॥ ఎగ్గు ॥

పిలువకతొలుతే ప్రేమములు తానే చల్లి
బలిమికత్తె యైనది పైకొనును
వలదన్నా విడువదు వడ్డి(ద్ది?)వారు చూడఁగానే
కొలఁదిమీర నతవిఁ గొంగువట్టి తీసును ॥ ఎగ్గు ॥

తడఁబడ దెంతైనా తాలిమి నిలుపలేక
కడుఁదమకించినది కాఁగిలించును
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
బడివాయఁకిఁక దాను పాలుపడివుండును ॥ ఎగ్గు ॥ 234

రేకు 1440 ## శుద్ధవసంతం

ఇన్నిఁ జూచేవుగాక యేల నిన్ను రట్టుసేయ
పన్ని సీత కొక్కెతకే బతిమిసేసుకోవా ॥ పల్లవి ॥

చెంతల నన్నేకాని చెలులఁ గైకొనవంటా
పంతములాడుకొనవా పలుమారును
మంతుకెక్కి నీ వప్పటి మఱచితివేమోకాక
వింతసతులఁ బదారువేలఁ జేకొనవా ॥ ఇన్నిఁ ॥

నాకే మోహించితిఁగాని నాతులఁ బెండ్లాడనంటా
 సాకిరులు వెట్టేవా సతులనెల్లా
పైకొని యేకడ నీవు పరాకై తివేమోకాని
 కాకుగాఁ బురాంగనలఁ గతలఁ గలపవా ॥ ఇన్నిఁ ॥

కమ్మి నాకాఁగిటఁ గూడి కాంతల నటంనంటా
 యెమ్మెలెల్లా నెలపవా యిప్పుడే నాతో
పమ్మి శ్రీవేంకటేశ్వర భ్రమసితివేమోకాని
 కొమ్మలైనగొల్లెతలఁ గూడి చెలఁగవా ॥ ఇన్నిఁ ॥ 235

మాళవిగౌళ

అవియు నవియు మరునమ్ములే కావా
 వివరింప భావములు వేరువేరై తోఁచెను ॥ పల్లవి ॥

చెలిమాటుననుండి వేసినతామెరపువ్వు
 కలికి నీపతికిని కానికాయను
మొలకగుబ్బలతమ్మిమొగుడ లంటఁగ నీవు
 అలమి పైకొంటేను అవె పూజలాయను ॥ అవి ॥

కోమలి దవనపుచిగురుగు త్తి వేసిన
 చేముంచి సన్నతనికిఁ జేసుటాయను
ఆమని మోవిచిగురు అంతలోఁ జవిచూపిన
 వేమారు వలపులకు విందులాయను ॥ అవి ॥

యీవేళ నీజాజిదండ యిదె మెద వేసితేను
 శ్రీవేంకటేశునికి మచ్చికలాయను
కూవలై నీమేన జాజుకొన్నపులకవిరులు
 మోవ నితనిఁ గూడఁగా ముదమాయను ॥ అవి ॥ 236

### వరాళి

వేడుకకాఁడ వౌఁదువు వెఱపేఁటికి
పాడిపంతా లెంచి నేను పచారించనేఁటికి ॥ పల్లవి ॥

కొంకులేక నీవూ నాపెఁ గూడినందుకు నీమేని-
పంకపుఁజెమటే చెప్పి బాసలేఁటికి
ఇంకనేమి నీవాపెను ఇంటఁ బెట్టుకున్నందుకు
అంకెఁ జెలులచే వింటి నాడనేఁటికి ॥ వేడు ॥

కలికిచన్నులమీఁదిగందము నీమేన నంటె
చెలులెల్లా నెరిఁగిరి సిగ్గులేఁటికి
వెలయ నవ్విందుకు వేఁడుకొనే విటు నీవు
తలఁచినట్టెల్లానాయ దాఁచనేఁటికి ॥ వేడు ॥

చెంతల నాచెల్లెలంటాఁ జెప్పేవు చుట్టరికము
వింతలు నీవల్లఁ గంటి వేసాలేఁటికి
ఇంతటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చింతలేదు యిఁక గుట్టుసేయనేఁటికి ॥ వేడు ॥ 237

### సాళంగం

ఏల విన్ను దూరేము యెఱఁగమా నే మంతేసి
మేలు నిన్ను మెచ్చితిమి మేఁటిదొర వౌదువు ॥ పల్లవి ॥

వాసి వంతెరిఁగి నీవు వరుసతో నడపితే
యీసడించవచ్చేరా యెవ్వరైనాను
నేసవెట్టినట్లనే సేవలు సేయించుకొంటే
తోసి పోనాడేవారికి దోసముగాదా ॥ ఏల ॥

తగువు దప్పక నీవు దండనే కాచుకుండితే
యెగసక్కెములాడుదురా యెవ్వరైనాను
తగులై నీవందరిపై దయగలిగుండఁగాను
పగటు నీపైఁ జూప పంతమా యేమైనా ॥ఏల॥

గుట్టుతోఁ గూడి నీమంచిగుణము నెరపఁగాను
యిట్టునట్టుఁ గొసరరా యెవ్వరైనాను
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
రట్టుసేయమ రావయ్య యిట్టె మాయింటికి ॥ఏల॥ 298

రామక్రియ

వెనక నీకు మొక్కి వేఁడుకొనీఁగాని చెలి
మునుపఁ బంతములాడి మొఱయకువయ్యా ॥పల్లవి॥

యెనసివుండినచోట నేమాఁటైనా నాడుదురు
పెనఁగులాడేవేళ బిగుతురు
పనులు సేయఁగాను పాదములు చెయి సోఁకు
వనితల నెగ్గుపట్టవలదయ్య నీవు ॥వెన॥

తప్పకచూచితేను తరితీపులెల్లా రేఁగు
కుప్పవడ నవ్వఁగాను కొప్పు వీడును
కప్పురము చవిగొంటే కడునెంగిలి యంటును
అప్పుడే యింతుల జరయఁగఁ దగవుగాదు ॥వెన॥

వేడుకమాట లాడితే వెంగెములై తోఁచును
కూడేపానుపుపైని సిగ్గులు జారును
యీడనె శ్రీవేంకటేశ యేలితి వీపె నింతలో
జారతో నతి వలయించకువయ్య యిఁకను ॥వెన॥ 299

కాంబోది

నిన్నుఁ జూచి తనివంది నిలుచున్నది
వున్నతి నీసతివలె నుండవద్దా వలపు ॥ పల్లవి ॥

వివివిని నీమాఁటల వెరగుతోడ నున్నది
ననుపుఁజేఁతలకును నవ్వుచున్నది
చనవు నీవియ్యఁగాను సంతోసముతో నున్నది
యెనసి రతిసలుప నెఱుఁగకవున్నది ॥ నిన్నుఁ ॥

తప్పక నీవు చూచితే తగులమితో నున్నది
వొప్పగఁ జేయివేసితే వొగ్గుచున్నది
కప్పిన పయ్యదంటితే కరఁగుతాఁ దా నున్నది
దప్పికి మోవియడుగఁ దలపోయుచున్నది ॥ నిన్నుఁ ॥

చేరి నీవు చెనకితే చిమ్మిరేఁగుతానున్నది
యీరతి నీకాఁగిటఁ బెంపెక్కివున్నది
గారవాన నేఁడు శ్రీవేంకటేశుఁ గూడఁగాను
నేరుపుతో నీవురాన నెలకొనివున్నది ॥ నిన్నుఁ ॥ 240

రేకు 1441 రామక్రియ

చెలులాల మీతోఁ జెప్పసిగ్గయ్యీ నాకు
చలముతో మోవితేనె సారెకు నిచ్చీని ॥ పల్లవి ॥

చూడవే యీతఁడు నన్ను సద్దుసేమి యడిగీని
యేడలేనివారు తనయింట నుండఁగా
ఆడ వేఁగినంతాఁ దాను ఆపెవద్దనుండి వచ్చి
వేడుకతో నావద్దివీణె వాయించీని ॥ చెలు ॥

కంటినే యిప్పు డితవికతకారిచేతలెల్లా
వొంటి నేనుండఁగా నావొడి పట్టీని
తొంటిపొందులవారెల్లా తోడనే కాచుకుండఁగా
అంటీనే నాపయ్యద అందరూఁ జూడఁగానే ॥ చెలు ॥

తగునే యీతనికి యీతరితీపువలపులు
పగటురతులఁ గూడి పైకొనీని
జిగిమీర నవ్వీతాను శ్రీవేంకటేశ్వరుఁడు
మిగులా నావసమై మెచ్చులు మెచ్చీని ॥ చెలు ॥ 241

శ్రీరాగం

ఇప్పుడు నీవు వచ్చితి విది చూచి నా కదివో
చొప్పుగా రెండుభావాలు చూపిచెప్పరాదు ॥ పల్లవి ॥

తక్కక యెడసి విన్నుఁ దలఁచఁగాఁ దలఁచఁగా
యెక్కడచూచినా నీవై యిదే తోఁచేవు
వెక్కసపునీసుద్దులే వేమారు వినఁగాను
మక్కువ వీనులకు నీమాటలే వుండీని ॥ ఇప్పు ॥

వరుసతో నీరూపు వ్రాయఁగా వ్రాయఁగాను
అరుదై చేతికిఁ జిక్కినట్టె తోఁచీని
సరవి నీగుణములు సతులతో నాడుకోఁగా
తొరలీ నీపేరే[1] నాతుదనాలికెకును ॥ ఇప్పు ॥

కందువ నీకుగానే కలఁగనఁగాఁ గనఁగా
అంది కాఁగిటఁగూడినయట్టె తోఁచీని
విందుగా నన్నిపుడె శ్రీవేంకటేశ కూడితివి
చందముగా నాకన్నిటా సతమై యేలితివి ॥ ఇప్పు ॥ 242

---

1. "నానాలికెతుదకు" అనుట సహజము. రేకు పాఠము యతి నిర్బంధముతో.

బౌళి

ముందు నిన్నెఱఁగమా యేమూల నుంటివే
సందుసుడి నింతలోనే సవతివై తివే ॥ పల్లవి ॥

సతులనుద్దులు చెప్పి చనవరివైతివే
అతనికి పాదాలొత్తి యాలవైతివే
సతతము నవ్వినవ్వి జాణకత్తెవై తివే
పతితోఁ బెనఁగులాడి బాఁతివైతివే ॥ ముందు ॥

మెచ్చుగా వావులుచెప్పి మేనదానవైతివే
తచ్చన చేసి యీతని తగులై తివే
మచ్చికఁ గొలువుసేసి మంచిచుట్టమవై తివే
యిచ్చకము సేసితని కిటు దొరవై తివే ॥ ముందు ॥

వట్టి సాఁకిరులు చెప్పి వాడికదానవైతివే
బట్టబయలు మొక్కి నేర్పరివైతివే
యిట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నేలినాఁడు
జట్టిగొని నీవతనిసతమైతివే ॥ ముందు ॥ 243

వరాళి

ఊరకె యిందరివలె నుండుముగాక
మారుకొని నిన్నడుగ మాకేల యిఁకను ॥ పల్లవి ॥

యిచ్చకము లాడేవారి విందు రమ్మందురుగాక
యెచ్చుకుందులాడేవారి నియ్యకొందురా
పచ్చిచేఁతలు నీమేనఁ బాదుకొని వుండితేను
మచ్చికతోఁ జెప్పిచూప మాకేల ఇఁకను ॥ ఊర ॥

మగువలఁ దెచ్చేవారి మన్ననసేతురుగాక
తగుబుద్ధిచెప్పేవారిఁ దాము మెచ్చేరా
అగడుసేసేచెలులు అండఁగాచుకుండఁగాను
మగిడి నీ కద్దమురా మాకేల ఇఁకను ॥ఊర॥

వెలయాఁడ్లయినవారి వేడుక చూతురుగాక
బలిమి విల్లాండ్లమీఁద బత్తిసేసేరా
యెలమి శ్రీవేంకటేశ యేలితి విప్పుడు నన్ను
మలసి మర్మములెత్త మాకేల యిఁకను ॥ఊర॥ 244

శంకరాభరణం

చలమో పలమో సతి నీకు
పిలువఁగఁబిలువఁగఁ బెనఁగేవూ ॥పల్లవి॥

తగిలి యతఁడు వినుఁ దడవఁగనూ
చిగురుఁజేతులను చిమ్మేవూ
అగపడి సరసములాడఁగనూ
విగిడి బింకములు నెఱపేవూ ॥చల॥

సంటున నాతఁడు నవ్వఁగనూ
గెంటపంబులను కెలసేవూ
అంటి యతఁడు విను నలమఁగనూ
యింటికి రమ్మని యెలయించేవూ ॥చల॥

శ్రీవేంకటేశుఁడు చెనకఁగనూ
భావ మెఱింగియుఁ బదరేవూ
యీవేళ విన్నితఁ డెనయఁగను
పూవుల వేయుచుఁ బొదిగేవూ ॥చల॥ 245

మంగళకౌసిక

మగవాని కేఁటియెగ్గు మాపుదాఁకాను
తగిలి భోగించినదే దక్కినదిగాక ॥ పల్లవి ॥

మనుకోవి యాపెగుణములు నాతోఁ బొగడేవు
వనితఁ దెచ్చుకొనఁగా వలదనేనా
మనసొకటైఁ గోరఁగా మాటలు నాతోనాడఁగా
యెనసినట్టయ్యీనా యేఁకరేది దోసము ॥ మగ ॥

వెలి నాపె నీకిచ్చినవిడెము నాకిచ్చేవు
వలపెంతగలిగినా వలదనేనా
చెలిమి నీ కందుండఁగా చేయి నాపైఁ జాఁచఁగాను
ఫలమేవంక వచ్చునో [1]పచ్చారేది దోసము ॥ మగ ॥

జోడుగా నాపెఁగలపి చుట్టరికాలు చెప్పేవు
వాడికె నేసుకొనఁగా వలదనేనా
ఆడ నాపె రాఁగా నన్నుఁగూడితి శ్రీవేంకటేశ
వేడుక నట్టె మొకము వేలించేది దోసము ॥ మగ ॥ 246

రేకు 1442 పాడి

తలఁచమైతిమి మీతగులాయము
చెలినిన్నేమిసేసినాఁ జెల్లునయ్యా నేఁడు ॥ పల్లవి ॥

వలచివచ్చిననారు వాకిటఁ గాచుకుండఁగ
తొలుతే విన్నికె యేల తొంగిచూచీని
సలిగె గలిగితేను సాదించకపోరాదు
తలిరుఁబోఁడికి విది తగునయ్యా నేఁడు ॥ తలఁ ॥

---

1. పచ్చి + ఆరేది.

కోరి సతులెల్లా నీకుఁ గొలువులుసేయఁగాను
వూరకే వచ్చి తాను నీవొడిపట్టీని
యీరీతి మీపొందులొత యెఱఁగమైతిమి నేము
కూరిమికాంతకు నిదె గుణమయ్యీ నేఁడు ॥ తలఁ ॥

నెట్టుకొని సవతులు నీపాదము లొత్తఁగాను
గట్టిగా నీవద్దఁ బండి కాఁగిలించీని
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి మమ్మిందరి
జట్టిగొన్నయింతి కిది సాజమయ్యీ నేఁడు ॥ తలఁ ॥ 247

ఆహిరి

ఇంతకంటె నేమిసేతు యింతులాల చెప్పరే
అంతటా నావోజలు తానన్నీ నెఱుఁగునే ॥ పల్లవి ॥

చెల్లఁబెట్టవద్దుగాని సేసినచేఁత చెప్పితే
చల్లఁగానే అందుకిట్టె సంతోసించేనే
కల్లకు నోరువఁగాని కాంత నెప్పటెఁ దెమ్మన్నా
యెల్లవారుఁ జూడఁగానే ఇంటికిఁ దెచ్చేనే ॥ ఇంత ॥

దాఁచుకొనవద్దుగాని తనమేనిగురుతులు
వూఁచి నాకుఁ జెప్పితే విప్పుడు మెచ్చేనే
రేఁచవద్దుగాని వొకరీతి గుట్టునుంటే
వూఁచకదాఁచక నేనూ నొద్దికై మొక్కేనే ॥ ఇంత ॥

వింతసేయవద్దుగాని వెస నాకెఁ బేఁడ్లాడితే
పంతములాడక సోబానఁ బాడేనే
ఇంతలోనె శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గూడె
బంతి నాపె దేవరఁగా భావించేనే ॥ ఇంత ॥ 248

## గౌళ

ఇందుకు సిగ్గువడఁగ నింత యేఁటికి
కఁదువై ననీవలపు కట్టిపెట్టవచ్చునా ॥ పల్లవి ॥

యేకడ నెవ్వఁరిమన నెట్టుఁడినా నుండెఁగాక
ఆకెకు నీవు విడెమంపఁదగదా
వాకున నే మాడుకొన్న వారికే తెలుసుఁగాక
ఆకడ నీ వాకెకుఁ బ్రియముచెప్పఁదగదా ॥ ఇందు ॥

కంటగించి సవతులు కాఁతాళింతురుగాక
నంటున నీ వాకెతోఁద నవ్వఁదగదా
అంటి తాము సన్న సేసుకొంటేఁగొవిరిగాక
జంటతో నీ వాకెమోవి చవిగొనఁదగదా ॥ ఇందు ॥

దూరి తాము నిన్ను కాలఁదొక్కితేఁ దొక్కిరిగాక
ఆరసి నీవాపెఁ బెండ్లియాడఁదగదా
కూరిమి నన్నేలితివి గొబ్బున శ్రీవేంకటేశ
గారవించి నీ వందరిఁ గరుణించఁదగదా ॥ ఇందు ॥ 249

## సామంతం

ఇందుకే వెరగయ్యీని ఇటు నిన్నుఁజూచి నాకు
కందువ నీనేరుపెల్లాఁ గానవచ్చెనే ॥ పల్లవి ॥

పొదిగి నాపతితోను పొత్తుల మాటలాదేవు
కదిసి చుట్టరికము గలపేవు
అదనఁ బెండ్లిపీఁటపై నందఁ గూచుండవచ్చేవు
ఇదివో నీజాణతన మేమి చెప్పేదే ॥ ఇందు ॥

అతనివదినెనంటా నట్టె వావులు చెప్పేవు
కాతరాన వట్టిపూడిగాలు సేసేవు
చేతిలోవివిదేనకు చెలఁగు నీవొగ్గేవు
యేతరి నీయానోద మేమిచెప్పేదే ॥ ఇందు ॥

యిద్దరము నుండఁగాను యేకతములాదేవు
అద్దుక యితనికి పయ్యద గప్పేవు
వొద్దిక శ్రీవేంకటేశుఁ డొనర నన్నేలినాఁడు
యిద్దెస నీమంచితన మేమిచెప్పేదే ॥ ఇందు ॥ 250

నాదరామక్రియ

ఎంతవేడుకోకావి యింతి నీపైవి
కాంత నేలఁదు రావయ్య కాచుకున్నది ॥ పల్లవి ॥

చెలియకు నీసుద్దులు చెప్పినంతటిలోననే
చెలపచెమట లవే చెక్కులవిఁ(నిం)డె
అలరి నీవుంగరము అట్టె వొదగంటానే
మొలకనవ్వులు విండె మోవిమీఁదను ॥ ఎంత ॥

నీచెలినవి ముందట విలుచున్న యపుడే
లాచి మోమునవెల్లాఁ గళలుదేరెను
చూచి నీకానవాలునేఁ జూపేనవి యడిగితే
కాచుక మైఁబులకలు కమ్మకొవి మించెను ॥ ఎంత ॥

నీరాక యెఱిఁగి యిట్టె నేఁ దలుపుదెరచితే
చేరి నీ కెదురువచ్చి సిగ్గువడెను
యీరీతి శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
తారుకాణ వచ్చితేను తగ నన్ను మెచ్చెను ॥ ఎంత ॥ 251

### శ్రీరాగం

ఆసపడ్డచెలులకు నాతురబంధుఁడు తాను
రాసికెక్క నింతలోనే రావద్దా తాను ॥పల్లవి॥

పెక్కుమారులు తను నేఁ బేరుకొవి పిలువఁగా
పక్కన నారమణుఁడు పలుకవద్దా
దిక్కులనెల్లా నేను తేరకొని వెదకఁగా
చొక్కఁగఁ దనరూపము చూపఁగవద్దా ॥ఆస॥

అసురుసురై తన్ను నటు నేఁ దలఁచఁగాను
వెస నాచన్నులపైఁ జేఇ వేయవద్దా
కొసరి తనపొందులు కోరుకొసివుఁడఁగాను
[1] ముసిపిదీర మాఁటలు మంచియాడవద్దా ॥ఆస॥

వెలలేనిజవ్వనాన వేడుకపడి వుండఁగా
కలసి కాఁగిట నన్నుఁగ్రై కొనవద్దా
అలరి శ్రీవేంకటేశుఁ డంతలో నన్నిదె కూడె
మలసి యెప్పుడు పిట్టె మన్నించవద్దా ॥ఆస॥ 252

రేకు 1443

### శ్రీరాగం

గుట్టుతో నుండుటే మేలు గుణవంతురాలికి
ఇట్టె నీవు వలెనంటే ఇయ్యకొనఁదగును ॥పల్లవి॥

పక్కనఁ జూచినచూపు భావించి చూచినచూపు
మొక్కలాన వింతికుచములపై నాఁటె
ఇక్కువలంటి విన్ను యెవ్వతె చెనకినాను
మిక్కిలి నీకూళతనమే మీఁదమిక్కిలౌను ॥గుట్టు॥

1. ముసిమి=ప్రేమానుబంధము అని వా.ని. ఇది. దానివ్యావహారికము కావచ్చు.

తగుల నాడినమాట తమితో నాడినమాట
వోగి నాపెకుఁబట్టినవుంకువాయను
జిగి విన్నెవ్వతె ఇఁకఁ జెఱఁగువట్టితీసినా
వెగపై యెడ్డతనమే వెల్లావిరియౌను ॥గుట్టు॥

సంతపించినట్టినవ్వు సరసమాడిననవ్వు
ఇంతలో నాపెకాఁగిటి కిరవాయను
చెంతల శ్రీవేంకటేశ చేరి నన్నుఁ గూడితివి
వంతదిగితే నాపెకు జంతతనమౌను ॥గుట్టు॥ 253

## రామక్రియ

జీరదీసేనా నీపై నాచిత్తమేమి యరసేవు
చేరి నీ చెప్పినట్టెల్లా సేవసేవతుఁగాక ॥పల్లవి॥

కన్నుల జంకించితేను కాదనేనా నిన్ను
వన్నుల నీవు దిట్టితే సాదించేనా
చన్నులు విసికితేను చలపట్టిపెనఁగేనా
అన్నిటా నీచేఁతకు లోనై వుండుదుఁగాక ॥జీర॥

కొప్పువట్టి తీసితేను కోపగించేనా విన్ను
చిప్పిలఁ జెనకితేను చేయివట్టేనా
ముప్పిరి గోరమూఁదితే తప్పించుకోఁజూచేనా
యెప్పుడూ నీకిచ్చకమై యెనయుదుఁగాక ॥జీర॥

బలిమి నీవు పైకొంటే పంతములాడేనా
వల పెంతరేఁచినాను వలదనేనా
యెలమి శ్రీవేంకటేశ యింతలో వన్నేలితి
తొలుతటివలెనే సంతోసింతుఁగాక ॥జీర॥ 254

### శుద్ధవసంతం

తానెంత నేనెంత తలపోసి చూచితేను
కానికిచ్చి తనమతి కరఁగించేనా ॥పల్లవి॥

కేలుచాఁచి నాగుబ్బలు గిలిగించీ నూరకే
నాలికాఁడు; తనతో నవ్వేనా నేను
పాలుపడి నన్ను విట్టె పాదాలు విసుకుమనీ
మేలువాఁడు తను మెప్పించేనా ॥తానెం॥

పలుమారు నాతోను పైకొని పెనఁగీని
చలపాదివాఁడు తాను; సాము సేసేనా
[1] తిలకించి యిటు నన్ను దిష్టించి చూచీని
బలిమికాఁ డన్నిటాను పంతమాడేనా ॥తానెం॥

జోడుగూడి నన్నిట్టె చొక్కించీని రతులను
కోడెకాఁడు తన్ను నే గోరఁగిరేనా
యీడనె శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నాదరించె
పాడిగలవాఁడు తాను బాసగొనేనా ॥తానెం॥ 255

### దేసాళం

ఇదియే నావిన్నపము యిఁకఁ దనచిత్తము
వదలక పైకొంటిఁబో వసమయ్యీనా ॥పల్లవి॥

మగఁడు దా నియ్యకొంటే మంచిదౌఁగాక వలపు
మగువకుఁ గలిగెఁబో మంతుకెక్కీనా
తగులమితో వింటే తగవింపౌఁగాక మాట
జిగిఁ దనతో నాడెఁబో నెలవయ్యీనా ॥ఇది॥

1. తిలకించి=ప్రసన్నతనొంది అని వా. వి. ఇదే ఇక్కడ సరిపోవుచున్నది.

చేరి తా నాదరించితే చెల్లుబడౌఁగాక నవ్వు
పూరకే నాకు వచ్చేఁబో వొద్దికయ్యీనా
గారవించి కైకొంటే కడునాటుఁగాక చూపు
యీరీతి నేఁ జూచితిఁబో యితవయ్యీనా ॥ ఇది ॥

తమకించి తా నంటితే తగులౌఁగాక కాఁగిలి
చెమరించి పొందితిఁబో సిగ్గుమానీనా
నెమకి నన్నుఁ గూడె తానె శ్రీవేంకటేశుఁడు
అమరెఁబో పనులెల్లా నంటువాసీనా ॥ ఇది ॥ 256

మాళవిగౌళ

సరిగా మన్నించవద్దా సవతుల నందరిని
సొరిదిఁ దమమోములు చూచుకొనే రిందరు ॥ పల్లవి ॥

సముకాన నుండి యాపె సలిగెలు చూపఁగాను
తమితో నవ్వులు నవ్వి తనరఁగాను
జమళిఁ జేతులు వేసి సాము నీతోఁ జేయఁగాను
చెమటల తాముఁ జూచి సిగ్గువడే రిందరు ॥ సరి ॥

తగిలి తగిలి యీకె తతిగొని చూడఁగాను
మిగులా సరసమాడి మెచ్చఁగాను
పొగరునీచేఁతలకు బొమ్మల జంకించఁగాను
అగపడి కరఁగేరు ఆసతో నిందరును ॥ సరి ॥

అలమేలుమంగ విన్నుఁ అంటి కాఁగిలించఁగాను
చెలరేఁగి అట్టె సారెఁ జెనకఁగాను
యెలమి శ్రీవేంకటేశ ఇదె నీవోజ మెచ్చఁగా
సొలసి తామునుఁ గూడి చొక్కి రిందరును ॥ సరి ॥ 257

బౌళి

మీరిద్దరు నొక్కటే మేమెంతటివారము
కోరి మిమ్ము విట్టె కాదుగూడదనఁగలమా ॥ పల్లవి ॥

సిగ్గువడియుండినాపెఁ జెఱఁగుపట్టి తీసితే
యెగ్గులెల్లా విన్ను నాపె యెంచకుండునా
వెగ్గళించి చెలులతో వేమారు నానతిచ్చేవు
బగ్గనఁ బంతమిప్పించి పాదిదిద్దఁగలమా ॥ మీరి ॥

కొలువులో నుండఁగాను కొమ్మచన్ను లంటితే
చలపట్టి విన్ను విట్టె జంకించవద్దా
తలకొని నీవింరు కందరి సాకిరివెట్టేవు
పిలిచి మిమ్ముఁ గాఁగిలింపించఁగలమా ॥ మీరి ॥

మంతనమాదేయలమేల్మంగనుఁ జెనకితేను
పొంతఁ జన్నుల విన్నొత్తి పొందకుండునా
ఇంతలో శ్రీవేంకటేశ యెనసితి వీకెను
వంతువెట్టి మీ కింకాను వాసిరేఁచఁగలమా ॥ మీరి ॥ 258

రేకు 1444 దేవగాంధారి

అటుగాన బలిమిసేయఁగరాదు రమణుని
యెటువలెనైనాను యిచ్చకమే మేలు ॥ పల్లవి ॥

చనవుగలకొలఁదే సరసాలు
ననిచినకొలఁదే నగవులు
వినయముకొలఁదే వేడుకలెల్లా। పట్టి
పెనఁగరా దింతులకు ప్రియునితోను ॥ అటు ॥

మన్ననకొలఁదివే మాటలు
సన్నలకొలఁదివే సంగాతాలు
అన్నిటా మెచ్చుకొలఁదే ఆదరింపులు। పతిని
మిన్నక కొసరరాదు మెలుఁతలకు ॥ అటు ॥

చుట్టరికముకొలఁదే సొలపులు
పట్టినకొలఁదివే పంతములు
అట్టె శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
ఇట్టుగా నన్నేలితి వాఱడి సేయరాదు ॥ అటు ॥ 259

శంకరాభరణం

తా నెఱఁగఁడా యీతగవులెల్లా
వీనులకు వింపుగాను విన్నవించఁగదరే ॥ పల్లవి ॥

సేసవెట్టి పెండ్లాడి చెలియను మగవాఁడు
వేసటతోఁ [1]బెదవాద వేయఁదగునా
ఆసకొలిపి రప్పించి యాపె నంతలో మొఱఁగి
వోసరించి వేరొక్కతెఁ బొందఁదగునా ॥ తానె ॥

చిట్టంటుచేఁత చేసి చేతికి విడెమిచ్చి
గుట్టుతోఁ బరాకు సేసుకొనఁదగునా
అట్టె సరసములు తా నాడుతా నేఁ జూడఁగానే
నట్టనడుమ నాపెతో నగఁదగునా ॥ తానె ॥

తాలిమితో నాకాఁగిటఁ దగిలి పెనఁగుతానే
లాలించి యెవ్వతెనో తలఁచఁదగునా
ఆలించి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
మేలువాఁడు నాకుఁ దాను మితిమీరఁదగునా ॥ తానె ॥ 260

1. పెదవాద=ఇలువరుసమార్పు, లేక వరుసమార్పు?

అహిరి

ఇదివో నావిన్నపము ఇఁకనేమి ననవోప
యెదలో వలపు నీవే యెరుఁగుదువు ॥పల్లవి॥

చలపాదిదానఁ గాను సాదించేటిదానఁ గాను
తలకొని నిన్నుదూరేదానఁ గాను
వలపులకాఁకల వసివాడనోపక
వెలినుండి నీకు విన్నవించేదానఁగాని ॥ఇది॥

పెనఁగేటిదానఁ గాను బిగిసేటిదానఁ గాను
తనియక కక్కసించేదానఁ గాను
మనసు నీకొప్పగించి మాటల నిన్నుఁ బొగడి
వినయముతో విన్నవించేదానఁ గాని ॥ఇది॥

విరసపుదానఁ గాను వెక్కసపుదానఁగాను
తరితీపుతోఁ గలసేదానఁ గాని(ను?)
విరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
వెరవుతో మొక్కి విన్నవించేదానఁగాని ॥ఇది॥ 261

కేదారగౌళ

మీరెఱుఁగరటరే మెలఁతలాల
చేరి నన్నెంతేసి గరిసించేరే చెలులు ॥పల్లవి॥

వల పెంత గలదని వర్ణించి యడుగనేల
తలపెంతగలిగె నెంతయు నంతే
చెలిమి కొలఁదివెట్టి చెప్పిచూపఁగరాదు
కెలయు రాకొట్ల కిచ్చగించుటే కొలఁది ॥మీరె॥

సింగారము లెక్కవెట్టి చెలఁగి వర్ణించనేల
అంగమెంత గలిగెను అంతానంతే
తోఁ(తొం?)గిచూపు లాసలకు తొడర నెందాఁకా గురి
పంగెనలేక కలసి పాయకుండుటే గురి ॥ మీరె ॥

రతికాంత కొలవెట్టి రచ్చలో వర్ణించనేల
పతిఇతవెంత తనభావమూ నంతే
తతి శ్రీవేంకటేశుఁడు తా నలమేలుమంగను
సతమై కూడియుండేది సాజమే యిద్దరికి ॥ మీరె ॥ 262

పాడి

చెప్పరాదా నాతోను చెవులారా వినేఁగాని
వుప్పతిలఁజెమట లే లూరినయ్యా మేనను ॥ పల్లవి ॥

వాడికమాట లాడి వచ్చేనంటాఁ జెప్పిపంపి
యేడనుంటివయ్యా నీ విందాఁకాను
జాడదప్పక నాతోనే సరసములాడితివి
వీడె మెవ్వతిచ్చెనయ్యా వేడుకతో నీకు ॥ చెప్ప ॥

బలిమి నన్నుఁ బెండ్లాడి బాసలెల్లా నాకిచ్చి
తలఁచే దెక్కడవయ్యా తమితో నీవు
కలదెల్లా నామీఁదనే కందువవలపు నీకు
చెలి మేడఁ గల్గెనయ్యా చెలులతో నేఁడు ॥ చెప్ప ॥

తామెరపువ్వున వేసి తగ నన్నుఁ గాఁగిలించి
యేమగువఁ జూచేవయ్య ఇప్పుడు నీవు
ఆముక శ్రీవేంకటేశ అలమేల్మంగనే నేను
కామించి నన్నేలితివి కానీవయ్యా మెచ్చితి ॥ చెప్ప ॥ 263

బౌళి

నీముందరికి రారాదా నేఁడు వెలయాండ్లకు
  ఆముకొని సరసములాడవచ్చేవు ॥ పల్లవి ॥

చుట్టపువరుస నాపె సుద్దులు నీకుఁ జెప్పఁగా
  గట్టిగాఁ గాలుదొక్కేవు కదనుండి
  గుట్టుతోడ నీవొద్దఁ గొలువు సేయఁగాను
  చిట్టంటుచేఁతలు చేసి చెక్కులు నొక్కేవు ॥ నీముం ॥

నెలఁత వేడుకలకు నీమొగము చూడఁగాను
  చెలరేఁగి చన్నులపైఁ జేఇ వేసేవు
  నెలవుల నవ్వుకొంటా నెంగట నిలుచుండఁగా
  కలువపువ్వుల వేసి కాఁగిలించేవు ॥ నీముం ॥

సారె నీమాటలు విని సంతోసాన నవ్వితేను
  గారవించి పచ్చడము గప్పి కూడేవు
  ఆరసి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
  సారె నన్నేలి యాపెను జంటలుసేసేవు ॥ నీముం ॥ 264

రేకు 1445 బౌళి

నీసుద్దులు వింటేను నిచ్చకొత్తలు నీకు
  ఆస యెంతైనాఁ గద్దు ఆఁడువారిమీఁదను ॥ పల్లవి ॥

యేదనుండితి విందాఁకా నెవ్వతె నీతో మాటాడె
  జాడతో నీపొందులెల్లా సాగివచ్చునా
  వేడుకకాఁడవు తొల్లె వేసారవు నీ వెపుడు
  వాడికగా మాఇంటికి వచ్చితివి నేఁడు ॥ నీసు ॥

నేయవఁసినదేమి చెంత నీకేమి ప్రియము
కాయజకేలి నీమతి కాఁకదేరెనా
చాయసేసుకోఁగలవు జాణతనాలు నేర్తువు
చేయిమీఁదుగా మముఁ జెనకి వచ్చేవు ॥ నీసు ॥

యెట్టివి నీతలఁపులు యెన్నఁడు నీకాఁగిలి
నెట్టుకొన్ననీకోరికె నెరవేరెనా
యిట్టె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
గుట్టున మమ్మేలితివి కోవిదుఁడ వౌదువు ॥ నీసు ॥ 265

### హిందోళవసంతం

ఎటువఁటియాగడములు యీపెసుద్దులు
కటకటా నీవే యిది గయ్యాళి యనవా ॥ పల్లవి ॥

కిమ్మల సతులెల్లాను కేరికేరి నవ్వఁగాను
తమ్మల మొసఁగేవు యీతరుణికివి
యెమ్మెలకు నీవీపెను యేమేమి సేసినాను
ఇమ్మల సిగ్గువడని దేఁటియాఁటదనరా ॥ ఎటు ॥

చెంత నున్నవారెల్లా చెవులు మూసుకొనఁగ
యెంతపచ్చిమాట లాడే వీపెతోను
వింతనేసి నీ వెంతవేడుకకాఁడవైనాను
ఇంతేసి అట్టడియైతే నేఁటియాఁటదనరా ॥ ఎటు ॥

చేరి వూడిగపువారు శిరసులు వంచుకోఁగా
సారెఁ గాఁగిలించే వీసతివి నీవు
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
యేరా నన్నేలితి వాపె నేఁటియాఁటదనరా ॥ ఎటు ॥ 266

### లలిత

[1] చూతువు రావమ్మా నీసుతుని యశోదమ్మ
భూతులఁ దిట్టే వద్దంటే పొలఁతులనెల్లను ॥ పల్లవి ॥

పొదవాటివుట్లెక్కి బిడుగులతోడివెన్న
తొడికిపెట్టేఁ దనతోడివారికి
కడవలపాలమీగడలు దేవుకతిని
కడకుఁ బాలెల్లాఁ గార కంతలునేసీని ॥ చూతు ॥

అక్కజపురోళ్లెక్కి అట్టుగపై దాఁచిన-
చక్కిలాలు సురుఁగులుఁ జవిగొనీని
వెక్కసానఁ బట్టరాక వీదులఁ బారాడుతాను
మొక్కలాన నెత్తుకొంటే ముద్దులువెట్టీని ॥ చూతు ॥

పన్నారుదొంతు లెక్కి బావలపెరుగు నేయి
చెన్నుమీర నారగించి చేరి నవ్వీని
అన్నిటా శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవిభుఁడు
వన్నెలఁ గ్రిష్ణుఁ డింటింటివాకిటఁ బొంచీని ॥ చూతు ॥ 267

### దేసాళం

ఇందరివినోదాననే యిట్లున్నాఁడు
చెంది సొమ్ములెల్లాఁ బెట్టి సింగారించరే ॥ పల్లవి ॥

మేడలోన నున్నవాఁడు మిక్కిలితమకమున
పాడించుకొంటా నున్నాఁడు భామలచేత
వూడిగపుసతులాల వొద్ద నుండఁగదరే
వీడెమీరే అడపము వెలఁదులాల ॥ ఇంద ॥

---

1. ఇది ఆధ్యాత్మకీర్తనలచాయలోనిది.

పరగ గద్దెపైనుండి పాత్రకత్తెలచేత
గరిమ నాడించుకొంటా కడుఁజొక్కని
సిరులఁ గట్టికవారు సేయరే బరాబరి
వరుస నాలవట్టాలవారెల్లా విసరరే ॥ ఇంద ॥

శ్రీవేంకటాద్రి నున్నాఁడు జిగి నలమేల్‌మంగను
యీవేళఁ గూడియున్నాఁడు యీ దేవుఁడు
వేవేగఁ దెరవేయరే వెసఁ జనవరులాల
బూవపుసవతులాల పొగడరే మీరు ॥ ఇంద ॥ 268

మాళవి

వేసాలెల్లాఁ జేసేవు వింతవావివలెనే
పాసికూడి వలపించ పంతమా నాకు ॥ పల్లవి ॥

పూవి చెలులచేత నన్నొదఁబరిపించేవు
ఔనయ్య నీమాటకు నే నడ్డమాడేనా
అనుకొవి సొమ్ములు నా కంతలోనే వాసగేవు
కానీవయ్యా నే నాసోదకత్తెనా ఇపుడు ॥ వేసా ॥

వరుసతో నూరకైనా వావులు నన్నడిగేవు
వొరసి నీ వంటఁగా నే నోపవనేనా
గరిమతో వీడెమిచ్చి కడు నుబ్బరేఁచేవు
తరితీపుతోడి [1] విదరవెల్లిదాననా? ॥ వేసా ॥

ఆదరిపాటున వచ్చి అట్టె కాఁగిటఁ గూడేవు
యెదుట నన్నేలఁగా విన్నెలయించేనా
అదన శ్రీవేంకటేశ అలమేల్‌మంగనే నేను
పదరి నీతో నేను పాసివుండఁగలనా ॥ వేసా ॥ 269

1. వేదురువెల్లి, వేదరుశబ్దము వ్యావహారికముగ 'వేదర' కాగా "వే" కు బదులు 'వి' లేఖక ప్రమాదమేమో, విదురువెల్లి=పిచ్చిపొంగిన (దానవా)అని కావచ్చు.

నాగవరాళి

ఈపాటివాఁడవు మాయింటికే రారాదా
యేపొద్దూ నీతమకమే యింతసేసీఁగాక ॥ పల్లవి ॥

సతులెల్లాఁ జూడఁగాను జారఁదీసేవు పయ్యద
రతికి వేళలేదా యీరవ్వ వలెనా
పతివై తేనేమి మాకుఁ బాటించవద్దా సిగ్గు
అతిజవ్వనము విన్ను నాడించీఁగాక ॥ ఈపా ॥

కొలువులోపలనే సిగ్గులుమోవ మాటాడేవు
వలపు పచ్చిసేతురా వానివలదా
యిలపై జాణఁడవై తేనేమి మాకు వద్దా గుట్టు
పెలుచుఁదనము విన్ను పెడరేఁచీఁగాక ॥ ఈపా ॥

వూడిగము సేయఁగానే వొద్దికఁ గాఁగిలించేవు
యీడుజో డెఱఁగవద్దా యించుకైనాను
యీడనె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కూడితివి నీకరుణే గురిసేసీఁగాక ॥ ఈపా ॥ 270

రేకు 1446 దేవగాంధారి

కాదని వేసరేవా కరుణించినవాఁడవు
పాదుకొని వొద్దనే పాయకుండువుగాక ॥ పల్లవి ॥

నన్ను నింతగా నేలి నమ్మించినవాఁడవు
విన్నపము సేయనేల వేమారు నీకు
సన్నలాదాయలా నాచనవులు చెల్లించి
మన్నించి నీవే యెరిఁగి మనిపేవుగాక ॥ కాద ॥

అట్టె నాచే సేవగొని ఆదరించినవాఁడవు
దిట్టవై నాగుణములు తెలుపనేల
నెట్టన నీమహిమలు నీవే తలఁచుకొని
రట్టుగా నను రక్షించే విట్టె నీవేకాక ॥ కాద ॥

పొత్తున నన్నుఁ బెట్టుక భోగించినవాఁడవు
బత్తి నీకుఁ జేసిచూపఁగనేల
హత్తి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
సత్తుగాఁ గూడితివి మెచ్చఁగఁదగుఁగాక ॥ కాద ॥ 271

## బౌళిరామక్రియ

నే నితఁడు మాటాడితే నీవు అడ్డాలు రానేల
ఆనుక నీవే నాతో నటు సన్నసేసేవే ॥ పల్లవి ॥

యేతుల నీకు గలితే యింటిలోఁ జేతువుగాక
కాతరించి యిందరిలో గర్వమేఁటికే
నీతులు నేరుచుకొంటే నీవే నడతువుగాక
పోతరించి నీవు మాకు బుద్ధిచెప్పనేఁటికే ॥ నేని ॥

తనివితోడఁ జక్కనిదానవైతే నౌదుగాక
యెనలేనిమురిపెములు యీడనేఁటికే
యెనసి చుట్టమవైతే నెట్టయినా నౌతగాక
మొనసి మాకిటు నాయములు చెప్పనేఁటికే ॥ నేని ॥

సేయ నోపికగలితే సేవలు సేతువుగాక
పాయపుమదముతోడి పంతమేఁటికే
యీయెడ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
పాయక నన్నుఁగూడె నీవస చెప్పనేఁటికే ॥ నేని ॥ 272

### సామంతం

చేరి నన్నుఁ జూచి యేలసిగ్గువడేవు
నేరుపు నీకెంతగద్దో నే నెరిఁగేఁగాని ॥పల్లవి॥

ఆస నీకుఁ గలిగితే నాతవిపాదా లొత్తవే
మూసిదాఁచనేల నీమోహ మీదను
సేనవెట్టవలసితే చేతులు చాఁచవే
వేసాలేల వద్దనే వీఁడే వున్నాఁడు ॥చేరి॥

మనసు నీకు వచ్చితే మాటలెల్లా నాడవే
యెనలేక గుబ్బతిలనేలే లోలోను
పని నీకుఁ గలిగితే పానుపుపైఁ బండుండవే
అనుమానించఁగనేల అదనే వున్నాఁడు ॥చేరి॥

వేడుకైతే చేతనున్నవిడె మిప్పించుకోవే
వాఁడుమోముతోడ నవ్వఁగవలెనా
కూడె శ్రీవేంకటేశుఁడు కోరి యలమేల్మంగను
వాడిక మెచ్చవే నాకువలచివున్నాఁడు ॥చేరి॥ 273

### మాళవిగౌళ mp3

చెలులాల చూడరే యీచెలిభాగ్యము
అలమేలుమంగ యీకె కబ్బెను యీభాగ్యము ॥పల్లవి॥

పతిదయగలిగినపడఁతి దీభాగ్యము
అతఁడు మాటమీరనీ దది భాగ్యము
సతతముఁ బాయక జంటైవుండేది భాగ్యము
అతివలెందరుగల్లా నది యేమిచెప్పేరే ॥చెలు॥

మగఁడుమన్నించినమగువది భాగ్యము
సొగిసి యాతఁడు మోహించుట భాగ్యము
వెగటులేవిరతుల వేసరవిది భాగ్యము
మగువలవలపులు మరి యేమిచెప్పేరే ॥ చెలు ॥

శ్రీవేంకటేశుఁ డేలె మచ్చిక నీసతిది భాగ్య —
మావేళ నాతఁడు మెచ్చినది భాగ్యము
తావుకొని యెప్పుడూఁ దనవాఁడౌటే భాగ్యము
యేవనితలనేరుపు లిఁక నేమిచెప్పేరే ॥ చెలు ॥ 274

## పాడి

ఏఁటికిఁ గొసరవలె నీతఁ డిన్నిటా జాణ
దాటువగా తానే నాకుఁ జనవిచ్చీఁగాక ॥ పల్లవి ॥

ఆలినేలేటివాఁడే అన్నిబుద్ధులనుఁ జెప్పు
లాలించి భోగించనేర్చు లాగులుగాను
మేలుగలిగినవాఁడే మిక్కిలివేడుక చూపి
పాలించి మేలములాడి పవిగొననేర్చును ॥ ఏఁటి ॥

నేసలు వెట్టినవాఁడే సిగ్గుతో వహించుకొని
వాసితో మనుపనేర్చు వన్నెకెక్కను
ఆసకొలిపినవాఁడే ఆదరానఁ గాఁలించి
వేసటలేక వలపు వెలయించనేర్చును ॥ ఏఁటి ॥

రతిఁ గలసినవాఁడే రమణతో మోవియిచ్చి
మతికి సంతోసముగా మన్నించును
ఇతఁడు శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
ఇతవెరిఁగి సారెకు నెనయఁగనేర్చును ॥ ఏఁటి ॥ 275

ఆహిరి

వేగిరించి చూచితేను విరసమౌ వలపెల్లా
బాగుగా నిచ్చకములే పచరించవలెను ॥పల్లవి॥

పతిచిత్త మెఱిఁగి గొబ్బన మాటాడఁగవలె
హితవుచూచుక విడె మియ్యవలెను
తతి దెలుసుకొని యత్తరి సేవసేయవలెను
చతురతతో మెలఁగేజవరాలికి ॥వేగి॥

చనవిచ్చినప్పుడే సరసమాడఁగవలె
వొనరఁ జాఁచితే పాదా లొత్తవలెను
ఘన నింపుగలిగితే విన్నపము సేయవలె
పెనఁగి పైకొనరాదు ప్రియురాలికి ॥వేగి॥

నాటినపొందులైతేను నవ్వులు నవ్వఁగవలె
చోటిచ్చితే పక్కనుండి చొక్కించవలె
యీటున శ్రీవేంకటేశ యిట్టి దలమేలుమంగ
కూటము లిట్టె చెల్లు గుణవంతురాలికి ॥వేగి॥ 276

రేకు 1447 కాంబోది

సంతోసించుకొందుఁగాక సతినై నేను
వింతలుగా మరి విన్నవించేటిదేఁటిది ॥పల్లవి॥

యెందరు సతులుండినా యేలేటివాఁడవు నీవు
పొందేటివేడుకలభోగము నీది
ముందే నేర్పులకెల్లా మూలపుగుణము నీది
విందుల నిఁక నేము విన్నవించేదేఁటిది ॥సంతో॥

వారివారిపై పెరిఁగి వలపించుకొంటివి
గారవించనేరిచినకరుణ నీది
కోరికెరిఁగి లాలించుకొనేది నీకిరితి
చేరి నీకు విన్నపము సేసే దిఁక నేఁటికి ॥ సంతో ॥

యిచ్చ యెరిఁగికలసేఇంపులు నీచతురత
మచ్చికరతులలోనిమహిమ నీది
హెచ్చినశ్రీవేంకటేశ యేనలమేలుమంగను
విచ్చనవిడి నీకు విన్నవించేదేఁటిది ॥ సంతో ॥ 277

సాళంగనాట

ఆపెఋఁగు నీ వెఋఁగు దాలోనిపనులెల్ల
యేపున విన్నవించితి మిదిగో చెలులము ॥ పల్లవి ॥

యేమని చెప్పింపుదువో యేవేళ వత్తువో యని
కామిని యాడ నీవేళ గాచుకున్నది
నీమన సెట్టువచ్చునో నీవూడిగ మబ్బు పెట్టో
యీమేర నుందాననని యెంచుకొంటా నున్నది ॥ ఆపె ॥

యెప్పుడు మోము చూతువో యేసన్న నేతువోయని
చొప్పుగా నీవంకే చూచుకవున్నది
మెప్పించుకొందునో నీవు మేలమాడుదువోయని
చప్పు డాలించుకొంటా నచ్చట నదె వున్నది ॥ ఆపె ॥

కందువకుఁ బిల్తువో ఇక్కడఁ గూడుదువోయని
పొంది నీపానుపుమీఁదఁ బొంచుకున్నది
అందపుశ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
చెంది నీకాఁగిటఁ గూడి చెలరేఁగుచున్నది ॥ ఆపె ॥ 278

## సామంతం

ఏమిసోద్యమే యీవేళ సతికి
కామునిబలములు కైవశమాయ ॥ పల్లవి ॥

సుదతి నీదుపం(పం?)జులవెలుఁగంటా
వుదయచందురుని కెదురేఁగి
ముదమునఁ గాశెలమోతలనుచు మరి
కొాదమతుమ్మిదలకూఁతల కలరె ॥ ఏమి ॥

తోడనె పెక్కువుదొడ్డపువుఁజులని
నీడలతరువులు నిక్కి చూచి
కేడించుగాలికిఁ గెరలినపుప్పొడి
చూడ ధూళియని వేడుకపడియె ॥ ఏమి ॥

చిం(చిం?)కదీర నీనేనపాలనుచు
చెంతనె విరులకు శిరసొగ్గి
యింతలో శ్రీవేంకటేశ నీవేలఁగ
సంతసమునఁ దనచందము దెలిసె ॥ ఏమి ॥ 279

## వరాళి

ఈకెసంది నీసంది [1]నెరవున్నదా
చేకొన్నదాఁకా గుట్టుసేసీ నింతేకాక ॥ పల్లవి ॥

చెలినేలినవాఁడవు చెలఁగువట్టఁగరాదా
కొలువులో సిగ్గుగాఁ గొంకీఁగాక
తలఁపు నీ వడుగఁగాఁ దగ విన్నవించరాదా
వలసి పరవశము మైమఱచీఁగాక ॥ ఈకె ॥

1. ఎరవు + ఉన్నదా.

నీవు వసంతమాడఁగా నీపై మారు చల్లరాదా
  నోవల సాదుఁదనము చూపీఁగాక
  పూవుల నీవు వేయఁగా పొంచి పట్టుకొనరాదా
  ఆవల మరుబాణాలని మానెఁగాక ॥ ఈకె ॥

వొట్టి రతివేళ నీకె నురమెక్కించుకోరాదా
  మట్టి దోసము గాకుండా మొక్కీఁగాక
  అట్టె శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
  గట్టిగా నీ యిచ్చెరిఁగి కాఁగిలించీఁగాక ॥ 280 ॥

హిందోళవసంతం

ఇందాఁకా నేనున్నజాడ యేమని చెప్పుదునయ్యా
  కందువ నాచెమటలు కమ్మి పుట్టింగించెను ॥ పల్లవి ॥

మంచిమాట నీవాడఁగాను మనసొక్కటాయను
  పెంచినకోవిలకూఁతాఁ బ్రియమాయను
  మించి నీవు నవ్వఁగాను మేను చల్లనాయను
  పొంచి ఇంటిలోవెన్నె లిప్పుడు చుట్టమాయను ॥ ఇందాఁ ॥

నీ పిదకు రాఁగానే విరుల ముడాయను
  ఆవేళ నావూర్పుగాలే అలపార్చెను
  కైవశమై నీవు గాఁగా కాఁపురము లీడేరెను
  తావుల నాకొలవిలో తామరపొందాయను ॥ ఇందాఁ ॥

కదిసి నీ వేలఁగా విక్కడ విట్టే చెలఁగితి
  ఇదె నావనముతీగె లింపులాయను
  ఆదన శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
  మొదలినాజవ్వనమే ముదము నొందించెను ॥ ఇందాఁ ॥ 281

బౌళి

వద్దనేమా తానే మాతో వచ్చి వొడఁబరచితే
ఇద్దరికిఁ దానే మూల మిన్నిటికిఁ గదవే ॥ పల్లవి ॥

తెగరానిమంకులకు తెలిపిచెప్పుట మేలు
తగులైనయెడకు నాదరించఁ బాడి
పగ సాదించరానిచో పక్కనఁ గూర్చుట దగు
తగవులు మాలో మాకు తానే తేర్చఁదగునే ॥ వద్ద ॥

అదలించరానివారి నట్టె వేఁడుకొంటే నీతి
సుదతులవాదు దీర్చుట సంగతి
వదలరానివారినెప్వగ మాన్పుట పుణ్యము
పొదిగి తానే మమ్ము బోదించఁదగునే ॥ వద్ద ॥

మచ్చరపునవతుల మట్టుపెట్టుట మంచిది
యెచ్చినవాసికత్తెల నేలుట గీర్తి
మచ్చిక నలమేల్మంగమగఁడు శ్రీవేంకటేశుఁ-
డిచ్చ మమ్ముఁగూడి తానే యాదేర్చఁదగునే ॥ వద్ద ॥ 282

రేకు 1448 కన్నడగౌళ

ఆతనితో నావిన్నప మదే యనవే
కాఁతరపునావలపు కారుకమ్మీననవే ॥ పల్లవి ॥

యెప్పుడూఁ దా మన్నించేది యెఱుఁగుదునవవే
యిప్పటినాతమి వోర్వవియ్యదనవే
తప్పులేదు తనమాట దయగలఁడనవే
రెప్పలెత్తి చూచుదాఁకా రేఁచీ నాసలనవే ॥ ఆత ॥

తిరమైననాపైబత్తి తెలిసితి ననవే
సరి విరహాన( బడ(జాల ననవే
కరుణించి నన్ను(కను కంటి నన్నీననవే
మరిగించి వట్టిజోలి మరియే(టికనవే ॥ అత ॥

తగ నన్ను( గూడినా(డు తల(తు నే ననవే
తెగనిరతుల( గాంక్ష దీరదనవే
జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశు(డు తాను
మిగులా నన్నేలినా(డు మెచ్చితి నేనవవే ॥ అత ॥ 283

## అహిరినాట

అయ్యో తనకేల లో(గ నది నాసంతోసమే
నెయ్యపువిభు(డు తాను నే( గాదనేనా ॥ పల్లవి ॥

ఘను(డు తా నెవ్వతెతో( గామించి నవ్వినాను
యెనలేనివే(డుకతో విట్టె చూచేనే
మనసిచ్చి యాపెకు తా మాటపట్టమిచ్చినాను
వొవగూడి యందుకెల్లా నొద(బఱచేనే ॥ అయ్యో ॥

తలచి యాపెపొందు తా( గోరినా సిదకు
పిలుచుక వచ్చి వొద్ద(బెట్టే నే నేను
చెలి నెంతపెద్దసేయ( జిత్తాన( గలిగినాను
కలకాల మాపె కూడిగముసేసేనే ॥ అయ్యో ॥

యిరవుగ( దా మిద్దరూ నెనసి వుండితేను
పరగ(గ( బఱచేనే పానుపు నేను
సిరుల నలమేల్మంగ శ్రీవేంకటేశు(డు తాను
సరి నన్ను నేలినా(డు చనవు చేకొంటినే ॥ అయ్యో ॥ 284

### కాంబోది

మెలుఁత ధైర్యమునకు మెచ్చవద్దా
తొలుత నీవన్నిటాను దొడ్డవాఁడ వౌదువు ॥ పల్లవి ॥

తరుణికి నీమీఁదితలఁపు గద్దుగనక
విరహమైనా మేలే వెతలేదు
మరిగి నీమీఁదిప్రేమ మనసు నిండెఁగనక
సరుగఁ జిత్తజునకు వెరవ దెంతైనను ॥ మెలుఁ ॥

అంగన ప్రాణములు నీయాస నున్నవిగనక
వెంగలినిట్టూర్పులకు వేసరదు
వుంగరము నీది వేలనుండఁగాఁ జూచీఁ గనక
ఊఁగదు తమక మెంత కొచ్చియెచ్చరించినా ॥ మెలుఁ ॥

చెలఁగి పాయము నీకు సెలవుసేసెఁగనక
తలకొన్నచింతలకు తలఁకదు
చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడవు నీ-
వలరి కూడితి విఁకే నందుకు జడియదు ॥ మెలుఁ ॥ 285

### ముఖారి

నే నెంతటివానను నీకేఁటికి లోఁగను
తానకమై యంత మొకదాకిరి సేసేవు ॥ పల్లవి ॥

చెలువుగలవాఁడవు చెల్లును సరసమాడ
వలచివాఁడవు నవ్వఁగఁజెల్లును
తలఁపుగలవాఁడవు తమకించాఁజెల్లును
బలిమిఁ దార్కాణించఁ బనియేమి నీకు ॥ నేనెం ॥

వేడుకగలవాఁడవు వినోదమాడఁగఁ జెల్లు
యీడై నవాఁడవు చనవియ్యఁజెల్లును
వాడికై నవాఁడవు వద్దఁబెట్టుకోఁజెల్లు
పాడిచెప్పి నన్ను నొడఁబఱచ నేమిటికి ॥ నేనెం ॥

కరుణగలవాఁడవు కాఁగిలించుకొనఁజెల్లు
యెరపులేనివాఁడవు యెనయఁజెల్లు
యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సరవిఁ గూడితి వెన్నిచనవు లిచ్చితివి ॥ నేనెం ॥ 286

దేసాళం

నీయిచ్చలోదాన నేను నీయితవే చూతుఁగాక
ఆయింతివి మారుకొన నరుదా నాకు ॥ పల్లవి ॥

యెలమి నీచిత్త మెప్పు డెట్టుండునో అనికాక
నెలఁతతోఁ బంతమాడనేరనా నేను
చెలికి నేమేమి బాసచేసితివో అనికాక
తలకొని మట్టుపెట్టఁదడవా నాకు ॥ నీయి ॥

యీసతిపై నే(నీ?)మోహ మెంతగద్దో అని కాక
వూసివాసు లెంచి మీరనోపనా నేను
వేసటతో నీమోము విన్ననౌనో అనికాక
తోసి యాపెయెమ్మె మాన్పదొడ్డా నాకు ॥ నీయి ॥

చెలఁగి నీవేడుకలు చెల్లింతు ననికాక
యలయిం చాపెను గెల్వ నెదురా నాకు
అలమేల్మంగనే నేను అట్టె శ్రీవేంకటేశుఁడ!
కలసితాపెను సాటిగలదా నాకు ॥ నీయి ॥ 287

గౌళ

కొమ్మలకు నిట్టివోజ కోటిసేసును
సమ్మతిగా నడచు టే సంసారఫలము ॥ పల్లవి ॥

నను పెంతగలిగినా నాయకునియెడాటాన
వినయములే వన్నె వెలఁదికిని
చన వెంతయిచ్చినాను సరసమాడేటివేళ
పెన(ఁ?)గకుండు టే కడుఁ బెద్దరికము ॥ కొమ్మ ॥

యెగ్గులేక వలచి తానెంత పచ్చిమాఁటాడినా
సిగ్గు నెరపుటే వన్నె చెలియకును
వెగ్గళించి యాతఁ డెంతవేడుకకు నవ్వినాను
వొగ్గి గుట్టుతో నుండు టొరపరితనము ॥ కొమ్మ ॥

వొలిసి శ్రీవేంకటేశుఁ డురముపై విడుకొన్నా
లలి మొక్కు టే మేలు యలమేల్మంగకు
కలసి మెలసి యెంతకాఁపురము చేసినాను
తలఁపులో మెలఁగుటే తగవైననేరుపు ॥ కొమ్మ ॥ 288

రేకు 1449 సామంతం

చెలులు తన్నెవ్వరెంతచేసినాఁ జేసిరిగావి
వలవనిగర్వాలు వారే కట్టుకోనీవే ॥ పల్లవి ॥

పొదిగి తనగుణాలు పొగడఁగఁదగుఁగాక
అద నెఱఁగక వెంగెమాడఁదగునా
వెదకి తానున్నచోటు విచారించఁదగుఁగాక
యెదుటఁ బరాకుతో నెలయించఁదగునా ॥ చెలు ॥

వైళము తాఁ జెప్పినటువలెఁ జేయఁదగుఁగాక
నాలిసేసి తనతోఁ బెనఁగఁదగునా
మేలుసేసినందుకు మెచ్చఁగఁదగుఁగాక
కూళతనమున మరీఁ గొసరఁగఁదగునా ॥ చెలు ॥

వొక్కపై పొందుసేసితే నొడఁబడఁదగుఁగాక
చక్కఁగా నెదమాటాడించఁగఁదగునా
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
దక్కె నాకు నతఁడు నేఁ దమకించఁదగునా ॥ చెలు ॥ 289

ముఖారి

నీవే నన్ను మన్నించేవు నేఁ గొసరే దేమున్నది
యీవలనావల నిన్ను నెచ్చరించనేఁటికి ॥ పల్లవి ॥

చక్కనివిన్నుఁ జూచి సతులు వలతురేకా
మక్కువ నీవు వారి మానరాదుగా
యెక్కువగా నిందరిలో నేలేవని వుందానఁగా
ఇక్కడ నాభాగ్యము యెంచఁగనేమిటికి ॥ నీవే ॥

మదనగోపాలుఁడవై మర్మాలు గలఁతువుగా
పొదుగక ఇంతులకుఁ బోరాదుగా
అదనఁ బట్టపుదేవి నయ్యేనని మొక్కితిఁగా
పదిమారులును నీతోఁ బచారించనేఁటికి ॥ నీవే ॥

ఇదె శ్రీవేంకటేశ్వర యిరవై వున్నాఁడవుగా
పదారువేలుకాంతలపతివై తిగా
అదన నలమేల్మంగనై ననేఁ గూడితిఁగా
అదివో నీసుద్దులు నే నడుగఁగనేఁటికి ॥ నీవే ॥ 290

ఆహిరి

చూద మాకు వేడుకయ్యీ సోద్యపునీచేఁతలెల్లా
వీదరానిపొందులైతే వెలవెట్టవచ్చునా ॥ పల్లవి ॥

చెక్కు చెమరించెనంటా చేసురటి విసరేవు
యిక్కువ నాకెపై నీకు నెంతమోహమో
చక్కవివదనమని సారె సారెఁ బొగడేవు
పిక్కటిల్ల నీకె యెంతప్రియమో ఇపుడు ॥ చూద ॥

కడు దిష్టిదాఁకకుండా కప్పేవు పైపచ్చడము
తడయక లోలో నెంత తగులాయమో
బడిబడి గుబ్బలపై పన్నీరు చిలికించేవు
ఆదరి నీకిది యెంత అపురూపమో ॥ చూద ॥

గాలి యెండా సోఁకకుండా కాఁగిట నించుకొనేవు
యీలీల నలమేల్మంగ యెంతచుట్టమో
యేలితివి శ్రీవేంకటేశ నన్ను వింతలోనె
వాలే నీమదిలోన నాసోదమెంతో ॥ చూద ॥ 291

శ్రీరాగం

నీవునేసేటిమాయలో నేఁగొన్నమరులు జాడో
చేవమీర నేఁ జేసేనేఁత నీకే నెలవు ॥ పల్లవి ॥

యేకతాన నుండి మాట లెన్నియైనాఁ దలపోతు
యీకడ నీమోము చూచి ఇట్టె మొగమోడుదు
రాక నీవుండితేఁ గాతరాన కడుఁజింతింతు
చేకొని నీవద్దనుండే చెలరేఁగి నవ్వుదు ॥ నీవు ॥

యేయింతిఇంట నీవున్నా యీసునఁ గడకు మ(వ?)త్తు
నీయాదరింపునఁ జెంది నే సంతోషించుకొందు
తోయరానిజవ్వనాన తొడికిపట్టఁగఁజూతు
చేయి నీవు వేసితేను చిత్తము గరఁగుదు ॥ నీవు ॥

కోరి విన్ను నంతలోనే కూడి మందెమేళమాడు
సారె నీవు దెలుపఁగా చనవున మొక్కుదు
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నేరుపున నీ వేలఁగా నిన్నే నే నమ్ముదును ॥ నీవు ॥ 292

బౌళి

ఏల నాతో నావతిచ్చే విచ్చకపుమాటలెల్లా
ఆలకించి వి(వి?)నఁగాక అవుఁగాదనేనా ॥ పల్లవి ॥

మగువకుఁ దొల్లె నీవు మాట యిచ్చినవాఁడవు
నిగిడి పొందుసేయుక నీవు మానేవా
చిగిరించి పూచికాచినయట్టిమామిడి
తగఁ బండ్లు పండక తా మానీనా ॥ ఏల ॥

తేరకొన నీఇంటికిఁ దెచ్చుకొన్నవాఁడవు
గారవించి కూడక ఇంక మఱచేవా
ఆరనార మేనిమీఁద నలఁదినకస్తూరి
కోరి పరిమళము చేకొననంటేఁ బోవునా ॥ ఏల ॥

వొద్దఁ బెట్టుక నీపాదా లొత్తించుకొనేవాఁడవు
వొద్దికమగఁడవై నీవుండకుండేవా
కద్దులే శ్రీవేంకటేశ కలసె నలమేల్మంగ
అద్దములో నీడవలె నంటువాసీనా ॥ ఏల ॥ 293

పాడి

ఆడకేల మమ్ముఁ బిల్చిననరే వోచెలులాల
వేడుకమాటలాడ వెన మీరు చాలరా ॥ పల్లవి ॥

కందువ నాపెఁ దాను కాఁగిలించుకుండఁగాను
చెంది సతు లెవ్వరెట్టు సేవసేనేరు
యిందుకు రమ్మనవే యేపనులు గలిగినా
అఁది సేసేము సిగ్గరిఆఁడువారము ॥ ఆడ ॥

మునుప పాన్పుపైఁ దాము ముసుగువెట్టుకుండఁగా
యెనసి యెవ్వరు విడెమియ్యవచ్చేరు
చెనకి మావద్దికిఁ జేఇ చాఁచుమనవే
ఘనమైనవాసివన్నెగలవారము ॥ ఆడ ॥

మేలిమలమేల్మంగను మెడఁగట్టుకుండఁగాను
కాలుదొక్కి యెవ్వరెట్టు కలనేరు
యేలినాఁడు శ్రీవేంకటేశుఁ డింతలోనె మమ్ము
వోలిఁ దాము(మ?) మన్నించఁగా నుండేటివారము ॥ఆడ॥ 294

రేకు 1450 మంగళకౌసిక

అతిరాజసపువాఁడు అన్నిటాఁ దాను
సతులచేఁ జెప్పిపంపీ సారె వచ్చేనంటాను ॥ పల్లవి ॥

చెలులతో మాటాడితే చిగిరించు వలపులు
కలసి మెలసి వుంటే కాఁక రేఁగును
మలసి నవ్వు నవ్వితే మర్మములెల్లాఁ గరఁగు
వొలిసి తా వింతేసి కోపఁగలఁడటవే ॥ అతి ॥

చెనకితేఁ జెమటలు చెలమలవలె నూరు
నవిచి మోము చూచితే నాటుఁ జిత్తము
పెనఁగితేఁ దమకము పెరుగుఁ గోటికొండలై
వొనరి యిట్టిపొందుల కోపఁగలఁడటవే ॥ అతి ॥

పొనఁగఁ జేయి చాఁచితే పులకలు మోసులెత్తు
కొసరితే కోరికలు కుప్పలై నిండు
యెనఁగ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
వొసపరై కూడె నింత కోపఁగలఁడటవే ॥ అతి ॥ 295

ముఖారి

ఏమినేసే విక్కడను యెంతపని గద్దు నీకు
కోమలి నీరాకలే కోరుకొని వున్నది ॥ పల్లవి ॥

ఇచ్చకమాడేనని నీ కితవరి నయ్యేనని
కొచ్చి చెలులతో నెంచుకొంటా నున్నవి(ది?)
ముచ్చటాడేనని సతి మోముచూచి మొక్కేనని
విచ్చేసే వాడకునని వేళగాచుకున్నది ॥ ఏమి ॥

చనవరినయ్యేనని సరసమాడేనని
మనసులో సంతోసించి మరిగున్నది
పెనఁగులాడేనని ప్రియములు చెప్పేనని
తనివోనిరతులకుఁ దమకించి వున్నది ॥ ఏమి ॥

చిత్తముదెలినేనని చేకొని కూడేనని
హత్తి పాన్పుపై నాయిత్తమై వున్నది
ఇత్తల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
కొత్తలుగా నేలితి విక్కువ నింకా నున్నది ॥ ఏమి ॥ 296

## భైరవి

అప్పటి నాతో మాటాఁడీ నదివో తాను
యిప్పుడు తనగుణాన కెనవత్తు నటవే ॥ పల్లవి ॥

పలుమారు సొలసితి పైపైఁ దన్ను దూఁరితి
కలువల వేసితిఁ గాఁక చల్లితి
వలపు నన్నింతసేసె వాసులు పంతము రేఁచె
మలసి తనకు నేను మంచిదాననటవే ॥ అప్ప ॥

బొమ్మల జంకించితి పొదుగఁగాఁ బెనఁగితి
చిమ్మితి గోళ్ల గుంపించితి సారెకు
నెమ్మనము చలపట్టె నిక్కించె మందెమేళము
యిమ్ములఁ దనకు నేను హితురాలనటవే ॥ అప్ప ॥

చన్నుల నొత్తితి మోవి చవిగొంటిఁ దమితోడ
కన్నులనే మెచ్చితి కాఁగిలించితి
అన్నిటా శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
వున్నతి నన్నేలినాఁడు వుపకారినటవే ॥ అప్ప ॥ 297

## దేసాళం

వాఁడివో తాఁ గొసరఁగా వద్దనేనటే
నేఁడు నాముందర వచ్చి నిలుచున్న దిపుడు ॥ పల్లవి ॥

పలుకులేఁటికే నాతోఁ బంతగత్తైతేఁ బతివి
వలపించుకొనఁగాను వద్దనేనటే
యెలమి నాతఁడు విడెమియ్యఁగాఁ జూడఁజాలక
వెలి నుండి తానేల వేసాలు నేసీనే ॥ వాఁడి ॥

పెద్దరికా లింతయేలే ప్రియముచెప్పి యతని
వద్దికి రప్పించుకోఁగా వద్దనేనటే
అద్దు కాతఁడు నాచన్ను లంటఁగా యేపురేఁగి
గద్దించి చూడఁగా నందుఁ గలిగేదేందే ॥ వాఁడి ॥

వేడుకై తే నొఁగాకేమి విచ్చనవిడి వితని
వాడికై కలయఁగాను వద్దనేనటే
యీడనే శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కూడె నన్ను వీఁకఁ దాను గొసరేదేఁటిదే ॥ వాఁడి ॥ 298

ఆహిరి

తా నిఁక నెప్పుడు నాపై దయదలఁచీనే
ఆనవెట్టి యాతవినే యడుగరే చెలులు ॥ పల్లవి ॥

కలువ లేమిటికిఁ గారింపులాయనే
తలపోఁత లేఁటికిఁ దరవాయనే
చిలుకపలుకులేల చిరుచేఁదులాయనే
అలరినరమణుని నడుగరే చెలులు ॥ తానిఁ ॥

కాసేటివెన్నెలలేల కడువేఁడులాయనే
ఆసలు జిగురులై యే లంటుకొనెనే
వాసనైనగాలి యేల వడ చల్లఁజొచ్చెనే
ఆసుద్దులెల్లాఁ బతి నడుగరే చెలులు ॥ తానిఁ ॥

పొదలతుమ్మెదలేల పొంచి తమిరేఁచీనే
ఆదరుఁజన్నులేల ఆముకొనీనే
అదన నలమేల్మంగనైననన్ను తాఁ గూడె
అదె శ్రీ వేంకటేశ్వరు నడుగరే చెలులు ॥ తానిఁ ॥ 299

రామక్రియ

ఎట్టు దప్పించుకోవచ్చు యెంతపంతములాడినా
పట్టానిజవ్వనము బయలీతలు ॥ పల్లవి ॥

చెలిచూపులు పతిని చిక్కించేఅడియాసలు
తలవంచుకొనుటలే తరితీపులు
కలికిసన్నలు మంచికంకణదారములు
సొలపులసిగ్గులే చొక్కుమందులు ॥ ఎట్టు ॥

ముద్దులపలుకులే మునుకొన్నచిలుకులు
అద్దలింపుజంకెలు పాయనిలంకెలు
చద్దివేఁడికొసరులు జారవియెలయింపులు
అద్దుకొన్నతిట్లవి మచ్చుమేపులు ॥ ఎట్టు ॥

వినయపుసరసాలు వీడరానిజిగురులు
చనవులకాఁగిళ్లు సరబేసులు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
పొనుగనిమీరతు లెప్పుడు నీడుజోడులు ॥ ఎట్టు ॥ 300

రేకు 1451 గౌళ

కానీలేవే చెలియా కంటిమి నీగుణాలెల్ల
కానవచ్చె నీవు పొత్తుఁ గలసితివేమో ॥ పల్లవి ॥

వాడికతో రమణుఁడు వచ్చితే రానీఁగదవే
వేడుకగా నేనే విన్నవించేఁగాని
ఆడుమన్న మాటలు నీ వాడవేమో యతనితో
ఆడునుండాతఁడు పరాకై వూరకుండునా ॥ కానీ ॥

ముప్పిరి నేనున్నదిక్కు మొగమైతేఁ జాలునే
చొప్పులెత్తి నేనే అన్నీఁ జూపేఁగాని
యెప్పుడూ నీమొగమోటా లేమిగలవోకాక
తప్పక యేపొద్దూ నన్నే తలఁచకవుండునా ॥ కానీ ॥

యెలమి శ్రీవేంకటేశుఁ డిటు పవ్వళించనీవే
అలమేల్మంగఁగనక అలమేఁగాని
కలసితి నీవతనిఁ గదిసి వచ్చితివేమో
మలసి తా విన్నాళ్ల మఱచి యట్టుండునా ॥ కానీ ॥ 301

## రామక్రియ

నీ వెప్పుడూ నావాఁడవే నీమన్నన నాకుఁ గద్దు
వేవేలు భావించకుమీ వేఁకుకిది చాలును ॥ పల్లవి ॥

విన్నవించితినంటా విచారాలఁ బెట్టకుమీ
పన్ని నీచిత్తానఁ గలపాటే చాలును
సన్నలుసేసితినంటా సారెకు నలయకుమీ
వన్నెల నీయంత నీవు వచ్చినదే చాలును ॥ నీవె ॥

వలచి వుందాననంటా వంతలఁ బొరలకుమీ
తలఁచుకొన్నప్పటినీతగులే చాలు
సొలసి మొక్కితినంటా చూచి వగవకుమీ
కలసి యేలేనంటి నీకరుణే చాలును ॥ నీవె ॥

ముందర నుందాననంటా మొగమోట బొంకకుమీ
చెంది నన్నుఁ గూడితివి శ్రీవేంకటేశ
అందపుటలమేల్మంగ నంటినవి నవ్వకుమీ
సందడి రతిపరవశము లివె చాలును ॥ నీవె ॥ 302

### శంకరాభరణం

వాసులురేసులు వద్దీకను
సేనలు చల్లఁడు చెల్లను మీకు ॥పల్లవి॥

చనవునఁ బొరలీ సలిగెలఁ జెనకీ
వనుపునఁ గొసరీ నలినాక్షి
పెనఁగకు నీవిఁక పెంచకు చలములు
మనవి చేకొనుము మగఁడవు నీవు ॥వాసు॥

నగవున సొలసీ నంటునఁ బొదిగీ
తగవున నొరసీ తలోదరి
వెగటులు నెరపకు వింతలు సేయకు
విగియకు చేకొను ప్రియుఁడవు నీవు ॥వాసు॥

ముచ్చటలాడీ ముద్దులు చిలికీ
మెచ్చీ విను నలమేలుమంగ
ఇచ్చల శ్రీవేంకటేశ కూడితివి
మచ్చికఁజెలఁగురమణుఁడవు నీవు ॥వాసు॥ 303

### సామంతం

వాకిట నేల వున్నాఁడు వద్దికి రమ్మనవే
చేకొని నేఁజెప్పినట్టు సేసేటిదానను ॥పల్లవి॥

తన కితవైతేను తాలిమితో నుండుఁగాక
వనితలతో నవ్వఁగా వద్దనేనటే
చన వెవ్వతె కిచ్చినా సమ్మతించి వుండుఁగాక
వెనకనే తెచ్చుకోఁగా వెంగెమాడేనటవే ॥వాకి॥

అంగన తనకు బాఁతియైతే నియ్యకొందుఁగాక
కొంగువట్టి పెనఁగఁగాఁ గోపించేవవే
సంగడిఁ బెట్టుకున్నాను సారె మెత్తుఁగా కాపెరు
సింగారించుకొమ్మనవే చెల్లదనేనటవే ॥ వాకి ॥

వాడికఁగా నడపితే వావిసేసుకొందుఁగాక
వూడిగపుకాంతకుఁగా నొరసేనవే
యీడనే శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కూడె నన్ను నీకెంకుగాఁ గొసరేనవే ॥ వాకి ॥ 304

రామక్రియ

కంటిమిగా నేఁడివెల్లా కన్నులారాను
ఇంటనే నీతపములు యీడేరెఁగా ॥ పల్లవి ॥

చెంరేఁగి చెలరేఁగి చేసీ నీకు నూడిగాలు
చెలికి నెంతచన విచ్చితివో నీవు
కొలఁవులోపల నుండి కొప్పు నీకు దువ్వీని
వెలయ నదెటువంటి వేకుకో నీకు ॥ కంటి ॥

కొసరి కొసరి నీకుఁ గూరిమితో వీడెమిచ్చీ
పొసఁగ నెంతచవులుప్పటైనో నీకు
ముసిముసినవ్వుతో నీమొగమే తప్పకచూచీ
సుసరానఁ గళలెంత సోకెనో నీకు ॥ కంటి ॥

చెనకి చెనకి విన్నుఁ జేరి చేరి కాఁగిలించీ
తని వెట్టు గలిగెనో తగిలి నీకు
యెనసితి శ్రీవేంకటేశ యలమేల్మంగను
మన సొక్కటాయ నేమిమర్మమో నీకు ॥ కంటి ॥ 305

ద్రావిళభైరవి

ఏమమ్మా యీపంతములు యెన్నఁడూ నెఱఁగము
ప్రేమతో మీఇద్దరికిఁ బ్రియములే కలవి ॥పల్లవి॥

మనసు లెనసి నీతో మంచిమాటలాడఁగాను
వివి వూఁకొనఁగవద్దా విభునితోను
కొనగొంగు వట్టుకొని కూరిములు చల్లఁగాను
కని సంతోసించవద్దా కమ్మటి నీవు ॥ఏమ॥

చెలరేఁగి నీతోను చిరునవ్వు నవ్వఁగాను
తలయెత్తి చూడవద్దా తగిలి నీవు
మొలకచన్నులు సారె ముట్టిముట్టి పెనఁగఁగా
లలిఁ గాఁగిలించవద్దా లావున నీవు ॥ఏమ॥

వురముపై నిడుకొని వూడిగాలు గొనఁగాను
సిరుల మెచ్చవద్దా శ్రీవేంకటేశు
అరుదుగాఁ గూడితివి అలమేలుమంగవు
సరసమాడఁగవద్దా సారె విటువలెనే ॥ఏమ॥ 306

రేకు 1452 కాంబోది

నేనేమి నెఱఁగను నిన్నేకాని
మోనాన నాలోనున్న మోహమెల్ల నీది ॥పల్లవి॥

కన్నెదాననై నన్ను కలికిఁ జేసితివి
పిన్నచన్ను లింతేసిగాఁ బెంచితివి
తిన్నని నామోవినిండా తేనెలే వూరించితివి
పన్నిననాజవ్వనభారమెల్లా నీది ॥నేనే॥

కందువ నామోమున కళలెల్లా రేఁచితివి
పొందుగ చూపుల వాఁడి పుట్టించితివి
చిందేటిచెమటతోడ సిగ్గుపడ నేరిపితివి
అందపునాసింగార మదియెల్లా నీది ॥ నేనే ॥

మలసి మాఁటలలోనిమర్మముఁ దెలిపితివి
కలసి దేవులఁగాఁ గైగొంటివి
అలమేల్మంగను నేను అన్నిటా శ్రీవేంకటేశ
తలఁచుకో నాచక్కఁదనమెల్లా నీది ॥ నేనే ॥ 307

నాదరామక్రియ

నీచిత్తమే యెఱుఁగు నే నెంతదాన
కాచి నన్ను నేలి యిట్టె కనుఁగొనవయ్యా ॥ పల్లవి ॥

మచ్చిక నీతోడిది మాఁటలు చెలితోడివి
కొచ్చినచెమటలు చెక్కులమీఁదివి
కచ్చుపెట్టి కోరికలు కాఁగిటికి లాచినవి
యిచ్చట నావిన్నపము లేమిచెప్పేనయ్యా ॥ నీచి ॥

తలఁపు నీమీఁదిది తనువు పానుపుపైది
లలి విట్టూర్పులు గుబ్బల నొరసేవి
యెలమి చూపులు నీకు యెదురులు చూచేవి
బలిమి నాయాస లెంతపచారించేనయ్యా ॥ నీచి ॥

నవ్వులు నెలవులవి నాకూటమి నీరతిది
చివ్వన నాకాఁపురము సిగ్గుమీఁదిది
యివ్వల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
వివ్వటిల్లఁ గూడితివి విన్నేమనేనయ్యా ॥ నీచి ॥ 308

ముఖారి

మూసి మంతనములేల ముసిముసినవ్వులేల
చేసినచేఁతలెల్లాఁ జెప్పించుకోరాదా ॥ పల్లవి ॥

సెలవుల నవ్వీ చెలి యేఁటికో కాని
నెలకొన్నసింగారాలనిన్నుఁ జూచి
వెలి నేమిసేసితివో వెస నీకెఁ బిల్చి నీవు
కలిగినవెల్లాఁ దారుకాణించుకోరాదా ॥ మూసి ॥

వొద్దఁ బాయకున్నది వువిద యేఁటికో కాని
పొద్దువొద్దు గాచుక నీపొంత నెపుడు
సుద్దు లేమిగలవో ఆచొప్పు లాపెనే యడిగి
బద్దులు తెలిసి నింద పాపుకొనరాదా ॥ మూసి ॥

మెచ్చి సన్నసేసీ యలమేల్మంగ యేఁటికో కాని
కొచ్చి శ్రీవేంకటేశ నీకొలువులోన
ఇచ్చల బాసపుమీఁద యిద్దరుఁ గూడితి రిదె
హెచ్చి యీకెచే విడె మిప్పించుకోరాదా ॥ మూసి ॥ 309

రామక్రియ

ఎంతకెంత చలములు యేల రేఁచేవు
చెంతలఁ జనవులిచ్చి చేకొనఁగరాదా ॥ పల్లవి ॥

వద్దనున్నకాంతలను వాసులు వుట్టించితేను
పెద్దరికాల కెంతైనాఁ బెనఁగుదురు
బుద్దిచెప్పి తగవులు దిద్దదొరకొంటేను
ఇద్దరూఁ దమమాట లెన్నైనాఁ జెప్పుదురు ॥ ఎంత ॥

సవతులై సవారి సారెఁ బంతా లెక్కించితే
జవళితో సణఁగులు చల్లుదురు
తవిలి వొద్దవి మరి తగఁ జేతఁబట్టితేను
తివుకుచు మీఁదమీఁద దీకొనఁగఁజూతురు ॥ ఎంత ॥

యెట్టనెదిటివారి నెదమాట లాడితేను
పెట్టరానివొట్లెల్లాఁ బెట్టుకొందురు
ఇట్టె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
గుట్టున నన్నేలితి వాకొమ్మలాఁ గూడరాదా ॥ ఎంత ॥ 310

హిందోళం

ఇంతకంటె వేడుక లేమి చెప్పేది
కాంతల కెప్పుడు నివి గలుగఁగవలయు ॥ పల్లవి ॥

పడఁతికి నెంచిచూడ పాయమే సింగారము
జడియనివొరపే చక్కఁదనము
విడువనితనగుట్టె వింతవింత విలాస్త(సః)ము
చిడుముడిమురిపెమే చెలఁగు విభ్రమము ॥ ఇంత ॥

మునుకొన్నపెనుసిగ్గే మోహనాకారము
తనలోనియణఁకువే తరితీపు
చెనకేవొయ్యారము చెప్పరానిచెలువము
వినయమె యెప్పుడూ వెలలేనిగుణము ॥ ఇంత ॥

చిట్టకపుఁజేఁతే చిమ్మిరేఁచేటిసొబగు
నెట్టుకొన్నవోరుపే నేరుపెల్లాను
ఇట్టి శ్రీవేంకటేశ ఇన్నిటా నలమేలుమంగ
పట్టపుదేవియాయ నీభావమే వొప్పిదము ॥ ఇంత ॥ 311

వేళావళి

ఘనుఁ డన్నిటాఁ దాను కంటె తనగుణమెల్లా
మునుపనే పాదాలకు మొక్కితి నే ననవే ॥ పల్లవి ॥

సరసము తా నాడుటే చనవిచ్చివట్టుగాదా
శిరసు వంచుకొంటేనే చేకొంటగాదా
తెరవేయిమంటేనే వద్దికిఁ బిలుచుటగాదా
యిరవాయఁ దనమేలు యేల చెప్పీ నాకును ॥ ఘనుఁ ॥

మాటలు తా నాడితేనే మచ్చిక చల్లుటగాదా
చోటిచ్చినదే వలపు చూపుటగాదా
నాటఁగ మోముచూచుటే నమ్మిక లిచ్చుటగాదా
వాఁటముగా తనపొందు వా(వ్రా?)సిపంపు నేఁటికే ॥ ఘనుఁ ॥

మెచ్చి కాఁగిలించితేనే మించి కలయుటగాదా
ఇచ్చగించుటే రతికి నెరుకగాదా
యిచ్చట శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
తచ్చి నన్నుఁ గూడె నింకాఁ దలఁపించవలెనా ॥ ఘను ॥ 312

రేకు 1453 దేశాక్షి

కాముకులైనవారికి కల్పవృక్షమువంటిది
గోమునఁ బెంచితే నెలకొను సంతోసములు ॥ పల్లవి ॥

మొగములు చూచితేనే మొలచును వలపులు
చిగిరించు మాటలాడి చెనకితేను
అగపడి నిలిచితే నల్లుకొనుఁ బ్రియములు
నగినంతలోననే ననలెత్తు నాసలు ॥ కాము ॥

కాయములు సోఁకితేను కలఁగు మకరందము
ఆయము లంటితే ఫలమందు నపుడే
చాయలా సన్నలా సరసములనె పక్వమౌను
దాయక పాయకుండితే తరితీపులెక్కును ॥ కాము ॥

తమకపురతులను తతి యెప్పుడైనా నౌను
జమళితలపోఁతల చవులు పుట్టు
అమర శ్రీవేంకటేశుఁ డలమేల్మంగఁ గూడఁగా
మమతలనే వసంతమహిమలు నిండెను ॥ కాము ॥ 313

పాడి

మాకేలే ఇటువంటిమందెమేళాలు తనతో
మేకొని సేవలుసేసి మెప్పించుటగాక ॥ పల్లవి ॥

వేడుకకత్తెలకు వేసాలు సేయవచ్చు
చూడఁగానే యెంతైనా సొలయవచ్చు
పాడిపంతా లెంతైనాఁ బచారించఁగవచ్చు
యేడను(నఁ?)డైనా తన్ను నెలయించవచ్చును ॥ మాకే ॥

కన్నులను జంకించి కాఁతాళించఁగవచ్చు
సన్నలుసేసి వూరకే సాదించవచ్చు
విన్నపాలు సేసిసేసి వేడుకలు రేఁచవచ్చు
చన్నుల నొత్తుచు లోలో జరయఁగవచ్చును ॥ మాకే ॥

చేయరానిచేఁత సేసి చెక్కులు నొక్కఁగవచ్చు
వేయిమాటలైనా నాడి వేఁడుకోవచ్చు
యీయెడ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చాయతో నన్నేలె నిఁక సమ్మతించవచ్చును ॥ మాకే ॥ 314

### లలిత

ఎంత గుణవంతురాలు యీసతి నీకు
    చెంత నిన్ను మెచ్చుఁగాని చిడుముడిపడదు ॥పల్లవి॥

యేమి నీవునేసినాను ఇచ్చకమే ఆడుఁగాని
    కామిని యెంతైన నీతోఁ గాఁతాళించదు
    జాము వోయి వచ్చినాను సంతోసించుకొనుఁగాని
    మోము చిన్నఁబుచ్చుకొని మొక్కలాన దూరదు ॥ఎంత॥

సిగిడి పరాకైనా నిన్ను నెచ్చరించుఁగాని
    మగువ నీనేరాలెంచి మరి పాయదు
    మిగులా నీ వెవ్వతెతో నగినాఁ జెలఁగుఁ గాని
    యెగసక్కెమున నిన్ను నెరవులు సేయదు ॥ఎంత॥

పిలువక నీ వుండినా పెనఁగి పైకొనుఁగాని
    చలములు నీతోను సాదించదు
    యెలమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
    మెలఁగి నీవుగూడినమేలు మరవదు ॥ఎంత॥ 315

### తెలుఁగుఁగాంబోది

ఇంతవిరహాగ్నిచేత నేల వెరగందితివి
    చింతదీర మాదిక్కు చిత్తగించఁగదవే ॥పల్లవి॥

మావిని నీరమణుఁడు మాటలాడినట్లయ్యీ
    వీనుల నీ వాలకించి వినఁగదవే
    పానుపుపై నాతఁడు నీపక్కనే వున్నాఁడోయీమో
    చేనంటి నీ విప్పు డిట్టె వెనకఁగఁగదవే ॥ఇంత॥

కచ్చుపెట్టి వాకిటఁ గడుచప్పుడయ్యాని
వచ్చీఁ బేరుకొవి పిలువఁగఁగదవే
చొచ్చి సోరణగండ్లఁ జూచుకొంటాపున్నాఁడేమో
తచ్చి నెలవుల నీవింతట నవ్వఁగదవే ॥ ఇంత ॥

గక్కన నెందుండో వచ్చి కాఁగిలించి నిన్నుఁ గూడె
వొక్కమనసున నిఁక నుండఁగదవే
అక్కరో శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
చక్కఁగా మావిన్నపాలు సరివచ్చెఁగదవే ॥ ఇంత ॥ 316

మధ్యమావతి

బలిమిసేయఁగరాదు పడఁతులాఁ బురుషులా
చెలులాల యిదెరిఁగి చేరి పొందుసేయరే ॥ పల్లవి ॥

మనసొక్కటైతేను మాటలూ నొక్కటే యౌను
తను వోరుచుకుంటేను తలఁపూ నోరుచును
కనుఁగవ కింపైతేను కడుఁపున కింపౌను
పనులకు మెచ్చేవారు పాటలకూ మెత్తురు ॥ బలి ॥

చేతికి లోనైతేను చేఁతలకూ లోనౌను
ఆతుమకుఁ దగులైతే ఆనలకూఁ దగులు
నీతులు సమకూడితే నిజములూ సమకూడు
కాతర మొల్లనివారు కపటమూ నొల్లరు ॥ బలి ॥

పిన్ననాఁడు గుణియైతే పెద్దనాఁడూ గుణియౌను
నన్నుఁ డాఁ గూడెఁగనక నవ్వు లౌనగూడెను
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ దేనలమేలుమంగను
మన్నింపించుకొన్నవారు మరిగించుకొందురు ॥ బలి ॥ 317

బౌళి

ఇంతు లేమెరుఁగుదురు ఇన్ని నోరుచుకోవయ్య
యెంతైనా నీకుఁబోదు యేలేటివాఁడవు ॥ పల్లవి ॥

సవతులజగడాలు సారె దిద్దఁబోతేను
రవళితో దూరుదురు రమణునిని
వివరముగా మరి వేఁడుకొనఁబోతేను
చివుకురంటాఁ బైవి చేతులు చాఁతురు ॥ ఇంతు ॥

కచ్చుపెట్టి విడేలిచ్చి కలపఁగఁబోతేను
యెచ్చుగుందు లెంతురు యెగ్గులు వట్టి
గచ్చులుసేసి యట్టె కాఁగిలించఁబోతేను
పచ్చారుతా మంచాలపైఁ బవ్వళించివుందురు ॥ ఇంతు ॥

అంతలో నీ విద్దరి నందఁబెట్టుకోఁబోతే
పంతాన నొట్లువెట్టి పచారింతురు
బంతినే యలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
కాంతలఁ గూడితి విఁకఁ గదు వివ్ను మెత్తురు ॥ ఇంతు ॥ 318

రేకు 1451 సాళంగనాట

ఇన్నిటా నేర్పరి దావి కిదే బుద్ధి
సన్నెఱిఁగి మెలఁగితే చవులౌను పొందులు ॥ పల్లవి ॥

యేలినవానితో సతి యెంత చనవరియైనా
వేళెరిఁగి మాటాడితే వేడుకలౌను
పిలుచు నొక్కొకవేళ వేసరుకొంటేఁ దాను
తాలిమితో నుండితేనే దయవుట్టును ॥ ఇన్ని ॥

కలసినయదాటాన( గదు(జక్కనిదైనాను
తల(?)పెరి(గి నవ్వితే( దమిరే(గును
అలి(గినసమయాన నాత(డే మన్నించి
పిలిచిన( బలికితే ప్రియము గలుగును ॥ ఇన్ని ॥

శ్రీవేంకటేశుతోడ జిగి నలమేల్మంగవు
నీవైనా నిచ్చకమైతే విల్చు( గాంతలు
ఆవటించి సమరతి నాత( దలయించితేను
కైవశమై కలసితే కర(గును మనసు ॥ ఇన్ని ॥ 319

## వసంతవరాళి

చేరి నన్ను(జూచి యేల సిగ్గువదేవు
మారుకొని యాపెతో మా(టాడవలదా ॥ పల్లవి ॥

కొసరి కొసరి నిన్ను( గొంగువట్టితీసీ నాపె
పొస(గి చేతికిలోనై పొందవయ్య
ముసిముసినవ్వుతో నీముందర( జెమటగార
అనురుసురయ్యీనేలో అడుగరాదా ॥ చేరి ॥

ముద్దు ముద్దువలె నాపె మోము( దప్పక చూచీ
కద్దో యేమైనా మీలో( గనుసన్నలు
దిద్ది కస్తూరినామము( దీర్చి నీనొసలను
అద్దుక మెచ్చు(గవద్దా ఆపెసేసేబత్తికి ॥ చేరి ॥

తనివార( దవివారా తా విన్ను( గా(గిట( గూడీ
ఘను(డవు నీయప్పణగా(బోలును
యెనసితివి శ్రీ వేంకటేశ యలమేల్మంగను
నను; విదె ఆకె యున్నది సంతోసించెను ॥ చేరి ॥ 320

వరాళి

ఎటువంటివాఁడవు ఇంతపొందైనచోట
తటుకనఁ బైకొనక తడవులుసేతురా ॥ పల్లవి ॥

పడఁతి చెక్కులంటాఁకా పయ్యదగప్పుకొంటా
పెదరేఁచి ఇంటిదాఁకాఁ బిలిచె నిన్ను
పుడివోనిజవ్వనాన నూరకే మలసుకొంటా
వొడివట్టి తియ్యఁగాను వోపనందురా ॥ ఎటు ॥

ఇరవైనఆసలతో నెప్పుడు వత్తువోయంటా
సురటి మాఁటువెట్టుక చూచీ నిన్ను
మురిపేన నీతోను ముద్దులు గురుసుకొంటా
గరిమ సన్నసేయఁగా గక్కన బిగుతురా ॥ ఎటు ॥

సారెసారె మోవితేనెచవులు చూపుకొంటా
నేరుపుతోఁ గాఁగిట నించీ నిన్ను
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
చేరి యెదురుచూడఁగా సిగ్గున నవ్వదురా ॥ ఎటు ॥ 321

దేసాళం

కాఁకల నొకటొకటె గదించుకొనేవు నీవె
సోఁకించి నీమేను నేసోదించవచ్చితినా ॥ పల్లవి ॥

వేడుకకు నీతో నవ్వితిఁగాక యేమైనా
తోడనే కేరడాలు నీతోఁ జేసేనా
యీడ నీవొంటి నుండఁగా ఇటు తోడుండితిఁగాక
[1]జాడతో నమ్మక నీవంగడికి వచ్చేనా ॥ కాఁక ॥

1. జాడతోన్ + అమ్మక

చక్కనినీరూపు నే నాసలతోఁ జూచితిఁగాక
చెక్కులకు చూపులు నాటించవచ్చేనా
మక్కువగలిగి నిన్ను మాదలాడించితిఁగాక
వెక్కసపు నీసుద్దులు వెల్చుకొనేనా ॥కాఁక॥

కందువల నిన్ను మెచ్చి కాఁగిలించుకొంటిఁగాక
సందడిఁ బెనఁగి నీపై [1]సత్వ చూపేనా
ఇందునె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అంది కూడితివి నిన్ను నాఅడిఁ బెట్టేనా ॥కాఁక॥ 322

మాళవిగౌళ

ఇటువంటివో జగల దిందరిలో నెక్కుడు
తటుకన రతులకుఁ దగులైనదానికి ॥పల్లవి॥

చలము గలుగవలె సరసమాడేయందు
పలుకులు నేరవలె బడినుండేను
తెలివి చూపఁగవలె తేటగా మొకమువను
చలివాపి పతివద్ద జాణైనదానికి ॥ఇటు॥

యిచ్చగించి చూడవలె యేకాంతమైనప్పుడు
విచ్చనవిడి గావలె వేడుకవేళ
కొచ్చి నవ్వవలెఁ దనుఁ గోరి యెదిరించితేను
పచ్చిగా విభునివద్దఁ బ్రౌఢై(ఢై?)నదానికి ॥ఇటు॥

చేరి యలమేలుమంగ సేవచేసేసమయాన
కూరిమి నంటఁగవలె కొంగువట్టితే
యీరీతిఁ గూడె శ్రీవేంకటేశ నిన్ను నలమేల్మంగ
మేరతో నీవద్ద నిట్టె మేలుగలదానికి ॥ఇటు॥ 323

1. సత్తువకు సంగ్రహరూపము

అమరసింధు

ఏ నెంత నీవెంత యేల గొరబుసేసేవు
పూని నన్ను వింతేసి పొగడేవు నీవు ॥పల్లవి॥

వింతవింతచేఁతలకు వేడుకకాఁడవు నీవు
సంతసుద్దులునేర్చినజాణకాఁడవు
సంతోసపునగవులజాజరకాఁడవు నీవు
యెంతైనా నే నిన్ను నెలయించఁగలనా ॥ఏనెం॥

వూరివారినెల్లా మెచ్చేవుబ్బరికాఁడవు
కారణములేకవచ్చేగందికాఁడవు
గోరగిరి యేరుసేసేకొనబుకాఁడవు నీవు
కేరడములాడి నిన్ను గిలిగించఁగలనా ॥ఏనెం॥

అలయక రతిఁగూడేఆసోదకాఁడవు నీవు
కొలఁదిమీరినయట్టికోడెకాఁడవు
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి విఁక నిన్ను గరిసించఁగలనా ॥ఏనెం॥ 324

రేకు 1455 సామంతం

ఎటువంటిభాగ్యమో యీపెకు నేఁడు
తటుకనఁ దాను దొరతనము మెరసెను ॥పల్లవి॥

చద్దికి వేఁడికి నీవు సారెసారె వేఁడుకోఁగా
పెద్దరికమున కాపె బిగిసీ నీతో
యిద్దరు నిద్దరేయని యీడనున్నసతులు మీ-
సుద్దులు వొగడుకొంటా చూచేరు మిమ్మును ॥ఎటు॥

వుమ్మగిలుఁజెమటతో వొడివట్టి తియ్యఁగాను
యెమ్మెలకే పెనఁగి సట్టె నీతో
అమ్మరో నీ వాకెకు అరవి(యః)[1] సమత్తువేమో
చిమ్మరేఁగి తరితీపు చిందీ మీవల్లను ॥ ఎటు ॥

నెట్టనఁ దమకమున నీవు గాఁగిలించుకోఁగా
బట్టబయలీఁది యాకె భ్రమసీ నీతో
ఇట్టె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
గట్టిగా సన్నేలితివి కంటిమి మీపొందులు ॥ ఎటు ॥ 325

## సామవరాళి

వెలలేనిమహిమలవేసాలవాఁడు
పలుకు లీడేరె నిఁక భావించనేఁటికి ॥ పల్లవి ॥

చెలిమి చేసినవాఁడు చేతికి లోనౌఁగాక
పిలువఁగానే నాతో పెనఁగనేలే
కలువల వేసినాఁడు కాఁగిలించుకొనుఁగాక
యెలయింపుఁజేఁతలతో నెక్కడ చూచీనే ॥ వెల ॥

తగులనాడినవాఁడు తనివి నొందించుఁగాక
జిగిఁ జేఇ వట్టఁగానే సిగ్గులింతేలే
నగినాఁడు మొదలనే నాటుకొని వుండుఁగాక
మొగమెదుటనే యేల మోహము దాఁచీనే ॥ వెల ॥

చెనకి కూడినవాఁడు చిత్తగించి మెచ్చుఁగాక
పనివడి మొక్కఁగానే పరాకులేలే
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చనవిచ్చి మరియేమి చాయలు దిద్దీనే ॥ వెల ॥ 326

1. 'సమర్థః', సంస్కృతము, 'శమత్తు' తమిళము. ఆరెండిటితద్భవమై 'నేర్పరి' అనునర్థమున ప్రయోగించినట్లున్నది.

బౌళి

ఇంతి యేమిసేసీనంటా యేల వేళ యడిగేవు
చెంత నీకెదురుచూచి చిమ్మిరేఁగీనయ్యా ॥పల్లవి॥

చిలుకలఁ జదివించీఁ జెలులఁ గూడి
కలువదండలు గట్టీఁ గందువ నుండి
మొలవఁబెట్టీ జాజులు మునుకొని
వెలఁది పూఁదోఁటలో విహరించీనయ్యా ॥ఇంతి॥

గుదిగుచ్చీ తామరలు గుట్టుతోడను
కడిమి తుమ్మిదలమూఁకలు రేఁచీని
సదరానఁ బన్నీరు చల్లులాడీని
వుదుటునఁ గేళాకూళి నోలలాడీనయ్యా ॥ఇంతి॥

పొంచి పొంచి చల్లగాలి పొందుసేసీని
కొంచక వెన్నెలలెల్లాఁ గూడపెట్టీని
నించి శ్రీవేంకటేశ్వర నిన్నలమేల్మంగ గూడె
మంచముపైఁ గాఁగిట నెమ్మది నున్నదయ్యా ॥ఇంతి॥ 327

ముఖారి

మట్టుతోనే సొలయవే మగనితోను
దిట్టవై పదరితేను దిద్దుకొనరాదు ॥పల్లవి॥

మాఁటలాడవచ్చుఁగాని మర్మములు నాఁటితేను
గీఁటించి మీఁదటఁ బెల్లగించఁగరాదు
కాటుకకన్నుల సన్న గావించవచ్చుఁగాని
పోటివెట్టి యడిగితే పోఁక బొంకరాదు ॥మట్టు॥

నవ్వు నవ్వవచ్చుఁగాని నడుమ నెగ్గువట్టితే
వువ్విళ్లూర మందువోసి వుడుపరాదు
పవ్వళించి వుండఁగాను పాదా లొత్తవచ్చుఁగాని
చివ్వనఁ గాఁగిలించితే సిగ్గువడరాదు ॥ మట్టు ॥

మొక్కు మొక్కవచ్చుఁగాని మోములఁటుకొంటేను
కక్కసించి నీరువోసి కడుగరాదు
అక్కున శ్రీ వేంకటేశు కలమేల్మంగవు నీవు
ఇక్కడ నన్నేలినాఁడు యెలయించరాదు ॥ మట్టు ॥ 328

భైరవి

నీమోహముకొలఁదివే నేఁజేసేప్రియము లివి
చేమంచి ఇన్నిటికి నీచిత్తము నాభాగ్యము । పల్లవి ॥

కతలెల్లా విన్నవించఁగలదానఁగాక నీకు
హితవైయుండిన దింక నెట్టు దెలుసు
తతి నీకు విందుచెప్పేదానఁ గాక కూరాకులు
మతి కింపులయ్యేవి మరి యెట్టు దెలుసు ॥ నీమో ॥

ఆడుమంటే నీతో జూజ మాడఁగలదానఁగాక
యీడ నీకు వేడుకౌత యెట్టు దెలుసు
కూడిమాడి నీగుణాలు కొనియాడేదానఁగాక
జాడతో సమ్మతించేటిచంద మెట్టు దెలుసు ॥ నీమో ॥

చేరివుండి వూడిగము సేయఁగలదానఁగాక
యీరీతి నీవు మఱిఁ(న్నిం?)చే దెట్టు దెలుసు
ఆరయ శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
గారవించి యేలితివి గతు లెట్టు దెలుసు ॥ నీమో ॥ 329

పాడి

నీవు సేసినచేఁతలు నేఁడు మామీఁద నున్నవి
యీవల నప్పటి మమ్ము నేల దూరేవు ॥ పల్లవి ॥

పెదవిపై కెంపులు బిగువులు వట్టుండఁగా
యెదురుమాటలు నీతో నేఁటి కాదేము
[1]కదలుఁగన్నుల నిద్ర కడుఁ గమ్ముకొనఁగాను
ఇదివో నిన్నుఁ గసరి యేల చూచేము ॥ నీవు ॥

పట్టఁగానే గరివడి పాలిండ్లు వుండఁగాను
బెట్టి యేలపెనఁగేము బీరాన నీతో
గుట్టునఁ జెమట మడుఁగులు గట్టుకొనఁగాను
జట్టిగావి ఇంకా నెంత సరసమాడేము ॥ నీవు ॥

సిగ్గువడ్డచిత్తము చిమ్మిరేఁగి వుండఁగాను
వొగ్గిరతులకు నెట్టు వొడిగట్టేము
నిగ్గుల శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యెగ్గులేక కూడితివి యెంత మెచ్చేము ॥ నీవు ॥ 330

రేకు 1456 దేసాళం

ఇందుకొరకే నిన్ను నింతేసి కొసరితిమి
సందడిఁ బంతాన నిన్ను జరయమనుమీ ॥ పల్లవి ॥

మఱసి సొలసి నిన్ను మాటలాడించకుండితే
తలఁపు దెలుసునా తరుణులకు
పిలిచి నిన్నింటికి రప్పించకుండితే నీ-
వలపుకొలఁ దెలుఁగవచ్చునా మాకు ॥ ఇందు ॥

---

1. కదలుఁగన్నుల, కన్నులకద అనుట సహజము.

చెనకి చెనకి నిన్ను చిమ్మిరేఁచకుండితేను
ఘనుఁడవు నీగుణము కానవచ్చునా
తనువు సోఁకించి నీకు తమి వుట్టించకుండితే
అనిశము నీగుట్టు అరయఁగవచ్చునా ॥ ఇందు ॥

కరఁగించి మరిగించి కాఁగిలించకుండితేను
సరి నీవేడుక చెల్లించఁగవచ్చునా
ఇరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పరగ నన్నేలితివి పాయ నీఁక వచ్చునా ॥ ఇందు ॥ 331

## ముఖారి

ఎవ్వరూ నేమి చెప్పేరు ఇంతటి నాయకుఁడవు
రవ్వగా నీవే తెలిసి రక్షింతువుకాక ॥ పల్లవి ॥

వలచితినంటాను వనిత చెప్పుకొనునా
సలిగె ఇచ్చితివంటా సాదించునా
తలఁ పెరుఁగుదునని తమకించి కొసరునా
చెలియ నేలేది నీచేతి దింతేకాక ॥ ఎవ్వ ॥

కాయము సోఁకినంతనే కాంత గర్వించునా
పాయపుదాననని పంతమాడునా
చేయి నీవు వేసితేనే చియనవ్వు నవ్వునా
ఆయింతివేడుకలు నీయాస యింతేకాక ॥ ఎవ్వ ॥

చక్కనిదియైతేనే సతి నిన్ను జంకించునా
వెక్కసాన మెచ్చితేనే ఓట్టువీఁగునా
యిక్కడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
వొక్కటైతి విదెల్లా నీ వోపి కింతేకాక ॥ ఎవ్వ ॥ 332

వరాళి

ఇంత సేయకుండితే నీ విచ్చగింతువా
సంతోసించేదానివలెఁ జవిచూపె మోవి ॥ పల్లవి ॥

బచ్చెనమాఁటలు నీతోఁ బచరించి
కొచ్చి కొచ్చి సొలసీని కోమలి నిన్ను
మెచ్చేదానివలెనే మేకులునేసి
కుచ్చి కాఁగిలించుకొని కుమ్మరించీ వలపు ॥ ఇంత ॥

ననుపునేసుక నీతో నవ్వు నవ్వి
చనవులు నెరపీని సారెకును
చెనకేదానివలెనే చెక్కులు వట్టి
పెనఁగుతానే యింకాఁ బ్రియములు రేఁచీని ॥ ఇంత ॥

జంకెనచూపులు నీపైఁ జాఁచి చాఁచి
అంకెలఁ జన్నుల నొత్తీ నప్పటిఁ దాను
లంకెల శ్రీవేంకటేశ లావున నలమేల్మంగ
తెంకి రతులనుఁ గూడి తెమలించీ సిగ్గులు ॥ ఇంత ॥ 333

దేశాక్షి

కదలేనిగుణములఘనుఁ డాతఁడు
వెదవెదగా నేఁటికి వెరగువదేవే ॥ పల్లవి ॥

గాఁటముతో నాతఁడు గారవించి పిలువఁగ
చీటికిమాటికినేల సిగ్గువడేవే
చోటిచ్చి యాతఁడు నీతో చుట్టరికము చెప్పఁగ
జూటవై మనసులేల సోదించేవే ॥ కద ॥

పెద్దరికములు సేసి పెనఁగఁగ నాతని-
వద్దనుండి శిరసేల వంచేవే
సుద్దులు విన్నదుగుతా సోగకన్నులఁ జూడఁగ
కొద్దిలేఁగియునుసేల గుట్టుసేసేవే ॥ కడ ॥

కైవశమై యాతఁడు కాఁగిలించి విన్నుఁ గూడె
వేవేగ మొక్కుచు నెంత వేఁడుకొనేవే
నీ వలమేలుమంగవు శ్రీవేంకటేశుఁడు తాను
యీవేళ విన్ను మన్నించె యెఁ(యెం?)త కొసరేవే ॥కడ॥ 334

శంకరాభరణం

కన్నచోటనే నీకు [1] కండకుడుము
విన్నప మిదె యింటికి విచ్చేయవయ్యా ॥ పల్లవి ॥

పున్నమవెన్నెల లవె పోగులాయను
సన్నజాజివనలు జాజుకొనెను
చెన్నుమీరె వింతటాను చిరుముత్యాలు
పన్నినసంసారము ఫలమందెను ॥ కన్న ॥

పదారువన్నెలపైఁడి పరిమళించె
సదరాన తరితీపు జాలువారెను
పొదలె మరురాజ్యము పొద్దువొద్దుకు
ముదిరి పువ్వులవాన ముంచుకొనెను ॥ కన్న ॥

పెరిగి పూపలెల్లనుఁ బిందెలాయను
యిరవైనచుట్టరిక మిల్లు విండెను
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
సరుస నీ వెనయఁగా సరిబేసులాయను ॥ కన్న ॥ 335

1. 'కందికుడుము' ను, మంగళకరమైనవిందు అను నర్థమున వాడెనా?

కేదారగౌళ

ఇటులానే నీసుద్దులు యేమైనా నంటుకొందువు
కటకటా యిటువలెఁ గాకుసేయవచ్చునా ॥ పల్లవి ॥

కోమలిచన్నులమీఁదికుంకుమగందపుఁబూత
ఆముకొని పచ్చడాన నంటుకున్నది
గామిడితనాన నాపైఁ గప్పితి వెగసక్కెన
యేమిసేతు విన్ను వింద కెవ్వరికిఁ జెప్పుదు ॥ ఇటు ॥

తొయ్యలికొప్పువిరులు తొరలినసవరము
కొయ్యతనాన ముడుచుకొంటివి నీవు
యియ్యెడ నేమరిపాటు ఇటు నాకు ముడిచితి
[1]నియ్యంత నీవెఱఁగవు విన్నిఁక నేమందును ॥ ఇటు ॥

చెలివట్టుకుఁడినచేతిలోలిపీదెము
లలిఁ గైకొని నీతమ్ములము వెట్టేవు
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి విఁక విన్ను గరిసించనేఁటికి ॥ ఇటు ॥ 336

రేకు 1457 శుద్ధవసంతం

వేసరనివలపులవిభుఁ డాతఁడు
సేసపాలు మీఁదఁ జల్లి చెనకఁగరాదా ॥ పల్లవి ॥

ఆరజాన దూరనేల ఆతవి వేఁడుకోనేల
వూరకే దొరతనాన నుంకఁగరాదా
మేరమీరి నవ్వనేల మిక్కిలిపంతమీనేల
నీరువంక తుంగవలె నెలకొనరాదా ॥ వేస ॥

1. నీ+అంత. వింతత్రికసంధి.

మొగసక్కెలాడనేల యిచ్చకము సేయనేల
నగుతాఁ జుట్టరికమే నడపరాదా
వెగటై మెఱయనేల వినయము చూపనేల
చిగురులోఁ చేఁగవలె చెలువొందరాదా ॥ వేస ॥

మనసు సోదించనేల మర్మములు చెప్పనేల
వొనగూడి రతులలో నోలాడరాదా
అనుఁగు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగవు నీవు
వినుపులో నీడవలె నెలకొనరాదా ॥ వేస ॥ 337 ॥

ఆహిరినాట

నావిన్నపము వినవే నలినాక్షి
చేవమీర నీకు బుద్ధిచెప్పితిఁ జుమ్మీ ॥ పల్లవి ॥

[1]చనవరితనమున సాదించుకంటేను
వినయముతో విభుని వేఁడుట మేలు
కనుచూపు నాటఁజూచి కాఁతాళించుకంటేను
మనసు రంజిల్లఁగ మాటాడుటే మేలు ॥ నావి ॥

పంతములు నెరపుచు బయలీఁదించుటకంటే
చెంతనుండి ప్రియములు చెప్పట మేలు
వంతుల నొట్లువెట్టి వలలఁబెట్టుటకంటె
చింతదీర నూడిగాలు సేయుట మేలు ॥ నావి ॥

పల్లదానఁ గాఁగిలించి పచ్చిగాఁ జేయుటకంటె
చల్లఁగా వలపు సారెఁ జల్లుటమేలు
కొల్లఁగా నలమేల్మంగ కూడె శ్రీవేంకటేశుఁడు
చిల్లరసిగ్గులకంటె చెనకుట మేలు ॥ నావి ॥ 338

1. చనవు=అవకాశము; అని వా. ని.

ముఖారి

మఱి యేఁటివిన్నపము మాపుదాఁకాఁ జేసేము
గుఱిగా నీవే తెలుసుకోవయ్య యిపుడు ॥ పల్లవి ॥

కచ్చుపెట్టి నీరూపము కన్నులఁజూచి యింతి
అచ్చపుమోవితేన(నె?)కు నాసపడీని
కొచ్చి కొచ్చి వీనుల నీగుణములు వినీవిని
ఇచ్చలో నీపొందులకు నేఁకరీఁ దాను ॥ మఱి ॥

సనుపున నెలవుల నవ్వు తానే అప్పటిని
చెనకి యిట్టె నీపై చేయివేసీని
వొవర నీవద్దఁ బాయకుండీపుండీ తమకించి
పెనఁగులాడుచు సారెఁ బ్రియముచెప్పీని ॥ మఱి ॥

ఇందు నందు నిందాఁకా నెదమాటలాడించి
కందువతోఁ దానే వచ్చి కాఁగిలించీని
అందపు శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
మందలించి నీయెదుట మచ్చిక చల్లీని ॥ మఱి ॥ 339

వరాళి

ఇటువంటిదౌత వల పెరఁగ నిన్నాళ్లును
తటుకన రాఁగారాఁగా తలతీపులాయను ॥ పల్లవి ॥

వెలినున్నయంతవడి విరహములై యుండి
కలసినమీఁదట కలయై తోఁచె
తలఁచినయంతవడి తమకములై నిండి
సులభానఁ దనువులు సోఁకితే వేడుకాయ ॥ ఇటు ॥

వినుకలియంతవడి వెడయాసలై మించి
కనుకలిఁ దవివందె కాయమెల్లాను
పెనఁగినయంతవడి బీరములు నాటుకొని
చవవిచ్చితేఁ గడుచవులై మెరసెను ॥ ఇటు ॥

చెంగటనున్నంతవడి సిగ్గులు మిక్కిలిరేఁగి
ముంగిటఁ గాఁగిలించితే ముచ్చటలాయ
రంగుగ నే నలమేలుమంగను శ్రీవేంకటేశ
అంగవించి నీ వేలితి వందాలాయ రతులు ॥ ఇటు ॥ 340

మంగళకౌసిక

దయవుట్టీ నీకునీకె తమకించి చెప్పనేల
వినుతాన నీకెమేలు నెరవేర్చవయ్యా ॥ పల్లవి ॥

చెక్కునజారేచెమట నెలవులఁ జిఱునవ్వు
చక్కనిమాటలలోనిసాదింపులు
పిక్కటిల్లుఁజన్నులపై పెడఁబాసినపయ్యద
అక్కరతో నీవే చూడ నవధరించవయ్యా ॥ దయ ॥

పీడినవెన్నుపై కొప్పు వేమారులు నిట్టూర్పులు
పీడెపుమోపిమీఁదివింతసన్నలు
వాడుదేరేమేనిపై జవ్వనమదమునొంపులు
వేడుకతో నీవె ఇన్ని విచారించవయ్యా ॥ దయ ॥

మనసులో తలపోఁత మర్మములబయలీఁత
తనివోనిచూపులలో తరితీపులు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
చనవిచ్చి ఇంకా నీవే సరసమాడవయ్యా ॥ దయ ॥ 341

## సామంతం

ఎటువంటివోజ యీపె కెటువంటివాడికము
కుటిలకుంతలి నీకే కోమలి గాఁదగును ॥ పల్లవి ॥

మగువ నీవు రాఁగాను మంచముపై నుండి లేచి
నిగిడి చెక్కుచేతితో నిలుచున్నది
తగులమిసేసి నీవు దండఁ గూచుండుమనగా
పగటున మెల్లనె నీపాదా లొత్తీని ॥ ఎటు ॥

నీవు మోము చూచితేను నీచేతికి బాగాలిచ్చి
కావించి యాకుమడిచి కాచుకున్నది
ఆవేళ మోము చూచి అటు నీవు నవ్వితేను
పూవులు నీకు ముడిచీ బుజముమాటునను ॥ ఎటు ॥

పెనఁగులాడఁగా నిన్ను బెరసి కాఁగిట నించి
మునుపఁ దమ్ములానకు మోవి చాఁచీని
యెనసె శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
తనిసి నీరతులను దైలువారీని ॥ ఎటు ॥ 342

రేకు 1458

## సామంతం

ఎటువంటియాఁటదైనా ఇంతకోపునా
తటుకున నిది చూచి దయపుట్టె మాకును ॥ పల్లవి ॥

వెలినుండి యీపె నీవేళలు గాచుకుండఁగా
చెలితో మాటలాడేవు చెల్లునా నీకు
సొలవక ఆపె నీసుద్దు లాలకించఁగాను
కిలకిల నవ్వే వీడ కేరడముగాదా ॥ ఎటు ॥

గాఁటముగా నాద నాపె కానుకవట్టుకుండఁగా
పాటలు వినే విక్కడఁ బంతమా నీకు
సూటిగా నీరూపము సోరణగండ్లఁ జూడఁగా
జూటపై పరాకయ్యేవు సోద్యముగాదా ॥ ఎటు ॥

తలుపు దెఱచుకొని తానే వచ్చివుండఁగాను
చలమునఁ జెనకేవు సంగతా నా(నీ?)కు
అలమె శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
తలఁపెరిఁగి యేలేవు తగవేకాదా ॥ ఎటు ॥ 343

పాడి

వెంగెమాడేనా నిన్ను వినవా నాజాద మున్ను
సంగతిగా బుద్ధిచెప్పి చవిపుట్టించేఁగాక ॥ పల్లవి ॥

ఆందమాయ నీమాటలు ఆపెతో మొగమోటలు
పొందుసేసే వప్పటిని పూఁటపూఁటలు
నిందలాడేమా నేము నీవిట్టె చూచేవు మోము
విందులుగా నీసుద్దులు విన్నవించేఁగాక ॥ వెంగె ॥

తొలఁకీ మోవినవ్వులు తురుము విండెఁ బువ్వులు
యెలమి వింకానేల యెడదవ్వులు
చలము నీపై లేదు సరవిఁ జెప్పకపోదు
వలపు సూదిదెవట్టి వాసిరేఁచేఁగాక ॥ వెంగె ॥

కంటిమి నీచేఁతలు కరుణ కివె పూఁతలు
దంటతనములకు యీఁతలు మోఁతలు
ఇంటనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నంటున నీవిచ్చినమన్నన చూపేఁగాక ॥ వెంగె ॥ 344

### లలిత

వెనకతియ్యనేఁటికి వేసారఁగనేఁటికి
పెనఁగఁగవద్దా నీకుఁ బ్రియమైనదాఁకాను ॥పల్లవి॥

పనివడి నీవు నాతో పచారించి చెప్పఁగాను
వినవద్దా నీమాటలు వేడుకతోను
కనుఁగొని నీవు నాతో కాఁపురము సేయఁగా
కొనియాడవద్దా నిన్ను కోరిక లీడేరను ॥వెన॥

మంతనాన నీవు నామనసురా మెలఁగఁగా
సంతోషించవద్దా నిన్ను సారెసారెకు
చింతదీర నీవు నాకు చేతికి లోనై వుండఁగా
ఇంత బత్తి సేయవద్దా ఇంపులు మీరఁగను ॥వెన॥

తగవు దప్పక నీవే దయతోడ నేలఁగాను
తగఁ గాఁగిలించవద్దా తమితోడను
మగిడి శ్రీవేంకటేశ మన్నించి నన్నుఁ గూడఁగా
పొగడఁగవద్దా నిన్ను బూమెల్లా నెఱఁగను ॥వెన॥ 345

### దేసాళం

ఎఱఁగమా నీగుణము ఇంతవింతవారమా
మెఱసి ఇన్నిటా నిన్ను మెచ్చుటింతేకాక ॥పల్లవి॥

చనవుగలుగువారు జడియఁగనేమిటికి
మనసెరిఁగినవారు మందాడనేల
కనుసన్ననుండేవారు కాఁతాళించనేమిటికి
ననిచి నీచేఁతలకు నవ్వుటింతేకాక ॥ఎఱఁ॥

తగులాయమైనవారు తత్తరించనేమిటికి
మొగమోటయినవారు మొరయనేల
తగవునడపేవారు తప్పించుకోనేమిటికి
సొగిసి నిన్నుఁ దప్పకచూచుటింతేకాక ॥ ఎఱఁ ॥

గుట్టుతో మెలఁగేవారు కొసరఁగనేమిటికి
చుట్టములైనవారు జుణుఁగనేల
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి వన్ను నేఁడు
చిట్టకములేక సంతోసించుకొంటగాక ॥ ఎఱఁ ॥ 346

## కురంజి

చెక్కుచెమటలతోడ సిగ్గులకు లోనైతి
తెక్కలివలపులకుఁ దెరఁగేది యిఁకను ॥ పల్లవి ॥

మనసిచ్చి నీవు నాతో మాటాలాడఁగా నేను
వొసర నేమని నీకు నుత్తర మిత్తు
చెనకి వేడుకతోడ చెయివట్టి పెనఁగఁగా
యెనసి నీయెదుట నే విఁక నేమిసేతు ॥ చెక్కు ॥

సొక్కుచు నామోము నీవు సూటిగాఁ జూడఁగాను
తక్కక నేనేమని తలఁచుకొందు
పక్కన నీవు నేఁడు నాపైఁ జేయివేయఁగా
దక్కి నే నేరీతి నీచిత్తమురా మెలఁగుదు ॥ చెక్కు ॥

ముచ్చటతో నీవు నామోవితేనె లానఁగాను
ఇచ్చగించి యేరీతి నింపు పుట్టింతు
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి వన్ను నేఁడు
మెచ్చఁజేసి నీభావ మేమిటఁ బచారింతును ॥ చెక్కు ॥ 347

ఆహిరి

సుదతి వున్నభావము చూడఁగరాదా నీవే
పదిమారులును నొరఁబరచఁగనేఁటికి ॥ పల్లవి ॥

సేసపాలు దైవారె చిప్పిలిఁగఁ జెమరించె
ఆసలు లోలో వించె ఆయాలు గరఁగె
రాసికెక్కెఁ దమకము రచ్చఁబడె వలపులు
వేసరక యెందాఁకాను విన్నవించే మీఁకను ॥ సుద ॥

కోరిక లీరికె లెత్తె గుంపులాయఁ బులకలు
వూరెను మోవితేనెలు వొదగె నిట్టూర్పు
నారుకొనెఁ గూరిములు ననిచెఁ జిఱునవ్వులు
తారుకాణగా నెంత తలఁపించే మీఁకను ॥ సుద ॥

కళలు మోమున ముంచె కన్నులఁ జెంగావి మించె
పలుకులఁ బచ్చిదేరె పరగె వేడుకలు
యెలమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సలిగెఁ గూడె విన్నెంత సాదించే మీఁకను ॥ సుద ॥ 348

రేకు 1459 వరాళి

చెలి యిఁక నేమిసేసు నేయఁగలనేవ సేసె
నెలకొన్నవిభుఁడవు నీ వెఱఁగవా ॥పల్లవి ॥

చిగురుఁబెదవివంచి చెప్పినయట్టిప్రియాలు
తగిలి నీతోఁ గొసరేతలపోఁతలు
మొగము చూచిచూచి మొక్కినట్టిమొక్కులు
విగిడి నేఁ జ(జెః)ప్పనేల నీ వెఱఁగవా ॥ చెలి ॥

యిచ్చకముగా నీకు విచ్చినయట్టికానుక
కొచ్చి నీపైఁ జల్లినకూరిములు
విచ్చనవిడిసి నిన్ను వేఁడుకొన్న వేడుకలు
విచ్చ నెచ్చరించనేల నీ వెఱఁగవా ॥ చెలి ॥

నన్నుల మోవిచూపిన జాలువారేతేనెలు
కన్నుల నవ్వి చేకొన్న కాఁగిలింపులు
యెన్నఁగ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నిన్నుఁ గూడె విన్నియును నీ వెఱఁగవా ॥ చెలి ॥ 349

కన్నడగౌళ

ఏమని విన్నవించేము యిఁక నీకును
కామినిభాగ్యము మరి కలది నీచిత్తము ॥ పల్లవి ॥

చెలికి నీవు బత్తిసేసినచేఁతలు
తలకొని యేపొద్దూఁ దలపోఁతలు
చెలరేఁగి మరుఁడువ్రాసినవ్రాఁతలు
కొలఁదిమీరిననీకొనగోరిగీఁతలు ॥ ఏమ ॥

ఆకెతోడ నీవు సారె నాడినయట్టిమాఁటలు
కైకొని నమ్మెనవె బంగారుమూఁటలు
జోకలుగ మోవితేనెసోనవూటలు
నీకు నేఁడు గలిగె నన్నిటాఁ బూఁటవూఁటలు ॥ ఏమ ॥

చిత్తగిం చిద్దరూఁ గలసినపొందులు
హత్తినలోలోనిమోహపువిందులు
యిత్తల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
కొత్తలుగాఁ గూడినసిగ్గుల కివె సందులు ॥ ఏమ ॥ 350

### మాళవిగౌళ

చిమ్మిరేఁగినటువలె నేసినదే చేఁతగాక
దొమ్మిసరసములోన తొలఁగఁ జోటున్నదా ॥ పల్లవి ॥

నెలవుల నవ్వు నవ్వి చెంగలిచూపులఁ జూచి
పలుకులఁ దరితీపు పచరించి
నిలుచున్న దిదె చూడు నీవేల సిగ్గువడేవు
వలపులజాజరకు వాసివంతు లెంతురా ॥ చిమ్మి ॥

చన్నులు కానుకచూపి సంగడిఁ గొలువుసేసి
సన్నలనే ప్రియములు చాలాఁ జెప్పి
యిన్నిటా విన్నుఁ గొసరీ యెక్కడ పరాకు నీకు
పున్నమవెన్నెలపొళ్లు పూఁచి కుప్పసేతురా ॥ చిమ్మి ॥

తనువున విన్నొరసి తమకము పెడరేఁచి
వినుకలిఁ గనుకలి వింతసేసి
యెనసె శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
మనసులోఁ బాలు దాగి మరి లెక్కసేతురా ॥ చిమ్మి ॥ 351

### ముఖారి

ఎట్టుసేసినా నమరు ఇంతటిదొరవు నీవు
గట్టువాయతనమేల కరుణించరాదా ॥ పల్లవి॥

చెలి పవివడి నీతో చెవిలోన విన్నవించఁగా
మలసి వేరొకతెతో మాటలాడేవు
యెలమి నాపె విన్ను నేమీ ననఁజాలక
నెలవుల నవ్వు నవ్వీఁ జిత్తగించరాదా ॥ ఎట్టు ॥

చివ్వన నీసతి నీచేతికిఁ గానుకియ్యఁగా
అవ్వలియాపె నుంగర మడిగేవు
విన్వటిల్ల విందుకుఁగా నెమ్మి నందాలుసేసుక
పువ్వులవేసీ నిన్నుఁ బొందుచూపరాదా ॥ ఎట్టు ॥

ఆసల వలమేల్మంగ అట్టె కాఁగిలించుకోఁగా
సేసవెట్టే విందరిపై శ్రీవేంకటేశ
యేసుద్దులూఁ దడవక యిన్నిటాఁ బొగడె నిన్ను
లాసి నీరతులకు లాలించరాదా ॥ ఎట్టు ॥ 352

## సౌరాష్ట్రం

ఇంచుకంతా నలయిక యెఱఁగ విదేమయ్య
వంచీ శిరసు నీవు వద్దనుండఁగాను ॥ పల్లవి ॥

చెలరేఁగి చెమటలు చెంపలవెంట జారీ
బెళకుచుఁ జెలి నీతోఁ బెనఁగఁగాను
మెలుపవ నొండొంటితో మీఁపై చన్నులు రాసీ
చలపట్టి నీతో సరసమాడఁగాను ॥ ఇంచు ॥

పైపైఁ బెదవులను పలుకుఁదేనెలు చిందీ
మాపుదాఁకాఁ జనవిచ్చి మాటాడఁగాను
రాపునఁ బెనఁగువడీ రమణిహారములెల్ల
దాపున నీచెనకులు తప్పించుకోఁగాను ॥ ఇంచు ॥

మునుకొవి నొసలిపై ముంగురులు జారీవి
ఘనమైనరతి విన్నుఁ గలయఁగాను
యెనసె శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
వినుపాయ నిట్టూర్పులు నిన్నుఁ గాఁగిలించఁగా ॥ ఇంచు ॥ 353

శ్రీరాగం

ఏమని తలఁచితివో ఇందాఁకాను
యేమరఁజుమ్మీ నేను యిందాఁకాను ॥ పల్లవి ॥

తచ్చితచ్చి యిట్టె నీచిత్తము రావలెనంటాను
యిచ్చకములే యాడితి నిందాఁకాను
పచ్చినీచేఁతలు చూచి పదరఁజాలక నే-
నెచ్చరికతో నుండితి నిందాఁకాను ॥ ఏమ ॥

మదిలోన నీవు నన్ను మన్నింతువంటాను
యెదురెదురే చూచితి నిందాఁకాను
కదిసి నిన్ను మాయింటికడకుఁ బిలిచేనంటా
యిదివో కాచుకుండితి నిందాఁకాను ॥ ఏమ ॥

నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యెట్టు నిన్ను సొలసితి నిందాఁకాను
గట్టిగా నన్నేలితివి కైవశమై నీవు నాకు
యిట్టిట్టని తెలియను యిందాఁకాను ॥ ఏమ ॥ 354

రేకు 1460 దేశాక్షి

అదివో నీదేవులు నీయక్కునఁ జెలువొందీని
యెదుట నీకు నాపె ఇన్నిటాఁ దగును ॥ పల్లవి ॥

భామ నీకు నేపొద్దు పరతంత్రము
ఆమనిరతులలో మోహనయంత్రము
దామెనపలుకుల మదనమంత్రము
సాముసేసేనీకాఁగిటిస్వతంత్రము ॥ అది ॥

నెలకొన్ననీకు మాణిక్యము
పొలసేచూపులకెల్లా పుష్పచాపము
కలిగె నీకింతటి శ్రిం(శృం?)గారరూపము
యిల నీమహిమ వెలయించేప్రతాపము ॥ అది ॥

తన్నుఁదానే నీకును చిత్తరంజనము
విన్నుఁ గూడేకళలతో నిరంజనము
యెన్నఁగ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
చెన్నగు నీవనేటివిశేషాన కంజనము ॥ అది ॥ 355

దేవగాంధారి

అవతియ్యవలె నాకు నడిగే నిదివో విన్ను
వూనివవలపు నాకు నుంకువ లిచ్చితివా ॥ పల్లవి ॥

ప్రియములు నీవుచెప్పినయట్టయ్యీఁగాని
నయగారినీచేఁతలు నమ్ముదునా
దయదలఁచితే నిన్నుఁదగిలి మెచ్చేఁగాని
వియతపునీగుణాలు నే నెరిఁగేదానవా ॥ అవ ॥

దినదినకొత్తలెల్లాఁ దెలుసుకొనేఁగాని
యెనసిన నీపొందిక నియ్యకొందునా
చనవున మోవిచ్చేవు చవులుచూచేఁగాని
ఘనమైననీమా టతికడచేటిదానవా ॥ అవ ॥

సరసములాడేవి సమ్మతులయ్యీఁగాని
పురిగొన్ననీనేరుపు పొగడుదునా
యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
గరిమ నన్నేలితివి కడు సంతోసింతునా ॥ అవ ॥ 356

## పాడి

ఇన్నాళ్లవలెఁ గావు యివే నీమోముకళలు
తన్నుఁదానే మీఁదమీఁద దైలువారీ నిపుడు ॥ పల్లవి ॥

చెలఁగి యాతఁడు నీకుఁ జెప్పిపంపినమాటలు
వెలఁదిరో వీనులారా వింటివటవే
సొలవక నీకిచ్చినసురటిలో తనరూపు
విలుకదైనభావము నీమతి నిల్చెనటే ॥ ఇన్నా ॥

ననిచి నీదిక్కు చూచి నవ్వినయట్టినవ్వులు
పెనఁగి సంతోసాలై పెరిగెనటే
చెనకి విన్నెచ్చరించి చిమ్మిరేఁచినసిగ్గులు
తనివొందించి విన్నింకాఁ దలఁపించెనటవే ॥ ఇన్నా ॥

గుదిగొన విన్నుఁ దాఁ గూడినకూటమి
కదిసి నిన్ను నేర్పరిఁగాఁ జేసెనటే
యిదె శ్రీవేంకటేశుఁడు యే నలమేలుమంగను
వెదకి నన్నేలె నీకు వేడుకాయనటవే ॥ ఇన్నా ॥ 357

## ముఖారి

ఇంతేసి నేరుతుమా నే మిల్లాండ్లము
సంతోసాన వారి నన్నూ సరిగాఁ జూచేవు ॥ పల్లవి ॥

కన్నుల నవ్వఁగఁదగు కడుఁజేఁతలాడికి
చన్నుల నొత్తఁగఁదగుఁ జలపాదికి
విన్నపాలు సేయఁదగు వెస మాటకారికి
సన్నలు సేయఁగఁదగు చనవరిదానికి ॥ ఇంతే ॥

సిగ్గులువడఁగఁదగు చిన్నిపెండ్లికూఁతురుకు
దగ్గరి వుండఁగఁదగు దంటదానికి
వెగ్గళించి వవ్వఁదగు వెఱపులేనియింతికి
వొగ్గి చెనకఁగఁదగు నుదుపైనదానికి ॥ ఇంతే ॥

పెనఁగి పిలువఁదగు బీరపుతరుణికి
పనిగొని కూడఁదగు పంతగత్తెకు
విను శ్రీవేంకటేశ్వర నే నలమేలుమంగను
యెనసితి; నాకుఁ దగు విచ్చకపుదానికి ॥ ఇంతే ॥ 358

సాళంగనాట

ఇప్పుడుగాక నీపగ టిఁకనెన్నఁడే
చెప్పరాదు నీసేఁతలు చెల్లెఁగా నేఁడు ॥ పల్లవి ॥

వంతులకుఁ బెనఁగేవు వాసులకు జుఁగేవు
యెంతలేదు నీయెమ్మె లేమిచెప్పేదే
పంతములు మెఱసేవు పైకొని జఱసేవు
కాంతుఁ డిచ్చినచనవు గద్దుగా నీకు ॥ ఇప్ప ॥

చెక్కు చేత మోపేవు సిగ్గులెల్ల నాఁపేవు
అక్కజపుదొరవు నీ వౌదువే మేలు
కక్కసించి సొలసేవు కాఁకల మలసేవు
నిక్కి జవ్వనమదము నిండెఁగా నీకు ॥ ఇప్ప ॥

నన్నులనే మొక్కేవు సారెఁ గాలుదొక్కేవు
పన్నినసీపుదు టిఁకఁ బట్టఁగరాదే
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
నన్నుఁ గూడె వేడుకలు నవిచెఁగా నీకు ॥ ఇప్ప ॥ 359

## వసంతవరాళి

కన్నులు చల్లఁగా మిమ్ముఁ గనుఁగొంటిని
సన్నలా చాయలా విఁక జరయఁగనేఁటికి ॥ పల్లవి ॥

అనుమానమెల్లఁ దీరె ఆకె నీవూఁ గూడితివి(రి?)
మనసొక్కటాయఁగా మాటలేఁటికి
చెనకులు గరివడె చెక్కులఁ జెమట నిండె
వెనకముందర లెంచి విచారించనేఁటికి ॥ కన్ను ॥

మొగమోట లోనగూడె ముందర నున్నారు మీరు
తగవాయఁ బనులెల్లా దాఁచనేఁటికి
జిగిఁ గళ లెదురెక్కె సిగ్గులు ముంగిటఁ బడె
తగిలెఁ జుట్టరికము తడఁబాటులేఁటికి ॥ కన్ను ॥

తారుకాణాయ రతులు దక్కె సంతోసములెల్లా
చేరెఁ బంతములు నే డె చింతలేఁటికి
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కోరి నన్ను నేలితివి గుట్టుసేయనేఁటికి ॥ కన్ను ॥ 360

రేకు 1461 లలిత

మనసిచ్చి యాతనితో మాటాడరాదా
యెనసినమీఁదట యెరవులు గలవా ॥ పల్లవి ॥

చెప్పరావిప్రియములు సేయరావిబాసలు
అప్పుడే వింటివిగదే యాతనిచేత
కొప్పుమీఁదిసేసలు గోరికొనగురుతులు
ఇప్పుడే నింపించుకొంటి విఁకనేలే సుద్దులు ॥ మన ॥

పెట్టరానిఆనలు పెనఁగరానిచేఁతలు
గట్టిగాఁ గంటివిగదే కాంతునివల్ల
చుట్టరికపుఁదనాలు చూపులలో నవ్వులు
గుట్టునఁ జేకొంటివి కొంకనేలే నీకును ॥ మన ॥

తలఁచరానిపొందులు తనియరానిరతులు
కలిగెఁగదే విభునికాఁగిట నేఁడు
అలమేల్మంగను నేను ఆతఁడు శ్రీవేంకటేశుఁ —
డెలమి నన్నేలినాఁడు ఇయ్యకొనవలెనే ॥ మన ॥ 361

రామక్రియ

ఓపమయ్యా నీతో నవ్వ నూరకే వుండేముగాని
చేపట్టి నీవే యేలితే సేవ సేసేఁగాని ॥ పల్లవి ॥

కూరిమిలేనిచోట కుమ్మరించి కుమ్మరించి
సారెసార నవ్వినాను చౌకలౌను
మేరలు మీరేయప్పుడు మేనవారికైనాను
గోర గిరితేఁజాలు గొప్పయేరై వుండును ॥ ఓప ॥

యెగ్గులువట్టేవారు యెచ్చరించి యెచ్చరించి
వొగ్గి సరసమాడినా నొల్లఁబట్టౌను
వెగ్గళించవలసితే వింతలేనివారికైనా
దిగ్గనఁ గొసరితేను తీగెసాగు మాటలు ॥ ఓప ॥

ఆయమెఱిఁగినవారు ఆదరించి యాదరించి
చేయిపట్టి తీసినాను చెమట లూరు
యీయెడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పాయక నన్నేలితివి పంతమాడేవారమా ॥ ఓప ॥ 362

## ఆహిరి

చెప్పవే నీవే బుద్ది సిగ్గయ్యీ నాకు
చిప్పిలీ వలపులెల్ల చిత్తములో నాకు ॥పల్లవి॥

మాటలఁ దేనెలు గారీ మచ్చికల నోరూరీ
యీటువెట్టి యీఁ డివి యేఁడ నేర్చునే
కోటిసేయ నవ్వు నవ్వీ కొంగువట్టి పెనఁగీని
గాఁటపుఁ బుషితో నేఁ గమ్మటి నేమందునే ॥చెప్ప॥

పిలుపులఁ దమి నిండీ ప్రియములఁ బంట వండీ
చలమరి యెటువంటిజాణఁడే తాను
తలపోఁత గడురేఁచీ దప్పిదీర మోవిఇచ్చీ
బలిమికాఁ డితనితో పంతమెట్టాడుదునే ॥చెప్ప॥

కన్నుల సన్నలు చూపీ కాఁగిట నాసలు రేఁపీ
పన్ని ఇన్నిటాఁ దాను పంతగాఁడౌనే
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
నన్నుఁ గూడె యెప్పుడు నాకే మోహించునే ॥చెప్ప॥ 363

## బౌళి

వట్టిపరాకులు సేయవద్దు నీకు విఁకనేల
గుట్టు నే మెఱుఁగుదుము కొంక నీకేఁటికిని ॥పల్లవి॥

వేసరక వూడిగాలు వేమరుఁ జేసీ నీకె
పూసగుచ్చినట్టు నీకు బుద్దిచెప్పీని
వాసులువంతు లెంచక వద్దనే కాచుకున్నది
నీసముకాన నదిగో నెలఁతఁ జూడరాదా ॥వట్టి॥

కైవసము సేసుకొని కన్నుల విన్ను నవ్వీవి
వావులు నీతోఁ జెప్పి వలపించీని
పూవులు ముడిచి నీతో పొందులు నటించీని
దేవులాయ విన్నిటాను తెరవేసుకోరాదా ॥ వట్టి ॥

పానుపుపైఁ గూచుండి పాదాలు విసికీని
మేనిపై గందము పూసీ మెల్లనే తాను
అనుక శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
పూని విన్నుఁ గాఁగిలించె పొగడఁగరాదా ॥ వట్టి ॥ 364

మాళవిగౌళ

ఊరకే నన్ను మెచ్చీని వొద్దికైనదాసనంటా
యీరీతి నన్నుఁ బొగడె నేపనికి వత్తునే ॥ పల్లవి ॥

చనవుగలుగువారు సంగడి నుండఁగఁదగు
మనసునమ్మినవారు మాటాడఁదగు
పనిగలిగినవారు పట్టిపెనఁగఁగఁదగు
యెనపి నన్ను మన్నించె నెందులోనిదాననే ॥ ఊర ॥

తగవెరిఁగినవారు తరితీపు సేయఁదగు
మొగమిచ్చలాడేవారు మొక్కఁగఁదగు
నగనేరిచినవారు నయము చూపఁగఁదగు
యిగురుమోవి ఇచ్చె నేమనఁగఁగలనే ॥ ఊర ॥

మేనరికమైనవారు మేకులు సేయఁగఁదగు
పూని పాయరానివారు భోగించఁదగు
యే నలమేలుమంగను యీతఁడు శ్రీవేంకటేశుఁ-
డీనెపాన నన్నుఁ గూడె నేమని చెప్పుదునే ॥ ఊర ॥ 365

శంకరాభరణం

శిరసు వంచకు మిఁక శ్రీనరసింహా। నీ-
సిరు లెన్నైనాఁ గలవు శ్రీ నరసింహా ॥పల్లవి॥

చెలి నీతొడపై నెక్కె శ్రీనరసింహా
చెలరేఁగె నీమోము శ్రీనరసింహా
నెలవుల నవ్వేదెరె శ్రీ నరసింహా। నీమై
చెలప చెమట లుబ్బె శ్రీనరసింహా ॥శిర॥

చేరఁదేసికన్నులశ్రీనరసింహా
చీరుమూరాడీ వలపు శ్రీనరసింహా
చీరకొంగంటేవేమీ శ్రీనరసింహా
చేరె నీకు నామేలు శ్రీనరసింహా ॥శిర॥

చేవల్లకు వచ్చితివి శ్రీ నరసింహా నా-
సేవలెల్లా మెచ్చితివి శ్రీనరసింహా
శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీనరసింహా
చేవమీరె నీపేడుక శ్రీనరసింహా ॥శిర॥ 366

రేకు 1462 సాళంగనాట

ఎదురుఁగొండ లెక్కె ఇందిర గాఁగిలించఁగా
పెదపెదచన్ను లెంత పిసికేవు నీవు ॥పల్లవి॥

ముసిముసినవ్వు నవ్వి మొక్కుచు విన్నుఁ గూరిమి
గొసరఁగాఁ జెలినేల కొంగువట్టేవు
సుసరానఁ జెమటార సురటి చేఁబట్టి నీకు
విసరఁగా నీకె నెట్టు వేసేవు పూవులను ॥ఎదు॥

కన్నులను జంకించి కమ్మటి నీచెవిలోన
విన్నవించఁగా నేమి ః ఱ్ఱపీఁగేవు
సన్నలనే వలపులు చవిచూపి నీవొద్ద
కిన్నెర మీఁటఁగా నెట్టు గిలిగించేవు ॥ ఎదు ॥

పానుపుపైఁ బవ్వళించి పయ్యద నీకుఁ గప్పి
వూవి చెనకఁగా నెంత బుజ్జగించేవు
ఆనుక శ్రీవేంకటాద్రి నౌథళాన విన్నుఁ గూడి
తానకమై తొడెక్కఁగా తగమన్నించేవు ॥ ఎదు ॥ 367

రామక్రియ

చెన్నలర భూపతిచెరువుకాద నున్నాఁడు
వెన్నెలబాయిట నాదీ వేంకటేశుఁడు ॥ పల్లవి ॥

వాడలవాడలవెంట వనితలపొందు చేసీ
వేడుకకాఁడుగదమ్మ వేంకటేశుఁడు
జాదలు మీరి యప్పటి జాణతనాలాడీని
వీడెపుమోవితోడ వేంకటేశుఁడు ॥ చెన్న ॥

సాదువలె నందరిచన్నులపైఁ జేయిచాఁచీ
[1] వీదరవెల్లితనాల వేంకటేశుఁడు
ఆదిగొని గొల్లెతల నాసలఁబెట్టీఁ దాను
వేదవేద్యుఁడై నట్టివేంకటేశుఁడు ॥ చెన్న ॥

ననుపైనసతులెల్ల వంటునఁ గానుకియ్యఁగా
వినయాలు(నః) చేకొనీ వేంకటేశుఁడు
యెనసి నన్నునేలి యిప్పుడు నావిన్నపాలు
విన నవధరించె శ్రీవేంకటేశుఁడు ॥ చెన్న ॥ 368

1. చూడు 269 పాట.

ఆహిరి

నామన సెఱుఁగుఁ దొల్లె నవిచినదాననౌత
కామించి యేఁచఁగవద్దు గక్కన రమ్మనవే ॥ పల్లవి ॥

యెదమాట లాడించి యెంతపొద్దు జరపీనే
అడియాసలనే యెంత అలయించీనే
వుడివోవిచూపులను వురులొడ్డీ నిది యేమే
చిడియనివలపులఁ జిమ్మిరేఁగేదానను ॥ నామ ॥

మొగమొగా లెదుటను మోహా మెంతరేఁచీనే
నగవునఁ గాఁక లెట్టు నటియించీనే
పగటుఁజేఁతలు చూపి బయలేల యీఁదించీనే
మిగులాఁ దమకముల మించివున్నదానను ॥ నామ ॥

మన్ననలు నాకు నిచ్చి మద మెంత యెక్కించీనే
కిన్నుసన్నలనే యేమి గారవించీనే
వున్నతి శ్రీవేంకటేశుఁ డుద్దగిరికృష్ణుఁడై
వన్నుఁ గూడె తనపొందు నమ్మికైనదానను ॥ నామ ॥ 369

సామంతం

చూడఁ జిన్నవాఁడుగాని జూటుఁదనాల నెక్కుఁడు
యేడ చూచినాఁ దాను [1]యీవిట్ఠలుఁడే ॥ పల్లవి ॥

గోవులలో విహరించేగోవిందుఁడు । పెక్కు-
వావుల గోపికలకు వల్లభుఁడు
చేవమీరి ముద్దులశ్రీకృష్ణుఁడు
యేవల్లఁ జూచినాను యీవిట్ఠలుఁడే ॥ చూడఁ ॥

1. 'విఠ్ఠలుఁడు' రేకు.

రాసక్రీడలలోని రాజీవాక్షుఁడు
ఆసఁ బదారువేలఁ బెండ్లాడినవాఁడు
బాసతో రుక్మిణీసత్యభామాసమేతుఁడు
యీసుద్దుల వెలసీ నీవిట్ఠలుఁడే ॥ చూడఁ ॥

వింతమధురాంగనలవేడుకకాఁడు
చెంతఁ గొలవిసతులసిగ్గులవాఁడు
కాంత లక్ష్మీపతి శ్రీవేంకటేశ్వరుఁడు
యింతటా వినోదించీ నీవిట్ఠలుఁడే ॥ చూడఁ ॥ 370

ముఖారి

ఎఱుఁగుదు నే నీమోహ మింతిఁ బిలుచుకోరాదా
మొఱఁగి వేసా లింత నాముందర నేఁటికి ॥ పల్లవి ॥

వెలఁదిమాటలు నీకు విన వింపులౌఁగాని
చలముతోడుత మొగచాటు గాదు
తలకొని మొక్కితేను దయ వుట్టుఁగాని మరి
యెలమిఁ బరాకుసేయ నెంతైనా గొలుపదు ॥ ఎఱుఁ ॥

ఆపెనవ్వినవవ్వులు అందములై యుండుఁగాని
రాపుల నెగసక్కెలై రచ్చకెక్కవు
చూపులఁ దరితీపులు సోద్యములై తోఁచుఁగాని
కైపులై యెంతైనాను కడుఁ జప్పఁగావు ॥ ఎఱుఁ ॥

నీదేవులు చెనకితే నేరుపులై మించుఁగాని
ఆదిగొవి పేసటలై యలపు గాదు
యీదెస శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
పోది నెంతైనా తనపొం దెప్పుడు పీడదు ॥ ఎఱుఁ ॥ 371

వరాళి

ఎంత నేరిపితివో యీపెకు నీవు
చెంతలఁ దొల్లి నేరదు చిమ్మిరేఁగీ నిప్పుడు ॥ పల్లవి ॥

బత్తిసేసి రమణి నీపైఁ జేతులు వేసి
నత్తుగా వీఁపునఁ దనచన్నులు రాసీ
మొత్తమున వలపులు ముచ్చటల నెగపోసి
కొత్తవుపాయాల నిన్నుఁ గొసరీ నదివో ॥ ఎంత ॥

మనసులోపల నీమంతనములే కోరి
ననుపైననీమోవికి నోరూరీని
చెనకి నీకాఁగిటికి సిగ్గులతోనే చేరి
చనవులు నెరపీని సారెసారె నదివో ॥ ఎంత ॥

చెలరేఁగి నీమీఁదిచిందు లిన్నియునుఁ బాడి
బలిమిసేసి నీతోఁ బంతములాడీ
యెలమి నన్నేలితివి ఇట్టె విన్ను నాపె గూడి
అలరి శ్రీవేంకటేశ యందిమెచ్చీ నదివో ॥ ఎంత ॥ 372

రేకు 1463 కాంబోది

కాదనేవారెవ్వరు కడుఁజలి వానె నీకు
యీదెస ముందువెనక లెంచనేల ఇఁకను ॥ పల్లవి ॥

పొందు నీకుఁ గలిగితే పోఁదోయవచ్చునా
అందుకోవయ్యా విడె మాపెచేతను
కందువ నాపెతో పొత్తుగలసినవాఁడవు
విందలకు వెఱవఁగ నీకేల ఇఁకను ॥ కాద ॥

వాడఁబాటు గలిగితే వోపననవచ్చునా
కడఁగి యాపెతోఁ బెనఁగకువయ్యా
వాడిగట్టుకొని యాపె నొద్దఁబెట్టుకున్నాఁడవు
వెడ విచారాలుసేయ వేరేయేల ఇఁకను ॥ కాద ॥

వావి నీకుఁ గలిగితే వలదనవచ్చునా
వేవేగఁ బెండ్లాడి నీవు వెలయవయ్యా
యీవల శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
కైవసమయినమీఁద కడమేల యిఁకను ॥ కాద ॥ 373

## భైరవి

నాపై బత్తిగలఁదే నావిభుఁడు
యేపొద్దూ నాసంతోస మేమని చెప్పుదునే ॥ పల్లవి ॥

చెనకక తనతోను సిగ్గువడి నేనుండఁగా
మనసిచ్చి తానే నాతో మాటలాడీనే
తనివొంది నాలో నేనే తలవంచుకుండఁగాను
చనవిచ్చి యప్పటివి సరసములాడీనే ॥ నాపై ॥

చాయనేసుక కంబముచాటున నే నుండఁగాను
చేయివట్టి తీసి నాచెక్కు నొక్కీనే
కాయమెల్లా పయ్యదను కప్పుకొని వుండఁగాను
ఆయములంటి నన్ను నాదరించీనే ॥ నాపై ॥

వేడుకతోఁ దనవొద్ద వేళగాచుకుండఁగాను
వాడుదేర నింత నన్ను వలపించీనే
యీడనే శ్రీవేంకటేశుఁ డెదుట నే నుండఁగాను
కూడి నన్ను నిందరిలో కొంకక యీదేర్చెనే ॥ నాపై ॥ 374

## పాడి

నీవారైనవారి నేము గారవించవద్దా
[1] యీరీతి(యీవిధాన?)నే మోరిచినదింతా నీకే నెలవు ॥పల్లవి॥

ఇత్తల నీచెలులను యెట్టైనఁ బొగదేము నీ-
చిత్తము వచ్చితేఁజాలు చింతయేఁటికి
బత్తితో నాపెచేనిమ్మపండు కిందికి జారితే
యెత్తి నే మిచ్చితే నది హీనమూఁ గాదు ॥నీవా॥

మంతనాన నీదేవులమాటున బదికేము నీ-
పంతము వచ్చితేఁజాలు పదరనేలా
బంతి నాపె కెచ్చరిక పరాకులు చెప్పితేను
యెంతైనా మా కందువల్ల నెగ్గులూఁ గావు ॥నీవా॥

యీడ నీసతిసలిగె విట్టె విన్నుఁ గూడేము
వేడుక నీకైతేఁజాలు వీఁగనేఁటికి
పాడితో నన్నేలితివి పక్కన శ్రీవేంకటేశ
ఆడ నాపెచెల్లెలనైనది వొచ్చెము గాదు ॥నీవా॥ 375

## సౌరాష్ట్రం

నే నెంతటిదానను నీ విన్నిటా ఘనుఁడవు
మోనముతో విన్నుఁ జూచి మొక్కుటింతేకాక ॥పల్లవి॥

అమరఁగ నాయకుఁడు ఆదరించితేఁగాక
తమకించవచ్చునా తరుణులకు
మమకారమునఁ గొంత మన్నించితేఁగాక
సముకాన జంకించి సాదించవచ్చునా ॥నేనెం॥

---

1. ప్రాసభంగము.

మక్కువతో మగవాఁడు మాటలాడితేఁగాక
కక్కసించవచ్చునా కామినులకు
చక్కఁగా నివ్వితివాపి చనవిచ్చితేఁగాక
పక్కనుండి పంతములు పచారించవచ్చునా ॥ నేనెం ॥

శ్రీ వేంకటేశ్వర నీవే చిత్తగించితేఁగాక
సోవలకే పెనఁగవచ్చునా మాకు
యీవేళ నన్నేలితివి యిటువలెనైతేఁగాక
దేవులనై కొంగువట్టి తెమలించవచ్చునా ॥ నేనెం ॥ 376

హిందోళవసంతం

తలఁచుకో యింకా నీవే తగవులన్నియు నేఁడు
సిలుగులాఁడిసుద్దులు చెప్పలేము గాని ॥ పల్లవి ॥

చేతికిలోనైనసతి చెప్పించుకోదు ప్రియము
నీతియెఱిఁగిన దెందూ నేర మెంచదు
ఆతుమలో మెలఁగేది అవుఁగాములు చూడదు
యేతరికత్తెగుణాలే యెఱఁగముగాని ॥ తలఁ ॥

ఇతవరియైనకాంత యెరవులు సేయదు
సతమైన దేమవినా చలపట్టదు
మతి నమ్మికైనది మర్మములు దడవదు
కతకారిదానిమాయ కానలేముగాని ॥ తలఁ ॥

తగులైనమావిని తరితీపు సేయదు
నగనేరిచినది యెన్నఁడుఁ దిట్టదు
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
యెగసక్కెపుదానిజా డెట్టుండునోకాని ॥ తలఁ ॥ 377

### కుంతలవరాళి

ఎఱుఁగుదు నీగుణములేల చెప్పేవు
మఱఁగైనట్టే వుండు మర్మములు సోఁకును ॥ పల్లవి ॥

పన్ని నీవెంతేసి మాతోఁ బంతములాడినా నాపెఁ
గన్నులఁ జూచితే నీకుఁ గళ రేఁగును
యెన్నఁగ నే గుట్టుతో నెంత వోరుచుకుండినా
సన్న లాపె సేసితే సారెఁ దమివుట్టును ॥ ఎఱుఁ ॥

చెలరేఁగి నీలోన సిగ్గులెంత నెఱపినా
లలి నాపె నవ్వితే నెలకొను నాస
చలపట్టుకొని రాజసమున నూరకుండినా
వెలలేనివేడుకలు వెల్లవిరి సేసును ॥ ఎఱుఁ ॥

వట్టిసటలకు నీవు వలపులు దాఁచినాను
గట్టిమాఁట [1]లాపేడితేఁ గాయ మలరు
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చుట్టరిక మెంచితేనే సొంపులెల్లాఁ గలుగు ॥ ఎఱుఁ ॥ 378

రేకు 1464 **శ్రీరాగం**

పతికి విన్నవించరే పడఁతులాల
సతమై తా నీఁక నాకు చనవు లిమ్మనవే ॥ పల్లవి ॥

వెలలేనివేడుకకు వేస టెంతైనాఁ గాదు
తలపోఁతరతులకుఁ దనివి లేదు
మొలకనవ్వులకును మొగచాటు చెప్పరాదు
యెలమితో నామోహ మెంతని చెప్పుదునే ॥ పతి ॥

---

1. ఆపె + ఆడితే.

తగులై నమీఁదట తనపొందు విడువదు
జిగిమించేతమకము చెప్పఁగూడదు
మొగివిచ్చకుండేసిగ్గు మొలచి పసివాడదు
యిగిరించె నావయసు యెటువలె దాఁతునే ॥ పతి ॥

కూడియున్నభావము గుదిగొని పాయదు
వీడెపుమోవిగుఱుతు వింతసేయదు
యీడనె శ్రీవేంకటేశుఁ డింతలో నన్ను నేలె
యీడుజోడయివభోగ మెంతైనాఁ గలదే ॥ పతి ॥ 379

కాంబోది

రాకుంటే దోసముసుమ్మీ రమణివొద్దికి నీవు
జోకగా నేరీతి నాపెఁ జొక్కులఁబెట్టితివో ॥ పల్లవి ॥

సంతోసాన నున్న దిదె సారెఁ జిరునవ్వులతో
మంతనాన నేమంటివో మగువతోను
వింతవింతసింగారాల విఱ్ఱవీఁగీ నింటితోన
అంతరంగమున కెన్ని ఆసలు వెట్టితివో ॥ రాకుం ॥

గుత్తపుఁజెమటలే కుమ్మరించీని సతి
చిత్తగించి యెట్లాఁ జూచితివో నీవు
బొత్తుగాఁ బాన్పుపై నీపొందులే కోరుకున్నది
ఇత్తల నమ్మిక లెన్ని ఇచ్చితివో నీవు ॥ రాకుం ॥

ఆముకొని తమకించి ఆట్టె నీకాఁగిటఁ గూడీ
యేమిసన్న సేసితివో యీఇంతికి
యీమేరనే శ్రీవేంకటేశ నన్ను నేలితివి
నేమముతో నెంతేసి నేరుచుకొంటివో ॥ రాకుం ॥ 380

### ఆహిరి

వట్టియలుక రేలే వద్దే నీకు
గుట్టు తెలిసితి విఁకఁ గూడరాదా యితవి ॥ పల్లవి ॥

వాదఁబడఁజెప్పితేను వాక్కుమనసై వుండు
కడునమ్మమెలఁగితేఁ గాదనరాదు
ఆ(ఆఁ?)డియాలాలు చూపితే ననుమానమే లేదు
తొడరి విభుని నీవు దూరఁ జోటే దిఁకను ॥ వట్టి ॥

తగవులు నెరపితే దాకొను సంతోషము
చిగిరించ నవ్వితేను చింత దీరును
మొగమోటఁ బైకొంటే మోహములు దైవారు
మగని నొఁగాదన మరియేలే ఇఁకను ॥ వట్టి ॥

యిఁ(యిం?)టికి విచ్చేసితేను యియ్యకోలొఁ బొందులు
జంట వాయకుండితేను సతమౌఁ బ్రేమ
నంటున శ్రీవేంకటనగపతి విన్నుఁ గూడె
అంటి నీవితని జరయఁగనేలే ఇఁకను ॥ వట్టి ॥ 381

### ఆహిరినాట

ఆఁటది గర్వించితేను అంతట [1]మట్టెరఁగదు
పాటించి యాతఁడు నీకే పాలుపడె నటవే ॥ పల్లవి ॥

వంతువెట్టుకొని పతివద్దఁ గాచుకుందానవు
యెంతగద్దే నీచనవు ఇందరికంటే
ఇంతలోనే చెవిలోన నేకతాలూ నాడేవు
చింతదీర నీమాటే నేసునటే యాతఁడు ॥ ఆఁట ॥

---

1. మట్టు+ఎరఁగదు

పరగ నాతనికి నీపచ్చడము గప్పేవు
పొరుగున నెన్నటిపొందులే నీకు
తెరవేసుకొనుచు చేతికి విడెమూ నిచ్చేవు
సిరులఁబనులు నీకుఁ జెప్పెనటే యాతఁడు ॥ ఆఁట ॥

కలసిమెలసి నీవు కందువలు చెప్పేవు
చెలరేఁగి నీకు బాస సేసెనటవే
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
తెలిపి నిన్నిట్లానే దిద్దెనటే యాతఁడు ॥ ఆఁట ॥ 382

దేవగాంధారి

తా నెరగఁడా యాతగవు లెల్లెడలను
నేనేమైనా తనమీఁద నెపాలు వేసేనా ॥ పల్లవి ॥

రతివేళమాఁటలు రచ్చలకు నెక్కవు
యితవైనవారికి యెగ్గులేదు
పతికిని సతికిని పాయదు చుట్టరికము
అతిమోహములకును అడ్డాఁకలేదు ॥ తానె ॥

సిగ్గుసద్దయంతలోనే చేరదు తమకము
వెగ్గళించినా నవ్వులు వేసటగావు
వొగ్గి వేఁడుకొంటేనే వోదు గదు(దు?)బీరము
కగ్గనిపొందులలోన కపటము లుండవు ॥ తానె ॥

చనవరిచేఁతలు సాదింపులు గావు
యెనసినకూటమికి నెర వేదది
ఘనశ్రీవేంకటేశుఁడు కదిసె నన్నింతలొనె
వినయముగలచోట వెగటై తోఁచదు ॥ తానె ॥ 383

తెలుఁగుఁగాంబోది

ఎన్నేసివిద్యలు నేర్చె నీరమణి
చెన్నుమీరె విన్నిటాను చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

పవితచెమటలనె వానలు గురిసీ నదె
వినుపునవ్వులనె వెన్నెలగాసీని
పనులుసేసేపూర్పుల పయ్యరగాలి విసరి
చెనకీ నీదేవులు చిత్తగించవయ్యా ॥ ఎన్నే ॥

విరహపువేడుక వేసఁగియెండలు గాసీ
సొరిఁది సిగ్గులనే మంచులు గప్పీని
వరుస మోవితేనెల వసంతకాలము చూపీ
సిరుల నీవేడుకలు చిత్తగించవయ్యా ॥ ఎన్నే

కందువచూపులనే కడుమెఱుఁగులు చల్లీ
అందపురతులనే వియ్యము లందీని
యిందుకె శ్రీవేంకటేశ యేలితి వీకెను నేఁడు
చిందీ నదె తరితీపు చిత్తగించవయ్యా ॥ ఎన్నే ॥ 384

రేకు 1465 వేళావళి

ఎవ్వరు నేరుతురు నేఁ డిటువంటినేరుపులు
వివ్వటిల్లఁజేఁతలను విన్నే మెప్పించెను ॥ పల్లవి ॥

చెక్కుచెమట దుడిచె చెలి సురటి విసరె
వెక్కసమై నీ కెంత వేడుకాయనో
చక్క వద్దఁగూచుండి జారినతురుము దిద్దె
మక్కువ నీవలపులు మానుపఁగవసమా ॥ ఎవ్వ ॥

వొంటినే కొలువునేసె వొయ్యనే పాదము లొత్తె
పెంటలుగా నీకెంత ప్రియమాయెనో
అంటిముట్టి పెనఁగుతూ నాయములు గరఁగించె
వెంటనే యీవోజ లిఁక విడపించవసమా ॥ ఎవ్వ ॥

సారెకు పయ్యదఁ గప్పె సంగడినే మాటలాడె
కోరిక నీకెటువలెఁ గూడెనో నేఁడు
గారవించి శ్రీవేంకటేశ నన్నేలితివి
తారుకాణనీసుద్దులు దాఁచ నిఁక వసమా ॥ ఎవ్వ ॥ 583

గౌళ

అతఁ డేమిసేసినాను అదియు నాభాగ్యమే
కాతరించి నేనెట్టు గరిసింతునే ॥ పల్లవి ॥

కలువపూవుల వేసి కడఁగి యాచేతనే
కులికి విభుని నెట్టు గోర నంటేనే
వలపులు చల్లిచల్లి పరుస నప్పటి నేనే
చలపట్టి యెటువలె జంకింతునే ॥ అతఁ ॥

సరసమాడుచు నవ్వి చక్కఁగా నానోరనే
యిరవుగా పలుసోఁకు లెట్టు సింతునే
గిరికుచముల నొత్తి కినిసి యంతటిలోన
విరహము రేఁచి యెట్టు వేరువేరె వుందునే ॥ అతఁ ॥

కందువరతులఁ గూడి కమ్మటి నాకాఁగిటనే
విందువలె సారె నెట్టు వేసరింతునే
అంది శ్రీవేంకటేశుఁడు ఆదరించి నన్ను నేలె
మందెమేళమున నెట్టు మాఁటల మెప్పింతునే ॥ అతఁ ॥ 386

పాడి

మీవలెనే వుండవద్దా మేటియైనజాణలెల్లా
భావించి తెలియలేక పదరఁగ నేలా ॥పల్లవి॥

మొక్కలము లేఁటికి మోహముగలవారికి
మిక్కిలి వివేకాన మించుటగాక
వెక్కసపుఁదమకాన వేఁడుకొనె విన్నాతఁడు
తక్కక నీవందుకుఁ దగ నియ్యకొంటివి ॥మీవ॥

కోపగించనేమిటికి కూటమిగలవారికి
వోపికతో నిన్నిటికి నోర్చుటగాక
చేపట్టి విన్నాతఁడు చెనకి నవ్వులు నవ్వె
తీపులమోవి యొసఁగితివి నీవతనికి ॥మీవ॥

వింతసేయనేమిటికి వేడుకగలవారికి
అంతరంగాన సంతసమందుటగాక
యింతలోనే శ్రీవేంకటేశుఁడు విన్నేలినాఁడు
కాంతవు నీ వాతనిఁ గాఁగిలించుకొంటివి ॥మీవ॥ 387

భైరవి

మేలుమేలనుచు మిమ్ము మెచ్చేఁ గాని
సోలి మీవద్దఁ గూచుండేచో టియ్యవయ్య ॥పల్లవి॥

విందముగాని నీవు వేడుకలెల్లా మెరసి
అందముగాఁ జెప్పవయ్యా ఆపెనుద్దులు
చెంది సిగ్గులువడక శిరసు వంచుకొవక
మందర విలాసించి నీమోము చూపవయ్య ॥మేలు॥

చూతముగాని యాపె సోయగపుగురుతులు
యీతరిఁ బిలువవయ్యా యెటువంటిదో
యేతుల కోపననక యింతటిలోనే నగక
సీతలఁపుఁ దెలుసుకొనే నిందు రావయ్యా ॥ మేలు ॥

ఇయ్యకొందముగాని యీసతిజాణతనాలు
ఇయ్యెడఁ బచారింపించనీవయ్యా నీవు
నెయ్యపుశ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
వుయ్యాలమంచము మీఁద నుండఁగదవయ్య ॥ మేలు ॥ 388

ముఖారి

ఏకతానకు రారాదా యిప్పుడే కావలెనా
కాకుసేసి యిందరిలోఁ గత లడిగేవు ॥ పల్లవి ॥

కనుఁగొనలనే నిన్ను కామిని జంకించఁగాను
చెనకేవు సారెసారెఁ జేయి చాఁచి
వనితలు చూడఁగాను వట్టిసిగ్గున నుండక
గొనకొని యాపెనేల కొంగువట్టేవు ॥ ఏక ॥

చక్కఁగా నీమోము చూచి సన్నలు సేయఁగాను
చెక్కిలి నొక్కి యిట్టె సేసవెట్టేవు
తక్కక నీ వింతలోనే తగ గుట్టుసేయక
వొక్కపై చన్నులనే వొరసుకొనేవు ॥ ఏక ॥

తీపుగా రేమోవి చూపి తెరవేసుకొనఁగాను
చేపట్టి కాఁగిట నించి జీరదీసేవు
రాపుల శ్రీవేంకటేశ రతుల జంకించితివి
పైపై నింకా నెంత పనులు చూపేవు ॥ ఏక ॥ 389

పూర్వగౌళ

వట్టియనుమానమేల వద్దనున్నాఁ డితఁడు
చుట్టమైనవాని నెంత సోదించేవే ॥పల్లవి॥

చెలిమిసేసినవాఁడు చేతిలోనివాఁడు కాఁడా
తలఁపులోపలివాఁడు తగులేకాదా
పిలిచినవాఁడు కడుఁబ్రియములు చూపఁడా
సొలపి యాతనినేల చూచి జరసేవే ॥వట్టి॥

యింటికివచ్చినవాఁడు యియ్యకొనిమాటాడఁడా
అంటిముట్టిపెనఁగేవాఁ డాదరించఁడా
చంటిపై గోరొత్తేవాఁడు చనవు లొసఁగఁడా
జంటైనపతితోనేల సాములు సేసేవే ॥వట్టి॥

కూరిమిచూపినవాఁడు కూడినవాఁడే కాఁడా
సారెకు నవ్వినాఁ డిఁక సమ్మతే కాదా
యీరతి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్ను నేలె
గారవించి యిఁకనేల కతలు సేసేవే ॥వట్టి॥ 390

రేకు 1466 సామంతం

ఇటువలె నుండవద్దా యేకమైనవలపులు
తటుకనఁ దరితీపు దైవారీని ॥పల్లవి॥

మనసు నమ్మికయైతే మంతనము లింపులౌను
కనుసన్న మెలఁగితే కడువేడుకౌను
తనివి గలిగితేను తాలిములు నిలుచును
యెనసినమీపొందులు యేమని మెచ్చేమే ॥ఇటు॥

మాట లొదఁబడికైతే మచ్చికలు సమకూరు
కూటము లొద్దికలైతే గుట్టు చెల్లును
పాటించి మొగమోడితే పనులన్నీఁ జక్కనౌను
యీటులేనిమీగుణాలు యెన్నెని చెప్పేమే ॥ ఇటు ॥

నగ నేరుచుకొంటే నాఁటుకొనుఁ బ్రియములు
తగులాయమైతేను తమి రేఁగును
అగపడి శ్రీవేంకటాధిపుఁడు నినుఁ గూడె
ఇగురుఁబోఁడి మీలీల లేమని నుతింతుమే ॥ ఇటు ॥ 391

గౌళ

చూడవయ్యా ఇంకా నాపెచొక్కపుఁజక్కఁదనాలు
వేడుకకాఁడవు తొల్లె వెలయకుండుదువా ॥ పల్లవి ॥

మాటలఁ దేనెలు గారీ మక్కువల నోరూరీ
తేటలువారీ నాపెతెలిఁగన్నుల
ఆఁటదానిఁ గంటే నీవు ఆసోదకాఁడవు
పాటించి నీవిది గంటే భ్రమయకుండుదువా ॥ చూడ ॥

నవ్వుల వెన్నెల గాసీ నంటున వింతలు చూపీ
రవ్వలు సేసీని సింగారపుఁజేఁతల
జవ్వనమదము సంతసమునకుఁ బుట్టినిల్లు
వువ్విళ్లూర వింత గలితే వోర్వఁగఁగలవా ॥ చూడ ॥

చెనకులు దుదిముట్టీ సిగ్గులనుఁ బాలకట్టీ
వినయములే తొట్లీ వెస రతుల
యెనసితివి శ్రీవేంకటేశ యీకెనూ నన్నూ
పెనఁగితి విందువంకఁ బ్రియ మందకుందువా ॥ చూడ ॥ 392

### పాడి

వలపు మొగచాటైనవారికి విట్టేకాదా
నెలకొన్నదొరవుగా నీ వేమిసేతువు ॥ పల్లవి ॥

నిచ్చలపుజవరాలు నీవద్దనే వుండఁగాను
మచ్చికతోడనే మాటలాడేవు
ఇచ్చగించి వీడెము నీకియ్యఁ గాచుకుండఁగాను
పచ్చిదేర నాచన్నులపైఁ జేయివేసేవు ॥ వల ॥

చనవరినీదేవులు సరసములాడఁగాను
ననుపున నన్నుఁ జూచి నవ్వు నవ్వేవు
వినయముతో నాపె విందు నీకుఁ జెప్పఁగాను
మొనసి నీ విపుడు నామోవి యడిగేవు ॥ వల ॥

పెండిలాడినాపె నాతోఁ బెనఁగుతా నుండఁగాను
అండనే నన్నుఁ గూడి ఆదరించేవు
నిండుకొన్నమచ్చికలు నీపై నారటిల్లఁగాను
కొండలశ్రీవేంకటేశ కోరి నన్ను మెచ్చేవు ॥ వల ॥ 393

### దేశాక్షి

ఆన తియ్యవయ్యా మాకు నామేలు విసేముగాని
[1]కోమలికిఁ బొంతనాలు గూడెనా నీకు ॥ పల్లవి ॥

చలముగొని యాపెను సారెసారెఁ జూచేవు
మలసి నీకుఁ బెండ్లాడ మనసయ్యీనా
చెలరేఁగి యప్పటిని చేయి మీఁదవేసేవు
యెలమితో వారివారు ఇచ్చిరా నీకు ॥ ఆన ॥

---

1. "కోనేటివతి నీకు సతికిఁ గూడెనా పొంతనాలు" అనినసరిపోవునేమోః ప్రాసభంగము

తీపులమోవివిందు తేనియలు జొబ్బిలీవి
ఆపెకు నీకును మాట లందెనా నేఁడు
కాఁపురము సేసేనంటా కాచుకొనివున్నాఁడవు
ఆపాటిచుట్టరికములాయనా మీకు ॥ ఆన ॥

పానుపుపై నాపెచేతఁ బాదా లొత్తించుకొనేవు
అ(ఆః)నుకొని బువ్వముపొత్తబ్బెనా మీకు
పూని శ్రీవేంకటేశ్వర పొంచి నన్ను నేలితివి
మేనరికా లిద్దరికి మెరసెనా ఇపుడు ॥ ఆన ॥ 394

## సాళంగనాట

మీకు మీకు నమరును మిక్కిలివేడుకలెల్లా
కైకొని నేమెల్లాఁ జూడఁగంటిమిగదే ॥ పల్లవి ॥

సింగారరాయఁడుగదే చిత్తజగురుఁడుగదే
అంగవించి నిన్నుఁ బెండ్లాడినవాఁడు
బంగారుపతిమవు పాలవెల్లికూఁతురవు
అంగన నీవు దేవులవైతివిగదే ॥ మీకు ॥

కాంచనపుదట్టివాఁడు కౌస్తుభపుమణివాఁడు
మంచితనమున నీకు మగఁడుగదే
మించుసిరులదానవు మేటితమ్మిపైదానవు
యెంచఁగ నితనివుర మెక్కితివిగదవే ॥ మీకు ॥

చేతులు నాల్గిటివాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
ఆతుమగా నిన్నునేలి ఆలరేఁగదే
యీతల శ్రీకాంతవు యిన్నిటా నేరుపరివి
యీతని కెప్పుడు నీవు యిరవైతివిగదే ॥ మీకు ॥ 395

బౌళి

వారివారిసహజాలు వన్నెకెక్కివుండుఁగాని
యీరసానఁ దలఁచితే యెక్కువలై తోఁచవు ॥పల్లవి॥

సతులు పెక్కుమాఁటల జరయుదు రూరకైనా
మతిలో నెగ్గుపట్టఁడు మగవాఁడు
చతురతలు మెరసి జంకింతురు సొలతులు
తతి నెంచఁబోతేను తప్పుగాఁ గైకొనఁడు ॥వారి॥

జవ్వనులు కాఁతాళించి నణఁగులు రాలుతురు
రవ్వలుగా నలుగఁడు రమణుఁ డెందు
పువ్వులఁగొని వేతురు బుజముల నొరతురు
నవ్వుతానే వుండుఁగాని నలిరేఁగి తిట్టఁడు ॥వారి॥

జట్టిగొన్నమానినులు సమరతి మీరుదురు
గుట్టు బయటవేయఁడు గుణవంతుఁడు
గట్టిగా శ్రీవేంకటేశ కడపలో నన్నేలితి-
వెట్టయినాఁ దనవిభుఁడే ఇన్నిటాను ఘనుఁడు ॥వారి॥ 396

రేకు 1467 రామక్రియ

తానేల నవ్వులు నవ్వీ దంటలముగామనుచు
పూని కొలువులో మీరఁబోలదనికాక ॥పల్లవి॥

నేరరా పతితో నాడ నెలఁతలు సరసాలు
ఆరయ మందెమేళ మౌననికాక
చేరి చెనకనోపరా చేతులు చాఁచి చాఁచి
సారెకుఁ దమసిగ్గులు జారీననికాక ॥తానే॥

జూటుఁదనాన పంతాలు చూపఁగనోపరా
ఆఁటదాని కోజలుగావనికాక
సూటిగాఁ గన్నులఁ జూచి సొలయఁగనోపరా
కాటుకవన్నెలకప్పు గప్పినదికాక ॥ తానే ॥

నెట్టనఁ దమకములు నెరపఁగనోపరా
గుట్టు బయలయ్యీనంటాఁ గొంకుటగాక
యిట్టె శ్రీవేంకటేశుఁ డేనలమేలుమంగను
ఘట్టమై నన్నేలఁగా సోద్యమయ్యీఁగాక ॥ తానే ॥ 397

ధన్నాసి

చిత్తగించరాదా నీవే చెలి యట్లనున్నదో
కొత్తగా నే విన్నవించేగురుతు లేమున్నవి ॥ పల్లవి ॥

తరుణి నీకూటములు దలపోసి తలపోసి
శిరసువంపులతోడఁ జిమ్మిరేఁగెను
వరుస నీకొప్పువీడి వాసనకుఁ గడుఁజొక్కి
నిరతపుఁదమకాన నివ్వెరగై వున్నది ॥ చిత్త ॥

నెమ్మదిఁ జిత్తరువులో నీరూపు చూచి చూచి
పమ్మినకోరికలలో పచ్చిదేరెను
తెమ్మలుగా నీసుద్దులు దిక్కులనెల్లా విని
వుమ్మగిలునట్టూర్పుల నుస్సురనీ నిపుడు ॥ చిత్త ॥

మన్నించఁగా నీకాఁగిట మర్మములు సోఁకి సోఁకి
చన్నులపై పులకల జడిసీ నిదె
యిన్నిటా శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నిన్ను మెచ్చి పొగడుతా నించుకొనెఁ గళలు ॥ చిత్త ॥ 398

దేసాళం

తలఁపించరే చెలు లాతనికి నిది
పలుక నేమున్నది తాఁ బలిగొంటగాక ॥పల్లవి॥

జిగిమించి విన్నపాలు సేయఁగనేర్తునా
తగ నన్ను మన్నించ తనకే పోదు
చిగురుఁజేతులఁ దన్నుఁ జెనకనేరుతునా
బిగివాయ కిలఁ దనభారమింతేకాక ॥తలఁ॥

సొరిదిఁ దనకు నేఁ జుట్టమయ్యేదాననా
దరిచేర్చి బుద్ధిచెప్పఁ దానేకాక
వరుసలఁ దనకు నే వలచేయంతదాననా
గరిమతో దానికీర్తి గట్టుకొనేఁగాక ॥తలఁ॥

పానుపుపైనుండి తన్నుఁ బైకొనఁగవచ్చునా
కావిమ్మని తానే నన్నుఁ గలసినాఁడు
అనుక శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
నానావిధాల నాతో నవ్వినాఁడుగాక ॥తలఁ॥ 399

శంకరాభరణం

అరుదరుదు విన్నుఁ బెండ్లాడినవారిభాగ్యము
సిరుఁలనీమహిమలు చెప్పఁ గొత్తలు ॥పల్లవి॥

ముప్పిరిగొనఁ గవి మోవి చూచితే
దప్పులుదేరు నందరుతరుణులకు
కప్పిన నీమేనితావిగాలి విసరితే
అప్పుడే విరహపుటలయిక మానును ॥అరు॥

మనసారా నీతోను మాఁటలాడితే
ఘనముగా నెమ్మోముల( గళలెక్కను
చనవిచ్చి నీవు మాసంగడిఁ గూచుండితే
తనివిఁబొందు గక్కనఁ దనువులెల్లాను ॥ అరు ॥

చేతనంటి నీమేవిసేవ సేసితే
కాతరపుఁగోరికలు కడుఫలించు
యీతల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నీతితో నన్నేలితివి నిందు నిఁక కీర్తులు ॥ అరు ॥ 400

సామంతం

ఊరకేల సిగ్గువడే వుపాయాలు నేఁ జెప్పితే
అరీతి నీవిన్నపము లన్నిఁ జేసుకొనవే ॥ పల్లవి ॥

జలజాక్షి నీపతి మజ్జనమింట నున్నవాఁడు
జలక మందియ్యవే సంతోసాన
చెలువుఁడు మైమర్దన చేయుమనునో యేమో
తలగడయుఁ జాపఁ జేత యామఱకువే ॥ ఊర ॥

శిరసారుచుకో నందే చిత్తగించునో యేమో
విరులివె కొంపోవే విడెము గోవే
గరిమ నలసితేను కడుఁజెమరించునేమో
సురటి గందవొడీ వించు కేమరకువే ॥ ఊర ॥

రతికిఁ బిల్చునో యేమో రానవరాదు నీకు
రతి వింతలోఁ బిల్చి తా నిన్నుఁ గూడె
అతఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
చతురుఁడు నన్నూ నేలె సవతుల మౌదుమే ॥ ఊర ॥ 401

వరాళి

ఆపెకు నీకుఁ దెలుసు నవి యెట్టివేడుకలో
 పైపై నవతులము పచారించఁగలమా ॥పల్లవి॥

వింతగా నీమోము చూచి వెలఁది నీతో నవ్వె
 ఇంతలోనే గురుతులు యేమిగనెనో
 సంతోసముతోడ నీసంగడి నిలుచున్నది
 అంతరంగపుమాట యెట్టానతి ఇచ్చితివో ॥ఆపె॥

సముకాన నప్పటివి నన్న సేసి నిను మెచ్చె
 తమకాన నీమేనేడ తన్ను సోఁకెనో
 చెమటలు గారఁగాను చేతులెత్తి నీకు మొక్కె
 ప్రమదాన నెటువంటిపనులు సేసితివో ॥ఆపె॥

కందువ నలమేల్మంగ కాఁగిలించుకొనె నిన్ను
 చెంది నీమన్నన నెట్టు చేకొనెనో
 యిందరి మమ్ము శ్రీవేంకటేశ యేలుకొంటివి
 పొంది నీదేవుల కెట్టు పొసఁగఁజెప్పితివో ॥ఆపె॥ 402

రేకు 1468 సాళంగం

కంటిమయ్యా నీచేఁతలు కన్నులతుదల నేఁడు
 నంటువ లేదంటానే ఆనలు వెట్టుకొనేవు ॥పల్లవి॥

పైపై నీవెక్కడనో పరాకై వుండితేను
 ఆపె నీ మొగము చూచీ నంతలోనను
 దాపుగా నప్పటి నీవు తనదిక్కు చూచితేను
 రాపుగా సిగ్గుతోడ శిరసు వంచుకొనీని ॥కంటి॥

వొద్దిక మలగుపైని వొరఁగి నిద్రించితేను
అద్దకొనిఁ జన్నుల నీయందపుఁజేయి
నిద్దిరించే దానివలె నెమ్మిఁ గన్నులు మూసితే
తిద్దే వాపెహారమును తేటతెల్లమిగను ॥కంటి॥

నన్నుఁ గాఁగిలించుకొని నాతో నీవు మాటాడఁగా
నన్నల మోవి చూపీని సారెకు నాపె
ఇన్నిటా శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మిన్న కాపెకతలకు మింగకు గుక్కిళ్లు ॥కంటి॥ 403

## శుద్ధవసంతం

చెల్లు నీ వంమకు నింత సేయవలదా
కల్లగాదు నీవల్లనే కంటిమి యీనేరుపు ॥పల్లవి॥

చెక్కు నొక్కి నీవద్దిచెలియకు నింతలోనే
పుక్కిటితమ్ములమిడి బుజ్జగించేవు
ఇక్కువ నెవ్వతెనైనా ఇంటికి రమ్మంటివో
వొక్కమాటే యీపె నింత వొడఁబరచేవు ॥చెల్లు॥

దొడ్డసొమ్ములెల్లాఁ బెట్టి తొడిఁబడ నప్పటికి
వెడ్డువెట్టి సారెసారె వేఁడుకొనేవు
అడ్డమై వేరొకతె నిన్నాసఁ బెట్టినదో
వొడ్డుకొనకుండా నింత వొడఁబరచేవు ॥చెల్లు॥

సన్నలు నాకుఁ జేసి సరి పెట్టె యీకెఁ గూడి
మిన్నక యెంతేసినమ్మిక లిచ్చేవు
ఇన్నిటా శ్రీవేంకటేశ యే నలుమేలుమంగను
వున్నతిఁ జనవులిచ్చి వొడఁబరచేవు ॥చెల్లు॥ 404

## ముఖారి

ఎంతగబ్బి ఇదియవి యేల తిట్టేవు
మంతనాన నీకది మంచిదేకాదా ॥ పల్లవి ॥

చనవు లొసఁగితేను జవ్వనులు మానుదురా
గొనకొని రమణుఁడు గొసరక
తనువులు సోఁకితేను తమకించకుండుదురా
పెనఁగులాడుతాను ప్రియములు చూపరా ॥ ఎంత ॥

నేసవెట్టిపెండ్లాడితే సిగ్గుతోనే వుందురా
వాసులువంతులుఁ జూపి వలపించక
ఆస నీవు గొలిపితే అట్టె పైకొనకుండురా
రాసికెక్క పచారించి రవ్వసేయక ॥ ఎంత ॥

మరిగించి కూడితేను మట్టుతో నుండుదురా
సరసములాడి మోవి చవిచూపక
ఇరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సిరుఁ గూడితి వాపెచెల్లె లూరకుండునా ॥ ఎంత ॥ 405

## ఆహిరి

పదారువేలు(ల?) సతులపతివి నీవు
సుదతి వెంగెమాడదుసుమ్మీ యీపట్టుకు ॥ పల్లవి ॥

మొక్కిమొక్కి చెలియ నీముందరనే వుండఁగాను
తక్కక సిగ్గుతోనేల తలవంచేవు
నిక్కి వెరొకతెచద్ద నీవుండఁగాఁ గనెనో
ఇక్కడ నీ వందుకుఁగా నేఁటికి లోఁగేవు ॥ పదా ॥

వేడుకతో నాపె నిన్ను వేమారు నుతించఁగాను
యీడ ముసుఁగువెట్టుక యెంత నవ్వేవు
పాదితో నీ వెవ్వతెకు బాస లియ్యఁగా వినెనో
తోడనే నీవప్పటి విందులకేల కొంకేవు ॥ పదా ॥

నెమ్మది నలమేల్మంగ నిన్నుఁ గాఁగిలించఁగాను
అమ్మరో నీవెంతేసిప్రియాలు చెప్పేవు
కమ్మి శ్రీవేంకటేశ నీకత లీపె దెలిసెనో
సమ్మతించె నిఁదుకుఁగా చఁద మెంతసేసేవు ॥ పదా ॥ 406

## సామవరాళి

నేమేమి నెఱఁగము నిజమని వుండుదుము
నీమహిమలెల్లాను నీకే తెలుసును ॥ పల్లవి ॥

తగవులు చెప్పేవు తరుణులకును మాకు
నగవులు నవ్వేవు నయగారాల
మొగములు చూచేవు మూఁకమీఁదనెల్లాను
యెగసక్కెపునీమోహ మెవ్వతెపై నున్నదో ॥ నేమే ॥

ఆసలెల్లాఁ బెట్టేవు అండఁ గూచుండుమనేవు
వేసార కందరికిని విడేలిచ్చేవు
సేసలు పైఁ జల్లేవు చేతులు సారెఁ జాఁచేవు
వాసిగా నెవ్వరిమీఁద వలపు నీకున్నదో ॥ నేమే ॥

పాదాలు పైఁ జాఁచేవు బాగుగ నొత్తుమనేవు
కై దండలు వట్టుకొని కాఁగిలించేవు
యీదెస శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పోదితో నన్నేలితివి పొందు లిఁకెందున్నవో ॥ నేమే ॥ 407

హిజ్జిజి

నే మెంత విన్నవించినా నీవు మామాట వినేవా
 ఆముకొని మమ్ము సుద్దులడిగేవు నీవు ॥ పల్లవి ॥

యేకతాన నుండి యాపె యేమనిచెప్పెనో బుద్ది
 ఆకుమడిచి ఇచ్చి యేమని నేర్పెనో
 ఆకడ బోనము వెట్టి .ప్పు దేమి బోదించెనో
 మాకుఁ దెలియదు నీమతకములెల్లాను ॥ నేమెం॥

సింగారపుఁదోటలోన చేరి యేబాస గొనెనో
 సంగతి గొల్వులో నెట్టు జట్టిగొనెనో
 యెంగిలిపొత్తువేళల నేమని భ్రమయించెనో
 చెంగట నెఱఁగము నీచిత్తములోపనులు ॥ నేమెం ॥

నెలకొన్నరతివేళ విన్నెంత వలపించెనో
 అలమేల్మంగ శ్రీవేంకటాధీశుఁడా
 తలఁచుక వచ్చి నేఁడు తగ మమ్ము నేలితివి
 మలసి తోఁచదాయ నీమర్మము లెవ్వరికి ॥ నేమెం ॥ 408

రేకు 1469 వరాళి

ఎట్టుసేసిన నీచేఁత కెప్పుడు లోనే నేము
 బట్టబయలీఁదనేల భాగ్యము నీచేతిది ॥ పల్లవి ॥

చెలువుఁడవు నీ వేమిచెప్పిన వినేముగాక
 చలమరితనమేల సాదించనేల
 వలచినవారము వద్దనే వుండేముగాక
 అలిగి పందుండనేల అవుఁగాదననేల ॥ ఎట్టు ॥

యేలినవాఁడవు నీయిచ్చ మెలఁగేముగాక
జోలిమాట లాడనేల సొలయనేల
నీలోనివారము విందుకవుందేముగాక
జాలి నీకు రేఁచనేల జంకించనేల ॥ ఎట్టు ॥

శ్రీవేంకటేశ్వరుఁడవు చేకొని మొక్కేముగాక
పూవుల వేయఁగనేల పొనుఁగనేల
యీవేళ నలమేల్మంగ నిటు నీకాఁగిటిదాన
వేవేలుగాఁ గూడితివి వేసరించనేల ॥ ఎట్టు ॥ 409

మాళవిగౌళ

మాకు విట్టె తోఁచీ నీమర్మము నేఁడు
కాకు సేయరా దీసుద్ది గలిగినట్టున్నది ॥ పల్లవి ॥

చెప్పుదునా వోయి నీచిత్తములోపలిమాఁట
కప్పి సిగ్గులువడవుగదా నీవు
చొప్పులెత్తి నీమొగము చూచితేనే కానవచ్చు
ముప్పిరి నాపెకు నీవు మోహించినట్టున్నది ॥ మాకు ॥

వుపమింతునా వోయి వొడలినీవు దేౄ(ద్యో?)గాలు
కపటముతో నవ్వవుగదా నీవు
నెపములే కందు నీవు నిలిచితేనే తెలుసు
యిపుడే నీ కాపెకుఁ బొం దెనసినట్టున్నది ॥ మాకు ॥

యేకుపరతునా వోయి ఇరవైననీగుణాలు
గారవముతో మెచ్చవుగదా నీవు
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
చేరి నన్నేలితి వాకెఁ జేకొనినట్లున్నది ॥ మాకు ॥ 410

పాడి

అటువంటివాఁడా యీతఁ డౌనే నీవు
కుటిలమేలే యెదిరిగుణము లెరఁగవు ॥ పల్లవి ॥

తేనెగారేమాటలాడి తీపులెల్లాఁ బుట్టించి
నానఁబెట్టేవు వలపు నాపతితోను
మేనెల్లఁ జెమరించెను మెరసి యీతని కిట్టె
మానవుగా ఇటువంటిమాయలాఁడిమాటలు ॥ అటు ॥

నిద్దిరించేవాని లేపి నేరుపులెల్లాఁ జూపి
బుద్దులు చెప్పేవు నావిభునికి నీవు
కొద్దిమీర నాస మీరె కూరిమి నీతని కిట్టె
వద్దే వుద్దండాలు వట్టిజోలిక తైవు ॥ అటు ॥

పసలుగా మొక్కు మొక్కిపాదాలు గుద్దేనంటా
వెసఁ గాఁగిలించేవు శ్రీవేంకటేశ్వరు
యెసగ నలమేల్మంగ నేను నామగఁ డితఁడు
కొసరకువే యెంతకోదెజవరాలవు ॥ అటు ॥ 411

సామంతం

కంటిమి మీవేడుకలు కన్నులతుదల నేము
వింటి మిన్నాళ్ల సుద్దులే వీనులపండుగలు ॥ పల్లవి ॥

సిగ్గువడివుండఁగాను చెలిచేఇ వట్టి తీసి
యెగ్గులేక తొడమీఁద నిడుకొంటివి
అగ్గమై యంతటఁబోక అపెఇంటికే వచ్చి
కగ్గులే కాపెవాకిలిఁ గాచుకవున్నాఁడవు ॥ కంటి ॥

తలవంచుకుండఁగాను తక్కక నెమ్మోగమెత్తి
వెలయ మూపుపైఁ జేయి వేసితివి
చలువగా నప్పటిని చన్నులపై నీవొరగి
మెలుపున నాపెతోనే మేలము లాడేవు ॥ కంటి ॥

గుట్టుతోడ నుండఁగాను కొంక కలమేల్మంగను
నెట్టనఁ గాఁగిటఁ గూడి నించితి కృప
అట్టె శ్రీవేంకటేశ ఆపెకే నీవు మటి
చుట్టమవై మమ్మునేలి చొక్కులఁబెట్టేవు ॥ కంటి ॥ 412

సౌరాష్ట్రం

పట్టకువయ్యా మాకొంగు బలిమిసేసి
గుట్టుతోవారముగాక కొసరేటివారమా ॥ పల్లవి ॥

నిమ్మకాయలంతేసి నిక్కఁజన్నులవారము
అమ్మరో నీతో మాటలాడఁగలమా
చిమ్ముల సిగ్గులలోనే చిందువందయ్యేవారము
పమ్ముచు నీతో నంతేసిపంతములవారమా ॥ పట్ట ॥

మెల్లనే పిడికెఁడంతమించునడిమివారము
చెల్లఁబో నీతో పొందుసేయఁగలమా
చల్లువలపులచేత జాజరకాడేవారము
వుల్లము గరఁగ నిన్ను నొరసేటివారమా ॥ పట్ట ॥

పుటపుటమొలచేటిపూఁపవయసువారము
కటకటా రతి నిన్నాఁగఁగఁగలమా
ఇటు శ్రీవేంకటేశ్వర యేనలమేలుమంగను
తటుకనఁ గూడితివి తప్పులెంచేవారమా ॥ పట్ట ॥ 413

దేసాళం

మాకుఁ జూడ నిదిమేలు మనసు నీ కెట్టున్నదో
చేకొని నీకు నితవు చెప్పితిమి నేము ॥ పల్లవి ॥

వపితపయ్యదలో వివట్టువచన్ను గుబ్బలు
కమఁగొంటివా వోయి గక్కన నీవు
పెనఁగి నీవురమునఁ బెట్టుకొంటేఁగవక
చెనకేరతుల నీవుచేసినభాగ్యము ॥ మాకుఁ ॥

తెలివైనమోములోనితేనెగారేయా కెమోవి
తలఁచుకొంటివో లేదో తగిలి నీవు
నెలకొన నీనోరిలో నించుకొంటేఁగనక
తలకొని నీవు సేయుతపము లీదేరును ॥ మాకుఁ ॥

మెచ్చులనలమేల్మంగమేనిమీఁదివాసనలు
యిచ్చల శ్రీవేంకటేశ యెఱుఁగుదువా
పచ్చిగా నీమేన నిండాఁ బట్టించుకొంటేఁగనక
అచ్చుగాఁ గూడితి నీకు నమరె వలపులు ॥ మాకుఁ ॥ 414

రేకు 1470 మాళవిగౌళ

ఏమని చెప్పఁగవచ్చు నిట్టె నీసతిభావము
కామించినచందమో కడఁగుసింగారమో ॥ పల్లవి ॥

చెలియ నీమోము చూచి చెక్కులఁ జెమట చిందె
వలపులో అదియ జవ్వనమదమో
విలువున నంతలోనె విట్టూర్పు నిగిడించె
కలనేటివేడుకలో కందువతమకమో ॥ ఏమ ॥

కాంత నీవద్దనుండి కళలతోదైవారె
చింతావిరహమో చిందెడుప్రేమో
మంతనపుమాటలాడి మఱి చిరునవ్వు నవ్వె
చెంత నీపై ఆసలో సిగ్గులమొలకలో ॥ఏమ॥

అలమేలుమంగ నిన్ను నపుడే కాఁగిట నించె
తలకొన్నకోరికో తగులాయమో
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా నిన్ను నేనసె
తలఁపులముచ్చటో తనమనోరథమో ॥ఏమ॥ 415

ఆహిరి

ఇంక నీచిత్తము యెట్లనైనఁ గావుము
పొంకమాయ నాకు నీకు పొందులెల్లఁ దొలుతనె ॥పల్లవి॥

తలఁపు నీ వెరుఁగుదువు తగవు నీకుఁ దెలుసును
మలసి విన్నవించనేల మాఁటిమాఁటికి
బలిమిసేయనేఁటికి పరాకు నీకు లేదు
విలిచి యేడనుండినా నీవారమే ॥ఇంక॥

వింటి నీగుణములు వెలసె నీచరితలు
జంట నాకు నీవు గలవు జరయవలవదు
అంటె నీమోహము అదియు స్వభావము
ఇంట నెపుడు నున్నాఁడ విదియ మాకు లాభము ॥ఇంక॥

చనవు లిప్పు డొసఁగితివి సరసమునఁ జెనకితివి
పెనఁగఁదగదు నీవు నాకుఁ బ్రియుఁడవౌదువు
వినుమ అలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తవిపి రతుల మమ్ము నింత తగులుసేసుకొంటివి ॥ఇంక॥416

పాడి

ఏమని యానతిచ్చేవో ఇందుకు నీవు
వేమరుఁ జెలికత్తెలు విచ్చిచెప్పరాదు ॥ పల్లవి ॥

కాంత నీవుఁ గూడుండఁగా కమ్మటి నొక్కతె రాఁగా
చెంతనే దాఁచుకొంటివి చెరఁగుఁ గప్పి
వింతగా నాకెకొంగు వేరొకవన్నెది సంది-
నంతలోఁ జూచి సందేహము విన్నదిగె ॥ ఏమ ॥

వీడె మాకె ఇచ్చేవేళ వేరొకచెలి రాఁగాను
వోడక మలఁగుదండ నుంచుకొంటివి
తోడనె యాకెనీడ గోడపై నుండఁగాఁ గని
జోడు గంటి మేడదవి సొలసి నిన్నదిగె ॥ ఏమ ॥

కమ్మి వీ జాపె వాఇంచఁగా కిమ్ముల సతి రాఁగా
సొమ్ములలోఁ బెట్టి యాకె నెమ్మిఁ గూడితి
పమ్మినయలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
ఇమ్ముల నాకెఁ గని యేమౌనని యడిగె ॥ ఏమ ॥ 417

గౌళ

చుట్టరికమైనచోట సూడువట్టనేఁటికి
గట్టియాయఁ బనులెల్లా కానిమ్మనవయ్యా ॥ పల్లవి ॥

చెక్కునొక్కి యాపె విన్నుఁజేరి వేఁడుకొనఁగాను
చిక్కినవ్వుతోనేల సిగ్గువడేవు
వుక్కుమీరి యావేళ విన్నారసెనో కొనగోరు
ఇక్కడ నందుకేమియు నెంచవద్దు రావయ్య ॥ చుట్ట ॥

కోరి ప్రియమెల్లాఁ జెప్పి కొంగువట్టి పెనఁగఁగా
తేరకొననేల యాకె దిక్కుచూచేవు
ఆరీతులఁ దొక్కుతొక్కులాడఁగాఁ గాలు దాఁకెనో
సారె నందుకేమి దోసముగాదు రావయ్య ॥ చుట్ట ॥

అలమేలుమంగ విన్న నటు గాఁగిలించఁగాను
తలవంచుకొని లోలోఁ దమకించేవు
యెలమి శ్రీవేంకటేశ యిక్కువ లెంతసోఁకెనో
కలసితి రిఁకేమిఁ గొంకఁగవద్దు రావయ్య ॥ చుట్ట ॥ 418

సాళంగం

ఎవ్వరెంత పెనఁగినా నేమాయను
నవ్వుతా నుండే నేను నావాఁడే ఆతఁడు ॥ పల్లవి ॥

ననుపుగలుగువారు నాయకునితోడుత
మనవులు చెప్పితేను మానుపరాదు
కనుఁగొంటా నుండుదము కాఁతలసరితలెల్లా
నను మన్నించు నాతఁడు నావాఁడే యెపుడు ॥ ఎవ్వ ॥

కొలువుసేసేవారు కోరి సేవలుసేసి
వలపులు చల్లితేను వద్దనరాదు
తెలుతము తమతమతెరఁగులెల్లా నేఁడు
నలి నన్ను మన్నించె నావాఁడే యతఁడు ॥ ఎవ్వ ॥

యేతులఁ బెండ్లాడినవా రెంతసరసాలాడినా
కాతరించి పెనఁగినాఁ గాదనరాదు
యీతల శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
నాతగులై నన్నుఁ గూడె నావాఁడే యతఁడు ॥ ఎవ్వ ॥ 419

ఆహిరి

విన్నపమిదె నీకు విసుము వద్దు పరాకు
ఇన్నిటా నీకు మేలు యిట్టె చెలి నేలు ॥పల్లవి॥

వేడుకకు వెలలేదు వెలఁదికి నీకుఁ బోదు
వాడికైనవల పిఁక వసముగాదు
యీడువచ్చు నిద్దరికి వింపులు మాయిందరికి
జోడుగూడు విచ్చేయు మానుదతినగరికి ॥విన్న॥

యెప్పుడుఁ గలదు పొందు యీకెమోవి నీకు విందు
కుప్పలుగా నిన్ను వేఁడుకొన్నదే సందు
చెప్పనేఁటికి యలపు చిత్త మీకెపైఁ గొలుపు
నెప్పునఁ గాఁగిటఁ గూడీ నీకరుణ నిలుపు ॥విన్న॥

అలమేల్మంగదేవులు అన్నిటాఁగూడేవావులు
నెలకొనెఁ గన్నులను విందుఁగావులు
నిలిచి శ్రీవేంకటేశ నీరతులే ఇంతసేసె
వెలలేవినవ్వుల వెన్నెలలు గానె ॥విన్న॥ 420

రేకు 1471 వరాళి

కూచుండఁబెట్టుకోరాదా కొమ్మను తొడమీఁదట
యీచాయనేల లోఁగేవు యెవ్వరు వద్దనేరు ॥పల్లవి॥

చెక్కులఁ జెమటగార చెలి నిన్నుఁ గొల్చివచ్చె
జక్కవలఁబోలేటిచన్ను లదర
అక్కర యెంతో నీకు నప్పటనుండీ నాపె-
దిక్కు చూచి సంతోసానఁ దెప్పలఁదేలేవు ॥కూచుం॥

క్రుమ్మడి జారఁగ నింతి కోరి తైదండ నీకిచ్చె
తమ్మిమోమున నిండాను దప్పులుదేరె
కమ్మి నీకరుణ యెంతో కరఁగి ఇందులకుఁగా
సమ్మతిగాఁ జనవిచ్చి సారె బుజ్జగించేవు ॥ కూచుం ॥

మతిచొక్క నలమేలుమంగ నీకుఁ బాదాలొత్తె
సతముగాఁ బులకలు జాజుకొనను
తతిఁ గూడితి వీకెను దాకొని శ్రీవేంకటేశ
ఇతవుగా మెచ్చిమెచ్చి ఇంపులుచల్లేవు ॥ కూచుం ॥ 421

## ముఖారి

కాదనేమా నీ వాపెఁ గాఁగిలించుకొనఁగాను
యీదెస మమ్మింత భ్రమఇంచకువయ్యా ॥ పల్లవి ॥

అట్టె ఆపెకుఁ జుట్టమవైతే నౌదుగాక మమ్ము
వట్టిపరాకులు సేయవలదయ్యా
చుట్టి మాటలాడ సందుచూచుకొంటేఁ గొందుగాక
దిట్టవై విడెము మమ్ముఁ దేనంపకువయ్యా ॥ కాద ॥

చొప్పుగా నీవాపెదిక్కు చూచితే చూతువుగాక
కప్పురము మాకన్నుల గుప్పకువయ్యా
చిప్పిలఁ బొంద నునువుసేసుకొంటేఁ గొందువుగాక
విప్పుచుఁ బచ్చడము పైఁగప్పకువయ్యా ॥ కాద ॥

పిలిచి యాపెకు సొమ్ము పెట్టితేఁ బెట్టుదుగాక
వెలచెప్పి పందేలు వేయకువయ్యా
చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడవు
ఇల మమ్ము నేలితి వెంతవాఁడవయ్యా ॥ కాద ॥ 422

## పాడి

కలికివి నీవెరఁగవితగవు లున్నవా
చెలులము నే మింత చెప్పిచూపవలెనా ॥ పల్లవి ॥

వాడికగా రమణుఁడు వలపులుచల్లితేను
యీడనే సిగ్గున శిరసేల వంచేవే
వేడుకతో చందురుఁడు వెన్నెలలు గాసితేను
జోడుగాఁ గలువలు మెచ్చుగ వికసించవా ॥ కలి ॥

మంతనాన నాతఁడు మాటలు విన్నాడించితే
పంతముతో మోనములు పచరింతురా
వంతలేక వనముల వసంతుఁడు పైకొంచే
బంతినే కోవిలలునుఁ బలుకఁగవలదా ॥ కలి ॥

సారె శ్రీవేంకటేశుఁ డిచ్చటఁ గాఁగిలించితేను
కూరిమి నలమేల్మంగ కూడితి వౌనే
మేరతోడఁ గొండమీఁద మేఘము వాలితేను
చేరిచేరి మయూరాలు చెంగలించి ఆడుఁగా ॥ కలి ॥ 423

## దేసాళం

ఎక్కడ పరాకో నీకు నెఱఁగము
యిక్కువఁ గొలువునేసే మిదివో నేము ॥ పల్లవి ॥

పట్టెమంచముమీఁదటఁ బవ్వళించి నీ వుండఁగ
అట్టె పాదాలొత్తీ నాకె అండఁగూచుండి
చిట్టంటుసేఁతల నీకు సేవసేసేరు గొందరు
ముట్టి సారెసారె నీకు మొక్కేము నేము ॥ ఎక్క ॥

చేతిమీఁద నీ విట్టె శిరసు వెట్టుకుండఁగా
యీతలను తొడచాఁచె [1]నీకె నొకతె
కాతరాన వేళ్లఁ జిటుకలుదీసేరు గొందరు
జాతిగా నీమేను చూచి సంతోసించేము నేము ॥ ఎక్క ॥

పన్ని యలమేలుమంగ పైపై సన్నలుసేయఁగా
వున్నది శ్రీవేంకటేశ పురముమీఁద
వన్నెలతో విరుమేలా వలపించేరు గొందరు
మన్నించి మమ్మేలితివి మలసేము నేము ॥ ఎక్క ॥ 424

కాంబోది

ఏమిసేతు నావలపే యింతసేసె నన్నును
కాముకులై నవారికత లిటువంటివి ॥ పల్లవి ॥

చక్కనినీమోముచూచేసందడిపరాకున
మక్కువతో నీకు మొక్కమఱచితిని
వెక్కసపునీకతలు వినేపరాకున
చిక్కనిప్రియము నీకుఁ జెప్పమఱచితిని ॥ ఏమి ॥

సారెసారె నీతో సరసములాడేపరాకున
చేరి కానుకియ్య మఱచితి నపుడు
మేరలేక నీతోనవ్వేమిక్కిలిపరాకున
పేరుకొని మాయింటికిఁ బిలువమఱచితి ॥ ఏమి ॥

కొలువు నీకుఁ జేసేటికూరిమిపరాకున
మలసి నిన్నుఁ జెనకమఱచితి
అలమేలుమంగపతివై నశ్రీవేంకటేశ
తెలిపి నన్నేలితే నుతించమఱచితివి ॥ ఏమి ॥ 425

1. ఈకెయున్+ఒకతె.

మంగళకౌసిక

అపుడైనా నాపెచెప్పినట్టెల్లాఁ జేయవద్దా
నెపమున నన్నుఁ జూచి నీవు సిగ్గువడేవు ॥పల్లవి॥

వలపులు చల్లిచల్లి వాడికగా నిన్నింటికి
పిలువఁగ వచ్చెఁగా ప్రియురాలు
వొలిసీనొల్లమితో నీ వూరకే వుండితేను
తెలిపి నీవాడివట్టి తీసెఁగా నిన్నును ॥అపు॥

దయవుట్టఁజెప్పి నీతోఁ దమయింటఁ బెండ్లియని
ప్రియమున నక్షంతలు పెట్టెఁగా నీకు
క్రియ యెఱిఁగియు నీవు కిమ్ముల(ఁ) బరాకైతే
నయమున మొక్కి నంటునను వేఁడుకొనెఁగా ॥అపు॥

పెనఁగి విన్నందలానఁ బెట్టి ఇంటి కిట్టె తెచ్చి
చనవునఁ గూడెఁగా సారెసారెకు
యెనసి యలమేల్మంగ కిరవై శ్రీవేంకటేశ
నను నేలితివి యాకె నవిచెఁగా నీకు ॥అపు॥ 426

రేకు 1472 నాదరామక్రియ

ఆసపడ్డవారి వింత అలయింతురా
దోసము రాకుండాను కందువ నుండవోయి ॥పల్లవి॥

వన్నెలెల్లాఁ బెట్టుకొని వద్దనే కొలువుసేయు-
చున్నది యీపెఁ జూడవోయి నీవు
సన్నలెల్లాఁ జేయుచును సారెకు నేఁకరీ నీకు
మన్నించి వట్టిపరాకు మానవోయి ॥ఆస॥

వేడుకతో నీవద్ద విసుపులేక సారెకు
 వూడిగాలు సేసీఁ జూడవోయి నీవు
నీడవలెఁ బాయక నీకె తపమునేసీని
 జాడతోఁ జిత్తానఁబెట్టి చనవియ్యవోయి ॥ అన ॥

అంటిముట్టి సరసములాడీ సారె నీతో
 వొంటి యాపెఁ గాఁగిలించవోయి నీవు
ఇంటనే శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
 జంట నేలితి వాకెతో సరినవ్వవోయి ॥ అన ॥ 427

బౌళి

పంతమునఁ గసరితేఁ బతికి నేవయగును
 వింత సేసుకొనరాదు వివేకపుసతికి ॥ పల్లవి ॥

సోలి సవతులు యెన్ని సొలసి మాటాడినా
 తాలిమే వలెను వుత్తమురాలికి
యేలాటా మా(లాఁ?)డి మగని కెంతయెమ్మెలు చూపినా
 వాలాయించి సంతోసించవలె నేరుపరికి ॥ పంత ॥

తవిలి తనసాటికి తరుణులు వెనఁగితే
 చవిచేసుకొనవలె జాణకత్తెకు
రవళి దాఁ జూడఁగానే రమణునితో నవ్వితే-
 నవలఁ దాఁ గూడి నవ్వనగు నయగారికి ॥ పంత ॥

పొరుగువా రతనికిఁ బొంచి సన్నలుసేసితే
 పరాకు నేయఁగఁదగు బాగరికివి
ధర నలమేల్మంగ వాతఁడు శ్రీవేంకటేశుఁడు
 పరుసఁ గూడి తిట్టుండవలెఁ జతురికకు ॥ పంత ॥ 428

## ముఖారి

అంతేసిదొరతనాలయాకె యీపె
కొంతపుఁజూపులఁ జట్టిగొనినాకె యీపె ॥ పల్లవి ॥

మట్టుమీరి లేకలంపి మాటమాత్రముననే
అట్టె యింటికి రప్పించినాకె యీపె
చుట్టమువలెనే నీసొమ్ములెల్లాఁ దనమెడఁ
బెట్టుకొని నిన్ను మెప్పించినయాకె యీపె ॥ అంతే ॥

చెంగటనే నేయరానిచేఁత సేసి నీవలపు–
లంగడిఁ బెట్టినయట్టియాకె యీపె
కొంగువట్టి నీతోను కూరిములు గొసరుచు
అంగవించి చన్నులొత్తినాకె యీపె ॥ అంతే ॥

నెలవుల నవ్వునవ్వి చెక్కులు నొక్కుచు నిన్ను –
నలుకలుదీర్చినయాకె యీపె
అలమేలుమంగను నేననఁగా శ్రీవేంకటేశ
కలసితి విదె నాసంగడియాకె యీపె ॥ అంతే ॥ 429

## శ్రీరాగం

నీవే నన్ను విట్టె మన్నించేవుగాక
భావించి నీతో నింత పదరఁగనేఁటికి ॥ పల్లవి ॥

కన్నులఁజూచిననీవు కరుణించనేరవా
విన్నప మేమిసేసేము వేగినంతాను
సన్నఁగొలిపించుకొని చనవియ్యనేరవా
ఇన్నిటా నిన్నుఁ గొసరి యెచ్చరించనేఁటికి ॥ నీవే ॥

మాట లాడినవాఁడవు మరుగఁగనేరవా
చీటికిమాటికి విన్నుఁ జెనకనేల
యీటునఁ బాదాలు చాఁచి యెనయఁగనేరవా
చోటిమ్మని యప్పటిని సొలయనేమిటికి ॥నీవే॥

నవ్వినవాఁడవు నాతో నంటుసేయనేరవా
రవ్వసేసి నీమతి కరఁచనేఁటికి
యివ్వల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
వువ్విళ్లూరఁ గూడితివి వొరయఁగనేఁటికి ॥నీవే॥ 430

శంకరాభరణం

చెప్పఁగలబుద్ది నీకుఁ జెప్పితి మిదె
యెప్పుడూ మావల్ల దోసమేమీ లేదుసుమ్మీ ॥పల్లవి॥

పక్కనఁ జెలిచన్నులపైఁ గేలు చాఁచేవు
యెక్కుడుగొండలవంటి వింత కోపేవా
జక్కవలవంటివి చన్నులు సావియైతేను
చొక్కముగ నీయనువు చూచుకొనరాదా ॥చెప్పఁ॥

యేనిగెతొండాలఁబోలేఇంతితొడలమీఁదట
ఆనించేవు నీపాదము లంతకోపేవా
పూవి యనఁటికఁబాలపొలికే నాతొడలైతే
దీనివల్ల నీయనువుఁ దెలుసుకోరాదా ॥చెప్పఁ॥

అదరుచు నద్దపుమోమాపెను మోవిమ్మనేవు
తదవి శ్రీవేంకటేశ దానికోపేవా
బదిఁ నలమేల్మంగను పద్మము నామొకమైతే
కదఁగి నన్నేలితివి కనుకోరాదా ॥చెప్పఁ॥ 431

వరాళి

నెమ్మదినీవోజలు నే నెఱఁగనా
అమ్మరో నే విన్న సుద్దు లడిగితినా ॥ పల్లవి ॥

వింటివి మాటలు సారె వేఁడుకొనే వెంత వన్ను
యింటికి విచ్చేతుగాక యీడనేఁటికి
అంటే ననరాదుగాక ఆనలేల పెట్టేవు
నంటున నీవినయాలు నమ్మనంటినా ॥ నెమ్మ ॥

వోడక నాకొంగువట్టి వాదఁబరచే విప్పుడు
యేడలేవిసరసము లీడనేఁటికి
వీడెమిచ్చేయప్పుడే వేడుకలయ్యీఁగాక
తోడనే కాఁగిలించే విందుల కెగ్గుపట్టేనా ॥ నెమ్మ ॥

గుట్టున నన్నేలితివి కోరి బత్తిగలనని
యిట్టె సాకిరి దెలిపే వీడ నేఁటికి
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
చుట్టరికపుమనసు సోదించవచ్చితినా ॥ నెమ్మ ॥ 432

రేకు 1473 రామక్రియ

ఇది యెంతగర్వియని యెంచేవుగనక నీవు
మది నింతయును నీమన్ననేసుమ్మీ ॥ పల్లవి ॥

ఆఁటదానఁగనక విన్నటు సొలయుదుఁగాక
గాఁటాన నే నుండేది నీకరుణేకాదా
వీటిలో చవులువుట్ట వెంగెములాడుదుఁగాక
నీటున నే మెలఁగేది నీలాలనేకాదా ॥ ఇది ॥

జవ్వనిఁగనక విన్ను సాదించి జంకింతుఁగాక
　చివ్వన నావలపు నీచేతిదేకాదా
నవ్వుతా నీకిచ్చకమునకుఁ బెనఁగుదుఁగాక
　రవ్వల నానేరుపు నీరచనేకాదా ॥ ఇది ॥

అలమేల్మంగఁగనక ఆసకొలుపుదుఁగాక
　కలుగునాపంతము నీఘనతేకాదా
వెలయ శ్రీవేంకటేశ వినోదముసేతుఁగాక
　వలిగెతో నారతి నీసమ్మతేకాదా ॥ ఇది ॥ 433

## శ్రీరాగం

ఇట్టుండవలదా మోహ మెంచిచూచితే
　అట్టె చెలులు చూచి అచ్చెరువందేరు ॥ పల్లవి ॥

చెంగలించు నీమోము చెలిఁ గనుగొంటేనే
　చెంగటఁ జేరితే కళ చిమ్మిరేఁగు
అంగమెల్లఁ బులకించు ఆకెమాటలు వింటేను
　యింగిత మెరిఁగితిమి యెంతమేలువాఁడవో ॥ ఇట్టుం ॥

వడదేరుదువు నీవు వనితఁ బేరుకొంటేను
　అడియాలములు చూచి హరుషింతువు
తడబడుఁ దమకము తగ నాపెఁ దఁచితే
　యెడయక కంటిమి నీ వెంతమేలువాఁడవో ॥ ఇట్టుం ॥

ఆయాలు గరఁగుదువు అలమేల్మంగ ముట్టితే
　చాయదేరు నీమోవి చవిగొంటేను
పాయక కూడితి విదె భావిం చీకెఁ జూచేవు
　యీయెడ శ్రీవేంకటేశ యెంతమేలువాఁడవో ॥ ఇట్టుం ॥ 434

బౌళి

ఎవ్వరు వెంగెములాడనేల నిన్నును
వువ్విళ్లూర సంతోసాన నుండుదువుగాక ॥ పల్లవి ॥

మగువ తేనెలుగాగ మాటలాడితే నీకు
తెగవిరతులతరితీపు లౌఁగాక
నిగనిగనిమోవి వెన్నెలనవ్వు నవ్వితేను
అగపడి కడుఁజల్లనౌఁగాక నీమనను ॥ ఎవ్వ ॥

సుదతి తమ్మిరేకుల చూపుల నిన్నుఁ జూచితే
కొదలే కింపు గుబులుకొనుఁగాక
అదనఁ జెమటఁతో ఆపె నీపాదా లొత్తితే
కదిసి తనివిఁబొందుఁగాక నీతనువు ॥ ఎవ్వ ॥

చెలియ తీగెలవంటిచేతులఁ గాఁగిలించితే
బలువలపులపంట వండుఁగాక
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నెలవై నన్నేలితివి పండుఁగాక కరుణ ॥ ఎవ్వ ॥ 435

పళవంజరం

ఆసపడుదురు నీకు నంగనలు గనుఁగొని
దోసముగా దండులకు దొరవై తేనేమి ॥ పల్లవి ॥

యెనలేనిమోహమున నెవ్వతైనా సొలయును
మనసిచ్చి యెవ్వతైనా మాటలాడును
ననుపున నెవ్వతైనా నవ్వఁజూచు నీతోను
వినయము సేయదంటా వెఱఁ గోపించకుమీ ॥ ఆస ॥

దంటయైనది యొకతె తమకించు నీకుఁగాను
వొంటి నుండితే నొకతె యొడివట్టును
అంటి చన్నులనే వొత్తు నందనేయుండి యొకతె
ఇంటిలోనే మొక్కదంటా నెగ్గులు పట్టకుమీ ॥ఆస॥

బత్తిగలజవరాలు పైకొని చెనకును
అత్తుకొన్నముద్దరాలు ఆయము లంటు
ఇత్తల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సత్తుగ నీయాలనైతి సాదించెననకుమీ ॥ఆస॥ 436

కాంబోది

పొద్దువోనిచెలులాల బూటక మేమిసేసేరె
వొద్దికి నాతనిఁ దేరె వొనగూడీ నన్నియు ॥పల్లవి॥

యెక్కడలేనిచలువ లెన్నైనాఁ గలిగినాను
మక్కువ వెన్నెలవేఁడి మాన్పఁబోయీనా
వెక్కసపుచెలులాడేవేడుకమాట లెన్నైనా
వొక్కకోవిలకూఁత నుడుపఁబోయినా ॥పొద్దు॥

వట్టివేళ్లఁ గట్టి యాలవట్టా లెన్నివిసరినా
తట్టి మలయానిలభూతముఁ జోపీనా
ఇట్టె కేళాకూళిలోన నెంత యీఁదులాడించినా
ముట్టినవిరహపునాములు దించీనా ॥పొద్దు॥

బచ్చెనచిత్తరు చూపి పరాకు లెంత సేసినా
అచ్చపుమనసిజుని నడఁచేరచే
ఇచ్చల శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
వచ్చి తానే నన్నుఁగూడె వారించీనా వలపు ॥పొద్దు॥ 437

భైరవి

ఏమని చెప్పఁగవచ్చు నింతికి నీచందములు
ప్రేమము నీచిత్తమునఁ బెట్టుకొనవయ్యా ॥ పల్లవి ॥

చెలియకు నీ విప్పుడు చేరి మోము చూపితేను
కలువలకును శశిఁగవినట్లాయ
వలచి నీవు వద్దికి వచ్చితే పవనమునకు
యెలమి వసంతుఁడు యేతెంచినట్లాయ ॥ ఏమ ॥

కోమలికి నీ వింతలో కోరి పొందుసేసితేను
తామరలకు రవి నేస్తమైనట్లాయ
కామించి నీ విట్టె కాఁగిలించుకొంటేను
గోమునఁ గొండలపై మేఘుఁడు వాలినట్లాయ ॥ ఏమ ॥

నెలఁతపై నీవు చూపు నిల్పితే జవ్వనసీమ
వాలిసి మరువిటెక్కె లుంచినట్లాయ
అలమేల్మంగఁ గూడితి వదె శ్రీవేంకటేశ్వర
నెలపై బొందిఁ బ్రాణుఁడు నిలిచినట్లాయ ॥ ఏమ ॥ 438

రేకు 1474 ఆహిరి

ఇంతకంటె మరి ఫల మేమని చెప్పఁగలదు
సంతతమైనవలపే సంసారఫలము ॥ పల్లవి ॥

సతికి జవ్వనమె జన్మమందినఫలము
పతి యాదరించినదె ఫలము
మతికి నింపుగా మంచిమాటాడినఫలము
అతికాంక్ష నెప్పుడుఁ బాయకుండుటే ఫలము ॥ ఇంత ॥

ననుపున మోముచూచినప్పుడు నవ్వేటే ఫలము
చనవిచ్చి ఆదేసరసమే ఫలము
మనసు తనివిదీర మర్మములంటుటే ఫలము
కనుఁగొనఁ జూచిచూచి కరఁగుటే ఫలము ॥ ఇంత ॥

పి(ప్రి?)యముతో మేనుసోకఁ బెనఁగినదే ఫలము
నయమునఁ జూపేటినన్నయే ఫలము
జయమై శ్రీవేంకటేశ్వర యలమేల్మంగను
వియతిఁ గూడితి విఁక నీవే ఫలము ॥ ఇంత ॥ 439

దేసాళం

విన్నప మేమిసేసేము వేగినంతాను
యెన్నికగా నాపెచన వీడేరించవయ్యా ॥ పల్లవి ॥

నెలఁత నీ కిచ్చినకానికఁ దలఁచుకోవయ్య
తళుకుఁగన్నులసన్న దలఁచవయ్యా
అలరిసేసినవినయము దలఁచుకోవయ్య
యెలమి నాపెకడకు నిట్టె రావయ్యా ॥ విన్న ॥

మక్కువతో నాడినమాఁట దలఁచుకోవయ్య
తక్కక యాపెవలపు దలఁచుకోవయ్యా
మొక్కిన చిన్నిచేతులమోడ్పు దలఁచుకోవయ్య
యిక్కువనున్నది యిట్టె యింటికి రావయ్యా ॥ విన్న ॥

వడి విన్నుఁగొల్చినభావము దలఁచుకోవయ్యా
తడయకసేసేసేవ దలఁచుకోవయ్యా
అదరి శ్రీవేంకటేశ ఆకె యలమేలుమంగ
యెడయక కూడితివి యిప్పుడు రావయ్యా ॥ విన్న ॥ 440

సామంతం

నీవు రాఁగా వలపుల విందెను బండారములు
    చేవదేరెఁ బనులెల్లా చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

వనితమై చెమటలవానలు నిండాఁ గురిసె
    మనసెల్లాఁ జిగిరించె మచ్చికలకు
    ఘనమైనపులకల కమ్మని జాజులుమించె
    కనుఁగొనవయ్యా చనుకనుఁగాయలు నవె ॥ నీవు ॥

సతిమోవితేనెల చాలాఁ బంటలు వండె
    తతిఁ గళలచే వసంతము వచ్చెను
    సతమై విట్టూర్పుల చల్లగాలి విహరించె
    రతిఁ జూడవయ్యా మోహరసములును నవె ॥ నీవు ॥

కూరిమి నలమేల్మంగకోరికెఁ దీగెలువారె
    గారవపుతమకము కాఁగిటఁ బాఁకె
    యీరీతి శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
    సారె భోగించవయ్యా జవ్వనవన మదె ॥ నీవు ॥ 441

శ్రీరాగం

ఎట్టి పరవశమో యెటువంటితమకమో
    బెట్టి[1] ముఁ(ముం?)జేతిచిలుక పిల్చినా నెఱఁగదు ॥ పల్లవి ॥

విన్నుఁ జూచేపరాకున నెలఁత చన్నులమీఁద
    సన్నదువ్వటపుకొంగు జారినది యెఱఁగదు
    మన్నించి నీవు దనతో మాటలాడేపరాకున
    వున్నతి నీకొనగోర నొత్తిన నెఱఁగదు ॥ ఎట్టి ॥

1. 'బెట్టు' కు వ్యావహారికరూపము కావోలు.

పలుమారు నీతోనవ్వేపరాకునఁ దాఁగట్టిన-
వలిపముచెమట పైవడి నంటుటెఱఁగదు
తలపోఁత నీమీఁదఁ దగిలినపరాకున
తెలిపి నీవు చెయివట్టితీసినా నెఱఁగదు ॥ఎట్టి॥

నెట్టన శ్రీవేంకటేశ నిన్నుఁ గూదేపరాకున
అట్టె అలమేలుమంగ అలయనెఱఁగదు
గుట్టునఁ దిరుపతిలో గోవిందరాజవై యుండే-
మట్టుఁ దెలిసి పొందులు మఱవనెఱఁగదు ॥ఎట్టి॥ 442

వరాళి

పాఁతవలపో ఇది పరగఁ గొత్తవలపో
యీఁతలుమోఁతలనై యిటువలె నుండెను ॥పల్లవి॥

తళుకున నిన్నుఁ జూచి తలవంచుకొనె నాకె
యెలమిఁ దా వారి నీకు నేమౌనో కాని
మలసి యీ భావము మాకుఁ జూడనైతేను
వలపులవలవేసి వంచితీసినట్లుండె ॥పాఁత॥

గక్కన మాటాడఁ బూఁచి కడమ దా గుక్కుకొనె
చక్కనిమీయిద్దరిలో సన్న లెట్టివో
యిక్కువ లివి మాలోన నెరిఁగి తెలుసుకొంటే
మక్కువమచ్చులు మేపి మంత్రించినట్లుండె ॥పాఁత॥

నెలవుల విన్ను నవ్వి చేరి కాఁగిటనుఁ గూడె
నలి మీచుట్టరిక మెన్నటిదో కాని
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
యిల మీరే చంద్రుడువెన్నెలవలె నుండె ॥పాఁత॥ 443

ముఖారి

నే నేమిటిదానను నేరు పెంతగలిగినా
వూవి నాకుఁ జనవు నీవొసఁగ నీభారమే ॥ పల్లవి ॥

నిక్కముగ నే నెంత నీమీఁద మోహించినాను
నెక్కొని యాదేరించ నీభారమే
వెక్కసమై యేపొద్దు నీవేళ నేఁ గాచుకుండినా
మక్కువతోఁ జేకొవి మన్నించ నీభారమే ॥ నేనే ॥

దట్టముగా నే నప్పటి దయవుట్ట మాటాడినా
నెట్టుకొని కరుణించ నీభారమే
చుట్టు చుట్టి నీపై నేను సొలపులు చల్లినాను
చిట్టకములేక భువిఁ జెల్లించ నీభారమే ॥ నేనే ॥

చెలరేఁగి నేనెంత సేవలు సేసినాను
నిలిపి మెచ్చులు మెచ్చ నీభారమే
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అలరఁ గూడితి వింక నన్నియు నీభారమే ॥ నేనే ॥ 444

రేకు 1475 దేశాక్షి

అడుగరే యీమాట అవునో కాదో
బడిబడి నిందరిలోఁ బచారించవలెనా ॥ పల్లవి ॥

యీతల నేవిన్నవించేదేమి సారెసారెకు
ఆతఁడే యెరుఁగునే అన్నియును
ఘాతల నామీఁదనే కరుణఁగలఁడు తొల్లె
నీతులుగా నింక వేరే నేరుపఁగవలెనా ॥ అడు ॥

పూనిపట్టి నే విప్పుదు పొంచి యెచ్చరించేదేమి
తానే యెరుఁగునే తలఁపులెల్లా
యీనెలవులనే నన్ను యేలుకొని వున్నవాఁడు
వీనుల నే నింతేసి వివరించవలెనా ॥ అడు ॥

మఱవకుమని నేను మరి వేఁడుకొననేల
యెఱుఁగునే శ్రీవేంకటేశ్వరుఁడే
అఱిముఱి నన్నుఁ గూడె నలమేల్మంగను నేను
గుఱిసేసి యింకా మఱి కొసరఁగవలెనా ॥ అడు ॥ 445

ఆహిరినాట

ఉత్తమనాయకుఁడవు వువిదలయడాటాన
బత్తిసేయవివాఁడవా పదరితిఁగాక ॥ పల్లవి ॥

నన్ను నీవు మఱచేవా నాలోవితమకమున
పన్ని చెలులచేఁ జెప్పిపంపుదుఁగాక
మన్నించకుండుదువా మనసుపట్టఁగలేక
విన్నపములెల్లాఁ జేసి వేగిరింతుఁగాక ॥ ఉత్త ॥

కరుణించవా నీవు కాఁకల కోర్వఁగలేక
విరుల నెచ్చరికగా వేతుఁగాక
పరగ నింటికి రాక పరాకులుసేతువా
సరి విన్ను రమ్మనుచు సారెఁ బిలిచేఁగాక ॥ ఉత్త ॥

చన వీయవా నీవు సారెసారెఁ బెనఁగుతా
చెనకి ప్రియము నీకుఁ జెప్పేఁగాక
నిను శ్రీవేంకటేశ్వర నే నలమేలుమంగను
యెనసితి నిందుకుఁగా నెఱఁగింతుఁగాక ॥ ఉత్త ॥ 446

సామంతం

ఎంతప్రియము గలిగె నంత పొదలు వలపు
వింతలే కాఁటదానికి వినయమే నేరుపు ॥ పల్లవి ॥

చిత్తమురా మాటలాడి చెలువునిమీఁదట
బత్తిచూపవలెఁగాక పడఁతికిని
కొత్తగా నేరాలువేసి కూరిమిఁ గొసరుకొంటా
హత్తి వెంగెములాడేది అది యేఁటినేరుపే ॥ ఎంత ॥

సముకాన నిలుచుండి సరసములాడి పతిఁ
దమకించవలెఁగాక తరుణికిని
జమళి వద్దనే వుండి సారెకు నలుగుకొంటా
అమరనికాఁక చల్లే దది యేఁటినేరుపే ॥ ఎంత ॥

అలమేలుమంగవలె నటు శ్రీవేంకటేశ్వరుఁ
గలయఁగవలెఁగాక కామినికిని
పెలుచుఁదనాన రతిఁ బెనగులాడుకొంటాను
అలయించి చొక్కించే దది యేఁటినేరుపే ॥ ఎంత ॥ 447

ఆహిరి

ఇన్నిటా మన్నించితివి యిప్పుడు నేఁ గాదంటినా
సన్నల జంకించ మచ్చరమా నాకు ॥ పల్లవి ॥

కవగూడి నీకరుణ గలిగితేఁ జాలుఁగాక
సవతుల సాదించ చలమా నాకు
జవళి నీ పిట్టె వుంటే నఁతోసించుకొందుఁగాక
వివరించి వాదడువ వేడుకా నాకు ॥ ఇన్ని ॥

చింతదీర నాసేవ చేకొంటేఁ జాలుఁగాక
కాంతల నుంకించి తిట్ట గర్వమా నాకు
ఇంత నన్నెత్తుసేసితే ఇటు విన్ను మెత్తుఁగాక
పంత మందరితోనాడ పగటా నాకు ॥ ఇన్ని ॥

కొద్దిమీరి నన్నీరీతిఁ గూడితేఁ జాలుఁగాక
వొద్దివారినెల్లా దూర నొరటా నాకు
గద్దరినా యలమేల్మంగను శ్రీవేంకటేశ్వర
వొద్దిక నన్నుఁ గూడితి వోడఁబాటా నాకు ॥ ఇన్ని ॥ 448

రామక్రియ

మగువ యెంతటిదైనా మగవానికిఁ గిరుదే। యీ-
తగవు నీ వెఱఁగి యీతనికి మొక్కఁగదే ॥ పల్లవి ॥

మంచి మాటాడితేఁ బతిమనసు గరఁగుఁగాక
ఇంచుక విష్టూరమైన ఇయ్యకోలౌనా
వంచన కలిగితేనే వాడిక లింపవుఁగాక
మించి నడవఁగఁబోతే మెరమెర వుట్టదా ॥ మగు ॥

సరసములాడితేను చవులెల్లాఁ బొడముఁగాక
విరసాన నుండితేను వేడుకలౌనా
మరుగఁజేసుకొంటేను మచ్చిక నిలుచుఁగాక
యెరవు నేసుకుండితే నెనయునా పొందులు ॥ మగు ॥

ముందరనే నవ్వితేను మొగమోట వుట్టుఁగాక
సందడిఁ దలవంచితే సమ్మతులౌనా
అంది యలమేల్మంగ వాతఁడు శ్రీవేంకటేశుఁ-
డిందు విన్నుఁ గూడె నిఁక విచ్చకమే మించదా ॥ మగు ॥ 449

పాడి

వాకిటఁ గొలువున్నాఁడు వనిత నీపతితఁడు
చేకొని వచ్చి నిట్టె చిన్నఁబోనేలే ॥ పల్లవి ॥

మక్కువఁ దలఁచుకొంటే మనసెల్లాఁ జిగిరించు
చెక్కు చేతఁబెట్టితేను చింత రేఁగును
ముక్కుమీఁద వేలిడితే ముంచును వివ్వేరగులు
యెక్కుడలేనివిరహమేల పెంచేవే ॥ వాకి ॥

అట్టె యెదురుచూచితే నాసలెల్లాఁ బైకొను
నెట్టనఁ దమకించితే నిండుఁ గాఁకలు
పట్టెమంచ మెక్కితేనే పరగుఁ దలపోఁతలు
దట్టముగా నెంతజోలి దవ్వుకొనేవే ॥ వాకి ॥

వుసురసురంటేను వూరకే మే నలసు
యెసఁగించితేఁ గోరిక లెలయించును
పసగా నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
వెస విన్నుఁ గూడె నిఁక విచారములేలే ॥ వాకి ॥ 450

రేకు 1476 సాళంగనాట

నిన్నేమనేదే నీకు నింతేసి నేరిపి
పన్నుకవుఁదినయట్టిపతి నంటగాక ॥ పల్లవి ॥

కాంతునికిచ్చేకామక కమ్మి నీవందుకొనేవు
యెంతచనవరిదాన వేమిచెప్పేదే
వింతగావిన్నవించితే వెస నీవు వూఁకొనేవు
మంతుకెక్క నీవతనిమారై తివటవే ॥ నిన్నే ॥

చెలువునికి మొక్కితే చేరి నీవు దీవించేవు
　యిల నెంత నేర్పరివే యేడసుద్దులే
　నెలవి నే నవ్వితేను సిగ్గులు నీవు వదేవు
　కులికి యాతవిచేఁతకు గురి నీవటవే ॥ విన్నే ॥

శ్రీవేంకటేశుఁ గూడితే చేత నన్ను మెచ్చేవు
　నీ వలమేలుమంగ వన్నిట జాణవే
　ఆవేళ నేఁ జుట్టిచ్చితే ఆకు నీ వందుకొనేవు
　దేవుల పితవిగుట్టు తెలిసితివటవే ॥ విన్నే ॥ 451

సామంతం

కోరినట్టె ఆయ నీకు గోవిందుఁడా । మా-
　కూరిమి మఱవకుమీ గోవిందుఁడా ॥ పల్లవి ॥

క్రొమ్మెఱుఁగుచూపుగోవిందుఁడా
　కుమ్మరించేవు వలపు గోవిందుఁడా
　కుమ్మెవో గోర నొత్తకు గోవిందుఁడా । నీ -
　కొమ్మలెల్లా నవ్వేరు గోవిందుఁడా ॥ కోరి ॥

కొలనిలోవారము గోవిందుఁడా । నీకుఁ
　గొలువు సేసేము గోవిందుఁడా
　కొలముగొల్లెతలము గోవిందుఁడా
　కొలకొల నవ్వేదురా గోవిందుఁడా ॥ కోరి ॥

[1] కుందణపుచాయమేనిగోవిందుఁడా
　గొందినేల పవ్వళించ గోవిందుఁడా
　చెందె విన్నలమేల్మంగ శ్రీవేంకటేశ నిన్నాడు-
　కొందుముసుమ్మీ నేము గోవిందుఁడా ॥ కోరి ॥ 452

---

1. ఈచాయ యుగభేదముతో సరిపెట్టుకోవలెనేమో?

బౌళి

ఎక్కడు గొసరఁబోతే యేపనికివచ్చునయ్య
మక్కువ గలిగినంత మన్నించవయ్యా ॥పల్లవి॥

పంతముకొలఁదులే పలుకులెల్లా
మంతనముకొలఁదివే మనవులును
బంతి వడ్డించేకొలఁదే పరఁగవిందు
చెంతఁ జేరినకొలఁదే చేకొన్నచనవులు ॥ఎక్క॥

ననుపుకొలఁదివే నగవులును
చనవుకొలఁదివే సరసములు
పెనఁగినకొలఁదివే ప్రియములును
వినయముకొలఁదివే వెసఁ జుట్టరికాలు ॥ఎక్క॥

కూడినకొలఁదివే కూటములు
వాడికకొలఁదివే వలపులును
యీడనె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
వేడుక నేలితివి వావికొలఁదే వర్తన ॥ఎక్క॥ 453

పాడి

రావయ్య మాఇంటికి రవ్వసేయ మాకేఁటికి
భావించి నీయిచ్చలోనే పరగేముగాక ॥పల్లవి॥

కందువైనజవ్వనపుకాంతల కేఁటిచలము
చెంది పతికిఁ బ్రియము చెప్పుటేకాక
మందలించి సారెసారె మరియేఁటిమాటలు
పొందులు దెలిపి నీతోఁ బొసఁగుటేకాక ॥రావ॥

యెచ్చట మానాపతులకేల వెంగెములాడను
 నిచ్చ నీసేవలు సేసి నిక్కుటగాక
 పెచ్చువెరిగి యందాఁకాఁ బెనఁగఁగవచ్చు నిఁక
 విచ్చనవిడివి నిన్నే వేఁడుకొంటగాక ॥ రావ ॥

ఇట్టె వలచినదాని కింత పెనఁగఁగనేల
 గుట్టున నలమేల్మంగఁ గూడుటగాక
 నెట్టన శ్రీవేంకటేశ నే నీకు నాలనే
 వొట్టిననీరతులలో నోలలాడుటగాక ॥ రావ ॥ 454

## రామక్రియ

నేనేమి బాఁతే తననెలఁతలెల్లా నుండఁగ
 మేనుఁ గాఁగిలించి యేమి మెచ్చీనే నన్నును ॥ పల్లవి ॥

కందువైననాపై తనకరుణ గురుతుగాక
 యిందులో నాచక్కఁదనా లెంతచెప్పీనే
 మందలించి నాతోనన్నమాటలే గుఱుతుగాక
 పొందుల నానేర్పులెల్ల పొగడీనే తాను ॥ నేనే ॥

కిమ్ముల నన్నేలేతనకీరితే గుఱుతుగాక
 యిమ్ముల నామంచిగుణ మేమిచెప్పీనే
 సమ్మతించి నాకిచ్చినచనవే గురుతుగాక
 పమ్మి నేఁ దనకుఁజేసేభక్తి యెంతో చూపీనే ॥ నేనే ॥

కోరి తా నన్నుఁగూడినకూటమే గురుతుగాక
 యీరీతి నావినయము లేమిసేసీనే
 ఆరయ శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
 చేరి నన్నుఁ గూడెను నాచేఁత లేఁటిచేఁతలే ॥ నేనే ॥ 455

సామంతం

అల్లనాఁ డెఱఁగవా ఆకెవో యీకె
పెల్లుగా నీతమ్ములము పెట్టించుకొనదా ॥ పల్లవి ॥

అంగనతో మాటలాడి ఆయములు గరఁగుతా
సంగాతాలు సేయవా చావడిలోను
సంగడినే నిలుచుండి సారెఁ జెమరించుకొంటా
కొంగుఁగొంగు మోయఁగఁ గొలిపించుకొనవా ॥ అల్ల ॥

భావించి చూచిచూచి పరవశమందుకొంటా
వావులు దెలుపవా వాకిటనుండి
పూవుల వేసి మోహాన బుసకొట్టుకొంటాను
నోవగా సతిచే నాకుచుట్టింపించుకొనవా ॥ అల్ల ॥

గుట్టుతోనే నవ్వి మేను గుబ్బతిలఁ బులకించి
ఇట్టె కాఁగిలించుకోవా ఇంటిలోనను
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
చుట్టి నన్నేలి యీకె కీసుద్దులెల్లఁ జెప్పవా ॥ అల్ల ॥ 456

రేకు 1477 పళవంజరం

వద్దనేమా నిన్నును వలపు దాఁచవచ్చునా
బుద్ధులెల్లా నీకు నేను బోధించేదాననా ॥ పల్లవి ॥

సేసకొప్పు వంచివంచి చెలి నీకు మొక్కఁగాను
చేసూటినే నీవేల సిగ్గువడేవు
ఆసపడి యప్పటి నీఅంద నిలుచుండఁగాను
మూసినముత్యమవై నామోమేమిచూచేవు ॥ వద్ద ॥

చేతులు చాఁచి నీకు చేరి కానుకియ్యఁగా
నాతికి నీవేల నన్నలుసేసేవు
కాతరాన నీదిక్కు కన్నుల నాపె చూడఁగా
యీతల నాతోడుత నేఁటికి నవ్వేవు ॥ వద్ద ॥

సారెకు విన్నాకె గూడి సరసములాడఁగాను
గారవించి నన్నెంత కాఁగిలించేవు
యీరీతి శ్రీవేంకటేశ యేనలమేలుమంగను
మేరమీరి నన్ను నేమి మెచ్చు మెచ్చేవు ॥ వద్ద ॥ 457

ముఖారి

ఇందుకొరకే వచ్చితి నిదె నీసముకానకు
చందము సేయఁగ నీవే చతురుఁడవయ్యా ॥ పల్లవి ॥

చేరఁడంతలుకన్నులచెలి నిన్నుఁ జూచితేను
మూరెఁడంతపొదపు(కు(క్రొ?)మ్ముడి వీడెను
యీరుదియ్యఁ బేనుపచ్చె నిదివో నీపై వలపు
సారెసారె యీపనులు చక్కఁబెట్టవయ్యా ॥ ఇందు ॥

జుట్టెఁడేసిపాదములజోటి నీవద్దికి రాఁగా
పట్టెఁడేసిచన్నులపై పయ్యద జారె
అట్టె కలి ముదిరి మెట్టాయ నీతో పొందులు
నెట్టన నీతబ్బిబ్బులు నీవే దిద్దవయ్యా ॥ ఇందు ॥

గొరెఁడంతచంద్రవంక గురుతు నీకుఁ బెట్టితే
బారెఁడు గాఁగిటఁ గూడి పంతమిచ్చేవు
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నీరుకొద్దితామరాయ నేఁడు మెచ్చవయ్యా ॥ ఇందు ॥ 458

బౌళి

ఏఁటికయ్యా నీతో మాటు యేలాటములాడను
చీటికిమాటికి, సంతోసించుటే కాక ॥ పల్లవి ॥

సులభమా నీతోను సొలసి మాటాడేది
అలరి నీ కిచ్చలాదే అఁటదానను
తలవంచుకొని నీదండ నిట్టె కాచుకుండి
చెలఁగి నీ చెప్పినట్టుసేసే దింతేకాక ॥ ఏఁటి ॥

గరువమా నాకు నిన్నుఁ గదిసి తప్పకచూడ
ఇరవుగఁ బెండ్లాడినయిల్లాలను
వరుసతో నీచిత్తమువచ్చినట్టే సేవసేసి
బెరసి నీచేత మెప్పించుకొంటగాక ॥ ఏఁటి ॥

యెమ్మెలా నీతో నేను యెలయించి నవ్వునవ్వ
నెమ్మి నలమేల్మంగను నీదేవులను
యిమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వుమ్మడిరతులఁ గూడి వుండు టింతేకాక ॥ ఏఁటి ॥ 459

శ్రీరాగం

ఆకె యదె పిలువరే అందరు నోచెలులాల
చేకొని పతివేడుక చెల్లించవలెను ॥ పల్లవి ॥

మగువ దనునాడినమాటలు దలఁచుకొంటా
తగినచక్కఁదనాలు తలఁచుకొంటా
నగుతాఁ బొందుసేసిననమువుఁ దలచుకొంటా
వొగి లోనఁ బవళించి వున్నాఁడు రమణుఁడు ॥ ఆకె ॥

పదఁతిపక్కనుండినభావము దలఁచుకొంటా
తదఁబాటురతులెల్లాఁ దలఁచుకొంటా
కదుమనోరథములు కల్పించి తలఁచుకొంటా
వుదివోవివేడుకతో నున్నాఁడు రమణుఁడు ॥ అకె ॥

అలమేలుమంగచేఁత లన్నియుఁ దలఁచుకొంటా
తలకొన్న నేరుపులు దలఁచుకొంటా
కలసి ఇప్పుడు తొంటికతలు దలఁచుకొంటా
వెలయుచున్నాఁడు శ్రీవేంకరమణుఁడు ॥ అకె ॥ 460

పాడి

ఎంత నేరుచుకొంటివే ఇన్నిటికి గురిగాను
కాంతునిఁ జూపి యెఱఁగనియట్టుందానవు ॥ పల్లవి ॥

అంది పతితో నేకతమాడ నేరుతువుగావి
అందరిముందర మాటలాడనేరవే
కందువ నన్ను నప్పటి గయ్యాళిఁ జేసి, నిన్ను -
నొందిలి యేమాడిన నోరుచుకుందానవు ॥ ఎంత ॥

పిలిచి యాతని నింటఁ బెట్టుకోనేర్తువుగాని
అలరి మావరుసకు నంపనేరవే
పలుమారు నేవచ్చినపనులు రట్టు కెక్కించి
చలమునే సాదించితే సాదవై యుందానవు ॥ ఎంత ॥

కోరి శ్రీవేంకటేశ్వరుఁ గూడఁగనేర్తువుగావి
చేరి మాకు వినయాలు సేయనేరవే
నేరిచి నన్నితదేలె నే నలమేలుమంగను
సారె నే నవ్వితే సంతోసాననే వుందానవు ॥ ఎంత ॥ 461

గౌళ

పూవులవాసనలెల్లా పుణుఁగున బట్టినట్టు
వావులే మీలోమీకు వైపులాయనయ్యా ॥ పల్లవి ॥

కొలఁది మీర నీకింతి కొలువులు సేయఁగాను
విలిచి యాపెమోము నీవు చూడఁగా
వలపు తీఁగెలువారి వరుస మీయిద్దరికి
అలరి మీకాఁగిళ్ల నల్లుకొనెనయ్యా ॥ పూవు ॥

పచ్చిదేర నీతో నాకె పలుమారు మాటాడఁగా
విచ్చన విడిగా నీవు వినఁగాను
ఱుచ్చి మీమనసు లివి గుడిగొనఁ జిగిరించి
తచ్చి మోవులలో నేస్తాలు సేసీనయ్యా ॥ పూవు ॥

అక్కునఁ దిరమై నీకు నలమేల్మంగ వుండఁగా
దక్కు సొమ్ములలో నీవు దాఁచుకుండఁగా
పక్కన మీకోరికలు ఫలించి శ్రీవేంకటేశ
చొక్కపుమీరతు లీడుజోడాయనయ్యా ॥ పూవు ॥ 462

రేకు 1478 ఆహిరి

ఎంత వుపకారివి యేమని పొగడుదును
వింతచేఁతలను నాకు వేడుక సేసితివి ॥ పల్లవి ॥

ఆసలుగా నీగురుతు లటు గొన్నిపెట్టి వంపి
పాసివున్నవిరహతాపము మాన్పితి
సేసవెట్టినగురుతు చెప్పిపంపి అప్పటివి
వేసటలు దీర వన్ను వెద్దువెట్టితివి ॥ ఎంత ॥

తనివార నాకు నేఁడు తతితో నీరూపు చూపి
మనసులోపలిచింత మానిపితివి
చెనకి చేయిమీఁద చేయివేసి యింతలోనే
తనువుపైకాఁకలార దప్పులు దేర్చితివి ॥ ఎంత ॥

గక్కన వింటికి వచ్చి కాఁగిట నన్నుఁ గూడి
ఇక్కడ నాకోరికె లీదేర్చితివి
వికమూ శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
చొక్కపురతుల నన్నుఁ జొక్కించి యేలితివి ॥ ఎంత ॥ 463

సాళంగనాట

ఏఁటిజోలి చేకొంటివి యెంతవిరాళి
నీటున వింతికడకు నేఁడే రారాదా ॥ పల్లవి ॥

కలికికన్నులచూపు కడలేనితరితీపు
మొలకచన్నులు నీవుమోఁచేటిమోపు
తెలిసిచూడ వలపు తెగరానిరాఁపు
కలిగె వింతికడకు గక్కన రారాదా ॥ ఏఁటి ॥

వనితచిగురుమోవి వన్నెలైనచెంగావి
దినదినమును నీకు తియ్యనితావి
చెనకి మీయిద్దరికిఁ జెప్పితి నే విందువావి
యెనసె వింతికడకు నిప్పుడే రారాదా ॥ ఏఁటి ॥

అలమేలుమంగమాఁట అమరుఁ గోవిలపాట
కలయికలకు విదె కాఁగిటిపూఁట
యెలమి శ్రీవేంకటేశ యీకెఁ గూడితి విచ్చోట
తలఁచి యింతికడకుఁ దప్పక రారాదా ॥ ఏఁటి ॥ 464

### శ్రీరాగం

ఇంక నీచిత్తముకొలఁదెట్టయినాఁ గరుణించు
అంకెల మావిన్నపము లవధరించవయ్యా ॥ పల్లవి ॥

సలిగె గలిగితేను సరసము లమరును
వెలినున్నవారికి వేసాలందురు
కలసినచుట్టాలైతే సొలయఁగఁజెల్లును
బలిమి వింతవారికిఁ బనిలేదు ॥ ఇంక ॥

యెనసినవావులైతే యేమిసేసినాఁ జెల్లు
మనసురానివారికి మాయలందురు
ననుపైనకాంతలు పెనఁగితే నీదేరు
చెనకఁ బెరవారికి చేతికి లోఁగారు ॥ ఇంక ॥

తగులైనవారికిఁ దమకించఁ బాడియౌను
సొగయనివారికి సోద్యమందురు
నిగిడి శ్రీవేంకటేశ నే నలమేమంగను
మొగి నన్నేలితివి కిమ్మలవారి కబ్బదు ॥ ఇంక ॥ 465

### దేసాళం

ఔదువే దొడ్డదాన నతని దక్కఁగొంటివి
యీదెస నీనేరుపులే యెన్నికాయఁ జెలియా ॥ పల్లవి ॥

యెలమిఁ గొలువుసతు లెందరు లేరు పతికి
తలఁపునఁ బాయనిదే తరుణిగాక
వల పెంతలేదు మరి వంతులకు వలవఁగా
కలయిక కింపైనదే వలయుఁగాక ॥ ఔదు ॥

పూని మాట లెన్నిలేవు పొలఁతు లాడితేఁ బతి-
వీనులఁబట్టినవే వేడుకగాక
నానఁబెట్టే దేమరుదు నవ్వుల నెలవులను
నానాఁటిసరసముల నాఁటవలెఁగాక ॥ ఔదు ॥

చెలిమి యెంతలేదు శ్రీవేంకటపతికి
అలమేల్మంగ నీపొందే యమరుఁగాక
మెలుపున నన్నుఁ గూడె మేలింకా నెంతలేదు
అలరి నీవలె మెఱయఁగవలెఁగాక ॥ ఔదు ॥ 466

సాళంగం

ఆనతియ్యవయ్య నాకు నందముగ వినేఁగాని
నానదుగదా నవ్వితే ననుపు గావలెను ॥ పల్లవి ॥

ఆనపడి నాయింటికి నటు సారెఁ బిలువఁగ
వేసట గాదుగదా వింతలై నీకు
వాసితో నీతోడ యెక్కు వలపులు చల్లఁగాను
దోసము గాదుగదా తొడిఁబడ నిపుడు ॥ ఆన ॥

వొగ్గి యందరిలో విన్ను నొడివట్టి పెనఁగఁగా
సిగ్గులు గావుగదా చేకొని నీకు
అగ్గమై చన్నులుదాఁక నంట నేఁ గూచుండితేను
యెగ్గయి తోఁచదుగదా ఇప్పుడు నీకు ॥ ఆన ॥

పలుమారు నే నీకు పాదము లొత్తఁగాను
అలయిక గాదుగదా అంతలో నీకు
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి మొగచాటు గాదుగదా నీకు ॥ ఆన ॥ 467

బౌళి

అన్నివిన్నపములును అందులోనే వున్నవి
వున్నతిఁ జెలికత్తెల మొద్దికతో నేము ॥ పల్లవి ॥

ఆపెయంపినకానిక యవధరించితివా
చూపులఁ దప్పక లెస్స చూచితివా
చేపట్టి ముక్కునఁ దావి చిత్తగించితివా
ఆపనుల కేమంటి వానతియ్యవయ్యా ॥ అన్ని ॥

యింతియంపినవారము యెఱుఁగుదువా మమ్ము
చెంతల మావినయములు చెవి సోఁకెనా
వింతలైనగురుతులు విచారించుకొంటివా
అంతరంగానఁ బట్టెనా ఆనతియ్యవయ్యా ॥ అన్ని ॥

అలమేలుమంగ వచ్చె నందఁబెట్టుకొంటివా
వెలయఁ గాఁగిట గారవించితివా
ఇల శ్రీవేంకటేశ్వర ఇన్నిటా జాణవు నీవు
అలరె మాపనులెల్లా నానతియ్యవయ్యా ॥ అన్ని ॥ 468

రేకు 1479 సామంతం

మట్టుమీరి మెలఁగితే మరేమున్నది
చుట్టరికమెరిఁగినసూటికత్తెలకును ॥ పల్లవి ॥

ప్రియముచెప్పుట మేలు బిగియకుండుట మేలు
నయగారిసతికివి నాథునితోను
క్రియతో మాటాడవలె కివియకుండఁగవలె
నియతమైనయట్టినెలఁతలకు ॥ మట్టు ॥

చెప్పినట్టు సేయఁదగు చేతికి లోనుగాఁదగు
తప్పనిమగువకును తనపతితో
చొప్పెరిఁగి నవ్వుటొప్పు సొలయకుండుట యొప్పు
ముప్పిరి గొనఁగఁ గడుమోహించినవారికి ॥ మట్టు ॥

కొలువు సేయుట పాడి కూరిమిచల్లుట పాడి
కలికియైనచెలికి కాంతునితోను
నెలవై శ్రీవేంకటేశ నిన్నలమేల్మంగ గూడె
యెలమి నిదేబుద్ధి యిల్లాండ్లకును ॥ మట్టు ॥ 469

## వరాళి

ఊడిగపుదానను వువిదకు నీకు నేను
వేడుకకాఁడ మీకత వెలయించరాదా ॥ పల్లవి ॥

యీకాంతను వలపించి ఇంత సేసినయందుకు
దాకొని నీచేఁతలు తలఁచరాదా
రాక నీ విందాఁకానుండి రవ్వ సేసినందుకు
నీకుఁ జేతులెత్తి మొక్కి విలుచుండరాదా ॥ ఊడి ॥

పంతాన నీకెఁ బిలిచి పరాకై వుండినందుకు
కొంతగొంత నే విన్నుఁ[1] గొనేదరాదా
అంతలోఁ దలఁచుకొని ఆదరించినయందుకు
సంతోసించుకొని విన్ను సారె మెచ్చరాదా ॥ ఊడి ॥

కమ్మర నీకెఁ గూడి గడుసుపడినందుకు
చిమ్మిరేఁగి ప్రియములు చెప్పఁగరాదా
ఇమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నీదేవిని
పమ్మి మిమ్మిద్దరినిఁ దప్పక చూడరాదా ॥ ఊడి ॥ 470

---

1. "కొనియాడుట"కు వ్యావహారికము.

### పాడి

అది చూచి నాకు వేడుకాయను నేఁడు
యెదలోన నీకప్పు డెట్టుండెనోకాని ॥ పల్లవి ॥

చెలిని చెవిలోపలఁ జేరి యేకతాలాడఁగ
పులకించె మేను గొబ్బున నీకును
మొలకనవ్వులు నీపై ముంచిముంచి చల్లఁగాను
జలజలఁ జెమరించె చక్కనినీచెక్కులు ॥ అది ॥

కోమలి నీకు లోవికొలఁవులు సేయఁగాను
అముకొనఁ జెంగలించె నదె నీమోము
కోమలపుచనుఁగవకొనలు దాఁకించఁగాను
ప్రేమతో మూపులు మూఁడై పెనగొనె నీకును ॥ అది ॥

వనిత యెదుటనుండి వలపులు రేఁచఁగాను
వొనర నీమర్మములు వుప్పొంగెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
పెనఁగి నీకాపెకుఁగా బెరసెను కళలు ॥ అది ॥ 471

### నాదరామక్రియ

సిగ్గున నూరకుండితే సేసినవాఁడవే నీవు
బెగ్గిలక సాకిరిచెప్పే నేను నీకును ॥ పల్లవి ॥

కలలోన వేరొకతె కాఁగిటిలో నిన్నుఁగని
వెలఁది మేల్కని నీతో వెంగెమాడీని
యెలమిఁ దెలియులేక యేలపెట్టుకొనే వాన
కలికియు నీవుఁ దారుకాణించుకోరాదా ॥ సిగ్గు ॥

వొక్కతెతో రతి నీకు నూహించి తానే భ్రమసె
చక్కనినీమోము చూచి సాదించీని
చెక్కుచేతితో నేల చింతించే విందుకుగా
గక్కన విద్దరుఁ దారుకాణించుకోరాదా ॥ సిగ్గు ॥

పొరుగాపె పొందులు పోలికలు చూచుకొని
సరికిబేసికి విన్ను జంకించీని
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ యాకె
కరుణించి విన్నుఁ దారుకాణించుకోరాదా ॥ సిగ్గు ॥ 472

కన్నడగౌళ

చెలిఁ గావు మరుఁ డింత నేయఁజొచ్చెను
నెలవులనవ్వులే సిగ్గురేఁచఁజొచ్చెను ॥ పల్లవి ॥

చెక్కుపైఁ జేయిడుకొని చింతించఁగాఁ జెలియకు
వుక్కుమీరి పెంజెమట లూరఁజొచ్చెను
వెక్కసపువిరహాన వెరగుతో నుండఁగాను
మిక్కిలినిట్టూరుపులు మించఁజొచ్చెను ॥ చెలిఁ ॥

యెదురుచూచి నీరాక కేఁకరుచునుండఁగాను
పొదలుచుఁ దమక మువ్పొంగఁజొచ్చెను
అదన నీపొందులకు నలయుచునుండఁగాను
తుదలేనికోరికలు తొడరఁగఁజొచ్చెను ॥ చెలిఁ ॥

తగిలి నీవలపులదప్పులఁ బొరలఁగాను
దగదొట్టి సందు లదరఁజొచ్చెను
జిగి నలమేల్మంగ శ్రీవేంకటేశుఁడ విన్ను
మిగులఁ గూడఁగా మేలు మెరయఁగఁజొచ్చెను ॥ చెలిఁ ॥ 473

బౌళి

పలికెనంటే గడుఁబచ్చిదేరును
చెలపచెమటలతో చెక్కులు నొక్కినది ॥ పల్లవి ॥

మనసున నెన్నటికి మఱవకు మీఁక నీవు
ననుపున విటు నన్ను నమ్మించినది
యెనసి మరినొకటి యెఱుఁగుదు వది నీవు
పెనఁగి యేకతమునఁ బ్రియము చెప్పినది ॥ పలి ॥

వది నాచుట్టరికము వదలకు మీఁక నీవు
కదలేక బత్తి నాపైఁ గలిగినది
చిదుముడిఁ దొల్లె నాకుఁ జెప్పివంపితివి
అదియాలముగ నాఁడె యాసలఁబెట్టినది ॥ పలి ॥

పరగ నాకాఁగిటఁ బాయకు మీఁక నీవు
విరుల నాపై దయసేసినది
విరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
గరిమఁ గూడితివి తార్కాణలయినది ॥ పలి ॥ 474

రేకు 1480 బౌళి

ఇంకనేల వెంగెమాడ నియ్యకోలై నపనికి
సంకెలేనిచనవున జట్టిగొంటగాక ॥ పల్లవి ॥

చిగురుఁబెదవిమీఁద చిమ్ముచుఁ దీపులు చల్లి
మగువ విన్నుఁజే మాటలాడఁగా
నగవచ్చునా నీతో నంటుచేసుకొని నాకు
వొఁగి బరాకులు చేసుకుండటగాక ॥ ఇంక ॥

సొలపుఁ జూపులలోన సూటిమెఱుఁగుల చల్లి
జలజాక్షి నిన్ను సారె జంకించఁగా
పిలువవచ్చినా నిన్ను పెనఁగచు మాఇంటికి
కొలువులో నవ్వుచేసుకొనుటగాక ॥ ఇంక ॥

కొమరెగుబ్బలచేత గురుతులు సోఁకించి
రమణి నిన్నేకతాన రతిసేయఁగా
అమర సలమేల్మంగ నౌదును శ్రీవేంకటేశ
తమి నిన్నుఁగూడి యిట్టె దైవారుటగాక ॥ ఇంక ॥ 475

## ముఖారి

చూచేవారికిఁ జూడ చుట్టమువలెనున్నాఁడు
యేఁచి యీతనికతలు యెన్నియైనాఁ గలవు ॥ పల్లవి ॥

ఆసలనే పెట్టిపెట్టి ఆయములంటి నన్ను
పోసరించి కడువలపులు రేఁచెనే
వోసరించి జూజాలాడి వూరకే సుద్దులుచెప్పి
వేసాలు చేసినాఁడే వేఁగినంతా నితఁడు ॥ చూచే ॥

సరసములాడియాడి సన్నలనే మోవిచూపి
మరిగించి ప్రియముల మచ్చికలు చూపెనే
సొరిది వీడెములిచ్చి సొమ్ములెల్లా మెడఁబెట్టి
తెరమఱఁగున దప్పిదేర్చె నితఁడు ॥ చూచే ॥

మచ్చికలు రేఁచిరేఁచి మన్ననలు నాకొసగి
హెచ్చి ఇంతసేసి నేఁ డిటు గూడెనే
అచ్చపు శ్రీవేంకటేశుఁ డట్టె పువ్వులను వేసి
రచ్చఁబెట్టి ఇందాఁకా రాఁపుసేసె నితఁడు ॥ చూచే ॥ 476

### పాడి

ఏఁటికి వేగిరపడే విప్పుడే నీవు
తేటతెల్లమైనప్పుడు తెలిసీఁగాని ॥ పల్లవి ॥

కొమరెపాయపుసతి కొలువులో నుండఁగాను
భ్రమసివున్నాఁ డతఁడు పలికీనటే
సముకాన నాపె వచ్చి చవులు వుట్టించఁగాను
తమకించివున్నవాఁడు తలఁచీనటే ॥ ఏఁటి ॥

చక్కఁదనములయాపె సరసములాడఁగాను
చొక్కినాఁ డెదిరివారిఁ జూచీనటే
చెక్కునొక్కి మరియును చేఁతలెల్లాఁ జేయఁగాను
అక్కరతో నున్నవాఁడు ఆదరించీనటవే ॥ ఏఁటి ॥

పొందులు చేసినయాపె పొత్తుకు వచ్చివుండఁగా
విందుచెప్పవచ్చితేను వినీనటవే
అందపుశ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁగూడె
మందెమేళమైనవాఁడు మఱచీనటే ॥ ఏఁటి ॥ 477

### కాంబోది

పదరేవు రతులకు పంతమా యిది
పదపడి బిగిసేవు పంతమా యిది ॥ పల్లవి ॥

యెదమిచ్చి ప్రియముతో వింటికిఁ బిలువఁగాను
పదఁతితోఁ బెనఁగేవు పంతమా యిది
చిదుముడి నీతో నవ్వి చెమరించె మేనెల్లా
బదలిక చూడవు పంతమా యిది ॥ పద ॥

జలజాక్షిచన్నులు నీసంగడినే వున్నవంటా
పలుమారు బిసికేవు పంతమా యిది
కలికికన్నులచూపు కాఁడిపారె నిన్ననంటా
బలిమితోఁ దిట్టేవు పంతమా యిది ॥పద॥

తరుణి నీపాదాలకు దండములు వెట్టఁగాను
పరసతులఁ జూచేవు పంతమా యిది
యిరవై శ్రీవేంకటేశ యేలితి విన్నిటా నీఁక
పరగఁ దమకించేవు పంతమా యిది ॥పద॥ 478

నాగవరాళి

నేరుపరి నందువు నెలఁతలలోనెల్లా
కూరి మెంతగలిగినా కొసరఁగవచ్చునా ॥పల్లవి॥

వలచినదాననంటా వాసికత్తెనంటాను
చెలరేఁగి పతితోడఁ జెప్పేవు నీవు
చలివాసివుందానవు చన వెంతగలిగినా
పొలఁతికి తన్నుఁదానే పొగడుకోవచ్చునా ॥నేరు॥

విన్నే నమ్మితినంటా నేఁ బాయనోపనంటా
యెన్నేసివేసాలు సేసే విప్పుడే నీవు
పన్నుకొని వచ్చితివి బలిమికత్తెవై తేను
కన్నియకు నింతేసి కరతలు గలవా ॥నేరు॥

చేయెత్తి మొక్కితినంటా సిగ్గుతో నుందావనంటా
ఆయములంటి కూడితి వంతలో నీవు
యీయెడ శ్రీవేంకటేశుఁ దేలె నన్ను దొరవైతే
పాయపుదానికి నింత పచ్చిసేయఁదగునా ॥నేరు॥ 479

### సామంతం

చెలఁగి కొలఁకులోన సిగ్గులువడఁగవద్దా
బలువుఁడవై తేనే [1] ప్రహ్లాదవరదా ॥ పల్లవి ॥

వడియుఁజెమటతోడ వంచినమోముతోడ
తొడమీఁదఁగూచున్న తొయ్యలితోడ
జడిసేసీవలపులు సరికి బేసికిఁ జూచి
పడఁతులెల్లా నవ్వేరు ప్రహ్లాదవరదా ॥ చెలఁ ॥

నిట్టూరుపులు మీర నిద్దుర గన్నులఁ దేర
గుట్టుతో విన్నాపె గోర గీర
గట్టిగా నీవాపెను కాఁగిలించి వదలక
పట్టుకుండఁగా నవ్వేరు ప్రహ్లాదవరదా ॥ చెలఁ ॥

సింగపుమోము మెఱయ చిమ్మఁజూపులు బెరయ
అంగన కాఁగిట నొయ్యన దొరయ
రంగుగ శ్రీవేంకటాద్రిరాయఁడవై మన్నించఁగా
పఁగెనల నవ్వేరు ప్రహ్లాదవరదా ॥ చెలఁ ॥ 480

రేకు 1481

### సాళంగనాట

నాకెమ నీకూరిమి నారసింహా
నాటకములెల్లాఁ గంటి నారసింహా ॥ పల్లవి ॥

కోమలు లిందరు నీపైఁ గోరి సేసలు చల్లఁగ
నామొగ మేమిచూచేవు నారసింహా
వేమరు వాడవారెల్లా విన్నపాలు సేయఁగాను
నామాటే చవులాయ నారసింహా ॥ నాకె ॥

1. 'ప్రంహ్లాద' రేకు.

యేతులఁ జెంచెత నీతో నేకతమాడినసుద్ది
నాతో దాఁచఁగనేల నారసింహా
జాతులఁ బెట్టుచు నీవు సారెనేల చెనకేవు
నాతులు నీకేమిబాఁతి నారసింహా ॥నాటె॥

పనితో విద్దెరమునుఁ బాయక కూడుండఁగా
ననిచె మనపొందులు నారసింహా
తనిసి నీరతుల దయఁజూచి యేలితివి
నను శ్రీవేంకటగిరినారసింహా ॥నాటె॥ 481

రామక్రియ

అట్టుసేయ కింక నీవు ఇట్టె రాఁగదే
పట్టపుదేవులవై నబలవంతురాలవు ॥పల్లవి॥

యెదురుఁగొండ లెక్కితివేమే వోచెలియా
యెదురఁగొండలచన్ను లెద నుండఁగా
వదలక నల్లఁగలువల వేసే వదియేమే
కదిసి నీచూపులే కలువలై వుండఁగా ॥అట్టు॥

యేరు నడుమఁ బెట్టుక యెలయించే విదియేమే
యేరువంటియారు నీకు నిదె వుండఁగా
సారెకు లేఁతతీగెలు జళిపించే విదియేమే
గారాపుతీఁగెలే నీకరములై వుండఁగా ॥అట్టు॥

పొంది వొక్కచోఁ దరితీపులు వుట్టించేవేమే
ముందుముందే తీపులు నీమోవి నుండఁగా
అందిపుశ్రీవేంకటాద్రి నహోబలమునను
ఇందిరవు నీకు నేనే ఇరవైవుండఁగను ॥అట్టు॥ 482

### ఆహిరి

వనిత నీపతి నేఁడె వచ్చీఁగాక
మనసులో వివరంపు మలయుచుండఁగను ॥ పల్లవి ॥

దప్పిదేరే వదియేమే తరుణి నీ వింతలోనే
చిప్పిలుమోవితేనెలు చిమ్మిరేఁగఁగా
కప్పినకాఁకలతోడ కడువసివాడే వదియేమే
కప్పురపునగవులు కలిగుంపఁగాను ॥ వని ॥

వుమ్మగిలే విదియేమే వువిద నీవూరుపుల-
తెమ్మెరలచలువలు తేటపడఁగా
కుమ్మరింపుఁజెమటలు కురిసేవు నీ విదియేమే
కమ్మ చూపుచాతకాలు కలిగివుండఁగను ॥ వని ॥

వీడిననెరచీఁకటి వెలఁదిరో నించేవేమే
తోడనే మోముకళలు తొలఁకఁగాను
ఆడనె శ్రీవేంకటేశుఁ డప్పుడే విన్నుఁగూడె
యేడాలేనిమఱపేలే యింపు నీకుండఁగను ॥ వని ॥ 483

### సామంతం

ఔనే మంచిదానవు ఆతఁ డటువంటివాఁడా
పూని వేఁడుకొనఁగదే పొందుగలవానిని ॥ పల్లవి ॥

కన్నులు గొప్పలంటాను కడుజంకింతురటవే
మన్నించి నిన్నేలినమగవానిని
సన్నలు నేరుతునంటా సాదింతురటవే
ఇన్నిట జాణఁడైనఇటువంటివానిని ॥ ఔనే ॥

వాఁటములు చేతులంటా వడిఁ బెనఁగుదురచే
మేటితనాన నుండేటిమేనవానివి
మాటలు నేరుతువంటా మగుడ నాడుదురచే
కూటమికి గురుతైనకొండవంటివానివి ॥ ఔనే ॥

చన్నులు గట్టులంటాను జడియ బిగింతురచే
విన్నాణపునేర్పుల శ్రీవేంకటేశుని
కిన్నెరకు నేర్తునంటా గీఁటి చూపుదురచే
పన్నినట్టివలపులపట్టమేలేవానివి ॥ ఔనే ॥ 484

బౌళిరామక్రియ

మాతో నేమిచెప్పేవే మాపుదాఁకాను
ఆతనిని చిలుకచే నాడించవలదా ॥ పల్లవి ॥

చేరి నవ్వవచ్చుఁగాక చేయిసోఁకఁ జెనకితే
వోరుచు కెవ్వరికైనా నుండవచ్చునా
ధీరత ఇంతలేకుండితే నప్పుడే యతనిపై
కోరి వేరొకటివెట్టి దూరుసేయవలదా ॥ మాతో ॥

జూదమాడవచ్చుఁగాక సులభాన గెలిచితే
వాదులేక యీసు విడువఁగవచ్చునా
పాదుకొని నీవింత పంతమాడేదానవు
మోదపు నీచెలులచే మోసపుచ్చవలదా ॥ మాతో ॥

తమి రేఁచవచ్చుఁగాక తగురతిఁ గినిసితే
తెమల కందుకు సమ్మతించవచ్చునా
అమర శ్రీవేంకటేశు నటు గూడినదానవు
మముబోంట్లచే మారుమలయించవలదా ॥ మాతో ॥ 485

సామవరాళి

ఎదురుబడి నున్నారు నిద్దరు నేకతమున
అదను చూచి యీడకు నాతని రప్పించవే ॥పల్లవి॥

వన్నల నాతనితో సరసములాడనీవే
కిన్నెరమీటుల గిలిచంచనీవే
విన్నపము లేమైనా వెలఁది చేసుకోనీవే
నన్నేల పిలిచేవు వదుమ నీవాడకు ॥ఎదు॥

బత్తిగలిగినట్టాఁ బాదాలు విసుకనీవే
గుత్తపుగుబ్బలఁ బతిఁ గుమ్మనీవే
కొత్తగా నవ్వులు నవ్వి కూరిమి గొసరనీవే
పొత్తులకాఁగిటనేల పొదుగుమనేవు ॥ఎదు॥

తిరముగా లోలోనే తెరవేసుకోనీవే
గిరికుచములంట భోగించనీవే
అరిది శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నుఁ గూడె
సురతపురహస్యాలచొప్పు వెదకుదురా ॥ఎదు॥ 486

రేకు 1482 సామంతం

ఎంతవనికోకాని యెఱఁగ నేను
చెంతనే తెలుసుకో నేఁ జెప్పితి నీసుద్దులు ॥పల్లవి॥

వదలేజారుఁదురుము వైపుగా ముడుచుకొంటా
కదలుఁగన్నులచూపు కాఁడిపారఁగా
మదమువలెనే పెంజెమటలు చెక్కులఁ గార
వెదకీ నెవ్వతో విన్ను వీదులవీదులను ॥ఎంత॥

అడఁచి చన్నులపైఁ బయ్యద బిగిఇంచుకొంటా
కదలేనివిట్టూర్పులు కడుమఁగాను
తడఁబడఁ బెదవుల తమ్మబేంట్లు రాలఁగా
అదిగీ నీవున్నచోటు అంగవలనెల్లాను ॥ ఎంత ॥

వుక్కుమీరి కరముల వొడిమీదఁ బెట్టుకొని
మిక్కలి నీకాపె పొందు మీఁదెత్తఁగా
ఇక్కడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూదేవు
చొక్కుచు నీమేడదిక్కే చూచీఁ దా నదివో ॥ ఎంత ॥ 487

సాళంగనాట

వేడుకకాఁడుగదమ్మ [1] విట్ఠలేశుఁడు
వీడెమియ్య వచ్చీని విట్ఠలేశుఁడు ॥ పల్లవి॥

నరున రుక్మిణిదేవి సత్యభామయుఁ జెనక
వెరవులు వెదకీని విట్ఠలేశుఁడు
సరసములాడుకొంటా సారెకు వలపులు చల్లీ
విరులదండలతోడివిట్ఠలేశుఁడు ॥ వేడు ॥

చన్నులంటి గోపికల సన్నలఁ దిట్లు దిట్టీ
వెన్న దిన్ననోరితోడి విట్ఠలేశుఁడు
కన్నులఁదప్పకచూచి కలువపువ్వుల వేసీ
వెన్నెలనవ్వులతోడి విట్ఠలేశుఁడు ॥ వేడు ॥

ఆగడపుఁజేఁత సేసి ఆయములునొత్తఁ గూడె
వేగిరకాఁడు గదవే విట్ఠలేశుఁడు
బాగుగ శ్రీవేంకటాద్రిఁ బాయక నన్నేలి మెచ్చీ
వేగ(గు?)జాముననుండి విట్ఠలేశుఁడు ॥ వేడు ॥ 488

---

1. 'విఠ్ఠల' రేకు

రామక్రియ

భూపతిచెరువుకాడఁ బొంచి తిరువేంకటేశుఁ—
దేపున నన్నెలయించి యెంతచేసెనే ॥పల్లవి॥

యిట్టె సింగారించుకొని యింటికి నే రాఁగాను
గుట్టుతోనే వచ్చి తా నాకొంగు వట్టెనే
వొట్టువెట్టి నేఁ దన్ను వొద్దనఁగానే పెఁడి-
పట్టెమంచ మెక్కించుక పచ్చిచేసెనే ॥భూప॥

మలసి వెన్నెలలోన మట్టెలమోతతోడ
మెలఁగఁగా వచ్చి నాతో మేలమాడెనే
చెలరేఁగి తప్పించుక సిగ్గుతో నే నుండఁగానే
కులుకుగుబ్బలమీఁద గుఱుతులు నించెనే ॥భూప॥

మిన్నక ముసుఁగుతోడ మేడమీఁద నెక్కఁగానే
సన్నచేసి నామోవి చవిగొనెనే
కన్నుల నే నద్దవించి కలకల నవ్వఁగానే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డిటు నన్నుఁ గూడెనే ॥భూప॥ 489

దేసాళం

ఏమి దప్పకచూచేవు యెగసక్కెమాడ నేను
వేమారు మొక్కే నేను వెన్నముద్దక్రిష్ణుఁడా ॥పల్లవి॥

కోడెకాఁడవై నీవు కోరి చన్నులంటఁగాను
వాడుమోముతోఁ దలవంచీఁ జెలి
ఆడానీడాఁ దిరిగాడి అన్ని నేరుచుకొంటివి
వీడె మియ్యఁగదవోఇ వెన్నముద్దక్రిష్ణుఁడ ॥ఏమి॥

గొల్లెతలవాడలోన గోళ్ల మీటఁగాను
తెల్లమి నొకతె వచ్చి తిట్టీ విన్న
బల్లిదుఁడ వౌదువు బాసలు సేయకు మిఁక
వెల్లవిరాయఁ బనులు వెన్నముద్దక్రిష్ణుఁడ ॥ ఏమి ॥

సేనవెట్టుతానే వచ్చి చిమ్మిరేఁగఁ గూడఁగాను
వాసులు వంతులు నీపై వంచీ నీకె
ఆసల శ్రీవేంకటాద్రి నంతలో నన్నేలితివి
వేసారకు రతులను వెన్నముద్దక్రిష్ణుఁడా ॥ ఏమి ॥ 490

మాళవిగౌళ

ఈవేళ నీమన్నన యిన్నేపి కలిగెఁగా
కైవశమైతే నీమతి కరఁగీఁగాని ॥ పల్లవి ॥

చీటికిమాటికి నీవు సిగ్గువడినా నీతో
మాటలాడఁ గలిగెఁగా మాపుదాఁకాను
చాటువగా నేఁ దప్పటి సరసమే చాలదా
కూటమిగలప్పటికిఁ గూడేవుగాని ॥ ఈవే ॥

భావము నీకెక్కడను పరాకై వుండినా నీకు
సేవసేయఁ గలిగెఁగా చేచేతను
వావులు దెలుపుచు నీవద్దనుండుటే చాలదా
యేవేళనైనా నీమోవి యిచ్చేవుగాని ॥ ఈవే ॥

యెవ్వతెకాఁగిట నీవు యెందుండినా నీతోను
నవ్వు నవ్వఁగలిగెఁగా ననుపుగాను
యివ్వల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
రవ్వగాఁ గూడితి విట్టే రతించేవుగాని ॥ ఈవే ॥ 491

సౌరాష్ట్రం

కాదనేనా ఇఁక నీపైఁ గాఁతాళించేనా
సాదవైతి వన్నిటాను సంగతాయఁ బనులు ॥ పల్లవి ॥

చేయరానిచేఁత చేసి చెకు(క్కు?)వట్టి వేఁడుకోఁగా
ఆయనాయ నిందువంకనైనదేమి
నాయ మెవ్వరు చెప్పేరు నాకు నీకు నడుమను
చాయకుఁ దెచ్చుకొంటివి సంగతాయఁ బనులు ॥ కాద ॥

జాలిఁబెట్టి మాటలాడి సమ్మతిగాఁ జేయఁగాను
చాలఁజాలు నిందువంక సాదించేదేమి
తాలి మెక్కడ నున్నది తవిసితి మిద్దరము
పోలికలు చూపేవు పొసఁగె నీపనులు ॥ కాద ॥

వెంట నాకేఁ దోడితెచ్చి వేరేమరఁగు వెట్టఁగా
కంటిఁగంటి నిందువంకఁ గలిగేదేమి
ఇంటివద్ద శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
జంటవై నెలకొంటివి చక్కనాయఁ బనులు ॥ కాద ॥ 492

రేకు 1483 రామక్రియ

ఎన్నిలేవు నీసుద్దులు యెరిఁగినవేళ కన్ను –
సన్నలు నేసేవు కడుసాదువలెనె ॥ పల్లవి ॥

కాతరాన నాపె నీపై కప్పురము చల్లెనంటా
యేతులకు నందరితో నేమి చెప్పేవు
చూతముగా నీవాకెతో చుట్టరికము మానేవా
నీతితోడ మాటాడేవు నిజమరివలెనే ॥ ఎన్ని ॥

వాకుచ్చి యప్పటి నాపె వయసతోఁ దిట్టెనంటా
సాకిరేల పెట్టేవు సతులనెల్లా
యీకడనే పచ్చిదేరీ విదివో నీయాచారాలు
పైకొని సాదించేవు పంతగానివలెనే ॥ ఎన్ని ॥

రవ్వలుగా నేఁ డాపె రచ్చలోఁ జెనకెనంటా
నవ్వులు నవ్వేవు నీవు నాతులెదుట
చివ్వన నన్నేలితివి శ్రీవేంకటేశ్వర
తవ్వేవు వలపులెల్లా తగవరివలెనే ॥ ఎన్ని ॥ 493

### తెలుఁగుఁగాంబోది

చెలులము మామాఁట సేయవచ్చు నిదివేళ
చెలఁగి యిదే నెపము చేసుకొనఁగదవే ॥ పల్లవి ॥

పలుమారుఁ బిలిచినాఁ బలుకవు పతితోడ
చలపాదితనమేలే సకియకును
అలిగినందుకు గుఱుతౌనిది మెచ్చితిమి
వల పిఁక నాఁపరాదు వల దియ్యకొనవే ॥ చెలు ॥

అంకెలఁ బెనఁగఁగాను ఆతనితో బిగిసేవు
మంకుఁదన మిదియేలే మగువకును
జంకించి వంచుకొన సందౌనిది నీకు మేలు
లంకె వాపరాదు యిఁక లలిఁ గాఁగిలించవే ॥ చెలు ॥

నేసవెట్టఁగా నవ్వేవు శ్రీవేంకటేశుతోను
బేసబెల్లితనమేలే ప్రియురాలికి
చేసినపొందుల కివి చెల్లు నే మెఱిఁగితిమి
వాసిఁ గూడి మానరాదు వచ్చి మోవి ఇయ్యవే ॥ చెలు ॥ 494

పాడి

మఱవఁగఁబోలుదురు మనసులోపల మీరు
తఱితోఁడ నేనైనాఁ దలపించే నీఁకను ॥ పల్లవి ॥

మేడమీఁదఁ గూచుండి మేమువచ్చే దెఱఁగక
ఆదరా జాణతనా లాపెయు నీవు
అదనెకాదా మరినందుకొంటిరి విడేలు
వేడుకై నే నడిగితే వెరగందే రిపుడు ॥ మఱ ॥

సింగారపుఁదోఁటలోన చేరి నేము నుండఁగానె
అంగవించి నవ్వుకోరా ఆకెయు నీవు
చెంగట నప్పుడేకాదా చేసన్న చేసుకొంటిరి
సంగడి నేఁ జూచితేను సాదించే రిపుడు ॥ మఱ ॥

పట్టెమంచముమీఁదను పాదాలు నే నొత్తఁగానే
అట్టె కాఁగిలించుకోరా ఆకెయు నీవు
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
చుట్టరికాలు చెప్పితే సోద్యమందే రిపుడు ॥ మఱ ॥ 495

సాళంగనాట

ఊరకే తానేల నన్ను వొత్తుకవచ్చీనే వీఁడు
పోరచిగాఁ జెలులాల బుద్ధిచెప్పఁగదరే ॥ పల్లవి ॥

తియ్యవిమోవులఁ గావా తెఱవలు వెంగేలాడి
చయ్యాటాలఁ బతులను సాధించేది
పయ్యదలోనున్న యట్టిపాలిండ్లేకావా
గయ్యాళిరతులలోన కదునాటేవి ॥ ఊర ॥

చల్లనిచూపులే కావా సారెసారె భ్రమయించి
వల్లెవేసి వలపుల వలఁబెట్టేవి
పెల్లున మంచినున్నని పిఱుఁదు లివే కావా
జల్లన గుండెగరఁచి సడిఁబెట్టేవి ॥ ఊర ॥

నయగారితనములనగవు లివే కావా
ప్రియము పుట్టించి పెడరేఁచేవి
వియతి శ్రీవేంకటాద్రినిలయుఁడు నన్నుఁ గూడె
క్రియతో నారూపేకాదా కెరలించేది ॥ ఊర ॥ 496

కాంబోది

ఈమాట విన్నవించరె యింతులాల విభునికి
దీమసపునాగుణము తెలియదా మీకు ॥ పల్లవి ॥

బాస దప్పవద్దుగాని పరకాంతల వింటికి
వాసితోడఁ దెచ్చుకొంటే వలదనేనా
ఆసకొల్పవద్దుగాని అక్కడఁ దా నెటువలె
వేసా లెన్నిచేసినా వెంగెమాడేనా ॥ ఈమా ॥

పంతమాడవద్దుగాని భావించి నామే లెఱిఁగి
యెంత నాతో నవ్వినా నేఁటికనేనా
వింతసేయవద్దుగాని వేడుకకాఁడవై ఇట్లు
సంతోసానఁ దిరిగినా సాదించేనా ॥ ఈమా ॥

జోలిఁబెట్టవద్దుగాని చోటిచ్చి పానుపుమీఁద
యేలాగునఁ గూడినా యెమ్మెలాడేనా
వేళతోడ నన్నును శ్రీవేంకటేశుఁ డిదె కూడె
మేలములెన్నియాడినా మితిమీరేనా ॥ ఈమా ॥ 497

సాళంగం

mp3

అడుగరే యీమాట ఆతవి మీరందరును
యెడయనిచోటను ఇగిరించుఁ బ్రియము ॥ పల్లవి ॥

పొరపొచ్చమగుచోట పొసఁగవు మాటలు
గరిమ నొరసితేను కలఁగు మతి
సరవులు లేనిచోట చలము వెగ్గళమవును
వొరసి పెనఁగేచోట నుమ్మగిలు వలపు ॥ అడు ॥

వొలసినొల్లనిచోట వొనరవు నగవులు
బలిమి చేసేటిచోట పంతమురాదు
అలుకలుచూపేచోట అమరదు వినయము
చలివాసివుండేచోట చండిపడుఁ బనులు ॥ అడు ॥

ననుపులేనిచోట నమ్మికచాలదు పొందు
అనుమానమైనచోట నంటదు రతి
యెనసినాఁడు శ్రీవేంకటేశుఁడు వన్నింతలోనె
తనివిలేనిచోట దైవారుఁ గోర్కులు ॥ అడు ॥ 498

రేకు 1484 వరాళి

ఏల సాములు సేసే వింతితోడను
జాలిఁబెట్ట కిఁక మోవిచవులియ్యరాదా ॥ పల్లవి ॥

బాయిటఁ బవ్వళించి పడఁతిచన్నులు నీవు
చేయిచాఁచి పిసికేవు సిగ్గువడఁగా
రాయిడేల చేసే వారయ రాలవంటివి
వేయైనా నీచేతులకు వెనకతీసీనా ॥ ఏల ॥

యేఁకటతోఁ బానుపుపై యిరవైవుండినయింతి
పోఁకముడి విడిచేవు పొరలఁగాను
వేఁకపువలపులకు వేసినముడియ ఇది
తేఁకువ నీచేఁతలతో దీకొనీనా ॥ఏల॥

మాఁగినమోవితోడ మంతనాన వున్నసతిఁ
గాఁగిటనే కుచ్చేవు కడునవ్వఁగా
దాఁగరావిచోటది తమితో శ్రీవేంకటేశ
పాఁగినసీయాసలకు పంతమిచ్చీనా ॥ఏల॥ 499

ఆహిరి

చలమేలే యీతనిచనవు చేకొంటగాక
పెలుచైనవానితోడఁ బెనఁగఁగరాదు ॥పల్లవి॥

తడయక పతి యెంతతరితీపులఁ బెట్టినా
పడఁతికి వేసరఁగఁ బాడిగాదు
చిడుముడి మరి నేమి సిగ్గులుమోవనాడినా
కొడిమ లెన్ని యతనిఁ గోపగించరాదు ॥చల॥

కమ్మటి నేలినవాఁడు కాఁక యెంతనేసినాను
కొమ్మ కెప్పుడు నొడ్డించుకొనఁగరాదు
కమ్ముకొని యంతలోనే కడుబలిమిసేసినా
దిమ్మరేఁచి యతనితో దీకొనఁగరాదు ॥చల॥

పొందైనవాఁ డెట్లుపొద్దులు గడపినాను
చందనగంధికి మీరి సాదించరాదు
అంది శ్రీవేంకటేశ్వరుఁ డదివో విన్నుఁ గలసె
అందగాఁ డితని నెందు నలక్షించరాదు ॥చల॥ 500

హిజ్జిజి

తనలోనే సిగ్గువడి తలవంచుకొన్న దిదె
మనవి చేకొని ఇట్టె మన్నించవయ్య ॥ పల్లవి ॥

సతి నీపైఁ జేయివేసి సంగాతాలెల్లాఁ జేసె
రతికిఁ బిలువఁగాను రమ్మనవద్దా
ఇతవరివైనదెల్లా నిందుకొరకా నీకు
మతిలోనిమే లెఱిఁగి మన్నించవయ్యా ॥ తన ॥

మంతన మిందాఁకా నాడి మచ్చిక పాటలు వాడి
ఇంతలో మోవెదుగఁగా నియ్యఁగవద్దా
బంతి నీచుట్టరికము పరాకుసేసేకొరకా
మంతుకెక్క సేసవెట్టి మన్నించవయ్యా ॥ తన ॥

వేడుకతోఁ జెక్కునొక్కి వేమారు నీకు మొక్కి
వాడికచూపఁగా నీవు వలవవద్దా
కూడె విన్నలమేల్మంగ కొనరేకొరకా మేడా
మాడుగు; శ్రీవేంకటేశ మన్నించవయ్యా ॥ తన ॥ 501

సామంతం

గొల్లదానఁ గదవయ్య గోవిందుఁడా
చిల్లరచేఁత లేఁటికిఁ జేసేవు గోవిందుఁడా ॥ పల్లవి ॥

వుంగరమేలిడిగేవు వువిదలు చూడఁగాను
కొంగువట్టితీసి నీవు గోవిందుఁడా
అంగవించి యొనఁగితి వల్లనాఁడె నాకు నిది
సింగారాలు నీకు బాఁతే చెల్లఁబో గోవిందుఁడా ॥ గొల్ల ॥

వాడి యేల సోదించేవు వూడిగపువా రుండఁగా
కొడిమెల కోప నేను గోవిందుఁడా
కడలేనిరతులనుఁ గాఁగిలించితి వప్పుడే
తడవకు మర్మము లుద్దండపుగోవిందుఁడా ॥గొల్ల॥

చన్నులేల పట్టేవు సవతులు నవ్వఁగాను
కొన్నేసిసుద్దులు చెప్పి గోవిందుఁడా
ఇన్నిటా శ్రీవేంకటాద్రి నిరవై నన్నేలితివి
మన్నించి పాయకుమీ ప్రేమమున గోవిందుఁడా ॥గొల్ల॥ 502

పాడి

కామిని యందరిలోనాఁ గడుగోల
నీమనసుకొలఁదికి నేర్పవయ్యా కతలు ॥పల్లవి॥

సెలవుల నవ్వఁగాను చేతులెత్తి మొక్కఁగాను
చలము సాదింతురా సతులతోను
అలిగివుండినదవి అగడుసేసే వూరకే
చెలి యేమిసేయవలెఁ జెప్పవయ్యా బుద్దులు ॥కామి॥

గుట్టుననే వుండఁగాను కొలువులు సేయఁగాను
ఒట్టబయలీఁదింతురా పడఁతులను
గట్టువాయతనమని కన్నవారితోఁ జెప్పేవు
చుట్ట మీకె నీవు చేసిచూపవయ్యా చేఁతలు ॥కామి॥

చెంతనే కూచుండఁగాను జిగిఁబాదాలొత్తఁగాను
పంతములాడుదురా భామలతోను
ఇంతలోఁ గూడి శ్రీవేంకటేశ కడుఁ గొసరేవు
వింతలే వివింకాఁ జదివించవయ్యా రతులు ॥కామి॥ 503

బౌళి

తేనెలు మోవి నూరె తెల్లవారెను
నానెఁ జెమటల మేను నవ్వితి నేననవే ॥ పల్లవి ॥

గోరికొన [1]వాఁడేయ కుచములు [2]వేఁడేయ
గారవాన నేఁడు తనకాఁగిటిలోన
తారుకాణ లిదె వచ్చె తమకము గడుహెచ్చె
చేరి నన్ను మన్నించి చిత్తగించుమనవే ॥ తేనె ॥

పిట్టూర్పులు బెట్టాయ నేరుపులు రట్టాయ
పట్టరానివయసుతో పానుపుమీఁద
నెట్టుకొనె నడియాస విజమాయఁ దనబాస
యెట్టఇనాఁ దనమాట లియ్యకొంటిననవే ॥ తేనె ॥

వేడుకలు మతి నిండె వెస వలపిదె పండె
మాడుపుటింటిలో తెరసుఱఁగునను
యీడనె శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
వీడే లంచుకొంటి మిఁక వేసరవద్దనవే ॥ తేనె ॥ 504

రేకు 1485 దేసాళం

నీకొలఁదివారమా నేమెల్లాను
పైకొని మమ్ముఁజూచి బతుకఁగఁగదవే ॥ పల్లవి ॥

వలపే గుఱిగాక వనితకుఁ బతికివి
సొలసి సొలసి యేమి జోలిదవ్వేవే
పిలుపే గుఱిగాక ప్రియముగలయందుకు
బలవంతములేల పచారించేవే ॥ నీకొ ॥

---

1, వాఁడి+ఆయ. 2, వేఁడి+ఆయ.

పాయమే గురిగాక బిగివాయనివారికి
చాయలా సన్నలా నేమిసాదించేవే
కాయమే గుఱిగాక కదలేవిరతులకు
నాయములేల గదించి నవ్వు నవ్వేవే ॥ నీకొ ॥

వేడుకే గురిగాక వెలలేవిపొందులకు
ఆడా నీడాఁ గూడి యెంత అలయించేవే
పాదితో శ్రీవేంకటాద్రిపతి నన్ను విదె యేలె
జోడుగూడి నీవేల చొప్పులెత్తేవే ॥ నీకొ ॥ 505

## రామక్రియ

ఇప్పుదే సిగ్గువడే విందరము నుండఁగాను
ముప్పిరి నేర్చుకొంటివి మునుప నీసుద్దులు ॥ పల్లవి ॥

సరసములాడితేను చవివుట్టు వలపులు
తరితీపు సేసితేను తమిరేఁగును
వొరశొరసి నవ్వితే నుల్లములు గరఁగును
సొరిది నీపతి నిటె చొక్కించఁగదవే ॥ ఇప్పు ॥

తప్పక చూచితేను తలకొను నాసలు
నెప్పునఁ బెనఁగితేను విందు ముదము
దప్పిదేరఁ గొసరితే తలపోఁత లుప్పతిల్లు
చిప్పిల నీ పతినికి సేవసేయఁగదవే ॥ ఇప్పు ॥

సారెసారెఁ జెనకితే సమ్మతించు మనసులు
కోరి కాఁగిలించుకొంటే కూడుఁ బ్రేమము
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
మేరతో నీవునుఁ గూడి మెప్పించఁగదవే ॥ ఇప్పు ॥ 506

## లలిత

వినరాదు నీసుద్దులు విని పూరకుండరాదు
ఘనుఁడైనపతినేల కరకరించేవే ॥ పల్లవి ॥

చేరివచ్చి నిన్నాతఁడు చెక్కునొక్కి వేఁడుకోఁగా
సారెసారె నీవేల సాదించేవే
కూరిమి గొసరి నీకుచ్చుల వట్టితీసితే
దూరి నీవెంతేసి దుండగాలాడేవే ॥ విన ॥

విందువలె మోవిఇచ్చి విడెము చేతి కియ్యఁగా
సందడిం బాతని నెంతజంకించేవే
కందువనుండి పెనఁగి కాఁగిలించుకొనఁగాను
మందెమేళమున నెటు మారుకొనేవే ॥ విన ॥

ఇంటిలో శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడఁగాను
అంటిముట్టి రతి నెంత అలఇంచేవే
నంటున నెలవులను నవ్వులెల్లా నవ్వఁగాను
దంటవై కమ్మటినేల తమకించేవే ॥ విన ॥ 507

## మంగళకౌసిక

ఈరీతి వేరొకతైతే ఇద్దరిని వింతసేను
సైరణతో నున్నదెంతసాదో కాని ॥ పల్లవి ॥

పువ్వుల నాపెను నీవు పూఁచివేయఁగాఁ జూచి
వివ్వెరగుతో నీకె నిలుచున్నది
యెవ్వరి నేమీ ననదు యెగసక్కెములాడదు
జవ్వని తావిది యెంతసాదో కాని ॥ ఈరీ ॥

వనితపై నీవు గడువసంతమాడఁగఁ జూచి
తనలోనే తాను చింతతో నున్నది
కనలి కోపించదు కాతరాన నలుగదు
చనవుమెరసీ నెంతసాదో కాని ॥ ఊరి ॥

పట్టపుదేవులు నీవుఁ బైకొని కూడఁగాఁ జూచి
గట్టిగాఁ గాఁగిట నిన్నుఁ గలనున్నది
యిట్టె శ్రీవేంకటేశ యేమీ నిన్నుఁ దడవదు
జట్టిగొని మొక్కీ నెంతసాదో కాని ॥ ఊరి ॥ 508

## నాదరామక్రియ

బుద్ది చెప్పవయ్యా నీపొలఁతికిని
వుద్దండాన నీవలనివుపేక్ష యిదేవరా ॥ పల్లవి ॥

యెవ్వతో నీవెంట వచ్చి యెమ్మెలెల్లా నాడుకోఁగా
నవ్వటిల్ల నీకె విని నిన్ను దూరెను
పువ్వువలె నీకుఁగానే పూమకవచ్చీఁ దాను
యెవ్వరైనా నీమతక మిదియెల్లా ననరా ॥ బుద్ది ॥

కావరించి యెప్పటిని కటారువట్టుక వుండి
నీవద్ద నేనవ్వఁగాను నిన్ను దూరెను
ఆవేళఁ దా నందుకుఁగా నొఁగాదవవచ్చీని
యీవల నీసలిగెలే యెంతసేసీ ననరా ॥ బుద్ది ॥

ఆట్టిగొనేదియుఁగాక సరుసనే కూచుండి
నెట్టనఁ గాఁగిలించఁగా నిన్ను దూరెను
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి మాచెలిని
అట్టుగా నీతగవు లాఅడిఁబడె ననరా ॥ బుద్ది ॥ 509

## దేసాళం

ఎంతవడిదాఁకానే నీయెలయింపులు
పంతము లిప్పుడే నీవు పచరించఁదగునా ॥ పల్లవి ॥

వెలయ నన్నిఁజేసినవిభుడే వేఁడుకొనఁగా
చలపాదితనమేల సకియకును
వలచినవలపులు వడి నెదలో నుండఁగ
వెలుపల పట్టిగుట్టు వెదచల్లఁదగునా ॥ ఎంత ॥

ఆసలఁబెట్టియేఁచినయాతఁడే పైకొనఁగాను
వేసదారియలుకేలే వెలఁది నీకు
నేసవెట్టినపెండ్లి చేతిలోనే వుండఁగాను
బేసబెల్లిబిగువులు పెనఁచఁగఁదగునా ॥ ఎంత ॥

వెక్కసపుసుద్దుల శ్రీవేంకటేశుఁడే కూడఁగా
కక్కసించ నింతయేల కాంతరో నీకు
మిక్కుటపురతిసొంపు మేనిమీఁద నుండఁగాను
జక్కవగుబ్బల నొత్తి జఱయఁగదగునా ॥ ఎంత ॥ 510

రేకు 1486

## శుద్ధవసంతం

కాంతలెల్లా నెఱఁగిరి కందువ మీసుద్దులు
చెంతనుండి ఇంత రట్టుసేసుకొందురా ॥ పల్లవి ॥

జలజాక్షికొప్పులోవిసంపెంగపువ్వులు రాలె
వెలుచుఁదనాన నీవు పెనఁగఁగాను
తిలకించి యప్పటివి తెరలోనికిఁ దియ్యఁగ
గలగల నందెలు గజ్జెలుఁ గదలెను ॥ కాంత ॥

అంగనగుబ్బలమీఁదిహారములు చిక్కువడె
రంగుగా నంటిముట్టి సరసమాడఁగా
చెంగటనే గిలిగించి చిమ్మిరేఁగ నవ్వించఁగా
సింగారపుఁబయ్యదల్లా చెమటఁ దడిసెను ॥ కాంత ॥

కామినివిట్టూర్పుల గాలి విసరఁగఁజొచ్చె
ఆమనిరతుల నాకె నలయించఁగా
యేమరించి శ్రీవేంకటేశ నీవీకెఁ గూడఁగా
దోమటిమోవితేనెలు తొటతొట నూరెను ॥ కాంత ॥ 511

బౌళి

ఇన్నాళ్ల నెఱఁగవైతి వింతేసి నీవు
సన్నలా చాయలా నాపె చదివించెనా ॥ పల్లవి ॥

యితరసతులతో నీ వెపుడు మాటాడకుండా
వ్రతము వట్టించెనా వనిత నీకు
సతమై నమ్మినచోట చలము సాదించుమని
మతికెక్క బుద్దులెల్లా నూరిపోసెనా ॥ ఇన్నా ॥

యేచి రతివేళ మోవి యెంగి లంటించకుమని
ఆచారాలు నేరిపెనా అంగన నేఁడు
చేచేతఁ గాఁగిలించితే సిగ్గులువడేయట్టుగా
లాచి నీమనసులో మొలవఁబెట్టెనా ॥ ఇన్నా ॥

తడవి చెనకినాను తలవంచుకొనుమని
గడుసరిఁ జేసెనా కామిని నిన్ను
అదరి శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
వుడివో కీగుణ మాకె వుపదేశ మిచ్చెనా ॥ ఇన్నా ॥ 512

## సౌరాష్ట్రం

నీ కెంత ఇతవైనదో నే నెఱఁగను
కాకుసేసి నవ్వేరు కాంతలెల్లా మిమ్మును ॥ పల్లవి ॥

పంతములకే వచ్చీని పరాకుచేసినాఁ బోదు
వంతులకే పెనఁగీని వనిత నీతో
యెంత చనవిచ్చితివో ఇందరిలో నీపెకు
వింత లివి గనుఁగొని వెరగయ్యీ నాకు ॥ నీకెం ॥

వాదికనవ్వులు నవ్వీ వద్దన్నా మానదు
యీదువెట్టుకొనవచ్చీ నింతి నీతోను
యేడ బాసలిచ్చితివో యీకె వింతనేసేనవి
చూడఁజూడ వింతలోనే సోద్యమయ్యీ నాకు ॥ నీకెం ॥

చలములకే పైకొనీ చాలునన్నా విడువదు
బలుములే చూపీని భామ నీతోను
యెలమి శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
అలరి యీపెసుద్దుల కరుదయ్యీ నాకు ॥ నీకెం ॥ 513

## ముఖారి

కొమ్మలిద్దరు నుండఁగాఁ గొంకీఁగాని
చిమ్ముఁజూపులతో లాచీ విదె నీయెదుట ॥ పల్లవి ॥

వేడుకైనసుద్ది నీతో విన్నవించ సిగ్గుపడీ—
నాడ నాకె నావవెట్టి యడుగవయ్యా
బేడుకోలుఁదనమున పెండ్లిమాట గాఁబోలు
చూడు మునిమునినవ్వు చూపీ నీయెదుట ॥ కొమ్మ ॥

కలికి మాటునముంది కానుకలియ్య సిగ్గువడీ
తిలకించి చేయిచాఁచి తీసుకోవయ్యా
అలనాఁ డేమంటివో నేఁ డాపవికిఁగాఁబోలు
తెలుసుకో లాలించితే తెలిపీ నీయెదుట ॥కొమ్మ॥

ముందర నీకు విలిచి మొక్కీతానే సిగ్గువడీ-
నందుకుఁ గాఁగిట నీవు నలమవయ్యా
విందువలె నన్నును శ్రీవేంకటేశ కూడితివి
అందుకో విడెము నీకు నందిఇచ్చీ యెదుట ॥కొమ్మ॥ 514

శంకరాభరణం

ఇద్దరుఁ గూడితి రీసు లిఁకనేల
వొద్దికాయ నాతనితో నొక్కటి గాఁగదవే ॥పల్లవి॥

చనవు వెగ్గళమైతే జడియనేల
మనసు లేకములైతే మరుగనేల
వొనరినపొందులైతే నొరయనేల
వినయానఁ బతిచేతివిడె మందుకొనవే ॥ఇద్ద॥

యితవులై వుండితేను యెరవులేల
రతు లొనగూడితేను రవ్వలేల
ప్రతినలు చెల్లితేను పంతములేల
మతకములెల్లా మాని మాటలాడఁగదవే ॥ఇద్ద॥

వేడుకలు వుట్టితేను వేసటలేల
జోడై వుండినచోట సోదించనేల
యీడనే శ్రీవేంకటేశుఁ డేలె విన్ను
జాడతో నాతనిమోవి చవిగొనఁగదవే ॥ఇద్ద॥ 515

మాళవిగౌళ

నీవెట్లా నుండినాను నీకేమయ్యా
మావంటివారికి నేమము వలెఁగాక ॥ పల్లవి ॥

మగవాఁ డేమిసేసినాను మరి యేడా నెగ్గులేదు
తగవులు దప్పినాను తప్పులెంచరు
జిగిమీరి సిగ్గువిడిచినాఁ గాదవియనరు
మగువలనై తేను మనసు లోరతురు ॥ నీవె ॥

దొరపాటివానికి దోసము గలదనరు
విరసాలు చేసినాను వెలిపులేదు
పొఁపొచ్చాన నుండినా బుద్ధులుచెప్ప రెవ్వరు
తరుణులమాఁటలే తగ అట్టుసేతురు ॥ నీవె ॥

వేడుకకావిసేఁతలు వెల్లవిరిగాఁ జేయరు
యేడనుండి వచ్చినాను యేమీననరు
కూడితివి నన్ను నేఁడు కూరిమి శ్రీవేంకటేశ
చేడెలు నీవద్దనుంటే చెలఁగి నవ్వుదురు ॥ నీవె ॥ 516

రేకు 1487 శ్రీరాగం

రమ్మనవే రమణుని రతికేలికి
పమ్మినతరితీపులభావ మొక్కటే ॥ పల్లవి ॥

చెమటలఁ దొప్పఁదోఁగేపింగారాలే వింతగావి
తమకము పరియే తనకు నాకు
మమకారములతోడిమాఁటలే వింతగావి
సుముఖపుమొగమోటమాపు లొక్కటే ॥ రమ్మ ॥

నగువేళ నెలవులనవ్వులే వింతగాని
తగులమి సరియే తనకు నాకు
అగపడ్డప్రియములఆసలే వింతగాని
వెగటుగానిమోవులవిందు లొక్కటే ॥ రమ్మ ॥

పలుమారుఁ గొఁగిటిలో పంతములే వింతగాని
తలఁపులు సరియే తనకు నాకు
అలమి శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
కలకాలముఁబాయనికాంక్ష లొక్కటే ॥ రమ్మ ॥ 517

## ఆహిరి

ఎంతచేసినా నీకు నెదురాడేనా
బంతినే మమ్మేల వొడఁబరచేవు నీవు ॥ పల్లవి ॥

మాట లెన్నిలేవు నీవు మాపుదాఁకా నాడితేను
చాటువగా నేము విసఁజాలముగాక
వాఁటమై యిందాఁకా నాపెవద్ద నుండి వచ్చి నేఁడు
పాటించి మమ్మేల వొడఁబరచేవు నీవు ॥ ఎంత ॥

చేఁత లెన్నిలేవు నీవు చెంతనుండి చేసితేను
వూఁతగాఁ దప్పకచూడనోపముగాక
పాఁతపడఁతికి నిట్టె బాసలెల్లాఁ జేసివచ్చి
బాఁతితో మమ్మేల వొడఁబరచేవు నీవు ॥ ఎంత ॥

మొక్కు లెన్నిలేవు నీవు మునుకొని మొక్కితేను
నెక్కొని సమ్మతించనేరముగాక
ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పక్కన మమ్మేల వొడఁబరచేవు నీవు ॥ ఎంత ॥ 518

బౌళి

అప్పటిఁ గొసరనేల ఆసోదమా
తప్పక నన్నుఁ జూచినతగవిదె చాలదా ॥ పల్లవి ॥

అరిదివలె మాయింటి కటు నీవు వచ్చితేను
వరుసకు రావంటా వాదింతునా
గరిమ నీపాటివుపకారము చేసిననిను
సరుస మెచ్చుటగాక సాదించవచ్చునా ॥ అప్ప ॥

మచ్చిక నెట్టకేలకు మాటలు నీవాడితేను
ఇచ్చకములాడవంటా యీసడింతునా
విచ్చ నీచుట్టరికము నెరపినయట్టి విన్ను
రచ్చ నుతించుటగాక రాఁపుసేయవచ్చునా ॥ అప్ప ॥

చేయిచాఁచి ఇన్నాళ్లకు చెనకి కాఁగిలించితే
కాయము చొక్కించవంటా కాఁతాళింతునా
యీయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పాయకవుండుటగాక పంగించవచ్చునా ॥ అప్ప ॥ 519

దేసాళం

సాదించనేఁటికి నీవు సారెసారెకు
భేదములేక కూడితే పెనఁగులాడేమా ॥ పల్లవి ॥

చెంగటనుండి నీవు చేసినదెల్లాఁ జేయఁగా
అంగనలము మాలో నేమాడుకోరాదా
సంగతిగా నీవు తొల్లె సాదువలె నుండితేను
పంగించి నిన్నటు భంగపరచవచ్చేమా ॥ సాదిం ॥

వుడివోవిచిన్నలు నీవాళ్లమీఁద నుండఁగాను
  నడుమ మాలో నేము నవ్వుకోరాదా
  నడిలేనిగుణముతో చక్కఁగా మెలఁగితేను
  కొడిమెలు గట్టి విన్ను కోపగించేమా ॥పాదిం॥

కప్పి యందరిని నీవు కాఁగిలించికూడఁగాను
  చొప్పులు మాలో నేము చూచుకోరాదా
  యెప్పుడూ శ్రీవేంకటేశ యెదయక యేలితేను
  తప్పులెంచి నీసుద్దులు తారుకాణించేమా ॥పాదిం॥ 520

## గౌళ

మంచివానివలెనే మాటలాడేవు
  అంచెల వచ్చితి విట్టె అ(అ?)ప్పు డెందువోయేవు ॥పల్లవి॥

చింతతో నే నుండఁగాను చెవిలో నేకతమాడే-
  వెంతలేదు నీవలపు యేమిచెప్పేది
  కాంతచేఁ బిలువనంపి కాచుకుండితి నిందాఁకా
  అంతటా వెదకించితి నప్పు డెందువోతివి ॥మంచి॥

విరహాన నే నుండఁగా వెనకనే నిలుచుఁడి
  యెరవులు చేసుకొనే వేమి చెప్పేది
  సరుగ నీరాకలకు సగినాలు చూపించితి
  అరుదుగా బత్తిసేనే వప్పు డెందువోతివి ॥మంచి॥

నివ్వెరగై నే నుండఁగా నీవె నన్నుఁగూడితివి
  యెవ్వరుండుటా నెఱఁగ వేమి చెప్పేది
  రవ్వగా శ్రీవేంకటేశ రతికి విన్నే కోరితి
  అవ్వలిమోమై నవ్వే వప్పు డెందువోతివి ॥మంచి॥ 521

## సామంతం

ఇట్టుండవలదా ఇద్దరివలపులు
దట్టమాయ రతితమకము లిపుడు ॥పల్లవి॥

కల గని రమణుఁడు కాంతకుఁ జెప్పఁగ
కిలకిలనవ్వీఁ గదు నాకె
తలకొని యందేమి తగులంగ నాడెనో
కలుగఁబోలు విదె కంటిమి సిగ్గు ॥ఇట్టు॥

పొద్దు వోకకత పొలిఁతికిఁ జెప్పఁగ
అద్దలించె మరి యాతవిని
వుద్దండా లందులో నున్నవి యేఁటివో
కద్దుగాఁబోలును కంటిమి సిగ్గు ॥ఇట్టు॥

వరుసతో నీతఁడు వావులు చెప్పఁగ
వొరసి గోరఁ జెలి యూఁదె విదె
సిరులఁ గూడె నీశ్రీవేంకటేశుఁడు
కరఁగఁబోలును కంటిమి సిగ్గు ॥ఇట్టు॥ 522

రేకు 1488 ఆహిరినాట

ఏమేమి నీవు సేసినా నితవే నాకు
గామిడితనాన నిన్నుఁ గాదుగూడ దవను ॥పల్లవి॥

వొద్ద నీవ్వెతెఁ బెట్టుకున్నా సంతోసముగావి
గద్దించి నీమీఁద మతి గలఁగదు
పొద్దున రాకుండితేను బుద్దులు చెప్పుదుఁగావి
అద్దపుమోము చిన్నఁబో దందుకల్లా నాకును ॥ఏమే॥

నీ వెందు వలచినా నేమ సమ్మతింతుఁగావి
ఆవలిచెలులతోఁడ నాడుకో నేను
చేవమీర నేడసుద్ది చెప్పినా నవ్వుదుఁగావి
వేవేలైనా నిన్ను వెంగెముగాఁ జూడను ॥ఏమే॥

వొక్కటెసొమ్ములు నీమైనుంటేఁ బొగడుదుఁగావి
గక్కన నేనెంతైనాఁ గాఁతాళించను
చిక్కి పుశ్రీవేంకటేశ నే నలమేలుమంగను
మక్కువ నన్నేలితివి మఱవ నే నిఁకను ॥ఏమే॥ 523

సామంతం

చిత్తమెట్టో యెఱఁగను చెలువుఁడ నే నీకు
మెత్తనిమనసుదాన మిక్కిలి మోహింతును ॥పల్లవి॥

వెలి నెవ్వతైనా నిన్ను వెంగెమాడి నవ్వఁగావి
పొలసి నేనైతే నిన్నుఁ బొగడుదును
పొలయలుకఁ గొందరు పొంచి నిన్నేలయింతురు
కలఇకలనే వూడిగము సేతు నీకును ॥చిత్త॥

కాతరించినది నిన్నుఁ గన్నుల జంకించుఁగావి
చేతులెత్తి మొక్కుదును చేరి నేనైతే
యేతరివాఁడ్లు నిన్ను యెందుకైనాఁ బిలుతురు
యీతల నిల్లాలనై నీఇంట నే నుండుదును ॥చిత్త॥

చలమరైన దొకతె సాదించుఁగావి నిన్ను
పిలిచి ప్రియము సేతుఁ బ్రేమ నేనైతే
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అలర నేలితివి నిన్నన్నిటా నే మెత్తును ॥చిత్త॥ 524

పాడి

నామన సేమిచూచేరే వదుమ నోచెలులాల
ఆముకొని నావిభువిఆత్మలో నుందానను ॥ పల్లవి ॥

ప్రేమముగలవనిత ప్రియములు చెప్పఁగాక
యేమైనా రమణుని కెదురాడునా
కామించి వచ్చినది కడుఁబత్తిసేసుఁగాక
సామాన్యపుఁబనులకు సాదించునా ॥ నామ ॥

తగుచుట్టమైవది తలఁపులో వచ్చుఁగాక
వెగటుగా నడచిన వేసారునా
నగ వెరిఁగినది మిన్నక ఇయ్యకొనుఁగాక
యెగసక్కెమాడినా యీసడించునా ॥ నామ ॥

కడువితపరై తేను కాఁగిటఁ జొక్కించుఁగాక
యెడసినతప్పులెల్లా నెంచుకొనునా
బడి నలమేల్మంగను పతి శ్రీవేంకటేశుఁడు
తడయక నన్నేలేవింతటి గోరకుండు(దుః)నా ॥ నామ ॥ 525

ఆహిరి

విరహమే తోఁచదు విభుఁడ నీతో నాకు
మరిగినయిటువంటిమరు లెటువంటివో ॥ పల్లవి ॥

తక్కక యేపొద్దు నాకుఁ దగులై వుందువుగన
పక్కనున్నట్టే వుందువు పాసివున్నాను
అక్కరతో ముచ్చటాడే అలవాటు గద్దుగన
వొక్కటైమాటాడినట్టేవుందు వూరకుండినాను ॥ విర ॥

కాచు కెప్పుడు మోమునఁ గట్టినట్టుందువుగన
చూచినట్టుందువు నీవు చూడకున్నాను
యేచి కలలోనా నీవే యెనసివుందువుగవ
యీచొప్పే మతిలో నుందు యే పరాకైనాను ॥ విర ॥

యెలమి నా ఇంటిలోనే ఇరవై వుండువుగవ
తలఁపులోనే వుందువు దండ వున్నాను
అలరి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
అలముకుందువు నీ వరుదై వున్నాను ॥ విర ॥ 526

## వరాళి

తానేల సిగ్గువడీనే తడవ నేను
పూని తన్ను దేవరఁగాఁ బూజింతు నేను ॥ పల్లవి ॥

అలసివచ్చినవాని కటు విసరుదుఁగాని
అలరి యాపనులెల్లా నడుగ నేను
చెలపచెమటలెల్లా చేతనే తుడుతుఁగాని
జలకమాడి రమ్మని సాదించ నేను ॥ తానే ॥

నిదుర కన్నుల నుంటే నేఁ బాదాలొత్తుదుఁగాని
చెదరుచు యెలుకలు సేసుకో నేను
పెదవులు వాడితే దప్పికి విడెమిత్తుఁగాని
పొదిగి మొగము చిన్నఁబుచ్చుకొన నేను ॥ తానే ॥

చిత్తజచిహ్నాలు చూచి చేరి కాఁగిలింతుఁగాని
వొత్తి యాడవని మరీ నొరయ నేను
హత్తెను శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
కొత్తలుగా నేలె వీఁక కొసర నేను ॥ తానే ॥ 527

ముఖారి

ప్రియములు చెప్పఁగాను బిగియనేల
రయమున లోనికి రమ్మనవే నీవు ॥ పల్లవి ॥

వలచినదానికి వాసు లెంచుకోఁదగదు
చెలిమిగలదానికి చింత వలదు
కలసినయిల్లాలికి కాదుగూడదనరాదు
పిలువవే నీమగనిఁ బేరుకొని యిపుడు ॥ ప్రియ ॥

పాయలేనిదానికి పంతాలకుఁ బనిలేదు
పాయపుదానికి నెగ్గుపట్టనేఁటికి
చాయకత్తైనదానికి సాదించి పోరఁగూడదు
చేయివట్టి తియ్యఁగదే చెనకి యీతనిని ॥ ప్రియ ॥

చుట్టమైనదానికి సోదించి చూడఁగరాదు
గుట్టెరిఁగినదానికి గుంపించనేల
ఇట్టె శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనె
ముట్టి కాఁగిలించుకోవే ముదమందిఁ దాను ॥ ప్రియ ॥ 528

రేకు 2489 సాళంగనాట

ఏమయ్యా నీతో నాకు నెంతమందెమేళము
నీమోము చూచుకుండుటే విధానముగాదా ॥ పల్లవి ॥

చనవిచ్చితివంటాను జాణతనాలాడేదా
వినయముతో నీమాట వినుటగాక
చెనకితివంటాను చేతులు పైఁజాఁచేదా
మనసెరిఁగి మొక్కుటే మంచిదిగాక ॥ ఏమ ॥

కై దండ వట్టితివంటాఁ గాళ్ల విన్నుఁ దొక్కేదా
ఆదెస నీదయగ త్తె నయ్యీఁగాక
సొదవంటాఁ బొగడితే చన్నులు దాఁకించేదా
పోదితో గర్వములేక పొదుగుటగాక ॥ ఏమ ॥

కలసితివంటా బింకముతోడఁ బెనఁగేదా
మెలుపునీరతులకు మెచ్చుటగాక
అలమేల్మంగను నేను అట్టె శ్రీవేంకటేశ్వర
తలఁపులో మెలఁగుటే తగవుగాక ॥ ఏమ ॥ 529

## దేసాళం

చెలులభాగ్య మాతవిచి త్తముగాక
తలకొని [1] యాఁకారఁ దమకేఁటికి ॥ పల్లవి ॥

పెక్కుసతులమగఁడు ప్రేమ వొకతెపైనుంటే
తక్కినకాంత అడుగఁ దమకేఁటికి
చిక్కనిచెమటమేనఁ జిప్పిలఁగ దొరకొంటే
తక్కరతనాల నవ్వఁ దమకేఁటికి ॥ చెలు ॥

మనసుపెట్టినవాఁడు మాటొకతెతో నాడితే
తనువులఁ గాఁకరేఁగఁ దమకేఁటికి
కమ్మఁగొని యాతనికాంక్షలు దీరకుంటే
తనియఁడంటా దూరఁ దమకేఁటికి ॥ చెలు ॥

కడువేడుక్కె(కై ?)నవాఁడు కాఁగి లొకతె కిచ్చితే
తడఁబడి పైకొనఁ దమకేఁటికి
పడఁతెలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడు
తడయ కేలితే సిగ్గు దమకేఁటికి ॥ చెలు ॥ 530

1. 'ఏఁకారు' కు వ్యావహారికము గాఁబోలు

తెలుఁగుఁగాంబోది

ఎంత చెప్పుదును మోహ మీతనిమీఁద
చింతించఁజాల నే కక్కసించినట్టౌనను చు ॥ పల్లవి ॥

కడుసింగారపుమేను కసుగందునోయని
జడిసి తప్పకచూడఁజాలనే నేను
యెడయక తనసుద్దు లెవ్వతె విసీనోయని
నుడుగఁగఁజాలనే నోరెత్తి నేను ॥ ఎంత ॥

నెమ్మది విందుమనసు నీరై కరఁగునోయని
సమ్మతిఁ జన్నుల నొత్తఁజాలనే నేను
కమ్మటి వలలఁబెట్టి కదిమినట్టౌనోయని
చిమ్ముచు నవ్వఁజాలనే నెలవుల నేను ॥ ఎంత ॥

చినుకురతిఁ జెమట చిమ్మి రేఁగునోయని
పెనఁగఁగఁజాలనే బెట్టుగా నేను
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
తనివొందించఁజాలనే తమితోడ నేను ॥ ఎంత ॥ 531

సామంతం

ఓయమ్మ నేనెంతదాన నూడిగము సేసేఁగాక
పాయనివోసకులాల పతితో మీరవరే ॥ పల్లవి ॥

వెక్కసమై తనకు నే విన్నపాలు సేసుకోఁగా
యెక్కడ నుండునో చిత్త మేమిసేతునే
చక్కనితనరూపము సారెఁ జూడఁగా నెవ్వతె-
దిక్కు చూచునో రెంట దెప్పరమైవుండఁగా ॥ ఓయ ॥

యేకతానకువచ్చి నే నింపులువుట్టించేనంటే
యేకాంతను రమ్మన్నాఁడో యెఱఁగఁగదే
చేకాను కిచ్చితేను చెలికై దండ వదలి
పైకొవి నిమ్మపండ్లభార మానవలెఁగా ॥ ఓయ ॥

కమసన్నలనే వచ్చి కాఁగిలించుకొనేనంటే
పెనఁగేటిరతులలో ప్రియ మెట్టిదో
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చనవిచ్చినాఁడు తానే సంతోసించవలెఁగా ॥ ఓయ ॥ 532

## ఆహిరి

వెలఁది యిట్టుండితేను విభునిచిత్తము వచ్చు
బలవంతకోలై తే పలుక నేమున్నది ॥ పల్లవి ॥

పతి పరాకైవుండితే పైపై నెచ్చరించవలె
మితితో సన్న యెఱఁగి మెలఁగవలె
యితవైనమాటలాడి యింపుల మెప్పించవలె
తతితోఁ గొలువుసేసి దండ నుండవలెను ॥ వెలఁ ॥

మొగమెత్తి చూచితే మోహము చల్లఁగవలె
నగితేఁ గమ్మటి మారు నగవలె
బిగువుఁజన్ను లంటితేఁ బ్రియపడి వుండవలె
జిగిఁ జెనకితే గట్టుచేసుకోవలెను ॥ వెలఁ ॥

వేడుకతో మన్నించితే వినయము చూపవలె
జోడై యేకతాన రతిఁ జొక్కించవలె
యీడనె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కూడితి మిందరి కివే గుణాలు గావలెను ॥ వెలఁ ॥ 533

బౌళి

తగిలి నాచేఁతలలో తప్పులు లోఁగొనవయ్య
మొగిచినచేతులతో మొక్కేను నీకును ॥ పల్లవి ॥

శిరసు మజ్జనమార్చి విరులు నే ముడువఁగా
అరిది నాగోరేదనం టెనో విన్ను
గరిమ నీమేన నిండా కస్తూరి నేఁ బూయఁగాను
వొరసి నాగుబ్బ లెంత వొత్తెనో విన్ను ॥ తగి ॥

మిక్కుటపుసొమ్ములు నీమేన నిండాఁబెట్టఁగాను
[1]చెక్కుల నాచెమ టెంత చిందెనో నీపై
అక్కరతో విడెమిచ్చి అంద నిలుచుండఁగాను
గక్కన నానీద యెంత గప్పెనో నీపైని ॥ తగి ॥

గాఁటపునీరతుల నేఁ గాఁగిలించి కూడఁగాను
సూటి నానిట్టూర్పు లెంత సోఁకెనో నేఁడు
యీటున శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
ఆటించి నావల పెంత తగిలెనో నేఁడు ॥ తగి ॥ 534

రేకు 1490 ముఖారి

బాపుబాపు నీవంటిపతికి విల్లాలనైతి
నీపై వలపే నాకు నిచ్చకల్యాణము ॥ పల్లవి ॥

యెంత నోమునోఁచెనో యీచనుఁగొండలు, నేఁడు
వంతుల నీకరపల్లవములు మించె
వింత లెట్టిభాగ్యము గావించెనో చెక్కుటద్దాలు
పొంత నీరూపమునీడ పొలయఁగలిగెను ॥ బాపు ॥

1. 'నాచెక్కుల చెమట' అనుట సహజము.

యేమి దపము చేసెనో యీకన్నుఁగలువలు
నీముఖచంద్రునిపొందు నెమ్మిఁ గలిగె
కామించి యేమిపుణ్యమో కందువ నామోవిపండు
వోముచు నీమూర్తికి నుపారమాయ ॥ బాపు ॥

యెన్నటితగులాయమో యీబాహులతలకు
వన్నె నీరతిచెమటవాన గలిగె
అన్నిటా శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
కన్నెనాటనుండి నీతోకాఁపురము గలిగె ॥ బాపు ॥ 535

భైరవి

ఏమని పొగడుదు నీ విట్టివాఁడవు
కామినులపాలిటికి కల్పవృక్షమైతివి ॥ పల్లవి ॥

మగువలు యేమాడినా మనసే కలఁగునా
తగునీగుణము సముద్రమువంటిది
సొగిసి యెంత సోదించి చూచినాఁ గానవచ్చునా
మిగులా నీమన సిట్టె మిన్నునేలవంటిది ॥ ఏమ ॥

కిమ్మల నెవ్వతె విన్ను కివిసినాఁ జెదరునా
నమ్మిననీదయ నిధానమువంటిది
నెమ్మి యెంతగలిగినా నెట్టనఁ జంచలించునా
పమ్మిననీమన్నన పైఁడికుండవంటిది ॥ ఏమ ॥

చిక్కించు కెవ్వరు నిన్ను చెందినా మొగచాటౌనా
తక్కక నీరతి యమృతమువంటిది
ఇక్కడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మిక్కిలి నన్నేలితివి మేలుగలవాఁడవు ॥ ఏమ ॥ 536

సామంతం

నిలుచున్నాఁ డదె నీయెదుటా
విలువునఁ గాఁగిట వించఁగదే ॥ పల్లవి ॥

చలమునఁ బతి విటు సాదించకువే
బలిమి చూపి కదుఁబదరకువే
వెలిఁబడ సణఁగులు వెదచల్లకువే
నెలకొని యెమ్మెలు నెరపకువే ॥ నిలు ॥

పంతము లీగతిఁ బచరించకువే
కొంతపుఁజూపులఁ గొసరకువే
దొంతరబీరాలు తొరలించకువే
చెంతల నూరక చెనకకువే ॥ నిలు ॥

యెదుటనుండి బయలీఁదిఁచకువే
పెదవుల గొణఁగుచు బిగియకువే
యిదివో శ్రీవేంకటేశుఁడు నన్నేలె
అదన రతుల నీ వలయకువే ॥ నిలు ॥ 537

ఆహిరి

మరునిబలాలమీఁద మనకేల వైరము
పరగఁ గూడినమీఁద పగ యెంచఁదగదు ॥ పల్లవి ॥

తుమ్మెదలఁ బోల్చితే తొయ్యలికొప్పు నెరులు
తెమ్మలుగా పువుటమ్ములతేనెలు దాగు
తమ్మిరేకులఁ బోలుచఁదగు కాంతకన్నులు
నెమ్మి నావేళఁ జంద్రుఁడు నిలువరా దెదుట ॥ మరు ॥

ధరఁ గొండలఁ బోల్చితే తరుణి చన్నుఁగవ నేఁ—
డిరవై గాలి మెలఁగ నెడమియ్యదు
కరికుంభాల చెలిపిరుఁదు వోలిచితేను
సరిఁ జెఱకువిల్లని చప్పరించును ॥ మరు ॥

అతివను బంగారుబొమ్మవి తగఁబోల్చితేను
ఇతవై మన్మథకళ లీపెనే చేరు
ఇతఁడు శ్రీవేంకటేశుఁ డీలేమ యలమేల్మంగ
మతి నిద్దరిఁబోలితే మదనుని గెల్తురు ॥ మరు ॥ 538

గౌళ

చక్కనివాఁడ వన్నిటా జాణవు నీవు
యిక్కడ నాసంతోస మెంతనఁగవచ్చును ॥ పల్లవి ॥

కన్నుల నన్నుఁజూచితే కాఁగిలించినట్టవును
సన్న సేసితే వలపు చల్లినట్టౌను
చిన్ని నవ్వు నవ్వితేను సేసవెట్టి నట్టౌను
విన్నవించ నెట్టువచ్చు వేడుక నాలోనిది ॥ చక్క ॥

సారె మాటాడితే మోవి చవిగొవినట్టౌను
చేరితేనే మేలెల్లా వచ్చినయట్టౌను
నేరుపుతోఁ జెనకితే నెమ్మిఁబెండ్లాడినట్టౌను
పేరుకొన నెట్టువచ్చు ప్రియములు నాకు ॥ చక్క ॥

మతి నీవు దలఁచితే మర్మము సోఁకినట్టౌను
రతిఁ గూడితేను కరఁగినట్టౌను
యితవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
తతిఁ బాయకుండితేను దక్కినట్టౌను ॥ చక ॥ 539

సాళంగం

నావోజలే రమణుఁడ నన్ను నింతసేసీఁగాక
నీవొళ్ల నేమైనాను నేరములు గలవా ॥ పల్లవి ॥

హత్తి నీతో నే మాటలాడ సిగ్గువడితేను
చిత్తములో తమకము చిమ్మిరేఁచీని
మొత్తానఁ గూరిమిదాఁచి మోమువంచుకొంటేను
యెత్తించీఁ గమ్మటిఁ దామే ఇవివో నాయాసలు ॥ నావో ॥

అడఁకువతో నే నాయగ్గలిక మాన్పుకొంటే
నడుమ నావేడుకలు నవ్వించీని
బడినుండే నామనను వరాకుసేసుకుంటే
బెడిదపుజవ్వనము పెదరేఁచీని ॥ నావో ॥

కదిసి నే వినయానఁ గాఁగిలించుకుందితేను
యిదె నామైమఱపులు యెనయించీని
అదన శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
పొదిగి నా పొందులే బోదించీవి ॥ నావో ॥ 540

రేకు 1491 మాళవిగౌళ

ఇట్టుండవద్దా పతికి నీడుజోడై నవవిత
మట్టుమీర దెంతైనా సమ్మతి నుండుఁగాని ॥ పల్లవి ॥

వలచినకామిని వాసివంతు లెంచదు
చెలరేఁగి చెప్పినట్టు సేసుఁగాని
తలఁపులో మెలఁగేది తవగర్వము చూపదు
నెలకొన్నప్రియములే వించుఁగాని ॥ ఇట్టు ॥

మరిగిన దెప్పుడును మనసు విరుచుకోదు
తరితీపు దప్పకుండా తగులుఁగావి
సరిఁ బొందుజరపేది సణఁగులు రాల్చదు
కరఁగమాటాడి అలుకలు దేర్చుఁగావి ॥ ఇట్టు ॥

కలపుకోలైనది కడువేసరించదు
పొలసి రతిఁ జవులు పుట్టించుఁగావి
అలమేలుమంగ గూడె నదె శ్రీవేంకటేశ్వరుఁ—
దెలిపి తెలిపి రతిఁ దేలించుఁగావి ॥ ఇట్టు ॥ 541

## పాడి

ఇతవే నెరపవలె యీరీతి నీవలె
మితిలేనినీగుణాలు మెచ్చితినే చెలియా ॥ పల్లవి ॥

నెపములు వేయరాదు నేరుపరిపతిమీఁద
వుపమించి యాడరాదు వొడ్డుకోరాదు
కపురులు చూపరాదు కాఁక వచరించరాదు
యెపుడూ సాదించరాదు ఇల్లాలికి ॥ ఇత ॥

మనసు నొప్పించరాదు మరి మారుకోరాదు
గునియరా దలయించి కొసరరాదు
చనవున మీరరాదు సవతులఁ దిట్టరాదు
తనుఁ బొగడుకోరా దుత్తమురాలికి ॥ ఇత ॥

తగ వడుగఁగరాదు తారుకాణఁ బెట్టరాదు
పగటు మెరయరాదు పదరరాదు
తగు నలమేల్మంగ వాతఁడు శ్రీవేంకటేశుఁడు
మగఁడాయ నీవంటిమంచిప్రియురాలికి ॥ ఇత ॥ 542

## శ్రీరాగం

ఎటువంటివేడుకలో యెదలోనే గుబ్బతిలీ
కుటిలకుంతలినేర్పు కొనసాగినయ్యా ॥ పల్లవి ॥

చెలఁగి తప్పకచూచు సిగ్గుతోఁ దలవంచు
తలఁపులో నీరూపు దలపోసును
నెలవులనే నవ్వు చెలికిఁ బ్రియముచెప్పు
కలికిభావము చెప్పఁ గతలాయనయ్యా ॥ ఎటు ॥

కోరును మనోరథాలు గుట్టుతోడనే కరఁగు
సారె నేకాంతాన నుండు సంతోసించును
చేరి మాటాడ నూహించు చెమరించు మేనెల్లా
నీరజాక్షిచందములు నీవే యెంచుకోవయ్యా ॥ ఎటు ॥

పవళించు పానుపుపై భావరతి నోలలాడు
కవగూడి నీవు రాఁగాఁ గడుమెచ్చును
ఇవల శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
జవరాలికూటములు పంగతేయనయ్యా ॥ ఎటు ॥ 543

## సామంతం

తానే వచ్చీఁగాక తరవులు వెట్టనేల
కానుకలు మీచేనంపి కక్కసించవలెనా ॥ పల్లవి ॥

తలఁపులఁ బారితేనే తనువులు సోఁకినట్టు
అలయించి యతనిమే నంటవలెనా
చెలిమిసేసితేనే చేతికిలోనైనట్టు
చెలులచే రమ్మని చెప్పించవలెనా ॥ తానే ॥

కమ్మి సుద్దులు వింటేనే కాఁగిలించుకొన్నట్టు
సమ్మతిచేసి చేతులు చాఁచవలెనా
పిమ్మటఁ బేరుకొంటేనే ప్రేమఁ దవిపైనట్టు
రమ్మని పిలిపించి రతిసేయవలెనా ॥తానే॥

యీడకు విచ్చేసితేనే యెదవాయకుండినట్టు
జోడై యుండ నొడఁబఱచుకోవలెనా
కూడె శ్రీవేంకటేశుఁ డిక్కడ నలమేల్మంగను
జాడతోడ తనమోవి చవిచూపవలెనా ॥తానే॥ 544

## నాదరామక్రియ

విభునిఁ దోడుకవచ్చే వెస నన్ని మంచివయ్యా
యిభయావకుఁ జేయరే యిట్టే వుపచారాలు ॥పల్లవి॥

వెలఁదికిఁ జందురుఁ డీవేళఁ జుట్టమవుఁగాని
కలువలు కొప్పున గక్కన వించరే
కలపుకోలున చల్లగాలి మన్నించుఁగాని
మలయజ మలఁదరే మందుగాను మేనను ॥విభు॥

ముద్దియకుఁ దాపరవి మొకమోడి వుండుఁగాని
వొద్దికఁ దామరపైఁ గూచుండఁబెట్టరే
గద్దరివసంతునకుఁ గడువిచ్చకమౌఁగాని
పొద్దువొద్దునకు పైపైఁ బుప్పొడి చల్లరే ॥విభు॥

పన్నుకొవి మేఘానకుఁ బరిణామ మవుఁగాని
చిన్ననెమ్మళ్లవా(వ్రా?)సినచీర గట్టరే
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డీకె యలమేలుమంగ
యిన్నిటా విచ్చేసికూడె యింటనే వున్నాఁడు ॥విభు॥ 545

బౌళి

వట్టిపెనఁగులాటల వలపు చవులు గాదు
 గుట్టుతో మెలఁగితేను గుణములు హెచ్చును ॥ పల్లవి ॥

మనసు లెనసితేను మాటలు ప్రియములౌను
 ననుపు గలిగితేను నమ్మికలౌను
 చనవులు సతమైతే సరసము లింపౌను
 వినయాలు చూపితేను వేడుకౌను పొందులు ॥ వట్టి ॥

సిగ్గువడ నేరిచితే చేఁతలు తరితీపౌను
 యెగ్గులెల్లా మానితేను ఇతవౌఁ బొందు
 వెగ్గళించి పొగడితే విభావాలు చెలరేఁగు
 వొగ్గి వేఁడుకొంచేను వుల్లములు గరఁగు ॥ వట్టి ॥

తలపోఁత లౌనరితే తమకము గడురేఁగు
 నెలకొన నవ్వులను విఁ(విం?)డు ముదము
 యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
 కలసితి మిద్దరముఁ గలుగుఁ జనవులు ॥ వట్టి ॥ 546

రేకు 1492 ముఖారి

అన్నిగుణాలను నీవే అధికుఁడవు
 కన్నె విన్నుఁ బొగడుతా కడుసంతోసించెను ॥ పల్లవి ॥

మొగమోటగలవాఁడు మోనాన నూరకుండు
 తగవెరిఁగినవాఁడు దయదలఁచు
 నగవెరిఁగినవాఁడు నంటునను నమ్మతించు
 తగులమిగలవాఁడు దండఁ బాయకుండును ॥ అన్ని ॥

వలచినవాఁడు కైవసమై మచ్చికసేసు
తలఁపొక్కటైనవాఁడు దాఁటఁడు మాట
నిలుకడైనవాఁడు నెట్టుకొని పొందుసేసు
పలుకనేర్చినవాఁడు పచరించుఁ గూరిమి ॥ అన్ని ॥

సన్నయెరిఁగినవాఁడు సరసుఁడై మెలఁగును
మన్నించనోపినవాఁడు మర్మములంటు
ఇన్నిటా శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
పన్నికూడితివి నీపంతము లీడేరెను ॥ అన్ని ॥ 547

## పాడి

కదలేనిపరాకులు గలవాఁడవు
జడియ కెప్పుడును మాచనవు చేకొనుమీ ॥ పల్లవి ॥

చేపట్టి యెప్పుడును చిత్తాన మఱవకుమీ
ఆపె నీకు నాచేఁ జెప్పియంపినమాట
చూపట్టివున్నది శిరసున ముడుచుకొనుమీ
మాపటంత వేసినకమ్మనితమ్మిపూవు ॥ కద ॥

చెలరేఁగి నీయరచేతనే పట్టుకుండుమీ
నిలిచి కానుకిచ్చిననిమ్మపండు
పలుమారు కన్నులను భావించి చూడుమీ
వలనుగా సురటిపైవా(వ్రా?)సినచెలిరూపు ॥ కద ॥

చక్కఁగా తరితీపుతో చవిసేసుకొనుమీ
మొక్కుతాఁ జూపినయట్టిమోవిపండు
అక్కన శ్రీవేంకటేశ అలమేలుమంగ గూడె
తక్కక యేపొద్దును దయ నేలుకొనుమీ ॥ కద ॥ 548

ఆహిరి

తానే యెఱుఁగుఁగాక తలవాతిపనులు
పూవిపట్టి తనునెట్టు బోదించవచ్చునే ॥ పల్లవి ॥

పట్టరానిది వయసు పంచరానిది వలపు
కట్టిపెట్టరానివి కనుచూపులు
మెట్టరానిది మనసు మీరరానివి వాసులు
యెట్టునేసినా విభుని నేమని సొలతునే ॥ తానే ॥

చెప్పఁగరానిది సిగ్గు సేయరానిది నగవు
కప్పిపెట్టరానివి చక్కఁదనములు
తిప్పరానిది గుణము తెంచరానిది కోరికె
అప్పటి నీతనిఁ గాదన నెట్టువచ్చునే ॥ తానే ॥

తనియరానిది రతి దాఁటరానిది పొందు
మొనసి మానరానిది మొగమోటము
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చనవిచ్చెఁ దను నెట్టు సాదించవచ్చునే ॥ తానే ॥ 549

దేసాళం

MP3

రమణుఁడు పిలిచీని రావే చెలియ నీవు
తమకమే వలెఁగాక తరుణులకు ॥ పల్లవి ॥

తలఁపుకొలఁది మంచితనమే వలెఁగాక
చలపాదితనమేల సరసులకు
వెలలేనిమాటల వినయమే వలెఁగాక
సొలపువెంగెములేల సుగుణలకు ॥ రమ॥

కాంబోది

కోటిసేయ వలపులు కుమ్మరించవలెఁగాక
నీటుతో గర్వములేల నేర్పరులకు
మేటిసరసములాడి మెఱయఁగవలెఁగాక
జూటుఁదనములేఁటికి సొంపుదొరలకును ॥ రమ ॥

నయగారితనమున నవ్వు నవ్వవలెఁగాక
రయమున దాఁగనేల రసికులకు
నియతి నన్నేలినాఁడు నేఁడు శ్రీవేంకటేశుఁడు
క్రియతో వేసరనేల కిమ్ముల దేవుళ్లకు ॥రమ॥ 550

పాడి

ఇన్నిటా జాణలైనవా రెరుఁగుదు రీయింపు
చెన్నుగా దైవము తొల్లె సేసిన దీయింపు ॥ పల్లవి ॥

వేసగికాలమునాఁటివెన్నెల లింపు
సేసలువెట్టేయప్పటి సిగ్గు లింపు
వేసరక అత్తవారివిందులు యింపు
మోసపోనియట్టిరతి మోవితేనె లింపు ॥ ఇన్ని ॥

అట్టే వసంతపుచల్లులాట లింపు
జట్టిగొన్నప్పటిసరసము లింపు
వెట్టదీర దప్పికి పీదెము లింపు
గుట్టుతో నుండేయప్పటికొసరులే ఇంపు ॥ ఇన్ని ॥

కడుఁజెమటకు చల్లగాలి యింపు
గుడిగొన్న కాఁగిటికి కూటము లింపు
అదరి శ్రీవేంకటేశ అలమేల్మంగకు నీకు
నొడఁబాటుమాటల వుచితము లింపు ॥ ఇన్ని ॥ 551

mp3

నాదరామక్రియ

ఈకెకు నీకుఁ దగు నీడుజోడులు
వాకుచ్చి మిమ్ముఁ బొగడవసమా యొరులకు ॥పల్లవి॥

జట్టిగొన్న నీదేవులు చంద్రముఖిగనక
అట్టె నిన్నురామచంద్రుఁ డనఁదగును
చుట్టమై కృష్ణవర్ణపుచూపులయాపెగనక
చుట్టుకొని నిన్ను కృష్ణుఁడవనఁదగును ॥ఈకె॥

చందమైనవామలోచన యాపెయౌఁగనక
అందరు నిన్ను వామనుఁ డనఁదగును
చెంది యాకె యప్పటిని సింహమధ్యఁగనక
అంది నిన్ను నరసింహుఁడని పిల్వఁదగును ॥ఈకె॥

చెలువమైనయాపె శ్రీదేవి యగుఁగనక
అల శ్రీవత్సుఁడవని యాడఁదగును
అలమేల్మంగ యహిరోమాళిగలదిగన
యిల శేషాద్రి శ్రీవేంకటేశుఁ డనఁదగును ॥ఈకె॥ 552

రేకు 1493 ఆహిరి

చిత్తగింతువు రావయ్య చెలియబాగులు నేఁడు
ఇత్తల విన్నవించ నే నెంతదానను ॥పల్లవి॥

వలిపపయ్యెదలోవివ్రటువచనుగుబ్బలు
తొలుత నీకాఁగిలి కెదురుచూచేయట్టున్నవి
తిలకించి(చ?) నీదేవులతేనెలయధరములు
చెలఁగి నీకు విందులుచెప్పేయట్టున్నవి ॥చిత్త॥

వెక్కసపుఁదళుకులవెడదకన్నులచూపు
మిక్కిలి నిన్నుఁ బూజించ మీఁదెత్తినట్టున్నది
తక్కక ఇంతిచేతులు తలఁబాలు వోయ నీపై -
నుక్కుమీర సూత్రవెట్టి వొడ్డినట్టున్నవి ॥ చిత్త ॥

నెమ్మది శ్రీవేంకటేశ నీ కలమేల్మంగమేను
కమ్మి నీమెడఁ దాళిగాఁ గట్టేయట్టున్నది
పమ్మి నీవే దయఁజూచి పడఁతిఁ గూడితి విట్టె
వుమ్మడి నీకు నీపె వొసరినట్టున్నది ॥ చిత్త ॥ 553

## ముఖారి

గుట్టుసేసుకున్నాఁడవు కోరి యేఁదరిమఁదర
తొట్టెనో వేడుకలెల్లా దొరవై వున్నాఁడవు ॥ పల్లవి ॥

[1] అతివఁ జూచినచూపు అచ్చొత్తినట్ల నీ -
మతిలో నున్నదో మాటలాడవు
తతి నాకెమాటలు తఱవై నీచెవులలోఁ
బతినాదా లిచ్చీనో పరాకైతివి ॥ గుట్టు ॥

అంగనమోవితేనెలఅన్ను వట్టెనో నీకు
వుంగిటిగొన్నట్టు వూరకున్నాఁడవు
సంగడి నాపెమైతావి సారె వాసవవచ్చెనో
అంగవించి యందే వోలలాడుతానున్నాఁడవు ॥ గుట్టు ॥

అలమేలుమంగరతు లట్టె మరిగితివో
వెలయుచు విలువున వెరగందేవు
అలరి శ్రీవేంకటేశ ఆకె నిన్ను బోదించెనో
తలఁచి వన్నుఁగూడి తమకించేవు ॥ గుట్టు ॥ 554

1. అరసున్న ప్రామాదికము కావచ్చు. "అతివచూచినచూపు" అనియుండదగు.

### కాంబోది

[1]ఉపచరించఁగరావా వువిద గదువలనె
నెపమున వురుటెల్ల నెరపీ నీమీఁదను ॥ పల్లవి ॥

నలినాక్షి గరిడిలో నంటునఁ గేళినేసె
మలసి చెక్కులను చెమటగారఁగా
వల పందులోనె చల్లి వాసనగుబ్బలు మోఁపి
నలువంక నీకు నభినయము చూపీని ॥ ఉప ॥

తెరమఱఁగున వచ్చి దేశికుద్ధాంగములను
సరవి నాడి చూపులు వళపుచును
తిరుపుగొని కమ్మటి తీగెచేతు లటు చాఁచి
పరగ నంగరంగవైభవము మెరసీని ॥ ఉప ॥

పదములఁ జిందుజక్కిణి బహుతాళమానముల-
విదె నాట్యమున విమ్న వింతి మెప్పించె
ఆదవ శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు
గదిసి చూడఁగా మతిగరఁగించీవి ॥ ఉప ॥ 555

### వేళావళి

ఏల తమకించేవయ్యా ఇంతలో నీవు
మేలిమిసగివములు మించీని యెదుటను ॥ పల్లవి ॥

అలులఁ జూడవయ్యా అంగనతురుముమూరు
చెలఁగి యద్దాలఁ జూడు చెక్కులమారు
అల చందురునిఁ జూడు మాకె మొగముమారు
అలుకదేరె; నాకె నీయందకు వచ్చీవి ॥ ఏల ॥

---
1. ఇందు నాట్యసంకేతము లెక్కువ.

చిగురులు చూడవయ్య చెలియధరముమారు
తగులతలఁ జూడు హస్తములమారు
సొగిసి జక్కవలనుఁ జూడు కుచములమారు
మగువ తెరదీసి నెమ్మది విన్నుఁ గూడీవి ॥ఏల॥

హత్తి తామరలఁ జూడు మమరుఁబాదాలమారు
పుత్తడిబొమ్మఁ జూడు పొలిఁతిమారు
ఇత్తల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
బత్తితోఁ గలనె వింకఁ బాయకవుండీవి ॥ఏల॥ 556

## పాడి

ఎఱఁగినజాణలది ఇట్టిమోహము
మఱవరా దాలికి మగనికి మోహము ॥పల్లవి॥

వినయము చేసితేను వెగ్గళించు మోహము
నసుపు చక్కనయితే నాటు మోహము
మొనసినమాటలైతే యీదేరు మోహము
మనసురా మెలఁగితే మానసీదు మోహము ॥ఎఱఁ॥

యేపొద్దుఁ గాచుకుండితే యిరవౌను మోహము
యేపుమీరి పైకొంటే ఇంపు మోహము
కోప మెందు లేకుండితే కొనసాగు మోహము
చూపు నెట్టుకోఁ జూచితే సులభమౌ మోహము ॥ఎఱఁ॥

ఇచ్చకమే నెరపితే వియ్యకోలౌ మోహము
నిచ్చకొత్తగాఁ గూడితే విందు మోహము
వచ్చి శ్రీవేంకటేశుఁడే వదలక నన్ను నేలె
తచ్చితచ్చి కొసరితే తగులౌను మోహము ॥ఎఱఁ॥ 557

బౌళి

వారిబత్తి ఇయ్యకొనవలెఁగాక
యేరీతినైనా మేరే యేమిసేయవచ్చును ॥ పల్లవి ॥

యెలమి నీ వాడానీడా నెందరిఁ బెండ్లాడినాను
చలమరిదాననా సాదించ నేను
కలరు నీకుఁ జుట్టాలు కామినులు యెందరైనా
యెలయింతు రందుకు నీ కేమిసేయవచ్చును ॥ వారి ॥

బెరసి యెవ్వతె వెంటఁబెట్టుక నీవు దెచ్చినా
విరవపుదాననా వెంగేలాడను
సరవు లెఱుఁగుదు నా జాడలన్నియు వింటి
ఇరుమేలా మందేముగా కేమిసేయవచ్చును ॥ వారి ॥

ఇంతలో నాముందర మీరిద్దరునుఁ గూడినాను
వింతయైనదాననా విడనాడను
ఇంతట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యేఁతలేదు నీయాసోద మేమిసేయవచ్చును ॥ వారి ॥ 558

రేకు 1494 రామక్రియ

చెప్పేదాఁకాఁ దరితీపు చేరి వించే వేడుక
చొప్పుగా నీకత నాకు సూచించవే చెలియ ॥ పల్లవి ॥

పసిఁడితీగెను మంచిపద్మము వికసించె
కనరక పామేల కాచుకున్నది
యెనగి మొల్లమొగ్గలు ఇందుకె కూటమి గూడె
దెనల నీకత నాకుఁ దెలుపవే చెలియా ॥ చెప్పే ॥

కంతుబాణమున నారికడపుఁగాయలు గాచె
చెంతఁ బోఁకబోదె యేల చెలువొందెనే
అంత సింగారదామము లందుకుఁ దోడువచ్చె
బంతినే యాకత నాతోఁ బలుకవే చెలియా ॥ చెప్పె ॥

పూవుమీఁదికొమ్మ కల్పభూజముతోఁ బెనగొనె
వావిరి మెఱుఁగుమొయిలు పన్నెవెట్టెను
యేవేళ శ్రీవేంకటేశు కీయలమేలుమంగ
దేవులాయ నీకతతెఱఁగేదే చెలియా ॥ చెప్పె ॥ 559

బౌళి

ఈసుద్దులు విన్నవించు మెఱఁగఁదేమో తాను
వేసరక రమ్మనవే విచారించఁ బనులు ॥ పల్లవి ॥

తమ్మి చందురునితోడ డాకొని యేకాంతమాడె
యిమ్ములఁ సూర్యుఁ డంతలో యెండలుగాసె
కమ్మర నందుకుఁగానే కప్పుకొనె మేఘము
రమ్మనవే చూచుఁగాని రమణుని నీడకు ॥ ఈసు ॥

వట్టివేసగిని గాలివానలు గురియుఁగఁ జొచ్చె
పట్టపగలు చీఁకటిపంట పండెను
చుట్టుక మరునమ్ములు సురసుర నుక్కెనవె
అట్టుసేయక పతిని ఇట్టె రమ్మనవే ॥ ఈసు ॥

పొదిగొన్నతీగెలు పూచి పుప్పొడి రాలె
యెదిరించి చకోరము లింపుసొంపెక్కె
ఇదివో శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కదిసినాఁ డిట్లానే కమ్మటి రమ్మనవే ॥ ఈసు ॥ 560

### సామంతం

వాకిట వచ్చివున్నాఁడు వాఁడివో నీరమణుఁడు
చేకొని వుపచారాలు చెప్పవలదటవే ॥ పల్లవి ॥

పొంతనే చుట్టరికాన పొందులు చేసినవారు
యెంతైనా యెగ్గులుఁదప్పు లెంతురటవే
చింతదీర మాఁటపట్టుచేసుకొన్నయట్టివారు
పంతవా రేమిచెప్పినా విననేర్తురటవే ॥ వాకి ॥

వొనరఁగఁ బ్రాణములు వొక్కటైవుండినవారు
తనివోవిముచ్చటలు దాఁతురటవే
చనవున రతికి నాసలఁబొరలేటివారు
పెనఁగక సిగ్గులెల్లాఁ బెంతురటవే ॥ వాకి ॥

విచ్చనవిడిని తాము వేడుకపడినవారు
కొచ్చికొచ్చి గుట్టునఁ గొంకుదురటవే
అచ్చపుశ్రీవేంకటేశుఁ డలమేల్మంగవునీవు
తచ్చి కూడితిరి నవ్వఁదగవులౌనటవే ॥ వాకి ॥ 561

### మాళవిగౌళ

ఇట్టిది కాలమహిమ ఇఁకనేల మరఁగు
గుట్టుదెలిసినవారు కూడఁజెప్పఁగదరె ॥ పల్లవి ॥

వంటున జక్కవలపై నల్లఁబులుగులు వాలె
అంటి తామరఁ జిగురూ [1]నల్లిబెల్లేయ
పెంటతుమ్మిదలపై పిచ్చిలఁ బాలు గురిసె
జుంటితేనె దొండపండు చూరలాడెను ॥ ఇట్టి ॥

1. అల్లిబెల్లి + అయ

వెదకి చిలుకలూఁ గోవిలలూఁ జీరుమూరాడె
గుదిఁ జంద్రశకలాలఁ గూర్మ మెక్కేను
చెదరి యద్దములలో చీఁకటి తీగెలువారె
పొదిగెఁ గారుమెఱుఁగుఁ బువ్వులదండలు ॥ ఇట్టి ॥

పువ్వుమీఁదివాసనకుఁ బొంచి డాసెను మొయిలు
కువ్వలై మరురాజ్యము కొటారుకెక్కె-
మవ్వపుటలమేల్మంగమగఁడు శ్రీవేంకటేశు-
వివ్వల నడిగి మాకు నెరిఁగించరే ॥ ఇట్టి ॥ 562

పరాళి

ఏమిసేసితివో కాని ఇంతివి నీవు
చేముట్టక పువ్వులచెండున వేసీని ॥ పల్లవి ॥

ముక్కర గదలఁగాను ముసిముసినవ్వు నవ్వి
చెక్కుచేతితో చెలి సిగ్గువడీని
చుక్కబొట్టువెట్టినకస్తూరిబేంట్లు రాలఁగా
చక్కనివిన్ను బొమ్మల జంకించీని ॥ ఏమి ॥

మించులమొగపుతీగె మెఱువఁగా మళ్లిచూచి
అంచె నిన్నుఁగవి శిరసటు వంచీని
కంచపుమోవితేనె కదు నుట్టిపడఁగాను
పెంచి వలపుల నీతో బీరములాడీని ॥ ఏమి ॥

కంకణాలు గల్లనఁగా గక్కనఁ బాదాలొత్తి
పొంకముగాఁ గూడి గొబ్బున మెచ్చీని
అంకెల శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
కుంకుమచెమటలెల్లాఁ గురిసీ నీపైని ॥ ఏమి ॥ 563

దేసాళం

ఏరుపరచఁగరావు యెవ్వరిసొమ్ములో యివి
చేరి విన్న నదిగేము చెప్పవయ్య తగవు ॥ పల్లవి ॥

అలులు నరచంద్రుడు వతమునివిండ్లును
కలువలు సంపెఁగయుఁ గమ్మఁజిగురు
పలుచనియద్దములు పచ్చిపోఁకయు శ్రీలు
చెలియసింగారాలో చిత్తజునిపొఁజులో ॥ ఏరు ॥

తిన్నవిసంకున్ను మంచితీగెలునుఁ దామరలు
చిన్నిజక్కవపిల్లలు సింహమును
యెన్నరావిచిమ(మి?) తరి(తి?) ఇసుకదిబ(బ్బ)లును
కన్నెసింగారాలో ఇవి కామునిబలములో ॥ ఏరు ॥

అనటికంబములును అమ్ములపొదులును
మినుకుఁగూర్మములు మించువజ్రాలు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
వనితసింగారాలో వలరాజుమూకలో ॥ ఏరు ॥ 564

రేకు 1495 మంగళకౌసిక

మగువకు లోఁగనేల మగవాఁడవు
నిగిడి బుద్ధులుచెప్పి నిలిపే నే నాపెను ॥ పల్లవి ॥

బత్తి నేఁ జేయఁగా నీవు పరాకున నున్నాఁడవు
చిత్తములో తలపోఁత చెప్పరాదా
యెత్తల నెవ్వతైనా విన్నేమైనా నాడినాను
వుత్తరువు చెప్పే నేను వొద్దు నీకు వెరపు ॥ మగు ॥

ఆకుమడిచియ్యఁగాను అవ్వలిమోమైనాఁడవు
దీకొని చూచేచూపు తిప్పుకోరాదా
నీకాంత లెవ్వరైనా విన్ను నేరాలెంచితేను
నీకు నడ్డమయ్యేఁగాని విమ్మలాన నుండుము ॥ మగు ॥

చెయ్యెత్తి మొక్కఁగాను సిగ్గుతో నున్నాఁడవు
తియ్యవినోరను నన్ను దీవించరాదా
వొయ్యనే శ్రీవేంకటేశ వొద్దికై నన్నేలితివి
చయ్యాటాలు మాన్పేఁగాని సతిఁ జూపు నాకు ॥ మగు ॥ 565

## బౌళి

ఆతని కొక్కతెవే నీ వాలవైతివా
యేతులు నెమ్మెలు నీవు యిందే చూపేవా ॥ పల్లవి ॥

యిచ్చకములెల్లా నాడి యితవరివై విభుని
మచ్చికలు రేఁపి భ్రమలఁబెట్టేవు
కచ్చుపెట్టి నేమెల్లాఁ గాచుకుండఁగా నీకు
యిచ్చోటఁ జెల్లుబడి ఇఁక నెంత గలదే ॥ ఆత ॥

పట్టినవ్వులెల్లా నవ్వి వద్దనుండి యాతని-
చుట్టమవై మాటలనే చొక్కించేవు
అట్టె నే మిందరమును ఆసపడివుండఁగాను
నెట్టుకొని నీబలిమి నెరపఁగవలెనా ॥ ఆత ॥

చెనకి కాఁగిట నించి శ్రీవేంకటేశ్వరుని-
మనసు రంజిల్లఁజేసి మరిగించేవు
యెనసె నీతఁడే మమ్ము నీడుజోడైతిమి నేము
తనియవు నీ వింకా తమకించఁదగునా ॥ ఆత ॥ 566

### వరాళి

ఆపె నెంతపొగడేపు అన్నిటా నేర్పరియని
 తీపులు పుట్టించేవారు తిట్టినా దీవెనలు ॥ పల్లవి ॥

చనవుగలసతులు సాదించితే నమరు
 ననుపైనవారలు నవ్వితేఁ జెల్లు
 మనసువచ్చినవారు మంతనమాడఁగఁదగు
 యెనసినచోటిపొందు లితవులై తోఁచును ॥ ఆపె ॥

చుట్టరికమైనవారు సొలసినా వేడుకౌను
 గుట్టెఱఁగినవారు దీకొవినా మెచ్చు
 పొట్టఁబొరుగువా రేతప్పులువట్టినాఁ బొసఁగు
 దిట్టసతు లొడివట్టితీసితే సమ్మతము ॥ ఆపె ॥

ఆసపడివచ్చినవా రాయములంటినా మేలు
 బాసగొన్నవార లెంతపైకొన్నా లెస్స
 వాసితో నన్నేలితివి వలచి (శ్రీ) వేంకటేశ
 నేసవెట్టినవా రెంతచెనకినా మంచిది ॥ ఆపె ॥ 567

### సామంతం

పిలిచి చేకొనవయ్యా ప్రియురాలిని
 సులభాన వచ్చె మేలు జోలి ఇంతవలెనా ॥ పల్లవి ॥

సొలసి సొలసి చూచి చొరువల కిటు లాచి
 యెలయించీ నిన్ను నీకె యెవ్వతోకావి
 యెలమి నీవేళనే యెక్కడ పరాకు నీకు
 వలపు తనంతరాఁగా వద్దనఁగవచ్చునా ॥ పిలి ॥

వచ్చివచ్చి మాటలాడి వన్నెలుగాఁ బాటవాడి
ఇచ్చి నీకు విడెము యెవ్వతోకాని
వచ్చిగా నీకీవేళ పనులెల్లాఁ గలిగెనా
మచ్చికచుట్టరికము మఱవఁగఁదగునా ॥ పిలి ॥

వినయములెల్లాఁ జేసీ వేడుక చన్నులరాసి
యెనసె నివ్విప్పుడే యెవ్వతోకాని
నిను శ్రీవేంకటేశుఁడ నే నలమేలుమంగను
చెనకి దక్కఁగఁగొంటి సిగ్గు నెరపుదురా ॥ పిలి ॥ 568

## భైరవి

పట్టరానికాఁతాళానఁ బదరేఁగాని
దిట్టవదానవు నీకు దీకొనఁగఁజెల్లునే ॥ పల్లవి ॥

కాంతుఁడిచ్చినసలిగెగలదానవుగనక
పంతములాడఁగవద్దా పలుమారును
బంతినుండి యాతనితో పకపక నవ్వేవు
ఇంతటిదానవు నీకు నెట్టుండినాఁ జెల్లునే ॥ పట్ట ॥

ఆతఁడున్నగద్దె యెక్కి అండవాయవుగనక
యేతులు నెరపవద్దా యిచ్చటను
చేతులు చాఁచి పతినిఁజేరి సాములు సేసేవు
బీతి(తు?)లేనిదానవు పెనఁగఁగఁజెల్లునే ॥ పట్ట ॥

బలిమి మగనిచేత బాసగొంటివి గనక
చలము సాదించవద్దా సారెసారెకు
యిల నన్నేలె శ్రీవేంకటేశుఁడని మెచ్చేవు
అలమేలుమంగవు నీకమరు నన్నియును ॥ పట్ట ॥ 569

ఆహిరి

సీమన నెఱఁగనా విన్నుదూర దోసము
కామించినవారిపొందు కైకొందువుగాక ॥ పల్లవి ॥

అంగనలు చెనకితే నొఁగాదనేవాఁడవా
అంగవించి యందుకు లోనౌదువుగాక
కొంగువట్టితీసినాను కోపగించేవాఁడవా
ఇంగితమెఱిఁగి చవవిత్తువుగాక ॥ సీమ ॥

వెలఁదులు మాటాడితే వేసరేటివాఁడవా
వెలయ నెంతవడైనా విందువుగాక
వలపులు చల్లితేను వద్దనేటివాఁడవా
కెలన నియ్యకొని భోగింతువుగాక ॥ సీమ ॥

పెనఁగి కాఁగిలించితే బిగిసేటివాఁడవా
యెనసి రతులఁ జనవిత్తువుగాక
ఘనుఁడ శ్రీవేంకటేశ కైకొని వన్నెలితివి
మనసిచ్చి యందరిని మన్నింతువుగాక ॥ సీమ ॥ 570

రేకు 1496 రామక్రియ

ఒకరు చేసినభాగ్య మొకరికి నేల వచ్చు
మొకము చూచినప్పుడే మొక్కేవి తాను ॥ పల్లవి ॥

సొలసి సొలసి నీతో సుదతి మాటాడఁగాను
పొలసి తానేమి వినీ పొంచులు యీకె
కలువరేకులవంటికన్నుల నాపె చూడఁగా
విలుచున్నది యెదుట నెరవాదై తాను ॥ ఒక ॥

ననుపున నాపె నీతో నవ్వులెల్లా నవ్వఁగాను
పవివడి తానేమి పైకొనీ నీకె
చనవునఁ దనమోవిచవు లాపె చూపఁగాను
నునుపునఁ దానేమి నోరూరీ నీపె ॥ ఒక ॥

చెక్కునొక్కి నేఁ డాపె సేవలెల్లాఁ జేయఁగాను
కక్కసించి యేల యాపె కాఁగిలించీవి
మక్కువ శ్రీవేంకటేశ మరి నన్ను నేలితివి
తక్కక యింకానేమి తడవీఁ దాను ॥ కఒ ॥ 571

## వసంతవరాళి

వద్దు వద్దు సతి నింత వలలఁబెట్టకు మీఁక
సుద్దులు చెప్పఁగఁబోతే సూడువట్టును ॥ పల్లవి ॥

శిరసువంచినదాని సిగ్గులువడినదాని
వొరసి చెనకఁబోతే వొట్టువెట్టును
మరలి చూచేదాని మాటలాడి దూరేదాని
గరిమఁ గరకరైతే కాఁతాళించును ॥ వద్దు ॥

కూరిమిచల్లేదాని కొంగువట్టితీసేదాని-
నారసి యద్దగించితే నద్దలించును
సారెకు నవ్వేదాని సంగడికి వచ్చేదాని
మారుకొని వలదంటే మచ్చరించును ॥ వద్దు ॥

ఆసపడివున్నదాని ఆయములంటేదాని
పాసి యెలయించఁబోతే పంతమాడును
నీసొమ్మయివదాని నేఁడు శ్రీవేంకటేశుఁడ
సేసవెట్టి కూడితివి చెలి విన్ను మెచ్చును ॥ వద్దు ॥ 572

## హిజ్జిజి

ఆఁటదాని కిచ్చకమే యమరుఁగాక
చీటికిమాటికి ఱట్టుసేయఁగవలెనా ॥ పల్లవి ॥

రాయడించనేమిటికి రమణునియెదకును
సేయఁగలవిన్నపాలు చేసుకోరాదా
చాయగా నయము చూపి సాదించుకొనేమేలు
ఆయాలు మోవనాడితే నది సంగతౌనా ॥ ఆఁట ॥

చనవుగలదంటాను జంకించనేమిటికి
మనసురా సేవసేసి మరుపరాదా
ననుపుగా మోవి యిచ్చి నాటించుకొనేవలపు
పెనఁగి రచ్చఁబెట్టితే ప్రియములై వుండునా ॥ ఆఁట ॥

బలిమికత్తెనంటాను పదరఁగ నేమిటికి
యెలమి నురమెక్కితి వెనయరాదా
అలమేల్మంగవు నీవు అతఁడు శ్రీవేంకటేశుఁ-
డలయించితే రతు లావటమైవుండునా ॥ ఆఁట ॥ 573

## శుద్ధదేశి

ఎంతలేటియాసోద మేది గొలఁది
సంతోసాన లోలోనే జడిగొనరాదా ॥ పల్లవి ॥

తగవులు చెప్పఁగానే దప్పిదేరీ నీమోవి
అగడేల పన్నీట నద్దుకోరాదా
తగుబాస లియ్యఁగానే తనువెల్లా బడలెను
పగటునఁ గొంతవడి పవళించరాదా ॥ ఎంత ॥

చెంది సేసలు చల్లఁగానే చెమరించె మేనెల్లా
చందముగా గందవొడి చల్లుకోరాదా
అంది యింటింటి కేఁగఁగా అట్టె వేసటలు రేఁగె
పొందుగాఁ గొంతవూరట పుచ్చుకోరాదా ॥ ఎంత ॥

చెలుములు సేయఁగానే చిత్తమెల్లాఁ గరఁగెను
చెలఁగి గుండెబలిమి చేసుకోరాదా
విలిచి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
కలసితి విన్నిటాను కరుణించరాదా ॥ ఎంత ॥ 574

## ముఖారి

అన్నిటాను దొరవై తే నైతివిగాక
విన్ను విట్టె మెప్పించనేరనా నేను ॥ పల్లవి ॥

పడఁతికి మగవితో బలిమి వద్దవికాక
వాదివట్టి విన్నుఁ దియ్యనోపనా నేను
కడలేనివిబ్బరానఁ గాలుదాఁకీనవికాక
వుడివోవిసరసాన కోపనా నేను ॥ అన్ని ॥

చెల్లఁబో నీలోనీవే సిగ్గువడేవవికాక
వొల్లనే నీతో మాటాడనోపనా నేను
పల్లదపురతులను భ్రమసేవంటాఁగాక నీ -
వుల్ల మిట్టే కరఁగించనోపనా నేమ ॥ అన్ని ॥

పుక్కట నీపెదవి కెంపులురేఁగినవికాక
వుక్కున నీమోవి యాననోపనా నేను
విక్కి శ్రీవేంకటేశుఁడ నే నలమేలుమంగను
వొక్కట నేలితి విందు కోపనా నేను ॥ అన్ని ॥ 575

సాళంగనాట

అప్పటి వత్తురుగావి ఆదనుండి యీడకు
యెప్పుడు మాయిల్లె మీకు విక్కువైనచోటు ॥ పల్లవి ॥

యెంతపని గలిగెనో యేకతమాడీ నాకె
వింతలుసేయక నీవు వినరాదా
కాంత యప్పటనుఁడి కాచుకున్న దిందుకే
యింతటఁ దెరలోవికి విద్దరు నేఁగరయ్యా ॥ అప్ప ॥

పట్టుకున్నది కానుక పయ్యద మూసీ యేఁటిదో
అట్టె చేతులుచాఁచి అందుకోరాదా
చుట్టిచుట్టి లాచీవి సుదతి తా నిందుకే
ఇట్టె కంబముమాఁటు కిద్దరు నేఁగరయ్యా ॥ అప్ప ॥

యేపున నన్నులుచేసీ నెందుకో యలమేల్మంగ
చూపుల శ్రీవేంకటేశ చూడరాదా
యీపట్టున నన్నేలితి వింతి గోరినందుకే
యేఁపక నామంచముపై కిద్దరు నేఁగరయ్యా ॥ అప్ప ॥ 576

రేకు 1497 సాళంగనాట

ఏమిటికి బిగిసేవు ఇందరుఁ జూడఁగాను
ప్రేమ పుట్టించి యాతనిఁ బిలిచి తేఁగదవే ॥ పల్లవి ॥

పెలుచవై వంతులకుఁ బెనఁగేవు రమణుని
వలపించుకొంటివా నావలెనే నీవు
పొలిఁతివై పుట్టితేనే భోగములు సరియౌనా
సొలసి నేర్పులఁ జవిచూపవలెఁగాక ॥ ఏమి ॥

వడిగా నాసంగడికి వచ్చేవు నాయకుని
కడుఁ బనిగొంటివా నాకై వడి నీవు
వడుమ సవతివైతే నావోజ నీకు వచ్చీనా
పెడఁబాయ కాతని మెప్పించవలెఁగాక ॥ ఏమి ॥

పుక్కట సేసలు చల్లి పొత్తుగలసే వాతని
దక్కఁగొంటివా నాచందమున నీవు
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డిటు నన్నాతఁడె యేలె
ఎక్కువైతే నీవు ఎట్టే నేరవలెఁగాక ॥ ఏమి ॥ 577

## శ్రీరాగం

చల మిఁకఁ బనిలేదు జలజాక్షి కడుసాదు
యెలమితో నిట్టె మాయింటికి రారాదా ॥ పల్లవి ॥

చేర యింతి ప్రియములే చెప్పీ నిదే నీకుఁ జాటి
కోరికలైతే మదిఁ గోటానఁగోటి
మేర మీరరాదు యీపె మేనరిక మిఁకఁ బోదు
యీరీతి మమ్ము మన్నించి ఇంటికి రారాదా ॥ చల ॥

కొమ్మ నిన్నుఁ దలపోసి కురిసీఁ జెమటవాన
చిమ్మిరేఁగేవలపైతే సేనాసేన
నమ్మినచుట్టాలు మీరు నంటున నొద్దికైనారు
ఇమ్ముల నీకు మొక్కేము ఇంటికి రారాదా ॥ చల ॥

యెన్నఁడుఁ బాయవినతి యీకె నీమోహపుటాలు
విన్నపములెల్లాఁ జేసీ వేవేలు
చిన్ననాఁడె యీడుచూపె శ్రీవేంకటేశుఁడ; యీపె
యెన్నికగాఁ గూడితివి ఇంటికి రారాదా ॥ చల ॥ 578

## గౌళ

ఇంతిదిక్కు చూడరాదా యెక్కడ పరాకు నీకు
అంతలోనే యేడలేవిఅనలు రేఁచీని ॥పల్లవి॥

ముసిముసినవ్వులు నవ్వి మోవిచవులు చూపి
కసుగాటువలపులు కాంత చల్లీని
ఇసుమంత మాటాడి యెదుటనే విలుచుండి
కొసరికొసరి నీకొలువు సేసీని ॥ఇంతి॥

తప్పక విన్ను చూచి తగిలి వేమారు మొక్కి
దప్పిదేరఁ గాఁగిటికిఁ దమకించీని
వుప్పతిల్ల సన్నచేసి వొడివట్టి విన్నుఁ దీసి
కప్పురపులప్ప నీకుఁ గానుకిచ్చీని ॥ఇంతి॥

చెలరేఁగి సేవచేసి చేతులు నీపైఁ జాఁచి
వెలపినసంతోసాన ఓట్టసీఁగివి
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
అలమి విన్నాకె గూడి యరుదఁ(దం?)దీని ॥ఇంతి॥ 579

## శ్రీరాగం

కరుణించు మీచెలి కదుఁటిన్నది
సరసమాడేనంటా సముకాన నున్నది ॥పల్లవి॥

నెలకొన్న వేడుకతో నీ వెప్పుడు వత్తువంటా
కలికి యప్పటనుండీఁ గాచుకున్నది
మలసి తనతో నీవు మాటలాడినందాఁకా
తిలకించి లోలోనె తిమురుచునున్నది ॥కరు॥

మొనసి యెప్పుడు నీమొగము చూతునోయంటా
తనివోవితమకానఁ దగిలున్నది
చనవున విన్నుఁజేరి సరసమాడినదాఁకా
యెనలేనిమనసెల్లా నిక్కడనే వున్నది ॥ కరు ॥

కందువ విన్నుఁ గాఁగిటఁ గాఁగిలించుకొనేనంటా
పొందులెల్లా మతిఁ దలపోయుచున్నది
యిందువచ్చి కూడితివి యీకెను శ్రీవేంకటేశ
విందులుగా మోవితేనె వేఁడుకొంటా నున్నది ॥ కరు ॥ 580

## ఆహిరి

ఎంత విన్ను నెలయించీ విదివో చెలి
కాంతుఁడవు విన్నింత కరఁగించె నీచెలి ॥ పల్లవి ॥

పక్కన నవ్వుతానే పంతములాడీఁ జెలి
చెక్కు నొక్కుతానే గోరఁ జెనకీఁ జెలి
చక్కఁగాఁ దప్పకచూచి సారెకు జంకించీఁ జెలి
మొక్కుతానే చన్నులమొనలు చూపీఁ జెలి ॥ ఎంత ॥

సంగడిఁ గూచుండుతానే చలము సాదించీఁ జెలి
జంగిలిమాటలాడి జరసీఁ జెలి
చెంగలించి మోవి యావి చిన్నలు పించీఁ జెలి
సింగారించేయందులోనే చిమ్మిరేఁగించీఁ జెలి ॥ ఎంత ॥

పాటలు నీపైఁ బాడి బయలీఁదించీఁ జెలి
చీటికిమాటికి రతిసేసీఁ జెలి
నీటున శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
కోటిసేయ నిన్నప్పటిఁ గొసరీఁ జెలి ॥ ఎంత ॥ 581

ముఖారి

అమరనిమాటలేల ఆడేవు నీవు
తమకము గడునిండె దట్టమాయఁ గొంకులు ॥ పల్లవి ॥

దాఁపురమేల నేసేవు తరుణితో విందాఁకా
కాఁపురము సేయవా కంటిఁబో నేను
యేఁపకు వన్నిఁక నీవు యేలపెట్టుకొనే వాన
రాఁపాయ నీవలపు రచ్చకెక్కె సుద్దులు ॥ అమ ॥

పోల బొంకనేమిటికి పొలఁతితో విందాఁకా
మేలములాడుకొనవా మెచ్చితిఁబో విన్న
జాలిఁబెట్ట కిఁక నీవు సారె నొడఁబరచకు
చాలుకొనెఁ దమకము జారఁజొచ్చె సిగ్గులు ॥ అమ ॥

వేసాలకేల లోఁగేవు వెలఁదిమీఁదట విట్టె
సేసలెల్లాఁ బెట్టవా చేకొంటి నీవు
ఆసల శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
పోసరించె వేడుకలు పొలుపొందె రతులు ॥ అమ ॥ 582

రేకు 1498 సామంతం

ఇన్నాళ్లవలెఁ గాదు యేమనినాఁ గెరలేవు
సన్నల నెవ్వతెచేతిపడికి లోనైతివో ॥ పల్లవి ॥

ఇంతి యెంత దూరినాను యెగ్గుగాదు విభునికి
వింతవింతసంతోసాలై వెలయుఁగాని
పంతగారితనమునఁ బదరే వదేమి నీవు
మంతనాన నెవ్వతెచే మాటఁబడినాఁడవో ॥ ఇన్నా ॥

మగువ కాఁతాళించితే మగవికి నెగ్గుగాదు
మిగులా వేడుకలై మెరయుఁగాని
తగవులఁబెట్టి సారెఁ దడవే వదేమి నీవు
పగటున నెవ్వతెచే భంగపడినాఁడవో ॥ ఇన్నా ॥

రమణి కాలుదొక్కితే రమణునికెగ్గుగాదు
తమితో సమరతులే తగులుఁగాని
జమళి శ్రీవేంకటేశ జరసే వదేమి నీవు
అమర నెవ్వతెచేత నప్పణ గొన్నాఁడవో ॥ ఇన్నా ॥ 583

## దేసాళం

అప్పణిచ్చి రిందుకు నీయంగనలెల్లా
చెప్పితి సంతోసాలు సిగ్గులెల్లాఁ దేరెను ॥ పల్లవి ॥

యేదనైనాఁ దిరిగాడి యేమైనాఁ జేతువుగాక
వేడుకకాఁడవు నీకు వెరపేఁటికి
ఆడేవారెవ్వరు నిన్ను అనుమానించకు మిఁక
తోడనే మగవానికి దోస మెందూ లేదు ॥ అప్ప ॥

విమ్మపం దెగరవేసి నీటు చూపుదువుగాక
యెమ్మెకాఁడవు వినయ మిఁక నేదది
సమ్మతించి రిందరను సటలుసేయకు మిఁక
నెమ్మది మేనవానికిని నింద లే దెప్పుడును ॥ అప్ప ॥

కొంకులేక కూడితివి కూరిమితో నిటు నన్ను
అంకెకాఁడ విఁక నీకు నలపున్నదా
పొంకమైరి నీసతులు పొందుము శ్రీవేంకటేశ
వుంకువవెట్టినపతి కొదుగఁగవలదు ॥ అప్ప ॥ 584

### పాడి

తనువుఁ దనువు సోఁకె తమకము దైవారె
చెనకఁగా వద్దనఁగఁ జెల్లునటే ఇఁకను ॥ పల్లవి ॥

పవ్వళించియుండినపతి పాదాలొత్తుమనఁగాను
నవ్వులు నవ్వుదురటే నాలికత్తెవై
యెవ్వరుఁ జూడకుండాను ఇట్టె నేఁ దెరవేసేను
చివ్వన సిగ్గులువడఁ జెల్లునటే ఇఁకను ॥ తను ॥

ఆసపడి నిన్ను విట్టె ఆకుమడిచిమ్మనఁగా
వేసాలు సేతురటవే వింతదానవై
వోసరించ కిటు మీకు నొరఁబరఁజెప్పే నేను
సేసవెట్టి తలవంచఁ జెల్లునటే ఇఁకను ॥ తను ॥

ముందె కాఁగిలించుకొని మోవితేనె ఇమ్మనఁగా
మందెమేల మౌదురటే మంకుదానవై
గొంది నలమేల్మంగవు కూడె శ్రీవేంకటేశుఁడు
చెందె మేలెల్లా జరయఁజెల్లునటే ఇఁకను ॥ తను ॥ 585

### హిందోళవసంతం

ఇందుకు మెచ్చిరి నీఇంతులెల్లాను
చందమాయ నీపనులు చక్కఁగూచుండవయ్యా ॥ పల్లవి ॥

నెలఁతపాదముతోడ నీపాదము పెనచి
విలుచుండి కాఁగిట వించే వాకెను
అలిగి లోనికిఁబోయేయప్పు డింత సేసితివి
ఇలలో జాణవౌదువు ఇట్టె కూచుండవయ్యా ॥ ఇందు ॥

మొనసి చెలిపయ్యెద ముంజేతఁ జుట్టుకొని
తనివారఁ బిసికే వందపుగుబ్బలు
పెనఁగి తిప్పించుకోఁగా ప్రేమతో సాదించితివి
ఘనుఁడవైతివి నేఁ దిక్కడఁ గూచుండవయ్యా ॥ ఇందు ॥

అలమేల్మంగచెక్కున వటు నీచెక్కు పొందించి
తలవంచుకొన్నాపెచింత మాన్పితివి
బలిమి శ్రీవేంకటేశ పంతపాకెఁ గూడితివి
అలరితి రొక్కమనసాయఁ గూచుండరయ్యా ॥ ఇందు ॥ 586

## సాళంగం

దేవులవయ్యేనంటా తివిరీఁ దాను
చేవదేర నాపెఁ గొంత చేపట్టఁగరాదా ॥ పల్లవి ॥

చుట్టమనై నీతోను సుద్దులెల్లాఁ జెప్పఁగాను
వెట్టికి వచ్చి తానేల వెంగెమాడీవి
గట్టిగా నాపెకు విది కడువేడుకై తేను
అట్టె కడమమాటెల్లా నడుగఁగరాదా ॥ దేవు ॥

బత్తిచేసి నే నీకు పాదాలు పిసుకఁగ
తత్తరించి తానేల తప్పువట్టీని
హత్తి తనకు నేరుపు లంతేసి కలిగితేను
కొత్తలవెట్టో తెలుసుకొని చూడరాదా ॥ దేవు ॥

అలమేలుమంగనై విన్నటు గాఁగిలించుకోఁగా
యెలమిఁ దానేల వచ్చి యేఁకారీవి
అలరి శ్రీవేంకటేశ ఆస లాపెకుఁ గల్గితే
పిలిచి యందూఁ గొంత పెనఁగించరాదా ॥ దేవు ॥ 587

mp3

## శంకరాభరణం

ముద్దులుగారీ మోమునను
వొద్దిక నేమైన నొసగరె చెలులు ॥ పల్లవి ॥

చెక్కులవెంటాఁ జెమటలు గారీ
యెక్కడ నాడెనొ యిందాఁకా
చక్కఁ గృష్ణునికి జలకము సేయరె
నెక్కొని కాఁగిట నించరె చెలులు ॥ ముద్దు ॥

పొరిఁబొరి నిట్టూర్పులు గడురేఁగెను
పరువులు వెట్టెనొ పడుచులతో
సరుగన శై త్యే(త్యో?)పచారము సేయరె
యిరవుగ నుయ్యాల విడరే చెలులు ॥ ముద్దు ॥

చుట్టుకొన్నజడ చొల్లెము జారెను
వుట్టులు గొట్టెనొ వుదుటునను
పట్టి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁ-
డిట్టిపనులవా రెంచరె చెలులు(?) ॥ ముద్దు ॥ 588

రేకు 1499

## సామంతం

కంకణము గట్టవయ్యా కలికికిని
అంకెల నీకుఁ దలఁపయ్యేటట్టుగాను ॥ పల్లవి ॥

యెప్పుడు నీమనసులో నింతిని మఱవకుండా
కుప్పెలువంటిచన్నులు గుఱుతుచూచుకోవయ్యా
నెప్పునఁ బెక్కుసతులనేస్తముగలవాఁడవు
తప్పక వారిలో నీకె తడఁబడకుండాను ॥ కంక ॥

ఇందుముఖి యందరిలో నెరతై వుండేయట్టుగా
ముందే చక్కఁదన మురమున వా(వ్రా?)సుకొనవయ్య
పొందు లెందైనాఁ జేసి భోగించేవాఁడవు
సందడి ననుమానము సారె రాకుండాను ॥ కంక ॥

ఇదె యలమేలుమంగ నేలితివి ననుపుగా
పదిమారు లీకెపేరు పాటము సేసుకోవయ్య
పదరి శ్రీవేంకటేశ పదారువేలనేలితి-
వెదుగా నందు వెదకి యెంచుకోకుండాను ॥ కంక ॥ 589

## బౌళి

ఆడనుండే లాగవేగా లాడవద్దు
యీడనే నీకాఁగిలి నాకిప్పుడే యిమ్మా ॥ పల్లవి ॥

చెలిగట్టినచెంగావిచీరకొంగు గానవచ్చీ
మలసి నీపచ్చడము మాటుననె
నెలఁత నీవద్దలేదని నిజము నెరపేవు
తెలిసె నాపానుపుమీఁదికి నీవు రమ్మా ॥ ఆడ ॥

తరుణిసొమ్ములకాంతి తళుకున మెరిచీని
సరి నీనిలువుమేనిసందుసందుల
అరుదై యెవ్వతె దాఁచనని వొడఁబరచేవు
పరగ విప్పుడే నాపక్కకు రమ్మా ॥ ఆడ ॥

వనితతనువువింతవాసనలు పొలసీని
వినుపుఁజెమటగా రేనీచెక్కులను
యెనసితి వేంకటేశ నేనలమేల్మంగ -
నొనర నాకెనుఁ జూపే నొద్దికతో రమ్మా ॥ ఆడ ॥ 590

పాడి

ఎవ్వరి నేమనఁగల మిప్పుడు నేము
　　ఇవ్వటిల్ల మిమ్ముఁజూచి నవ్వే మింతేకాక ॥ పల్లవి ॥

నేరుపులన్నియుఁ జూపి నెలఁతపయ్యదకొంగు
　　సారెఁ దీసి యిట్టె సరసములాడేవు
　　అరితేరి నిన్ను నాపె అనవెట్టి పలుమారు
　　దూరుఁతాను పెంజెమట గోరఁ జిమ్మీని ॥ ఎవ్వ ॥

వేడుకలు పుట్టించి వెలఁదిచన్నులమీఁద
　　తోడనే కుంకుమ పూసి దొమ్మిసేసేవు
　　పీడినతురుముతోడ వెస నిన్ను నద్దలించి
　　మేడెపురతికి నాకె మీరివచ్చీని ॥ ఎవ్వ ॥

కందువఁ గాఁగిటఁ గూడి కాంతను శ్రీవేంకటేశ
　　సందడి మోవితేనె చవిచూచేవు
　　మందలించి నిన్ను నాకె మనసు రంజిలఁజేసి
　　ముందుముందె నీమర్మములు ముట్టీని ॥ ఎవ్వ ॥ 591

ధన్నాసి

మాకు నీవు వెఱచేవా మాటమాటలా
　　ఆకెఁ బేరుకొవితైనా నానందించేవుగాక ॥ పల్లవి ॥

తెలతెలవారఁగానే తెఱవమొగముచూచి
　　వలపు చద్దిగట్టుక వచ్చితివి
　　చలాన నే వలిగితే జడిసేవా నీవేమైనా
　　తలపోఁతనైనాఁ గొంత [1]తనుతువుగాక ॥ మాకు ॥

---

1. 'తనియు' ధాతువుపై లాడర్థరూపము.

పానుపు దిగుతా నీవు భామమోవి చవిచూచి
తేనెతావులు దప్పికిఁ దెచ్చుకొంటివి
పూని నేఁ బిలువకుండే పొగిలేవా నీవేమైనా
దానియాసానలనైనాఁ దనుతువుగాక ॥ మాకు ॥

కన్నులు దెఱచుతానే కాఁగిటిలో నాకెఁ గూడి
అన్నిటా రతిసంబళా లందుకొంటివి
యెన్నఁగ శ్రీవేంకటేశ యెడసేవా నీవేమైనా
తన్నూ నన్నూఁ గూడితివి తనుతువుగాక ॥ మాకు ॥ 592

## దేశాక్షి

మీకుమీరే తెలుసును మీఁదపెత్తు
పైకొని వూరివారికి పను లిందుఁ గలవా ॥ పల్లవి ॥

చెక్కులు నీవు నొక్కితే సెలవుల నవ్వె నాకె
యెక్కువతక్కువలు నే మెఱఁగము
తక్కక చెలుల మింతే తగవు లేమడిగేరు
యిక్కడ సాకిరు లెవ్వరెట్టు చెప్పే రిఁకను ॥ మీకు ॥

కన్నుల నీవు చూచితే కాఁతాళించి పల్కె నాకె
వున్నసుద్దులు దెలియ వూరకే మాకు
యెన్న నూడిగపువార మేఁటికి గురిసేసేరు
పన్ని ఇందు కెవ్వ రొడఁబరచవచ్చేరు ॥ మీకు ॥

కలయ నీవు వచ్చితే కాఁగిలించుకొనె నాకె
తలఁపు లేర్పరచ నెంతటివారము
కొలువువారము వేఁడుకొనకు శ్రీవేంకటేశ
చలపట్టెవ్వరు మిమ్ము సాదించఁగలరు ॥ మీకు ॥ 593

గౌళ

మగవాఁడవు నీవు మగువను నేనైతే
వెగటున విన్నుఁ గడువెగ్గళించవచ్చేమా ॥ పల్లవి ॥

కంటకమాడఁగ లేదు కసరుకొవఁగ లేదు
నంటున నే నీతోను నవ్వరాదా
వొంటే నందుకుఁగా నీవు వూరకే సాదించేవు
బంట(టు?)పంతాలకు నీతో పైకొనవచ్చేమా ॥ మగ ॥

కొలఁదిమీరఁగ లేదు కొంగువట్టి తియ్యలేదు
నొలసి విన్నుఁ దప్పకచూడరాదా
చెలికత్తెలకు నీవు చెప్పిచూపే విదియెల్లా
చలమిబలుములను బంకించవచ్చేమా ॥ మగ ॥

జోలిఁబెట్టలేదు విన్ను నోదనగొనఁగలేదు
మేలుమేలనుచు విన్ను మెచ్చరాదా
యేలితివి శ్రీవేంకటేశ నన్ను వింతలోనె
గేలిసేసి యిఁక విన్నుఁ గెరలించవచ్చునా ॥ మగ ॥ 594

రేకు 1500 శుద్ధవసంతం

చేసినవెల్లాఁ జేసి సిగ్గువడనేమిటికి
బాసలు తన్నుఁజేయించి భంగపెట్ట వీఁకను ॥ పల్లవి ॥

వొడఁబరచేఁగావి వొద్దికి రమ్మనవే
యెడమాట లాడించఁగా నేమి వచ్చివి
పడఁతు లెందరినైనా బడిఁబెట్టుక రానీవే
కొడిమలు గట్టి తన్నుఁ గోపగించ వీఁకను ॥ చేసి ॥

మొక్కులు మొక్కఁగాని మోము చూపుమనవే
అక్కడ నుండఁగాఁ దన కయ్యేదేమి
చొక్కి వారిచ్చినయట్టిసొమ్ముతోనే రాసీవే
దక్కి నాకుఁ దను నేమీ తప్పు లెంచ వీఁకను ॥ చేసి ॥

పాదము లొత్తేఁగాని పవ్వళించుమనవే
సాదువలెఁ గూచుం దేమి సాదించీని
యీదెస శ్రీవేంకటేశుఁ దేలెఁ దానె రాసీవే
ఆదిగొని అట్టునేసి అలయించ వీఁకను ॥ చేసి ॥ 595

రామక్రియ

వేడుకకాఁడై నయట్టివిభుఁడు గాక
కోడెతనాలు సేసీని [1]గోలవాఁడా యీతఁడు ॥ పల్లవి ॥

పసిఁడికుండలవుట్లు బాలకృష్ణుఁడు గొట్టఁగా
వెస నొక్కతె చన్నులు వీఁపు నాటఁ బట్టీనె
యెసఁగి యాకుండలే యే(యి?)వి యని తానంతలో
పిసికీఁ జేతులఁబట్టి పిన్నవాఁడా యీతఁడు ॥ వేడు ॥

కోనలజుంటిపెరలగుదులపుట్టి గొట్టఁగా
తేనెమోవిని గోవిందుఁ దిట్టె నొకతె
మోనమున నాతేనెమోవి తేనెగా నవి
పావిపట్టి చవిచూచీ పసిబిడ్డా యీతఁడు ॥ వేడు ॥

పాలవుట్లు శ్రీవేంకటపతి గొట్టఁగా నొకతె
పాలవంటినవ్వు నవ్వి పదరి సిగ్గువరచె
పాలదియే పదఁతిసెలవినంటా
నాలితో వారవట్టీ సన్నపువాఁడా యీతఁడు ॥ వేడు ॥ 596

---

1. గోల=ముగ్ధుఁడు, ముగ్ధ అని శ. ర. వా. ని. ఇక్కడ 'గోల' శబ్దము అమాయకత్వమని ధర్మవాచకమై 'దొంగవాఁడు' వలె ప్రయోగింపబడినదా?

## దేవగాంధారి

కంటివా వోయి యీగయ్యాళితనాలు
గొంటరిసతులు కొంకుదురా ॥పల్లవి॥

ప్రియముచెప్పి నేఁ బిలుచుకరాఁగా
నయాన తానేల వచ్చీ నీతో
భయమెఱఁగనిపడఁతు లెందైనా
వియతాన నుండనేరుతురా ॥కంటి॥

కానుకిచ్చి నేఁ గన్నుల మొక్కఁగా
తానేల దీవించీ దండనుండి
పూని సిగ్గుదలపోయనికాంతలు
కానీలే తగవుగ్గై కొందురా ॥కంటి॥

గక్కన నే విన్నఁ గాఁగిలించుకోఁగా
మిక్కిలి తానేల మించీ నీకె
యిక్కడ శ్రీవేంకటేశ లాఁతివారు
తక్కినసుద్దులు దలఁతురా ॥కఁటి॥ 597

## ముఖారి

ఏల యెమ్మెలు చెప్పేవే ఇందరితోను
వాలాయించి యంత నీవు వక్కాణించనేఁటికి ॥పల్లవి॥

సతులలో నీవుండఁగా జాణతనా లాడెఁగాక
అతనికి నీకుఁ దొల్లి యంతపొందా
బతిమా లింటికి రాఁగా పాదాలు పైఁజాఁచెఁగాక
ఇతవె నీపైబత్తియేమి చెప్పేదే ॥ఏల॥

దిట్టవై నీవు నవ్వఁగా దిష్టించి చూచెఁగాక
నెట్టన నాతఁ దేవూరే నీ వేవూరే
చుట్టపువరుసగాఁగా చోటు నీకు నిచ్చెఁగాక
పట్టిచూచితేమ నీపై పన యేమున్న దే ॥ ఏల ॥

పిన్నదానవుగాఁగాను ప్రేమఁ జన్ను లంటెఁగాక
నిన్నుఁగూడ నాతఁడెంత నీవెంతే
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
సన్నల మీఇద్దరికి చవు లేమి చెప్పేదే ॥ ఏల ॥ 598

## హిజ్జిజి

నీవు చేసినచేఁతలు నీకు నెరి ఫలియించె
యీవల నిందుకే చెలు లిందరు నవ్వేరు ॥ పల్లవి ॥

కొలువుసేసేదానిఁ గొప్పువట్టితీసి నీవు
లలి నోరిలోఁ దమ్మెలము వెట్టఁగా
బలిమి నాకె నీమోవిఁ బచ్చిసేఁతలెల్లాఁ జేవి
మెలుపునఁ బంతములు మెరయక మానునా ॥ నీవు ॥

కదలనున్నదానిఁ దొదలసంది నిడుక
జడియుచు నీవు సరసములాడఁగా
వడిసి కస్తూరిబొట్టువన్నె నద్ది వేల నందు
అడియాలముగ నాపె అచ్చు వా(వ్రా?)యఁదగదా ॥ నీవు ॥

దండనున్నదాని నుద్దండాన శ్రీవేంకటేశ
గందుమీరి వేడుకతోఁ గాఁగిలించఁగా
బెండుపడ నీవురము బిగువుఁజన్నుల నొత్తి
చండిపెట్టి రతిఁ జొక్కించఁగ నిఁక వలదా ॥ నీవు ॥ 599

దేసాళం

ఇంత తమకింతురా యిందరిలోనా
పొంతనే రట్టుసేతురా పొంద్దైనచోటను ॥ పల్లవి ॥

చెక్కుపైఁ జేఇదుకొని పిగ్గువడియున్నచెలిఁ
గక్కసింతురా రతికిఁ గాఁకలుసేసి
పిక్కటిల్లుఁజన్ను లిట్టె పిసికి నంతటిలోనె
మొక్కళపుఁదనమేల మోహించినచోటను ॥ ఇంత ॥

పదఁతిమాఁటువనుండి భావించిచూచేఇంతి—
నొడిపట్టి తీతురా వొరయుచును
తొడిఁబడ నీ వప్పుడే తొక్కేవు పాదములు
గడుసరితనమేల కలసినచోటను ॥ ఇంత ॥

పానుపుపై గుట్టుతోడఁ బవ్వళించి యున్ననతి
ఆనవెట్టి కూడుదురా ఆయములంటి
మోనాన శ్రీవేంకటేశ మోవి పిప్పిసేసితివి
[1] దీనకపుఁదనమేల తిరమైనచోటను ॥ ఇంత ॥ 600

1. దీనకపుఁదనము=దైన్యము?

# 1. వ అనుబంధము

## అకారాదిగ రాగ, సంకీర్తన సంఖ్యాసూచి

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| అమరసింధు | .... 324. |
| ఆహిరి | .... 1, 5, 9, 11, 15, 51, 58, 60 97. 162, 188. 202, 220, 248, 261. 276, 291, 299, 348, 363, 369, 381, 406, 416, 420, 439, 448, 463, 483, 500, 518, 526, 533, 538, 549, 553, 570, 581. |
| ఆహిరినాట | .... 63, 219, 284 338, 382 446, 523. |
| కన్నడగౌళ | .... 283, 350, 473 |
| కాంబో(భో)ది | .... 64, 65, 69, 94, 180, 184, 227, 240, 277, 285, 307, 373, 380, 425, 437, 478, 497, 555. |
| కుంతలవరాళి | .... 378. |
| కురంజి | .... 347. |
| కేదారగౌళ | .... 262, 336. |
| కొండమలహరి | .... 167. |
| గుండక్రియ | .... 3, 53, 83, 95, 101, 104. |
| గుజ్జరి | .... 21. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| గౌళ | .... 82, 136, 249 288, 301, 386, 392, 418, 462, 521, 539, 579, 594. |
| తెలు(గు)కాం(గాం)బోది | ... 33, 41, 44, 140, 156, 207, 221, 316, 384, 494, 531. |
| తోండి | .... 56, 218. |
| దేవగాంధారి | .... 12, 168, 259, 271, 356, 383, 597. |
| దేశా(సా)క్షి | .... 119, 318, 334, 355, 394, 445, 593. |
| దేసాళం | .... 7, 91, 196, 231, 256, 268, 287, 298, 322, 331, 346, 399, 414, 424, 440, 466, 490, 505, 510, 520, 530, 550, 564, 584, 600 |
| ద్రావిళభైరవి | 306. |
| ధ(ద)న్నాశి(సి) | .... 203, 398, 592. |
| నాగగాంధారి | .... 197. |
| నాగవరాళి | .... 105, 270, 479. |
| నాదరామక్రియ | .... 50, 130, 142, 170, 191, 198, 216, 251, 308, 427, 472, 509, 545, 552. |
| పడ(డి)(ళ)సంజరం | .... 436, 457. |
| పాడి | .... 26, 27, 75, 92, 179, 183, 193, 232, 247, 263, 275, 294, 314. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| | 330, 344, 357, 375, 387, 393, 411, 417, 423, 450, 454, 461, 471, 477, 495, 503, 525, 542, 548, 551, 557, 585, 591 |
| పూర్వగౌళ | .... 390 |
| బౌళి(భవుళి) | .... 57, 80, 81, 87, 124, 139, 144, 161, 230, 243, 258, 264, 265, 282, 293, 318, 327, 364, 396, 428, 435, 453, 459, 468, 474, 475, 504, 512, 519, 534, 546, 558, 560, 566, 590. |
| భవు(భౌ)(బౌ)ళి రామక్రియ | .... 123, 133, 172, 234, 272, 485. |
| భూపాళం | .... 96, 160. |
| భైరవి | .... 42, 71, 166, 297, 329, 374, 388, 438, 536, 569 |
| మంగళకౌశిక | .... 47, 54, 129, 246, 295, 341, 426, 508, 565. |
| మధ్యమావతి | .... 29, 317. |
| మాళవి | .... 8, 61, 269, |
| మాళవిగౌళ | .... 49, 143, 155, 236, 257, 274, 323, 351, 365, 410, 415, 491, 516, 541, 562. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
| --- | --- |
| ముఖారి | .... 2, 10, 14, 20, 32, 38, 68, 70, 76, 78, 84, 88, 99, 106, 107, 116, 132, 145, 148, 154, 158, 164, 177, 178, 189, 192, 195, 199, 201, 225, 286, 290, 296, 309, 328, 332, 339, 352, 358, 371, 389, 405, 422, 429, 444, 458, 476, 514, 523, 535, 547, 554, 575, 582, 598. |
| మేచబౌళి | .... 185 |
| రామక్రియ | .... 4, 16, 36, 93, 108, 137, 141, 150, 176, 187, 204, 210, 214, 224, 233, 239, 241, 254, 300, 302, 305, 310, 362, 368, 397, 433, 449, 455, 482, 489, 493, 506, 559, 571, 596. |
| రీతిగౌళ | .... 212. |
| లలిత | .... 46, 55, 73, 103, 111, 153, 175, 181, 217, 267, 315, 345, 361, 507. |
| వరాళి | .... 98, 194, 215, 237, 244, 280, 321, 333, 340, 349, 372, 402, 409, 421, 432, 443, 470, 499, 527, 563, 567. |

వసంతవరాళి .... 320, 260, 572.

వేళావళి .... 102, 312, 385, 556.

శంకరాభరణం .... 17, 19, 23, 28, 37, 45, 52, 59, 72, 74, 79, 85, 90, 120, 134, 157, 165, 182, 190, 206, 211, 223, 245, 260, 303, 335, 366, 400, 431, 515, 588.

శ్రీరాగం .... 13, 22, 24, 30, 35, 67, 86, 115, 122, 168, 242, 252, 253, 292, 354, 379, 430, 434, 442, 460, 465, 517, 543, 578, 580.

శుద్ధదేశి .... 574.

శుద్ధవసంతం .... 133, 235, 255, 337, 404, 511, 595.

సామంతం .... 6, 25, 31, 34, 39, 40, 43, 48, 62, 77, 89, 100, 110, 113, 114, 117, 118, 121, 125, 127, 131, 146, 149, 159, 171, 174, 200, 205, 209, 213, 222, 226, 250, 273, 279, 289, 304, 325, 342, 343, 370, 391, 401, 412, 441, 447, 452, 456, 469, 480, 484, 487, 502, 522, 524, 532, 537, 544, 561, 568, 583, 589.

సామవరాళి .... 326, 407, 486.

సాళంగం .... 109, 126, 135, 147, 151, 169, 186, 238, 395, 403, 419, 467, 498, 540, 587.

సాళంగనాట .... 18, 66, 112, 128, 152, 228, 229 278, 319, 359, 367, 451, 464, 481, 488, 496, 529, 576, 577.

సౌరాష్ట్రం .... 353, 376, 413, 492, 513.

హిందోళం .... 311.

హిందోళవసంతం .... 173, 208, 266, 281, 377, 586.

హిజ్జిజి .... 408, 501, 573, 599.

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన, రాగ, సంఖ్యాసూచి.

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంగన చేసిన | మాళవి | 61 |
| అంగన లాతని | దేశాక్షి | 119 |
| అంతకోపితే | ముఖారి | 84 |
| అంతసిగ్గువడక | లలిత | 46 |
| అంతసిగ్గువడకు | రామక్రియ | 4 |
| అంతేసిదొర | ముఖారి | 429 |
| అందరిక | ఆహిరి | 15 |
| అందుకంటె | సామంతం | 213 |
| అక్కడఁజెలి | ముఖారి | 201 |
| అటుగాననీకు | సామంతం | 62 |
| అటుగానబలిమి | దేవగాంధారి | 259 |
| అటువంటి | పాడి | 411 |
| అట్టెకాదా | గౌళరామక్రియ | 172 |
| అడుగరే ఈమాట అన్న | దేశాక్షి | 445 |
| అడుగరే ఈమాట అతని | సాళంగం | 498 |
| అతనితలఁపు | లలిత | 55 |
| అతిరాజసపు | మంగళకౌసిక | 295 |
| అతివయేగతి | శంకరాభరణం | 19 |
| అదిచూచి | పాడి | 471 |
| అదియేకాదా | రామక్రియ | 176 |
| అదివోకనుఁగొను | ముఖారి | 68 |
| అదివోనీ | దేశాక్షి | 355 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అదెచూడరే మోహన | హిందోళవసంతం | 208 |
| అన్నిగుణాలను | ముఖారి | 547 |
| అన్నిటాను | ముఖారి | 575 |
| అన్నిపనులు | శంకరాభరణం | 74 |
| అన్నియునీ | దేసాళం | 7 |
| అన్నియును | సామంతం | 113 |
| అన్నివిన్నపములు | బౌళి | 468 |
| అపుడైనా | మంగళకౌసిక | 426 |
| అప్పటిఁగొసర | బౌళి | 519 |
| అప్పటినాతో | భైరవి | 297 |
| అప్పటినీ | గుండక్రియ | 104 |
| అప్పటనుండి | సాళంగం | 151 |
| ఆప్పటివత్తురు | సాళంగనాట | 576 |
| అప్పణిచ్చి | దేసాళం | 584 |
| అప్పుడైనా | వరాళి | 98 |
| అమరనిమాట | ముఖారి | 582 |
| అయ్యోతన | ఆహిరినాట | 284 |
| అయ్యోయేమి | బౌళి | 139 |
| అరుదరుదు | శంకరాభరణం | 400 |
| అల్లదివో | సామంతం | 149 |
| అల్లనాఁడెరఁగ | సామంతం | 456 |
| అవియునవి | మాళవిగౌళ | 236 |
| అవియే | శంకరాభరణం | 190 |
| అసురల | గౌళ | 136 |
| ఆఁటదాని | హిజ్జిజి | 573 |
| ఆఁటది | ఆహిరినాట | 382 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఆకెయదె | శ్రీరాగం | 460 |
| ఆడకేల | పాడి | 294 |
| ఆడనుండే | శంకరాభరణం | 211 |
| ఆడనుండే | బౌళి | 590 |
| ఆణికాఁడ | మాళవిగౌళ | 49 |
| ఆతఁడు | రామక్రియ | 214 |
| ఆతఁడేమి | గౌళ | 38౮ |
| ఆతనికి | వేళావళి | 102 |
| ఆతనికొక్క | బౌళి | 566 |
| ఆతనితో | కన్నడగౌళ | 283 |
| ఆతురమే | పాడి | 26 |
| ఆనతియ్యవయ్యా | సాళంగం | 467 |
| ఆనతియ్యవయ్యా | దేశాక్షి | 394 |
| ఆనతియ్యవలె | దేవగాంధారి | 356 |
| ఆపెకునీ | వరాళి | 402 |
| ఆపెనెంత | వరాళి | 567 |
| ఆపెఱుఁగు | సాళంగనాట | 278 |
| ఆయనాయ | రీతిగౌళ | 212 |
| ఆరజమేల | దేసాళం | 196 |
| ఆరజమైతి | ముఖారి | 32 |
| ఆసపడుదురు | పళవంజరం | 436 |
| ఆసపడ్డచెలుల | శ్రీరాగం | 252 |
| ఆసపడ్డవారి | నాదరామక్రియ | 427 |
| ఇంకనీచిత్తము | ఆహిరి | 416 |
| ఇంకనీచిత్తము | శ్రీరాగం | 465 |
| ఇంకనేల | బౌళి | 475 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇంచుకంతా | సౌరాష్ట్రం | 353 |
| ఇంతకంటెనెవ్వరి | ముఖారి | 178 |
| ఇంతకంటెనేమి | ఆహిరి | 248 |
| ఇంతకంటెమరి | ఆహిరి | 489 |
| ఇంతకంటెవేడుక | హిందోళం | 311 |
| ఇంతతమకింతు | దేసాళం | 600 |
| ఇంతలోననే | ఆహిరి | 51 |
| ఇంతలోనేడిట్టె | రామక్రియ | 93 |
| ఇంతలోనేవిభుఁడ | ముఖారి | 38 |
| ఇంతవిరహాగ్ని | తెలుఁగుఁగాంబోది | 316 |
| ఇంత సేయఁగా | మంగళకౌసిక | 54 |
| ఇంత సేయకుండ | వరాళి | 333 |
| ఇంతిచెలువ మే | శంకరాభరణం | 45 |
| ఇంతిదిక్కు | గౌళ | 579 |
| ఇంతియేమి | బౌళి | 327 |
| ఇంతిసింగారము | నాదరామక్రియ | 170 |
| ఇంతులే | బౌళి | 318 |
| ఇంతే నాతల | సాళంగం | 135 |
| ఇంతేపో | బౌళి | 81 |
| ఇంతేసి | ముఖారి | 358 |
| ఇందరివినోదాన | దేసాళం | 268 |
| ఇందాఁకా నే | హిందోళవసంతం | 281 |
| ఇందుకుఁగా | శ్రీరాగం | 115 |
| ఇందుకు మెచ్చి | హిందోళవసంతం | 586 |
| ఇందుకుసిగ్గు | గౌళ | 249 |
| ఇందు కెల్ల | కాంబోది | 94 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇందుకే | సామంతం | 250 |
| ఇందుకొరకే | దేసాళం | 331 |
| ఇందుకొరకే | ముఖారి | 458 |
| ఇందుమీఁద | ముఖారి | 76 |
| ఇటమీఁదనీ | సామంతం | 146 |
| ఇటమీఁదమీ | భైరవి | 42 |
| ఇటులానే | కేదారగౌళ | 336 |
| ఇటువంటిదాత | వరాళి | 340 |
| ఇటువంటివోజ | మాళవిగౌళ | 323 |
| ఇటువలెనుండ | సామంతం | 391 |
| ఇటువలెనే | ముఖారి | 116 |
| ఇట్టిదికాల | మాళవిగౌళ | 562 |
| ఇట్టుండవద్దా | మాళవిగౌళ | 541 |
| ఇట్టుండవలదా | సామంత | 522 |
| ఇట్టుండవలదా | శ్రీరాగం | 434 |
| ఇట్టెపోధర | శంకరాభరణం | 85 |
| ఇతరము | తోండి | 218 |
| ఇతవే నెరప | పాడి | 542 |
| ఇదిఇట్ల | ముఖారి | 20 |
| ఇదియెంత | రామక్రియ | 433 |
| ఇదియేదిష్టము | తెలుఁగుఁగాంబోది | 33 |
| ఇదియేనా | దేసాళం | 256 |
| ఇదియేపరమ | శంకరాభరణం | 206 |
| ఇదివోనా | ఆహిరి | 261 |
| ఇద్దఱకిద్దరే | సామంతం | 125 |
| ఇద్దరిగుణంబు | ఆహిరి | 1 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇద్దరి తలఁపు | నాగవరాళి | 105 |
| ఇద్దరుఁ గూడితి | శంకరాభరణం | 515 |
| ఇన్నాళ్లవలెఁగాదు | సామంతం | 583 |
| ఇన్నాళ్లవలెఁగావు | పాడి | 357 |
| ఇన్నాళ్లనెఱుఁగ | బౌళి | 512 |
| ఇన్నిఁజూచేవు | శుద్ధవసంతం | 235 |
| ఇన్నిటాజాణ | పాడి | 551 |
| ఇన్నిటానేనీకు | సామంతం | 43 |
| ఇన్నిటానేర్పరి | సాళంగనాట | 319 |
| ఇన్నిటామన్నించి | ఆహిరి | 448 |
| ఇన్నియుఁగన్న | ముఖారి | 107 |
| ఇప్పటనుండి | బౌళి | 87 |
| ఇప్పుడాతని | కాంబోది | 227 |
| ఇప్పుడుగాక | సాళంగనాట | 359 |
| ఇప్పుడునీవు | శ్రీరాగం | 242 |
| ఇప్పుడేవిచారించు | శంకరాభరణం | 23 |
| ఇప్పుడేసిగ్గువడే | రామక్రియ | 506 |
| ఈకెకు | నాదరామక్రియ | 552 |
| ఈకెసంది | వరాళి | 280 |
| ఈపాటివాఁడ | నాగవరాళి | 270 |
| ఈమాటవిన్న | కాంబోది | 497 |
| ఈరీతి వలపు | ఆహిరి | 5 |
| ఈరీతివేరొక | మంగళకౌసిక | 508 |
| ఈవేళనీ | మాళవిగౌళ | 491 |
| ఈసుద్దులు | బౌళి | 560 |
| ఉత్తమనాయకుఁడ | ఆహిరినాట | 446 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఉపచరించఁగ | కాంబోది | 555 |
| ఊడిగపు | వరాళి | 470 |
| ఊరకున్న | నాదరామక్రియ | 50 |
| ఊరకెయిందరి | వరాళి | 244 |
| ఊరకేతానేల | సాళంగనాట | 496 |
| ఊరకేనన్ను | మాళవిగౌళ | 365 |
| ఊరకేమరు | సామంతం | 48 |
| ఊరకేలసిగ్గు | సామంతం | 401 |
| ఎంతకెంతచలములు | రామక్రియ | 310 |
| ఎంతకెంతజాణతనా | సామంతం | 131 |
| ఎంతగబ్బిఇది | ముఖారి | 405 |
| ఎంతగబ్బితనమే | ముఖారి | 2 |
| ఎంతగబ్బితనమే | శంకరాభరణం | 79 |
| ఎంతగుణవంతు | లలిత | 315 |
| ఎంతచెప్పుదును | తెలుఁగుఁగాంబోది | 531 |
| ఎంతచేసినా | ఆహిరి | 518 |
| ఎంతనిన్ను | ఆహిరి | 581 |
| ఎంతనేరిపితివో | వరాళి | 372 |
| ఎంతనేరుచు | పాడి | 461 |
| ఎంతనేర్చె | ఆహిరినాట | 68 |
| ఎంతప్రియము | సామంతం | 447 |
| ఎంతలేటి | శుద్ధదేశి | 574 |
| ఎంతలేదాతని | రామక్రియ | 108 |
| ఎంతవడి | దేసాళం | 510 |
| ఎంతవనికో | సామంతం | 487 |
| ఎంతవుపకారివి | ఆహిరి | 463 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎంతవేడుకో | నాదరామక్రియ | 251 |
| ఎక్కడపరాకో | దేసాళం | 424 |
| ఎక్కుడుగొసర | బౌళి | 453 |
| ఎగ్గుపట్టఁబని | బౌళిరామక్రియ | 234 |
| ఎటువంటిభాగ్య | సామంతం | 325 |
| ఎటువంటియాఁట | సామంతం | 343 |
| ఎటువంటియాగడ | హిందోళవసంతం | 266 |
| ఎటువంటివాఁడ | వరాళి | 321 |
| ఎటువంటివేడుక | శ్రీరాగం | 543 |
| ఎటువంటివోజ | సామంతం | 342 |
| ఎట్టయిన | శ్రీరాగం | 22 |
| ఎట్టి పరవశమో | శ్రీరాగం | 442 |
| ఎట్టుదప్పించు | రామక్రియ | 300 |
| ఎట్టు సేసిన | వరాళి | 409 |
| ఎట్టుసేసినా | ముఖారి | 352 |
| ఎదురుఁగొండ | సాళంగనాట | 367 |
| ఎదురుబడి | సామవరాళి | 486 |
| ఎన్నఁడు | సామంతం | 89 |
| ఎన్నిటికిఁకఁదానె | లలిత | 153 |
| ఎన్ని లేవు | రామక్రియ | 493 |
| ఎన్నేసివిద్యలు | తెలుఁగుఁగాంబోది | 384 |
| ఎప్పుడూనా | పాడి | 282 |
| ఎప్పుడెప్పుడంటా | సామంతం | 205 |
| ఎఱఁగమా | దేసాళం | 346 |
| ఎఱిఁగించ | శ్రీరాగం | 24 |
| ఎఱిఁగిన | పాడి | 557 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎఱుఁగుదునీ | కుంతలవరాళి | 378 |
| ఎఱుఁగుదునే | ముఖారి | 371 |
| ఎఱుఁగుదుమమ్మ | నాదరామక్రియ | 142 |
| ఎవ్వరము | సామంతం | 25 |
| ఎవ్వరినేమనఁగల | పాడి | 591 |
| ఎవ్వరునేరుతు | వేళావళి | 385 |
| ఎవ్వరు వెంగెము | బౌళి | 435 |
| ఎవ్వరూనేమి | ముఖారి | 332 |
| ఎవ్వరెంత | సాళంగం | 419 |
| ఎవ్వరేమి | తెలుఁగుఁగాంబోది | 156 |
| ఏఁగివచ్చుఁగాని | ముఖారి | 199 |
| ఏఁటికయ్యా | బౌళి | 459 |
| ఏఁటికిఁగొసర | పాడి | 275 |
| ఏఁటికివేగిర | పాడి | 477 |
| ఏఁటిజోలి | సాళగంనాట | 464 |
| ఏఁటిమాఁట | సాళంగనాట | 152 |
| ఏఁపులేల | సామంతం | 118 |
| ఏకతపువేళ | శంకరాభరణం | 157 |
| ఏకతానకు | ముఖారి | 389 |
| ఏకతానమీకుండఁగా | సామంతం | 222 |
| ఏడఁగన్న | తెలుఁగుఁగాంబోది | 44 |
| ఏదాయనేమి | ముఖారి | 182 |
| ఏనెంతనీ | అమరసింధు | 324 |
| ఏమనిచెప్పఁగ | భైరవి | 488 |
| ఏమని చెప్పఁగ | మాళవిగౌళ | 415 |
| ఏమనిపొగడుదు | భైరవి | 536 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమనియానతి | పాడి | 417 |
| ఏమనివిన్నవించేము | కన్నడగౌళ | 350 |
| ఏమమ్మమగువా | నాదరామక్రియ | 198 |
| ఏమమ్మాయీ | ద్రావిళభైరవి | 306 |
| ఏమయ్యా | సాళంగనాట | 529 |
| ఏమాయనందుకు | వరాళి | 215 |
| ఏమాయనింతలో | శ్రీరాగం | 67 |
| ఏమిటికి | సాళంగనాట | 577 |
| ఏమిటికే | తెలుఁగుఁగాంబోది | 207 |
| ఏమిదప్పక | దేసాళం | 490 |
| ఏమిదలఁచు | తోండి | 56 |
| ఏమినేరుపే | సాళంగనాట | 228 |
| ఏమిపంతాలాడే | సాళంగనాట | 229 |
| ఏమిమాయ | నాదరామక్రియ | 130 |
| ఏమిసేతునా | కాంబోది | 425 |
| ఏమిసేతునీకు | ఆహిరి | 97 |
| ఏమిసేసితివో కాని | వరాళి | 563 |
| ఏమిసేసితివోయింతిని | ముఖారి | 154 |
| ఏమిసేసీనింటిలో | రామక్రియ | 233 |
| ఏమిసేసేవో | తెలుఁగుఁగాంబోది | 221 |
| ఏమిసేసేవిక్కడ | ముఖారి | 296 |
| ఏమిసోద్యమే | సామంతం | 279 |
| ఏమేమినీవు | ఆహిరినాట | 523 |
| ఏమైన | ముఖారి | 164 |
| ఏరుపరచఁగ | దేసాళం | 564 |
| ఏల తమకించే | వేళావళి | 556 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏలనాతో | బౌళి | 293 |
| ఏలనిన్ను | సాళంగం | 238 |
| ఏలయెమ్మెలు | ముఖారి | 598 |
| ఏలసాములు | వరాళి | 499 |
| ఒకటికొకటికి | పాడి | 183 |
| ఒకటికొకటిగూడ | రామక్రియ | 204 |
| ఒకటిగూడినను | శంకరాభరణం | 120 |
| ఒకటిపై నొకటి | లలిత | 78 |
| ఒకరుచేసిన | రామక్రియ | 571 |
| ఒకరొకరికే | సామంతం | 40 |
| ఒకరొకరిమనసు | గౌళ | 82 |
| ఒక్కటికి | సామంతం | 31 |
| ఒక్కమాఁటే | బౌళి | 80 |
| ఒక్కరీతినే | దేవగాంధారి | 168 |
| ఒడలుబఁడ్ల | గుండక్రియ | 101 |
| ఓపవయ్యా | రామక్రియ | 362 |
| ఓహోబాలకి | లలిత | 175 |
| ఓయమ్మనే నెంత | సామంతం | 582 |
| ఔదువేదొడ్డదాన | దేసాళం | 466 |
| ఔనేమంచిదానవు | సామంతం | 484 |
| ఔలేనేనే | ముఖారి | 106 |
| కంకణము | సామంతం | 589 |
| కఁటిమయ్యా | సాళంగం | 403 |
| కంటిమిగా | రామక్రియ | 305 |
| కఁటిమినీ | సామంతం | 412 |
| కంటిరానీ | శంకరాభరణం | 182 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కంటి వావోయి | దేవగాంధారి | 597 |
| కందువమీ | మంగళకౌసిక | 129 |
| కటకటా | గుండక్రియ | 53 |
| కడలేనిగుణము | దేశాక్షి | 334 |
| కడలేనిపరాకులు | పాడి | 548 |
| కదిసినమీఁద | ముఖారి | 78 |
| కనుఁగొనరే | ముఖారి | 88 |
| కన్నచోటనే | శంకరాభరణం | 335 |
| కన్నచోటి | ముఖారి | 189 |
| కన్నవారెవ్వరు | మాళవిగౌళ | 143 |
| కన్నులుచల్లఁగా | వసంతవరాళి | 360 |
| కరుణించు | శ్రీరాగం | 580 |
| కలికివినీ | పాడి | 423 |
| కాంతనీవు | శ్రీరాగం | 163 |
| కాంతయేమి | ఆహిరి | 9 |
| కాంతలెల్లా | శుద్ధవసంతం | 511 |
| కాఁకలనొక | దేసాళం | 322 |
| కాదనివేసరేవా | దేవగాంధారి | 271 |
| కాదనేవా | సౌరాష్ట్రం | 492 |
| కాదనేమా | ముఖారి | 422 |
| కాదనేవారెవ్వరు | కాంబోది | 573 |
| కానీలేవే | గౌళ | 301 |
| కామినియందరి | పాడి | 503 |
| కాముకులైన | దేశాక్షి | 313 |
| కాయముఁబ్రా | సాళంగనాట | 18 |
| కూచుండఁబెట్టు | వరాళి | 421 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| కొమ్మలకు | గౌళ | 288 |
| కొమ్మలిద్దరు | ముఖారి | 514 |
| కొలచినా | బౌళిరామక్రియ | 138 |
| కోరినట్టె | సామంతం | 452 |
| కోరిబిడ్డఁడంటాఁగంటి | లలిత | 103 |
| గరిమతోనిన్నిటాఁగల | పాడి | 27 |
| గుట్టుతోనుండులే | శ్రీరాగం | 253 |
| గుట్టుసేసుకున్నాఁడవు | ముఖారి | 554 |
| గొల్లదానఁగద | సామంతం | 502 |
| ఘనుఁడనీవలన | బౌళి | 144 |
| ఘనుఁడన్నిటాఁదాను | వేళావళి | 312 |
| చక్కనిమానిసి | ముఖారి | 195 |
| చక్కనివాఁడ | గౌళ | 539 |
| చలమిఁకఁబని | శ్రీరాగం | 578 |
| చలమేలే | ఆహిరి | 500 |
| చలమోపలమో | శంకరాభరణం | 245 |
| చాలదానాకింత | కాంబోది | 184 |
| చాలుఁజాలు | సాళంగం | 169 |
| చాలునేనీమాఁట | లలిత | 217 |
| చిత్తగించరాదా | ధన్నాసి | 398 |
| చిత్తగింతువు | ఆహిరి | 553 |
| చిత్తమెట్లో | సామంతం | 524 |
| చిమ్మిరేఁగి | మాళవిగౌళ | 351 |
| చుక్కలు | సామంతం | 200 |
| చుట్టరికమైన | గౌళ | 418 |
| చూచేవారి | ముఖారి | 476 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| చూడఁజూడ | గుజ్జరి | 21 |
| చూడఁబసి బాల | ఆహిరి | 60 |
| చూడఁజిన్న వాఁడు | సామంతం | 370 |
| చూడ మాకు | ఆహిరి | 291 |
| చూడరమ్మ | ధన్నాసి | 203 |
| చూడవమ్మ | రామక్రియ | 210 |
| చూడవయ్యా | గౌళ | 392 |
| చూతువురా | లలిత | 267 |
| చెక్కిటిచే | ముఖారి | 14 |
| చెక్కు చెమటల | కురంజి | 347 |
| చెన్నలర | రామక్రియ | 368 |
| చెప్పఁగల | శంకరాభరణం | 431 |
| చెప్పరాదా | పాడి | 263 |
| చెప్పరాదు | భైరవి | 166 |
| చెప్పవే నీవే | ఆహిరి | 363 |
| చెప్పేదాఁకాఁ | రామక్రియ | 559 |
| చెలఁగి కొలువ | సామంతం | 480 |
| చెలిఁగావు | కన్నడగౌళ | 473 |
| చెలియుఁక | వరాళి | 349 |
| చెలులభాగ్య | దేసాళం | 530 |
| చెలులము | తెలుఁగుఁగాంబోది | 494 |
| చెలులాలచూడరే | మాళవిగౌళ | 274 |
| చెలులాల మీ | రామక్రియ | 241 |
| చెలులాల వూహించి | సామంతం | 6 |
| చెలులు తన్నెవ్వరెంత | సామంతం | 289 |
| చెల్లఁబో | భైరవి | 71 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చెల్లు నీవందుకు | శుద్ధవసంతం | 404 |
| చెల్లెఁగద | సామంతం | 159 |
| చేరినన్నుఁజూచి | సామంతం | 273 |
| చేరినన్నుఁజూచి | వసంతవరాళి | 320 |
| చేసినదే | సామంతం | 174 |
| చేసినవెల్లాఁజేసి | శుద్ధవసంతం | 595 |
| జవ్వనమందరి | పాడి | 92 |
| జీరదీసేనా | రామక్రియ | 254 |
| తగిలినాచేఁత | బౌళి | 534 |
| తనలోనే | హిజ్జిజి | 501 |
| తనిసితి | రామక్రియ | 36 |
| తనువుఁదనువు | పాడి | 585 |
| తనువుతనది | సామంతం | 117 |
| తనువుబడలె | ఆహిరి | 202 |
| తరవాతి | కొండమలహరి | 167 |
| తరుణికిచ్చక | తెలుఁగుఁగాంబోది | 41 |
| తలఁచమైతిమి | పాడి | 247 |
| తలఁచరా | ముఖారి | 158 |
| తలఁచుకోనా | ఆహిరి | 220 |
| తలఁచుకోయింకా | హిందోళవసంతం | 377 |
| తలఁపించరే | దేసాళం | 399 |
| తలఁపోకటి | వరాళివిగౌళ | 155 |
| తానట నన్నట | ఆహిరి | 58 |
| తానిఁక నెప్పుడు | ఆహిరి | 299 |
| తానెంత నేనెంత | శుద్ధవసంతం | 255 |
| తానెఱఁగఁడా | దేవగాంధారి | 388 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తానెటుఁగఁడా | శంకరాభరణం | 260 |
| తానేయెటుఁగుగా | ఆహిరి | 549 |
| తానేలనవ్వులు | రామక్రియ | 397 |
| తానేలసిగ్గు | వరాళి | 527 |
| తానేవచ్చీఁగాక | సామంతం | 544 |
| తీపులతన | కాంబోది | 64 |
| తెలవకు | మంగళకౌసిక | 47 |
| తెలిసె నీగుణమెల్లా | గుండక్రియ | 95 |
| తెలుసుకో | భూపాళం | 96 |
| తేనెలుమోవి | బౌళి | 504 |
| తొయ్యాలి | హిందోళవసంతం | 173 |
| దయవుట్టి | మంగళకౌసిక | 341 |
| దేవ దుందుభులు | శ్రీరాగం | 80 |
| దేవులనయ్యో | సాళంగం | 587 |
| దొడ్డిపట్టు | శంకరాభరణం | 59 |
| నగవింతే | ముఖారి | 10 |
| నమ్మరానా | మధ్యమావతి | 29 |
| నయగారి | సామంతం | 171 |
| నవ్వకురా | దేవగాంధారి | 12 |
| నవ్వినవ్వి | రామక్రియ | 141 |
| నాకునివియే | రామక్రియ | 16 |
| నాకెట్లఁదెలుసు | ఆహిరి | 11 |
| నాచెను నీ | సాళంగనాట | 481 |
| నాపైబత్తి | భైరవి | 374 |
| నామనసె | ఆహిరి | 369 |
| నామనసేమి | పాడి | 525 |

| పంక్తి ర్తవమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నాలుకతుద | రామక్రియ | 224 |
| నావలెఁగావు | కాంబోది | 180 |
| నావిన్నపము | ఆహిరినాట | 338 |
| నావోజలే | సాళంగం | 540 |
| నిండుజాణ | నాదరామక్రియ | 216 |
| నిక్కమమ్మ | శంకరాభరణం | 165 |
| నిక్కమానతియ్యా | శంకరాభరణం | 90 |
| నిక్కినాతమకానకు | సామంతం | 121 |
| నిచ్చఁబండుగలు | ముఖారి | 145 |
| నిన్నుఁజూచి | కాంబోది | 240 |
| నిన్నేమనేదే | సాళంగనాట | 451 |
| నిలుచున్నాఁడదె | సామంతం | 537 |
| నీకునాపె | సామంతం | 227 |
| నీకునిచ్చకమాడ | రామక్రియ | 187 |
| నీకునీవే | సాళంగం | 126 |
| నీకు వలయు | సాళంగం | 186 |
| నీకెంత ఇతవైన | సౌరాష్ట్రం | 513 |
| నీకొలఁది | దేసాళం | 505 |
| నీగుణమెఱఁగే | దేసాళం | 231 |
| నీచిత్తమే | నాదరామక్రియ | 308 |
| నీటముంచు | కాంబోది | 69 |
| నీదాకవలె | శంకరాభరణం | 223 |
| నీమనసె | ఆహిరి | 570 |
| నీముందరికి | ఔళి | 264 |
| నీమోహము | భైరవి | 329 |
| నీయిచ్చలో | దేసాళం | 287 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీవనఁగ | శ్రీరాగం | 86 |
| నీవారైనవారి | పాడి | 375 |
| నీవుచేసిన | హిజ్జిజి | 599 |
| నీవురాఁగా | సామంతం | 441 |
| నీవు సేసిన | పాడి | 330 |
| నీవు సేసేటి | శ్రీరాగం | 292 |
| నీవెట్లానుండి | మాళవిగౌళ | 516 |
| నీవెప్పుడూ | రామక్రియ | 302 |
| నీవేనన్ను నిలె | శ్రీరాగం | 430 |
| నీవేనన్ను మన్నించే | ముఖారి | 290 |
| నీసుద్దులు | బౌళి | 265 |
| నెమ్మదినీ | వరాళి | 432 |
| నెమ్మదినున్నాఁడ | శంకరాభరణం | 17 |
| నేనితఁడు | బౌళిరామక్రియ | 272 |
| నేనెంతటి | ముఖారి | 286 |
| నేనెంతటి | సౌరాష్ట్రం | 376 |
| నేనెఱఁగనా | గుండక్రియ | 3 |
| నేనేమిటి | ముఖారి | 444 |
| నేనేమి బాఁతే | రామక్రియ | 455 |
| నేనేమీనెఱఁగ | కాంబోది | 307 |
| నేమెంతవిన్నవించి | హిజ్జిజి | 408 |
| నేమేమినెఱఁగ | సామవరాళి | 407 |
| నేరుపరి నందువు | నాగవరాళి | 479 |
| పంతమాడ | ఆహిరినాట | 219 |
| పంతము | బౌళి | 428 |
| పచ్చిసేయ | లలిత | 181 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పట్టకువయ్యా | సౌరాష్ట్రం | 413 |
| పట్టరాదు | సామంతం | 77 |
| పట్టరాని | భైరవి | 569 |
| పడఁతిఇటని | సామంతం | 39 |
| పతికివిన్నవించ | శ్రీరాగం | 379 |
| పతిబెడబాసి | పాడి | 193 |
| పదరేవు | కాంబోది | 478 |
| పదారువేలు | ఆహిరి | 406 |
| పలుకుఁబంతము | సామంతం | 100 |
| పలుకుల | ముఖారి | 177 |
| పలికెనంటే | బౌళి | 474 |
| పాఁతవలపో | వరాళి | 443 |
| పాయపురమణుఁడ | ముఖారి | 148 |
| పిలిచిచేకొన | సామంతం | 568 |
| ప్రియములు | ముఖారి | 528 |
| పులుఁగునెక్కేటి | సాళంగనాట | 112 |
| పూవులవాసన | గౌళ | 462 |
| పొద్దువోని | కాంబోది | 437 |
| పొంఁతిదేహమే | నాదరామక్రియ | 191 |
| పొలిఁతిజవ్వనము | మాళవి | 8 |
| బలిమిసేయఁగ | మధ్యమావతి | 317 |
| బాపుబాపునీ | ముఖారి | 535 |
| బాపు బాపుమా | బౌళి | 161 |
| బాలకిగాని | శుద్ధవసంత | 133 |
| బుద్ధిచెప్పవయ్యా | నాదరామక్రియ | 509 |
| భుఖిఁదనవారిఁబాసి | ఆహిరి | 162 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| భూపతిచెరువు | రామక్రియ | 489 |
| మంచివాని | గౌళ | 521 |
| మంజుతనౌ | శంకరాభరణం | 28 |
| మందులు | సాళంగనాట | 66 |
| మగవాఁడవు | గౌళ | 594 |
| మగవాని | మంగళకౌసిక | 246 |
| మగువకు | మంగళకౌసిక | 565 |
| మగువయెంతటి | రామక్రియ | 449 |
| మట్టుతోనే | ముఖారి | 328 |
| మట్టుమీరి | సామంతం | 469 |
| మనసిచ్చి | లలిత | 361 |
| మనసిజ | శంకరాభరణం | 52 |
| మనసులు | శంకరాభరణం | 134 |
| మరలియేవని | సామంతం | 34 |
| మరునిబలాల | ఆహిరి | 538 |
| మఱవఁగఁబోలు | పాడి | 495 |
| మఱియేఁటి | ముఖారి | 339 |
| మాఁటలేల | ఆహిరి | 188 |
| మాకుఁజూడ | దేసాళం | 414 |
| మాకునిట్టె | మాళవిగౌళ | 410 |
| మాకునీవు | ధన్నాసి | 592 |
| మాకేలేఇటు | పాడి | 314 |
| మాతోనేఁటికి | ముఖారి | 192 |
| మాతోనేమి | బౌళిరామక్రియ | 485 |
| మించికాలము | శ్రీరాగం | 35 |
| మీకు మీకునమరు | సాళంగనాట | 395 |

| సంకీర్తనమొదలు | రాగములు | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మీకు మీకే కాన | వరాళి | 194 |
| మీకు మీకే తెలుసు | దేశాక్షి | 593 |
| మీరిద్దరునొక్కటే | బౌళి | 258 |
| మీరెఱఁగరటరే | కేదారగౌళ | 262 |
| మీరేమి దూరకు | శ్రీరాగం | 122 |
| మీవలెనే | పాడి | 387 |
| ముందునిన్నె | బౌళి | 243 |
| ముద్దుగారఁగా | భూపాళం | 160 |
| ✓ముద్దులుగారీ | శంకరాభరణం | 588 |
| మూసిమంతనము | ముఖారి | 309 |
| మెలుఁత | కాంబోది | 285 |
| మేకులాఁడి | బౌళి | 57 |
| మేరకుమేర | ముఖారి | 70 |
| మేలు మేలనుచు | భైరవి | 388 |
| మేలు మేలుఇన్నిటా | శంకరాభరణం | 72 |
| మేలు మేలుగా | సాళంగనాట | 128 |
| మేలు మేలునీజాడ | సామంతం | 110 |
| మేలు మేలు | తెలుఁగుఁగాంబోది | 140 |
| మేలైననాలైన | ముఖారి | 99 |
| మొక మోటముల | పాడి | 75 |
| మొదలనే | సాళంగం | 109 |
| రతి నీపలుకు | సామంతం | 114 |
| రమణిజవ్వనము | బౌళి రామక్రియ | 123 |
| రమణుఁడుదానై | సామంతం | 127 |
| రమణుఁడుపిలిచీ | దేసాళం | 550 |
| రమణునికడ | రామక్రియ | 137 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| రమ్మనవే | శ్రీరాగం | 517 |
| రమ్మనిరావయ్యా | శంకరాభరణం | 37 |
| రాకుంటే | కాంబోది | 380 |
| రావయ్యామా | పాడి | 454 |
| రాసబలుపు | రామక్రియ | 150 |
| అట్టునేయ | రామక్రియ | 482 |
| వట్టిపరాకులు | బౌళి | 364 |
| వట్టి పెనఁగులాట | బౌళి | 546 |
| వట్టియనుమాన | పూర్వగౌళ | 390 |
| వట్టియలుక | ఆహిరి | 381 |
| వద్దనేమా తానే | బౌళి | 282 |
| వద్దనేమా నిన్ను | పళవంజరం | 457 |
| వద్దునన్నుఁ జెనకకుర | గుండక్రియ | 83 |
| వద్దువద్దు సతి | వసంతవరాళి | 572 |
| వనితకు నెంత | బౌళి | 230 |
| వనితనీపతి | ఆహిరి | 483 |
| వలచినదానఁగా | పాడి | 179 |
| వలపు మొగ | పాడి | 393 |
| వలపెందుఁజల్లి | లలిత | 111 |
| వాఁడివో | దేసాళం | 298 |
| వాకిటఁగొలువు | పాడి | 450 |
| వాకిటనేల | సామంతం | 304 |
| వాకిటవచ్చి | సామంతం | 561 |
| వారిబత్తి | బౌళి | 558 |
| వారివారి | బౌళి | 396 |
| ✓ వాసులు | శంకరాభరణం | 303 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వింతచెలి | ముఖారి | 225 |
| వినరాదు నీ | లలిత | 507 |
| విన్నపమిదెనీకు | ఆహిరి | 420 |
| విన్నపమేమి | దేసాళం | 440 |
| విపరీతము | నాగగాంధారి | 197 |
| విభునిఁదోడుక | నాదరామక్రియ | 545 |
| విరహమే | ఆహిరి | 523 |
| వెంగెమాడేనా | పాడి | 344 |
| వెదకరేచెలులాల | మేఁచబౌళి | 185 |
| వెనకటియ్యే | లలిత | 345 |
| వెనకనీకు | రామక్రియ | 239 |
| వెలఁది యిట్టుండి | ఆహిరి | 533 |
| వెలఁదివిరహా | బౌళి | 124 |
| వెలలేని | సామవరాళి | 326 |
| వేగిరించి | ఆహిరి | 276 |
| వేడుకకాఁడ | వరాళి | 237 |
| వేడుకకాఁడు | సాళంగనాట | 488 |
| వేడుకకాఁడైన | రామక్రియ | 596 |
| వేసరనివలపు | శుద్ధవసంతం | 337 |
| వేసాలెల్లాఁజేసే | మాళవి | 269 |
| శిరసువంచకు | శంకరాభరణం | 366 |
| సంతోసించు | కాంబోది | 277 |
| సకలలోకేశ్వరులు | సామంతం | 209 |
| సరిగామన్నించ | మాళవిగౌళ | 257 |
| సరిబేసు లవియివి | సాళంగం | 147 |
| సాదించనేఁటికి | దేసాళం | 520 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| సిగ్గున నూరకుండితే | నాదరామక్రియ | 472 |
| సుదతినొకటొక | కాంబోది | 65 |
| సుదతివున్నభావము | ఆహిరి | 348 |
| సూడగదవమ్మ | శ్రీరాగం | 13 |
| సేయనీవే | దేసాళం | 91 |

T. T. D. Religious Publications Series No. 179

రూ 14=00

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రచురణ